# THE TUNES OF DIVINITY

# (SANKĪRTANA LAKṢAṆAMU)

(A Treatise On Hymnody in Telugu

by

**Tāllapāka Cina Tirumalācārya)**

VOLUME-I

*GENERAL EDITORS*

DR. SHU HIKOSAKA
DR. G. JOHN SAMUEL

*TRANSLATION AND COMMENTARY*

DR. SALVA KRISHNAMURTHY, M A., Ph.D.

INSTITUTE OF ASIAN STUDIES

INSTITUTE OF ASIAN STUDIES
MADRAS-600 041
INDIA

# TUNES OF DIVINITY
# SANKĪRTANA LAKṢAṆAMU

**VOLUME-I**
**V . . UME-II**

Editor & Commentator

**Dr. SALVA KRISHNAMURTHY**

Publication No. 11-A
... ation No. 11-B

"THIS BOOK IS PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE OF THIRUMALA THIRUPATI DEVASTHANAMS UNDER THEIR SCHEME AID TO PUBLISH RELIGIOUS BOOKS"

(c) INSTITUTE OF ASIAN STUDIES

First Edition 1990

Price: Rs. 125/- US $ 30

*Copies can be had from:*

Publication Division
INSTITUTE OF ASIAN STUDIES
10th East Street,
Thiruvanmiyur,
Madras-600 041,
INDIA
Phone: 416728,
419866

# కృతజ్ఞతలు


'సంకీర్తన లక్షణా'నికి సంబంధించిన ఈ కార్యక్రమాన్ని సూచించిన వెంటనే ఆమోదించిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ స్టడీస్ పరిశోధన కార్యక్రమాల డైరెక్టర్ డాక్టర్ జాన్ శామ్యూల్ గారికి ధన్యవాదాలు చెప్పటం నా మొదటి కర్తవ్యం.

ఉపయుక్త గ్రంథసూచిలో చెప్పబడిన గ్రంథకర్తల అందరి కృషి నాకు ఉపకరించిదనటంలో సందేహం లేదు. ఆయా గ్రంథకర్తలందరికీ నా కృతజ్ఞతలు; అందులో ముఖ్యంగా శ్రీ రావూరి దొరసామి శర్మ, డాక్టర్. ఎస్.వి. జోగారావ్. డి.లిట్., డాక్టర్. తూమాటి దోణప్ప. డి.లిట్., డాక్టర్. పి.యస్.ఆర్. అప్పారావ్ గారలకు సాధన్యవాదాలు.

మద్రాసులో ఉన్ననాకు మైసూరు ఓరియంటల్ ఇన్స్టిట్యూట్‌లోని సంగీత తాళపత్ర గ్రంథాలను అవలోడించి విషయం సేకరించి పంపటమేకాక మైసూరు లోని వరలక్ష్మీ అకాడమీలోని 'సంగీత సుధామణి' ప్రతినుండి 'శిఖాపదా'నికి సంబంధించిన శ్లోకాలను పంపిన ఆర్.వి.యస్. సుందరం, డి.లిట్., (తెలుగు రీడర్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ కన్నడ స్టడీస్, మైసూర్) గారికి నా హార్దమైన మంగళాశాసనాలు. ఈ శ్లోకాలను ఉపలభ్యంచేసి తమ అభిప్రాయాన్ని కూడా తెలియజేసిన మాన్యమహాశయులు, మైసూరు వరలక్ష్మీ అకాడమీ నిర్వాహకులు అయిన మహామహోపాధ్యాయ శ్రీ ఆర్. సత్యనారాయణ గారికి నా కృతజ్ఞతాంజలులు.

'సంకీర్తన లక్షణం' గ్రంథాన్ని రాగిరేకుల మీది పాఠంతో సరిచూచే సౌకర్యాన్ని కలిగించిన తిరుమలతిరుపతి దేవస్థానం సంస్థ అధికారులకు, శ్రీ వేంకటేశ్వర మ్యూజియం, తిరుపతి, క్యూరేటర్, ఏ.కె.వి. యస్. రెడ్డిగారికి, గైడ్ లెక్చరర్ శ్రీ టి. విశ్వనాథం గారికి నా హార్దమైన కృతజ్ఞతలు.

ఈ వ్యాసంగంలో గ్రంథావలోకనానికి సహకరించిన మద్రాసు మ్యూజిక్ అకాడమీ లైబ్రరీ, గవర్నమెంట్ ఓరియంట్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ, అధికారులకు మైసూర్ ఓరియంటల్ ఇన్స్టిట్యూట్ అధికారులకు కృతజ్ఞతలు.

చర్చలకు తమవిలువైన కాలాన్ని వెచ్చించి సహకరించిన మద్రాసు విశ్వవిద్యాలయం సంగీత విభాగానికి చెందిన ప్రొఫెసర్. డాక్టర్ సీతగారికి, శ్రమకోర్చి టైపుస్క్రిప్టు చదివి, పుస్తకాలు ఇచ్చి, పలువిధాల సహకరించిన సంగీతం రీడర్ డాక్టర్ ఎన్. రామనాథం గారికి నా కృతజ్ఞతలు.

మద్రాసు
9-8-89

డాక్టర్. సాళ్వకృష్ణమూర్తి

# TRANSLITERATION

## For TELUGU

అ -a; ఆ - ā; ఇ - i; ఈ - ī; ఉ- u; ఊ - ū; ఋ - ṛ; ఎ - e; ఏ - ē; ఐ - ai; ఒ - o; ఓ - ō; ఔ - au; అం - ṃ; అఁ; అః - h

క - k; ఖ - kh; గ - g; ఘ - gh; ఙ- ṅ

చ - c; ఛ - ch; జ - j; ఝ - jh; ఞ - ñ

ట - ṭ; ఠ - ṭh; డ - ḍ; ఢ - ḍh; ణ - ṇ

త - t; థ - th; ద - d; ధ - dh; న -n

ప - p; ఫ - ph; బ - b; భ - bh; మ - m

య - y; ర - r; ఱ - ṟ; ల - l; ళ - ḷ; వ - v

శ - ś; ష - ṣ; స - s; హ - h: క్ష - Ks

## For Sanskrit

अ -a; आ - - ā; इ - i; ई - - ī; उ- u: ऊ - - ū; ऋ - ṛ; ए - ē; ऐ - ai;
ओ - ō; औ - au; अं - ṁ; अः - ḥ

क - k; ख - kh; ग - g; घ - gh; ङ - n

च - c; छ - ch; ज - j; झ - jh; ञ - - ñ

ट - ṭ; ठ - ṭh; ड - ḍ; ढ - ḍh; ण - ṇ

त - t; थ - th; द - d; ध - dh; न -n

प - p; फ - ph; ब - b; भ - bh; म - m

य - y; र - r; ल - l; व - v

श - ś' ; ष - . ṣ; स - s; ह - h; क्ष -. Kṣ

# భూ మి క

## ధ్వ ని

గాలిలాంటి మాధ్యమంలో స్పందనాలు ధ్వని పుట్టేటట్లు చేస్తాయి. 'ట్యూనింగ్ ఫోర్క్' (Tuning Fork) అనబడే ఒక స్వరదాన్ని కఱ్ఱతో కొట్టి మోగించినపుడు అది శీస్పందించటానికి మొదలుపెట్టి గాలిలో అలలలాంటివి ఏర్పడేటట్లు చేయగా మనకు ధ్వని వినబడుతోంది. ధ్వని పుట్టటానికి, ప్రయాణించటానికి ఒక మాధ్యమం కావాలి.

## ప్రతిధ్వని - దీర్ఘ ప్రతిధ్వని

ఒక ధ్వనిని విన్నప్పుడు దాని ముద్ర సెకండులో 10వ భాగం కాలం (1/10 of a second) ఉంటుందని చెప్తారు. ఒక తలం ధ్వనిని పరావర్తింపజేసి ప్రతిధ్వనిని పుట్టించాలంటే అది ఆ ధ్వనిపుట్టే చోటునుండి కనీసం 110 అడుగుల దూరంలో ఉండాలి. అంతేకాదు. ఆ ధ్వని అలపొడవు (Wave-length) ఎంత ఉందో దానికి సమానమైన పరిమాణం ఆ తలానికి (surface) ఉండాలి. దీర్ఘ ప్రతిధ్వని (reverberation) పెద్ద హాలుల్లో, భవనాల్లో కలుగుతుంది. ధ్వని గోడల ఉపరితలం మీద పరావర్తనం చెందటం వల్ల అధికం అవుతుంది. అలాగే కిటికీల గుండాను ధ్వనిని పీల్చుకొనే వస్తువుల గుండాను కొంత భాగాన్ని కోల్పోనూ కోల్పోతుంది. ఈ లాభనష్టాలు తేలిన తర్వాత దానికి ఒక స్తిమితం (balance) ఏర్పడుతుంది. మొదటి ధ్వని ఆగిన తర్వాత కూడా కొంత ధ్వనిశక్తి (sound energy) హాలు గోడలవైపున, వినేవారి చెవుల వైపున ఉంటుంది. ఇది కారణంగా స్పందనవునాడి ధ్వనిని వెలికి విడుస్తుంది. దీనికి ఫలితంగానే దీర్ఘ ప్రతిధ్వని కలుగుతుంది. ఇది నిడుపైన ప్రతిధ్వని మాత్రమే.

## మాధ్యమాలు

ధ్వని ప్రయాణించటానికి ఒక మాధ్యమం కావాలి అని చెప్పాము. గాలి లేని 'వాక్యూవం' (Vacuum)లో ధ్వని వినబడదు. గాలిని తీసివేసిన ఒక సీసాలో మనం ఒక ధ్వని చేస్తే అది వినికిడికి రాదు. ధ్వని గాలి, మట్టి వంటి వాటిల్లోనే కాక వాయువుల్లోనూ, ద్రవ పదార్థాల్లోను, మరి ఇతర ఘన పదార్థాల్లోను ప్రయాణిస్తుంది. ధ్వని వేగం శీతోష్ణ పరిస్థితుల్ని బట్టి మారుతుంది. ఉదాహరణకి తడి గాలిలో ధ్వని ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది.

## మనిషి చెవి - ధ్వని మోతాదు

మనిషి చెవి సెకనుకు 30మొదలు 38,000 స్పందనాలు కల ధ్వనులను వినగలదని అంటారు. సంగీతంలోని స్వరాలకు సెకనుకు 30మొదలు 4,000 స్పందనాలు గల ధ్వనులు తగి ఉంటాయని చెప్పబడుతోంది.

## సంగీతధ్వనులు

మామూలు ధ్వనులు వేరు, సంగీతధ్వనులు వేరు. మామూలు ధ్వనులు చెవికి కఠోరంగా ఉంటాయి. సంగీత ధ్వనులు వినటానికి హాయిగా ఉంటాయి. వీటి మోతాదు

సెకనుకు 30మొదలు 4,000 స్పందనాలకు లోబడి ఉంటుందని చెప్పినా దీని పైహద్దు నోటి పాట (గాత్రం) విషయంలో చాలా క్రిందకే వస్తుంది.

ఈ సంగీత ధ్వనులు ఒకదానితో ఒకటి (1) శ్రుతి (pitch) (2) ఘనత (intensity) (3) గుణం (timber) అనే అంశాల్లో భేదిస్తుంటాయి. స్పందించే వస్తువు స్పందనాల తరచుదనాన్నిబట్టి 'శ్రుతి' మారుతుంది. ఘనత (intensity) అనేది ధ్వనించే వస్తువు స్పందన విస్తృతి ( amplitude of vibration) మీద ఆధారపడి ఉంటుంది. ఒక వీణ తంతెను మృదువుగా మీటినపుడు ఒక స్పందన విస్తృతి కలిగి ఒక విధమైన స్వరమున్నూ, గట్టిగా మీటినపుడు మరొక స్పందన విస్తృతికలిగి మరొక విధమైన స్వరమున్నూ వినబడుతాయి. ఇంక గుణమనేది ఇది ఫిడేల్ ధ్వని, ఇది వీణ ధ్వని, ఇది ఫ్లూటు ధ్వని అని గుర్తింప జేసే ప్రత్యేక లక్షణం. శ్రుతి ఘనతలు సమానంగా ఉన్నా సరే ఫిడేల్, వీణ, ఫ్లూటు ధ్వనుల్ని మనం గుర్తిస్తాం. ఈ గుణం స్పందన పద్ధతి (mode of vibrating) మీద, ఆ ధ్వని నుండి పుట్టే స్వయం భూ ధ్వనుల (upper partial tones) ప్రాముఖ్యం మీద ఆధారపడి ఉంటుంది.

### నాదం (Resonance)

ఒక స్వరదాన్ని (tuning fork) ప్రయోగించి ఒక టేబిల్ చెక్కకు నొక్కితే ఆ చెక్క అణువులు కూడా స్వరదం కంపనాలతో సమానమైన కంపనాలతో స్పందించే ఒత్తిడికి లోనౌతవి. ఈ బలవంతపు స్పందనాలు గాలిలో తమ స్వంత అలలను కలిగిస్తాయి. ఇవి స్వరదం స్పందనాలను బలపరుస్తాయి. ఈ కారణం చేత స్వరదం ధ్వని కొంత దూరం వరకు గట్టిగా వినబడుతుంది. స్వరదానికి ఉండే స్వతంత్రమైన స్పందనాలు, చెక్కకు ఒత్తిడి వల్ల కలిగిన బలవంతపు స్పందనాలు అనే రెండింటి తరచుదనం సమానం అయినపుడు ఆ బలవంతపు స్పందనాల తరచుదనం 'నాదినీ స్పందనాలు' (resonant vibrations) అవుతున్నాయి. ఇదే సంగీతంలో 'నాదం' అనబడుతోంది. సహానుకంపాలు (sympathetic vibrations) కూడ నాదినీ స్పందనాలను కల్గిస్తాయి. (ఒక తంతెను మీటినప్పుడు ఈ ధ్వని తరంగాల వల్ల ప్రక్కన ఉండే తంతె కూడా స్పందిస్తుంది. కానిచెక్కబల్లకు ట్యూనింగ్ ఫోర్కును నొక్కడంలాంటిది ఇక్కడ ఉండదు. ఇలాగ తనంతకు తానే స్వతంత్రంగా స్పందించటం సహానుకంపనం). వయొలిన్‌కు నాదపేటిక (resonance box) ఉంది.

### 'అంతరాలు'- 'ఘాతలు'

సంగీతంలో ధ్వనులకు స్పందనాల తరచుదనాలు ఉన్నాయి. ఒక స్వరం 'శ్రుతి' (pitch) అనే దాన్ని దాని స్పందనాల తరచుదనాన్నిబట్టి పాశ్చాత్య సంగీతంలో నిర్ణయిస్తారు. భారతీయ సంగీతంలో ఈ స్పందనాలు కాక, స్పందనాల విస్తృత్తులు ముఖ్యంగా గ్రహింపబడుతై. ఈ శ్రుతుల మధ్య ఉండే భేదాలనే 'అంతరాలు' (intervals) అంటారు. రెండు వేర్వేరు తరచుదనాలు గల సంగీత స్వరాలను ఒకేసారి పలికించినప్పుడు, వాటి ధ్వని తరంగాల నిడువులు వేరు వేరు గనుక అవి ఒకప్పుడు ఒకదానినొకటి బలపరచటం ఒకప్పుడు ఒక దానినొకటి అడ్డగించటం జరుగుతుంది. ఒకదానినొకటి అడ్డగించినప్పుడు ధ్వని తరంగాల పరస్పరతాడనం వల్ల 'ఘాతలు' (beats) వినబడుతై. హార్మోనియంలో ఒకటవ పీకెను రెండవ పీకెను ఒకేసారి నొక్కినప్పుడు 'ఘాత' స్పష్టంగా వినబడుతుంది. ఈ పద్ధతినే మూడవ, నాల్గవ, ఐదవ పీకెల మీద కొనసాగించినప్పుడు 'ఘాతల' వేగం

ఎక్కువైనట్లు తోచుతుంది. ఐదో పీకెను చేర్చినప్పుడు ఘాతల వేగం చెవికి ఇంపుగా ఉన్నట్లు అనిపిస్తుంది. వేగంగాను క్రమబద్ధంగాను ఏర్పడే 'ఘాతలు' క్రొత్త స్వరాన్ని పుట్టించినట్లు అనిపిస్తుంది. ఈ 'ఘాతల' శ్రావ్యత సెకనుకు 33 అనే తరుచుదనాన్ని దాటిన తర్వాతనే వస్తుంది.

## పాశ్చాత్యసంగీతం - భారతీయ సంగీతం

పాశ్చాత్య సంగీతం స్వర సంప్రదాయ పద్ధతికి చెందింది అనవచ్చు. ఇటువంటి సంగీతంలో స్వరాల సామరస్యానికి ప్రాధాన్యం అనేది స్పష్టం. దీంట్లో సంగీత స్వరాలు రెండు వర్గాలు: (1) కన్కార్డ్స్ (Concords), (2) డిస్కార్డ్స్ (discords). 1-3-5 స్వరాలను కలిపి వాయించితే కన్కార్డ్ అవుతుంది. వీటికి గనుక ఏడవ కార్డ్‌ను కూడా కలిపి (1-3-5-7) వాయించితే డిస్కార్డ్ అవుతుంది. కన్కార్డ్‌లోని 3వ స్వరం తీవ్రస్వరం అయితే అప్పుడు ఆ వర్గాన్ని అంతటిని కామన్ కార్డ్ ఆఫ్ సి మేజర్ (common chord of C major) అంటారు; ఆ 3వ స్వరం కోమలస్వరం అయితే కామన్ కార్డ్ ఆఫ్ సి మైనర్ (common chord of C minor) అంటారు. అదే విధంగా డిస్కార్డ్‌లోని 7వ స్వరం కోమలస్వరం అయితే కార్డ్ ఆఫ్ ది డామినెంట్ సెవెన్త్ (Chord of the dominant seventh) అంటారు. హార్మానికల్ మేజర్ స్కేల్ (Harmonical major scale), హార్మానికల్ మైనర్ స్కేల్ (Harmonical minor scale), మెలాడికల్ మైనర్ స్కేల్ (Melodical minor scale) అనే మూడు స్కేళ్లు ఆ పద్ధతిలో ఉన్నాయి. ఇవి కర్ణాటక సంగీతంలోని ధీరశంకరాభరణం, కీరవాణి, గౌరీ మనోహరి అనే మేళకర్తలను పోలి ఉంటాయని అంటారు.

భారతీయ సంగీతం 'రాగ సంప్రదాయ పద్ధతి'కి చెందింది. రాగం, స్వరం, తాళం చేరి సంగీతం అయిందని ఒక నిర్వచనం చెప్తుంది (రాగః స్వరశ్చ తాళశ్చ త్రిభిస్సంగీత ముచ్యతే). స్వర తాళాలు ఉన్నప్పటికీ ఈ పద్ధతిలో రాగానికే ప్రాముఖ్యం. రాగం అంటే కొన్ని స్వరాలను ఆరోహణ అవరోహణ క్రమంలో గమక యుక్తంగా పాడటం అని చెప్పవచ్చు. వినేవారి చిత్తానికి సుఖం కలిగేటట్లు స్వరాలను కంపింప చెయ్యటమే గమకం. ఈ పద్ధతికి గమకాలే ప్రాణం అని చెప్తారు.

భారతీయ సంగీతం వేదాల నుండి పుట్టిందని ఋగ్వేదంలోని ఉదాత్త, అనుదాత్త, స్వరితాలతో మొదలై సామవేద కాలంనాటికి (1) కృష్ట (2) ప్రథమ (3) ద్వితీయ (4) తృతీయ (5) చతుర్థ (6) మంద్ర (7) అతిస్వార్య అనే ఏడు స్వరాలు అవరోహణ క్రమంలో గుర్తింపబడినవని చెప్తారు. ఇవి ఈనాటి మ-గ-రి-స-ని-ద-ప అనే స్వరాలతో సంవదిస్తాయి. స్వరాలు ఆరోహణ క్రమంలో పుడతాయనీ ఆ క్రమంలోనే రక్తి ఎక్కువనీ కనుగొన్నప్పుడు ఈ స్వరాలను స-రి-గ-మ-ప-ద-ని అనే క్రమంలో ఏర్పాటు చేయటం జరిగింది. 'స' అనే షడ్జస్వరంతో ఆరంభమయ్యే ఈ స్వరసముదాయాన్ని 'షడ్జ గ్రామం' అంటారు. సామవేదం నాటికి ఏర్పడి ఉండి మధ్యమ స్వరంతో ప్రారంభించి అవరోహణ క్రమంలో నడిచే మ-గ-రి-స-ని-ద-వ అనేవి 'మధ్యమ గ్రామం' అనబడుతున్నాయి.

భారతీయ సంగీతంలో 22 శ్రుతి స్థానాలు గుర్తింపబడినై. స-రి-గ-మ-ప-ద-ని అనే సప్త స్వరాలు ఈ శ్రుతుల్లో ఎక్కడెక్కడ పుట్టేది, వాటి అంతరాలు, ఆ స్వరాల స్పందన సంఖ్య (frequency per second) మూడు స్థాయిల్లోను ఎలా ఉంటాయో క్రింద చూపబడుతోంది.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| శ్రుతులు | 4 | 7 | 9 | 13 | 17 | 20 | 22 |
| స్వరాలు | స | రి | గ | మ | ప | ద | ని |
| అంతరాలు | 4 | 3 | 2 | 4 | 4 | 3 | 2 |
| తారస్థాయి | 480 | 512 | 600 | 640 | 720 | 768 | 900 |
| మధ్యస్థాయి | 240 | 256 | 300 | 320 | 360 | 384 | 450 |
| మంద్రస్థాయి | 120 | 128 | 150 | 160 | 180 | 192 | 225 |

నోటిపాట (గాత్రం) మంద్రస్థాయి 160 స్పందనాల తరచుదనం మొదలుకొని తార స్థాయిలోని 720 స్పందనాల తరచుదనం మధ్య పడవగలదు. అనుమంద్ర ( మంద్రస్థాయి కంటె తగ్గుస్థాయి) అతితార (తారస్థాయికంటె పై స్థాయి) స్థాయులు సంగీత వాద్యాల మీదనే పలికించటానికి సాధ్యంగా ఉంటాయి. వయొలిన్ వాద్యాన్ని మంద్ర షడ్జా నికి చెందిన 120 స్పందనాల తరచుదనం అతితారషడ్జానికి చెందిన 1800 స్పందనాల తరచుదనం మధ్య వాడవచ్చు. వీణను అనుమంద్ర పంచమానికి చెందిన 90 స్పంద నాల తరచుదనం అతి తారషడ్జానికి చెందిన 1800 స్పందనాల తరచుదనం అనేవాని మధ్య వాడవచ్చు. వేణువును మంద్రషడ్జానికి చెందిన 120 స్పందనాల తరచుదనం తారపంచమానికి చెందిన 720 స్పందనాల తరచుదనం అనే వానిమధ్య వాడవచ్చు.

## శ్రు తి

గాత్రగానానికి అనుగుణంగా వాద్యస్వరాలను సరిచేసుకోవటం కూడ శ్రుతి అనబ డుతుంది. ఈ శ్రుతి అనేది పంచమశ్రుతి అనీ, మధ్యమ శ్రుతి అనీ రెండు రకాలు. వీటిలో మొదటిదైన పంచమశ్రుతి సాధారణంగా పురుషులకు, ప్రౌఢ శారీరంగల వ్యక్తులకు తగి ఉంటుంది. రెండవదైన మధ్యమశ్రుతి సాధారణంగా స్త్రీలకు, సన్నని కంఠస్వరంగల వారికి తగి ఉంటుంది.

ఒక తంబురలో దాన్ని మీటే వానికి దగ్గరగా ఉండే ఇత్తడి తంతె ఒకటి, అటు తర్వాత ఉక్కు తంతెలు మూడు- కలిసి మొత్తం నాలుగు తంతెలు ఉంటవి. మంద్రషడ్జానికి ( 120) ఇత్తడి తంతెను, మధ్య షడ్జానికి (240) తర్వాతి రెండు తంతెలను, మంద్రపంచ మానికి (180) దూరాన ఉన్న చివరి ఉక్కు తంతెను శ్రుతి చేస్తే- ఈ నాల్గు తంతెల పరిణామాన్ని 'పంచమ శ్రుతి' అంటారు. దీన్ని ప-స-స-ప అని వ్రాయవచ్చు. (స, పల క్రింది బిందువు మంద్రస్థాయిని సూచిస్తుంది. ఏ గుర్తూ లేనివి మధ్యస్థాయి స్వరాలు. పైన చుక్క పెడితే తారస్థాయికి సూచన. పైన రెండుచుక్కలు అతితారస్థాయికి, క్రింద రెండు చుక్కలు అనుమంద్రస్థాయికి గుర్తులు). మీటేవానికి దూరంగా ఉండే నాలుగో ఉక్కు తంతెను మంద్రమధ్యమా (160) నికి శ్రుతి చేసి, మిగతావాటిని మునుపటి ప-స-సలుగా ఉంచితే అప్పుడు 'మధ్యమ శ్రుతి' అవుతుంది. (ప-స-స-మ).

హార్మోనియంలో మంద్రస్థాయిలోని ఒక స్వరాన్ని షడ్జంగా తీసుకుని దానికి ఆరోహ ణంలోని పంచమాన్ని, దానితోపాటు దానికి మధ్యస్థాయి షడ్జాన్ని తీసుకున్నట్లయితే అది పంచమశ్రుతి అవుతుంది. అంటే ఒకటవ, ఎనిమిదవ, పదమూడవ (1-8-13) పీకెలను వాయించటం పంచమశ్రుతి. హార్మోనియం మీద ఒకటవ, ఆరవ, పదమూడవ పీకెలను ఒకేసారి (1-6-13) వాయించటం మధ్యమశ్రుతి అవుతుంది.

## అనురణనాత్మక ధ్వనులు- అచ్చులు

ఒక తంతెను మీటినప్పుడు అది 1,2,3,4,5,6 మొదలైన ఖండాలుగా స్పందిస్తుంది. అలాగ స్పందించే భాగానికి ఆహత గ్రంథి (anti- node) అని స్పందన విశ్రాంతిగల స్థానానికి అనాహత గ్రంథి (node) అని పేరు. తంతెను మీటినప్పుడు గట్టిగా వినబడే ధ్వనిని ఆధారషడ్జం (the fundamental) అంటారు. అటు తర్వాత వచ్చే స్పందనలు కొన్ని. స్వయంభూ ధ్వనులు (over tones, upper partial tones) అనబడే అనురణనాత్మక ధ్వనులు (Harmonic series of sounds). శ్రుతి అనేది స్పందించే తంతె భాగం పొడవునుబట్టి ఉంటుంది కాబట్టి ఈ అనురణనాత్మక ధ్వనులు 1:2:3:4:5:6 వగైరా నిష్పత్తుల్లో ఉంటాయి. ఆధారషడ్జం స్పందనాల తరచుదనం 100 అయితే దాని స్వయంభూ ధ్వనుల తరచు దనాలు 200, 300, 400, 500, 600 వగైరాగా ఉంటాయి. ఇది హార్మోనిక్ సిరీస్ అనబడే 100, 100x2, 100x3, 100x4, 100x5, 100x6 క్రమానికి చెందుతాయి. కాగా సంగీత స్వరాలు అనురణనాత్మక ధ్వనులతో కూడిన మిశ్రిత ధ్వనులు. మానవగాత్రం, తంతెలు అనేవాని ధ్వనులు ఈ అనురణనాత్మక ధ్వనుల్లో సమృద్ధాలని తెలుస్తోంది.

ఐతరేయారణ్యకం మానవ కంఠంలోని స్వరపేటిక (larynx)ను 'దైవీ వీణ' అన్నది. మగవారిస్వరతంతులు సుమారు 18మి.మీ. పొడవు, స్త్రీలస్వరతంత్రులు సుమారు 12 మి.మీ. పొడవు ఉంటాయి. మగవారి కంఠధ్వని ధ్వనితరంగం పొడవు సుమారు 8'-12' మధ్య ఉంటుందని, ఆడువారి కంఠధ్వని ధ్వనితరంగం పొడవు సుమారు '2'-4'' మధ్య ఉంటుందని చెప్పబడుతోంది. గమనించవలసిన అంశం ఏమంటే మనుష్యుల కంఠంలోని స్వరపేటిక ( larynx) అనురణనాత్మక ధ్వనులనబడే స్వయంభూ ధ్వనులు ఉండే ధ్వనుల్ని పలుకుతుంది అని, అది గాత్ర సంగీతానికి ప్రత్యేకంగా అనుకూలమైన అంశం అని.

ఒక వ్యక్తి అ,అ,ఆ అని రాగాలాపన కూనిరాగంగానైనా చేసినప్పుడు ఆ ధ్వనుల్లోని అచ్చులు ముఖ్యంకాని హల్లులు కావు. మానవ భాషల్లోని అచ్చులు అనురణనాత్మకాలైన మిశ్రిత ధ్వనులని చెప్పినవారు హెల్మ్ హోల్ట్జ్. స్వరతంతుల స్పందనాలే అచ్చులనే ధ్వనులను సాధ్యంగాచేస్తున్నవి. నోరు నాదపేటిక ( resonance chamber)లాగ పని చేస్తుంది. కాగా సంగీతానికి అచ్చులే ముఖ్యమైనవని గ్రహించవలసి ఉంటుంది. భారతీయ సంగీతంలో గీత ధ్వనులను 'స్వరాలు' అన్నట్లుగానే సంస్కృతం, తెనుగు, కన్నడ భాషల్లో అచ్చులను 'స్వరాలు' అంటారు. వీటిని 'ప్రాణములు' అనటం కూడా ఉంది. నిస్సందేహంగా సంగీతంలో అచ్చులు ప్రాణాలే.

## సంగీతానికొక భాష - తెనుగు

సంగీతంలో కూనిరాగం తీయటానికే అచ్చులు కావలసి వస్తే ఒక పాట పాడి దానికి అర్థవత్త కల్పించటానికి సార్థకమైన పదాలతోడి ఒక రచన కావాలి. సంగీతంలో స్వరాల కూర్పుకు 'ధాతువు' అని పేరైతే సార్థకమైన పదాలతో కూర్చిన పదరచనకు 'మాతువు' అని పేరు. పాటలో ఒక చిత్త వృత్తి (mood)లోని భావాన్ని (emotion) బుద్ధికి అందేటట్లుగాను అర్థమయ్యేటట్లుగాను మార్చి దర్శనానికి తెచ్చేది ఆ పాటలోని 'సాహిత్యం' అనబడే పద రచన. ఈ ప్రయోజనంకోసం సంగీతానికి ఒక భాష కావాలి. దక్షిణ భారత దేశంలో ఈ పనిని నిర్వహిస్తున్నది తెనుగు. తెనుగు కవులు శ్రీనాథుడు కృష్ణదేవ

రాయలు 'దేశభాషలందు తెనుగులెస్స' అన్నారు. సంస్కృతకవుల్లో ధర్మమేంతుడు 'వాచో మాధుర్య వర్షిభ్యో.... మండనాన్యాంధ్ర యోషితామ్' అంటూ తేనెలుగురిసే తెనుగు మాటలు ఆంధ్ర వనితల కలంకారమని ఈ భాష చెవికింపుగా ఉండటాన్ని మెచ్చుకొన్నాడు. రాజశేఖరుడు 'వాక్పత్యాంగ సముద్భవై రధినయై ర్నిత్యం రసోల్లాసితః' అంటూ తెనుగు భాషకుండే రసస్ఫూర్తిను చెప్పారు. అప్పయ్య దీక్షితులు—

'ఆంధ్రత్వ మాంధ్ర భాషాచ, ప్రాభాకర పరిశ్రమః

తత్రాపి యాజుషీశాఖా,నాల్పస్యతపసః ఫలమ్'

అంటూ తెనుగు వాడుగా పుట్టటం, తెనుగు భాష మాటాడటం, పూర్వ మీమాంసా శాస్త్రంలో గురుమత మనబడే ప్రభాకర భట్టు ప్రస్థానం (కుమారిలభట్టుప్రస్థానానికి భిన్నము)లో పరిశ్రమ చెయ్యటం, యజుర్వేద శాఖలో పుట్టటం ఎంతో తపస్సు చేసి ఉంటేకాని లభించేవి కాదని కంఠోక్తిగా చెప్పారు.

సంస్కృతంలోని హంస సందేశ కావ్యంలో తెనుగును గూర్చిన మెచ్చికోలు ఉంది. ఐరోపీయులు తెనుగును ప్రాచ్య ప్రపంచానికి ఇటాలియన్ భాష అన్నారు. ( Italian of the East). డాక్టర్ కారీ (Carey) తన 'తెలింగ వ్యాకరణం' (Telinga Grammar) (1812 A.D.)లో "తెలింగ, కర్నాటక, తమిళ, మళయాళ సింగలీస్ (సింహళ) అనే ఐదు భాషల్లో తెలింగ భాష అత్యంతం నాజూకైనదిగా తోచుతుంది. నేర్చుకోటానికి కష్టమైంది అనేది ఒప్పుకున్న మాటే అయినా అభిప్రాయాల్ని నిరాటంకంగా, సముచితంగా, నాగరికమైన సౌకుమార్యంతో వ్యక్తం చెయ్యటానికికావలసిన శక్తినిచ్చే విభక్తికారక విధానాల వైచిత్రి ( Variety of inflexion) ఉండటం వల్ల నేర్చుకోటానికిచాలాతగిఉన్న భాషల్లో ఒకటిగా దీన్నేచేర్చి చెప్పాలి" అన్నాడు.

డాక్టర్ కాంబెల్ (Campbell) తన 'తెలూగూ' వ్యాకరణం (Teloogoo Grammar) (1816 A.D.) అంకితం చేస్తూ ఈ ప్రాథమిక (వ్యాకరణ) గ్రంథం భారత దేశ భాషల్లోని అతి ప్రాచీనమూ, ఉపయోగకరమూ, నాజూకుగలదీ అయిన ఒక భాషకు సంబంధించిన సూత్రాలను వివరిస్తుందనీ సాగరతీరంలోని మామూలు ఉద్యోగులు, రాణువవారు తెలంగాణంలోని ఈ భాషతోటి, నాగరకులైన ఇక్కడి జనుల గుణగణాలతోటి, ఆచారలతోటి పరిచయాన్ని వృద్ధి చేసుకోవటానికి ఈ గ్రంథం ఉపకరిస్తుందని చెప్పివాడు. పీఠకలోని XIII పుటలో ఇలా వ్రాశాడు:

"తెలుగు అందుకొన్న గొప్ప నాజూకుతనాన్ని చూపటానికి నేటికీ నిలిచి ఉన్న పలు విధాలైన బహు సంఖ్యాకమైన గ్రంథాలు చాలు. దీని సమృద్ధి, భావస్ఫురణ, నిర్మాణంలో క్రమబద్ధత అనేవాటిని మీరిరాగలభాషలు లేవు. ఈ భాష తన వ్యక్తీకరణంలోని ఒక గొప్ప నాజూకుతనాన్ని, శ్రుతి పేయతను గూర్చి విశిష్టంగా గర్వపడవచ్చు".

ద్రావిడ భాషలకు తులనాత్మక వ్యాకరణం వ్రాసిన డాక్టర్ కాల్డ్వెల్ తన గ్రంథం (25 పుట)లో "ద్రావిడ భాషల్లో, సంస్కృతి ప్రాచీనత, శబ్ద సమృద్ధి అనేవాటి వరంగా తెలుగు తమిళం తర్వాత చెప్పదగిందిగా భావింపబడుతూంది. అయినా శ్రావ్యతా మాధుర్యం విషయంలో మాత్రం ఇది ప్రథమస్థానానికి న్యాయమైన హక్కు పొందింది" అన్నారు.

అట్లే 27 పుటలో తెనుగు భాషకుండే తేనె సోనల తీపిని ప్రశంసించాడు.

ఆధునిక కాలంలో తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి 'సుందర తెలుంగ'ని మెచ్చి నాడు. ప్రొఫెసర్ జె.బి.ఎస్. హాల్డేన్‌గారి తెనుగు మీది అభిమానం ప్రసిద్ధమే. తెనుగు భాష మాధుర్యానికీ అది సంగీతానికి ప్రత్యేకంగా నప్పి ఉండటానికి కారణం అది అజంత భాషకావటమే. అనగా తెనుగులో పదాలు ఏదో ఒక అచ్చుతో ముగుస్తాయని హల్లుతో ముగిసే పదాలు దాదాపు లేవనీ అభిప్రాయం. పదాంతంలో వచ్చే అచ్చుల్లో కూడా ఉ,అ,ఇ, అనేవి ఎక్కువ. తెనుగు అజంతత్వం సంగీతానికి పనికి వచ్చే ముఖ్య లక్షణంగా ఉంటుండగా ఆ పనికి రావటానికి మరికొన్ని అంతేమంచి కారణాలూ ఉన్నాయి. తెనుగు ఛందస్సులో చెవికి ఇంపుగొల్పే ధ్వని సాజాత్యానికి ఉభయమిచ్చే యతి, ప్రాస ఉన్నాయి. యతి అన్నప్పుడు పాదాద్యక్షర ధ్వనితో సాజాత్యంకల అక్షర ధ్వని యతిస్థానంలో రావటం అనేది ప్రసిద్ధమే. ఈ ధ్వని సాజాత్యం పాదా ద్యక్షరంలోని అజ్ఝల్లులు రెండింటికీ సంబంధించి ఉంటుంది. ప్రాసమనేది పాదద్వితీయాక్షర స్థానంలో అన్ని పాదాల్లోను హల్లు అవృత్తి కావటం. ఈ భాషకు మరింత గీతి లక్షణాన్ని సేకరించిపెట్టటంలో ఛేకం, ముక్త పదగ్రస్తం, వృత్త్యనుప్రాసం వంటి శబ్దాలంకారాలు సహాయపడుతున్నాయి. ఛేకానుప్రాసం సంగీతంలోని స్వరాలంకారమైన 'ఊర్మి' లాగ పనిచేస్తుంది. (సమ, సమ రిప, రిప). ముక్త పదగ్రస్తం 'ఆక్షేపము' అనే అలంకారంలాగ పని చేస్తుంది. (సరిగ, రిగమ, గమప) వృత్త్యనుప్రాసం 'స్ఖలితం' అనే అలంకారంలాగ పని చేస్తుంది. (సగరి మమ రిగస, రిమగ పపమగరి...) ఏకాక్షరావృత్తి గాంధారవృత్తి వలె పని చేస్తుంది.

తెనుగు వ్యాకరణంలో అచ్చుల సమీకరణం ఉత్తమంగా జరిగి ఉచ్చారణ సౌలభ్యం, గానయోగ్యత అనేవాటికి దోహదం చేసే గుణం ఉంది. హల్లుల విషయంలో కూడ ఇలాంటి ప్రయోజనమే కలుగుతుంది. అగ్ని> అగ్గి; భక్తి> బత్తి; శ్వాసవ్యంజనాలు సుల భతరాలై నాదవ్యంజనాలుగా మారి ఉచ్చారణ సౌలభ్యాన్నిస్తాయి. ఇలాగే నాదాక్షరాలు నాదతరాలుగా మారటమూ ఉంది. (తిగ> తీవ; పగలు> పవలు; మామిడి> మావిడి) నాదతరాలు నాదతమాలుగా మారటమూ ఉంది. ఈ లక్షణాలతో తెనుగు భాషకు ఒక కోమలత్వం వచ్చింది. శ్రావ్యత కోసం వచ్చే మార్పు కూడా ఇలాగే ఉపకరిస్తుంది: (అడగు> అణగు; పుడక> పుణక; పడతి> పణతి.). అలాగే తెలుగులో వచ్చే పాక్షిక వర్ణ సమీకరణం (నిండు+వెలు> నివ్వెలు; నెలు+మనము> నెమ్మనము) మఱి గసడదవాదేశం, ఉచ్చారణలో ఒక ప్రత్యేక సౌలభ్యాన్నిస్తాయి. ఇలాంటి లక్షణాలే తెనుగును సంగీతానికి ప్రత్యేకంగా తగిన కోమలమైన భాషగా చేసినై.

## నాట్యసంగీతాలకు తెనుగుల ఉభయం

ప్రాచీనకాలం నుండి తెనుగుదేశంలో నాట్యసంగీతాలు గొప్ప పాత్రే వహించినై. నాట్యా నికి సంబంధించి రెండుపాయలు ఉండేవి. (1) నట్టువమేళాలు, (2) నాట్యమేళాలు. నట్టువ మేళాలు దేవదాసీ వ్యవస్థ ద్వారా దేవాలయాల్లో ఆరాధనానృత్యాలకు దారితీసినై. నాట్య మేళాలు రాజనర్తకీవ్యవస్థ ద్వారా రాజసభ నృత్యాలకు దారితీసినై. ఈ నాట్యమేళాలు క్రమంగా కూచిపూడి సంప్రదాయం ద్వారా కలాపాలకు, ఇతరాలు పురాణ కథలతో భాగవతమేళాలకు దారితీసినై.

శాతవాహనుల, ఇక్ష్వాకుల కాలాల్లో నాట్య సంగీతాలు రాజాస్థానాల్లోనే వర్ధిల్లినా చాళుక్య, చోళ రాజుల కాలాల్లో దేవాలయాలు వీటికి ప్రోదిచేసినై.

చెల్లవ్వ (క్రీ.శ. 848-892), చామకాంబ (క్రీ.శ. 945-970), ప్రోలమ, అక్కసాని (క్రీ.శ. 1250 ప్రాంతం), లకుమాదేవి (క్రీ. శ. 1386- 1402), మాచల్దేవి (క్రీ.శ. 1437 ప్రాంతం), రంజకం కుప్పాయి (క్రీ.శ. 1509- 1530) ముద్దుకుప్పాయి (క్రీ. శ. 1531 ప్రాంతం) శాసనాల్లో పేర్కొబడ్డ ప్రసిద్ధ నర్తకుల్లో కొందరు. ఎఱునట్టువ, నృసింహ మండలిక, నట్టువ సోమయ్య నట్టువ ప్రోల (క్రీ.శ. 1250 ప్రాంతం) అనేవారు శాసనాల్లో పేర్కొబడ్డ ప్రసిద్ధులైన నట్టువనార్లలో కొందరు. క్రీ.శ. 1560కి ముందు భరతం వీరరాఘవయ్య అనే నట్టువనార్ ఉన్నట్లు తెలుస్తోంది.

నాట్య సంగీతాల మీద తెలుగు వారు సంస్కృతంలో వ్రాసిన గ్రంథాల్లో నందికేశ్వరుని 'అభినయదర్పణం' ప్రాచీనతమమైంది. నందికేశ్వరుణ్ణి మతంగుడు పేర్కొన్నాడు. అందుచేత ఆ గ్రంథం క్ర.శ. 3శతాబ్దికి చెందిందని తలపబడుతోంది. ఈ గ్రంథానికి దొరికిన అయిదు ప్రతులూ తెలుగు లిపిలోనే ఉన్నాయి. నందికేశ్వర ప్రస్థానం భారతనాట్యానికి చెందిన 16 ప్రస్థానాల్లో ఒకటి. ఆంధ్రదేశంలో సాధారణంగా ఇదే అనుసరింపబడుతోంది. క్రీ.శ. 1213-1255 నాటి జాయసేనాపతి నృత్య రత్నావళి, గీత రత్నావళి అనే రెండు గ్రంథాలు వ్రాశాడు. గీత రత్నావళి లభ్యం కాలేదు. నృత్తరత్నావళి ప్రచురింపబడింది. సర్వజ్ఞసింగభూపాలుడు (క్రీ.శ. 1300 ప్రాంతం) శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరానికి సుప్రసిద్ధ వ్యాఖ్యానం సంస్కృతంలో రచించాడు. ఈ వ్యాఖ్యానానికి '(సంగీత) సుధాకర'మని పేరు. కుమారగిరి రెడ్డి (క్రీ.శ. 1386- 1402) 'వసంత రాజీయము' అనే గ్రంథానికి కర్త. దీనిని కాటయవేముడు పేర్కొన్నాడు. పెదకోమటి వేమారెడ్డి (క్రీ.శ. 1402- 1420) 'సాహిత్య చింతామణి ' అనే గ్రంథాన్నే కాక 'సంగీత చింతామణి' అనే గ్రంథం కూడా వ్రాశాడు. ఈ 'సంగీత చింతామణి'కి ఉన్న రెండు ప్రతులూ తిరువనంతపురం పాలెస్‌లైబ్రరీలో ఉన్నట్లు తెలుస్తోంది. కల్లినాథుని సంగీత రత్నాకరం మీది వ్యాఖ్య ప్రసిద్ధం. అయన ఇమ్మడి దేవరాయల (క్రీ.శ. 1440- 1465) ఆస్థాన విద్వాంసుడు. బండారువిఠ్ఠలుడు సంగీత రత్నాకరం మీద తెలుగులో వ్యాఖ్యానం వ్రాశాడు. (ఇది అముద్రితం). ఇతను గుజరాత్‌నవాబు అబుల్ గియాజుద్దీన్ సుల్తాను నుండి మూడువేల తులాల బంగారాన్ని బహుమతిగా పొందినట్లు తెలుస్తోంది. ఈ విఠ్ఠలుని కుమారుడైన బండారులక్ష్మీనారాయణ 'సంగీత సూర్యోదయం' అనే గ్రంథానికికర్త. ఇతడు శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానంలో ఉండినవాడు. ఈ సంగీత సూర్యోదయానికి 'లక్ష్మణ భరతం' అని కూడా పేరు. చెఱుకూరి లక్ష్మీధరుడు (క్రీ.శ. 16 శతాబ్ది) నాట్య సంగీతాలను రెండింటినిగూర్చి చెప్పే 'భరత శాస్త్రం' అనే గ్రంథం వ్రాశాడు. అంతే కాదు. ఈయన గీత గోవిందం మీద 'శ్రుతిరంజని' అనే వ్యాఖ్యను వ్రాశాడు. అళియరామరాయలకాలంలోని కొండవీటి రామామాత్యుడు 'స్వర మేళకళానిధి' అనే ప్రసిద్ధ గ్రంథం వ్రాశాడు. మొట్టమొదటిగా మేళజన్యరాగాల వర్గీకరణ పద్ధతిని చెప్పినవాడితడే. కర్నాటక సంగీతానికి నేటి వీణను ప్రసారించింది ఇతడే. ఈ కాలానికే చెందిన మరొక ప్రసిద్ధ సంగీత గ్రంథకర్త తూర్పు గోదావరి జిల్లాకుచెంది 'రాగవిబోధము' అనే గ్రంథాన్ని రచించిన సోమనాథుడు. ఇది ' స్వరమేళ కళానిధి'ని సమర్థిస్తుంది. దక్షిణ

భారత సంగీతంలో ఆరోహణ అవరోహణ క్రమాలతోడి 'మేళకర్తల' నిర్మితిని ప్రవేశపెట్టింది ఈ గ్రంథం. ఈ గ్రంథాన్ని చూస్తే డెబ్బదిరెండు మేళకర్తలు స్మరణకువస్తాయని చెప్తారు. నేటి వీణావాదన పద్ధతిని ఇతడే ప్రవేశపెట్టినట్లు చెప్పబడుతోంది. రఘునాధ భూపాలుని 'సంగీత సుధ' చెప్పకుండానే స్ఫురించే గ్రంథం.

తెనుగు గ్రంథాల్లో దామరాజు సోమయ్య (క్రీ.శ. 1560 పూర్వం)గారి 'భరతం', పోలూరి గోవిందకవి (17 శతాబ్ది) 'రాగ తాళ చింతామణి,' 'తాళదశ ప్రాణ ప్రదీపిక' అనే గ్రంథాలూ, లింగముగుంట మాతృభూతకవి (16-17 శతాబ్దంలో) 'అభినయదర్పణం,' లేపాక్షి వేంకట నారాయణకవి (క్రీ.శ. 1900 ప్రాంతం), 'నాట్య ప్రదీపనము,' మతు కుమల్లి నృసింహకవి (19 శతా.) 'సంగీత సారసంగ్రహము' మరియు 'భరత శాస్త్ర సర్వస్వము' చిల్లకూరి దివాకరకవి (17 శ. తర్వాత ) 'భరత సారసంగ్రహము' అనేవి కొన్ని ముఖ్య గ్రంథాలు. ' సంగ్రహ చూడామణి' రచించిన గోవిందాచార్యులు ఆంధ్రుడని తలవబడుతున్నారు.

వేంకటమఖి మేళకర్తలు సమగ్రంగా లేనందువల్ల అతడు చెప్పిన మేళములు కొన్ని 'సంగీతసార సంగ్రహం'లోనూ 'సంగ్రహ చూడామణి'లోను జన్యరాగాలుగా కనబడుతాయి.

వాగ్గేయకారుల్లో అన్నమాచార్యులు, భద్రాచల రామదాసు అనబడే కంచెర్ల గోపన్న, క్షేత్రయ్య, త్యాగరాజు, పెద్దిదాసు, సారంగపాణి ప్రసిద్ధులే.

తెనుగు సాహిత్యంలోని ప్రాచీనకవుల్లో చాలమంది సంగీతం చక్కగా తెలిసినవారో లేదా సంగీత పరిచయం కలవారో అని చెప్పాలి. వసుచరిత్ర వ్రాసిన రామరాజభూష ణుడు 'సంగీత కళా రహస్యనిధి'. అతని గ్రంథంలో హిందోళం, వసంత, కోలాహల, నాట, సారంగ, కాంబోజ మొదలైన రాగాలకు చెందిన మత భేదాల మీద అతని నిర్ణయాలు నిక్షేపించబడి ఉన్నాయి. 'ప్రాంచీనాంధ్ర మహా కవుల సంగీత ప్రతిపత్తి' అనే పేరుతో డాక్టర్ బాదరాజు వెంకటశారద అనేవారు పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించి ప్రాచీనాంధ్ర కవుల సంగీత జ్ఞానాన్ని ప్రదర్శించారు. గ్రంథకర్త్రి సంగీత శిక్షణ కలవారు. గ్రంథం ప్రచురింపబడింది.

## II

## శ్రీ వేంకటేశ్వరుడు

ఈనాడు తిరుమల తిరుపతిలోని వేంకటేశ్వరుడు భారతదేశం నాల్గు మూలలందే కాకుండా దాని సరిహద్దులకు అవల కూడా ప్రసిద్ధుడై పూజింపబడుతున్నాడు. ఆ దేవుణ్ణి వేర్వేరు జనులు వేర్వేరు విధాలుగా భావించారు, భావిస్తున్నారు. కొందరాయన్ని శివుడని, మరికొందరు శక్తి అని, ఇంకా కొందరు భైరవుడని, వేరొక కొందరు జినుడని, ఇంకొక కొందరు స్కందుడని భావించి ధ్యానిస్తారు. (ఈ అంశాన్ని గురించి అన్నమాచార్యులొక అధ్యాత్మ సంకీర్తనలో గానం చేశారు). పదకొండో శతాబ్దిలో శ్రీ రామానుజులు ఈ దేవుణ్ణి విష్ణువుగా ప్రకటించారు. ఆయన తనకు శ్రీమద్రామాయణాన్ని బోధించిన తిరుమలనంబిగారిని, మరి ఇద్దరు శిష్యులను, 24గురు ఏకాంగులను ఆలయ నిర్వహణకు ఉంచినట్లు చెప్పబడుతోంది.

తిరుమల తిరుపతి వైఖానసాగమపద్ధతిగా పూజ జరిగే ఆలయాలకు కేంద్రంలాంటిది. వైఖానసాగమాన్ని పాటించే ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు ఆలయాలకిది ఒజ్జబంతి.

14వ శతాబ్దిలో వేదాంత దేశికులు, శిష్యులతో సహా మణవలమహాముని తిరుమల దర్శించి స్వామిని పూజించారు. అహోబిల మతస్థాపకుడైన శఠకోపయతి, అన్నమాచార్యులు ఈ ఆలయాన్ని ప్రసిద్ధికి తెచ్చారు. 16వ శతాబ్దిలో ఈ ఆలయానికి శ్రీకృష్ణ దేవరాయల ప్రాపు లభించింది. ఆయన క్రీ.శ. 1512- 1523 మధ్య కాలంలో ఏడుసార్లు తిరుమల దర్శించి స్వామిని సేవించుకొన్నారు. మొదటిసారి దర్శించినప్పుడు స్వామికి నవరత్న కిరీటం, 25 వెండిపళ్లేలు, పాలు త్రాగడానికి బంగారు పాత్ర కానుకలుగా సమర్పించుకున్నారు. రెండోసారి దర్శించినప్పుడు శ్రీదేవికి భూదేవికి చాల నగలు సమర్పింపబడినై. మూడోసారి యాత్రలో రాయలు స్వామికి అయిదు గ్రామాలు ఇచ్చారు. నాల్గోసారి యాత్రలో స్వామికి 25వేల వరహాలతో కనకాభిషేకం చేయించడం తాళ్లపాక గ్రామాన్ని దానం చెయ్యడం జరిగింది. రాయల చిన్నరాణి అయిన చిన్నాదేవి ఒక గ్రామాన్ని ఒక హారాన్ని ఇచ్చింది. రాజుగారు నవరత్న ప్రభావలి అనే మకరతోరణాన్ని కూడా ఇచ్చారు. ఐదోసారి యాత్రలో 'ఆనందనిలయ' విమానానికి బంగారుతొడుగు చేయించటానికి 25వేల వరహాలు పులికాపునకుగాను వెయ్యివరహాలు, ఉదయ నైవేద్యానికి 5నూర్ల వరహాలు ఇయ్యటమే కాక ఒక కంఠహారము పతకము ఇయ్యబడినై. ఆరోసారి కొన్ని భూములు దానము చేయబడినై. ఏడోసారి నవరత్నాలు పొదిగిన పీతాంబరం, నవరత్నాలుగల రెండు వింజామరలు, ఒక పతకం, 10వేల వరహాల ధనం కానుకలుగా సమర్పింపబడినై. తర్వాత కాలంలో అచ్యుతరాయలు, సదాశివరాయలు కూడా స్వామిని భక్తితో సేవించుకున్నవారే. 16 శతాబ్ది నుండి ఈ ఆలయం యశస్సు భారతదేశం అంతా వ్యాపించింది. ఈ ఆలయానికి వచ్చే సాలుసరి వరుమానం విషయంలో ఇది ప్రపంచంలోని గరిష్ఠాదాయంగల ఆలయాల్లో రెండోస్థానానికి వస్తుందని చెప్పబడుతోంది.


### తాళ్లపాక కవులు

తాళ్లపాక ఆంధ్రప్రదేశ్ కడపజిల్లా రాజంపేట తాలూకాలోని ఒక గ్రామం. పూర్వం

ఆ ప్రాంతాన్ని 'పొత్తపినాడు' అనేవారు. తాళ్లపాకలో నందవరీక శాఖకు చెందిన స్మార్తనియోగి బ్రాహ్మణకుటుంబం ఒకటి ఉండేది. (నందవరీకులు తమకులదైవంగా- కర్నూలు జిల్లాలో బనగాని పల్లెపాణ్యం అనే ఊళ్ల మధ్య ఉండే నందవరంలోని చౌడేశ్వరి (చాముండేశ్వరి)ని సేవించటం వల్ల వారికా పేరు వచ్చింది. నందవరీకులు ఋగ్వేదులు. అశ్వలాయనసూత్రులు). ఆ కుటుంబంలో నారాయణసూరికి నారయణుడు, విఠలుడు, నారాయణుడు అనేవారు తండ్రి, తాత, ముత్తాతలు. నారాయణసూరి లక్కమాంబ అనే ఆమెను వివాహం చేసికొన్నాడు. అన్నమయ్య ఈ దంపతులకు కుమారుడుగా జన్మించి శ్రీ వేంకటేశ్వరునికి గొప్ప భక్తుడై తెనుగులో గొప్ప సంకీర్తనాచార్యుడైనాడు. ఈయనకు తిరుమలమ్మ, అక్కలాంబ అని ఇద్దరు భార్యలు. ఈయనకు తిరుమలమ్మయందు నరసయ్య అనే కుమారుడు కలిగాడు. ఈ నరసయ్య, కవికర్ణ రసాయనం అనేకావ్యం వ్రాసిన సంకుసాల నృసింహకవి అనే ఆయన ఒక్కరే అనే అభిప్రాయం ఒకటి ఉంది. అక్కలాంబకు పెదతిరుమలాచార్యుడు అనే కొడుకు, నరసమ్మ తిరుమలమ్మ అనే ఇద్దరు కూతుళ్లు కలిగారు. ఈ పెదతిరుమలాచార్యునికి ఐదుమంది కొడుకులు. వాళ్లు (1) చిన తిరుమలాచార్యుడు (2) అన్నయ (3) పెదతిరువేంగళనాథుడు (4) చిన తిరువేంగళనాథుడు 5) కోనేటి తిరువేంగళనాథుడు అనేవారు. చిన తిరుమలాచార్యుడు పెదమంగమ్మ అనే ఆమెను వివాహం చేసుకొన్నాడు. ఆమెయందు అతనికి తిరువెంగళప్ప అనేకొడుకు కలిగినాడు. తాళ్ళపాకవారి వంశ వృక్షాన్ని ఇలా చూపవచ్చు:

## తాళ్లపాక కవుల వంశవృక్షము

అన్నమాచార్యులు (క్రీ.శ. 1424-1503)




వీరిలో ఒక్కొక్కరిని గురించి రేఖా మాత్రంగా క్రింద చెప్పబడుతోంది.

అన్నమాచార్యులు క్రీ.శ. 1424-1503 మధ్య కాలంలో విలసిల్లినారు. (క్రోధి సంవత్సర వైశాఖమాసంలో విశాఖా నక్షత్రంనాడు మొదలుకొని దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశివరకు). తమిళ భక్తుడు నమ్మాళ్వారుతో వీరికిచాలా పోలికలున్నాయి. ఇద్దరూ వైశాఖ మాసంలో విశాఖానక్షత్రంనాడు పుట్టినవారే. నమ్మాళ్వార్ తిరువాయ్ మొళి అనే దివ్య ప్రబంధాన్ని కూర్చటం తన పదునారో సంవత్సరంలో మొదలుపెట్టగా అన్నమయ్యగారు కూడా తన పదునారో ఏట వేంకటేశ్వరుని సాక్షాత్కారాన్నిపొంది తన సంకీర్తన రచన ప్రారంభించాడు. ఇద్దరూ కూడా శ్రీ వెంకటేశ్వరునిగూర్చి, ఇతర వైష్ణవాలయాల్లోని దైవాలనుగూర్చి గానం చేశారు. వైష్ణవ భక్తులకు నమ్మాళ్వార్ కొన్ని భమణి అంశతో పుట్టారని విశ్వాసం. అలాగే అన్నమాచార్యులు కూడా విష్ణువు ఖడ్గమైన 'నందకం' అంశతో పుట్టారనే విశ్వాసం ఉంది.

పెరియాళ్వార్ శ్రీ రంగనాథునికి (గోదాదేవినిచ్చి) మామగారైనట్లే, అన్నమాచార్యులు కూడా తిరుమల వేంకటేశ్వరునికి 'కల్యాణోత్సవం' ఏర్పాటు ప్రారంభం చేసి తానూ స్వామికి మామగారైనారు. స్వామివారికి శుక్రవారాభిషేకం చేసే పద్ధతిని ప్రారంభించింది కూడా అన్నమయ్యగారే.

అన్నమాచార్యులవారు రోజుకొకటికి తక్కువ కాకుండా 32,000 (ముప్పై రెండువేల) సంకీర్తనలు రచించినట్లు చెప్పబడుతున్నది. వారే వేంకటేశ్వరుని ఆలయ ప్రాంగణంలో 'సంకీర్తన భండారా'న్ని నెలకొల్పినట్లు కూడా తెలుస్తోంది. ఈ సంకీర్తనలను అన్నమాచార్యుల కుమారుడైన పెదతిరుమలాచార్యులు రాగిరేకుల మీద చెక్కించడం ప్రారంభించారు. అన్నమాచార్యులు అహోబిలంలోని ఆదివన్ శఠకోపయతి శిష్యులైనందున కొన్ని సంకీర్తనల రాగిరేకులు అచటికి పోయినట్లు చెప్పబడుతోంది. కొన్ని తంజావూరు చేరినట్లు తలపబడుతోంది. ఏమైనా సంకీర్తనలు అన్నీ నేడు లభ్యంగా లేవు. పెదతిరుమలాచార్యులు అతని కుమారుడైన చిన తిరుమలాచార్యులు కూడా సంకీర్తన కర్తలే. నేడు తాళ్లపాకవారి సంకీర్తనల్లో 14,523 మాత్రం లభ్యం అవుతున్నాయి.

సంకీర్తనలు కాక అన్నమాచార్యులు సంస్కృతంలో వేంకటాచలమాహాత్మ్యం, తెలుగు ద్విపదలో రామాయణం, మరి పండ్రెండు ఇతర శతకాలు రచించారు. వీటిలో వేంకటాచల మహాత్మ్యం, వేంకటేశ్వర శతకం దొరుకుతున్నాయి. మిగిలినవి లభ్యంగా లేవు. ఈయన సంస్కృతంలో 'సంకీర్తన లక్షణం' రచించినట్లు చెప్పబడుతోంది కాని లభ్యం కాలేదు.

అన్నమాచార్యులు పద కవితా పితామహుడని, సంకీర్తనాచార్యుడని, హరికీర్తనాచార్యుడని పిలువబడుతున్నాడు. కన్నడభాషలో పురందరదాసులవారికి, ప్రాకృత భాషలో వేంకటమఖికి దారి చూపిన సంకీర్తన వాఙ్మయానికి అన్నమాచార్యులు వ్యవస్థాపకుడైనాడు. అన్నమాచార్యులవారు పండు ముసలిగా ఉన్న కాలంలో పురందరదాసులవారు యువ సమకాలీనుడుగా వారిని తిరుపతిలో దర్శించారు. అంతే కాదు. అన్నమయ్యగారి రచనలను తమ కన్నడ రచనల్లో అనుకరించారు కూడా. వారి మాళవి రాగంలోని 'శరణు శరణు

సురేంద్రవందిత శరణు శ్రీపతి సేవిత' అనే రచన అన్నమయ్యగారి మాళవి రాగంలోని రచన 'శరణు శరణు సురేంద్ర సన్నుత శరణు శ్రీసతి వల్లభా' అనే దాన్ని అనుకరించింది.

పొత్తపి నాటిలోని టంగుటూరులో దండనాథుడుగా ఉంటూ అటు తర్వాతి కాలంలో క్రీ. శ. 1487- 1490 మధ్య కాలంలో మూడేండ్లపాటు విజయనగర రాజుగా ఉండిన సాళువ నరసింగరాయల ప్రాపు అన్నమాచార్యులకు ఉండేది. ఈ నరసింగరాయలు సంస్కృతంలో 'రామాభ్యుదయం' అనే కావ్యం వ్రాసినాడు. సంస్కృతంలో 'సాళ్వాభ్యుదయ'మనే కావ్యం ఇతని జీవితకథను చెప్తుంది. ఈ నరసింగరాయడు అన్నమాచార్యులను చాలా గౌరవించాడు. అయినా అన్నమయ్య అతనిమీద పద రచన చెయ్యడానికి నిరాకరించి అతనితో వేరుపడితే రాజు సంకెళ్లు వేయించాడు. కాని అన్నమయ్య వేంకటేశ్వరుని మీద పదం చెప్పి ప్రార్థించి ఆ సంకెళ్లు ఊడిపడేటట్లు చేశారు. రాజు తన మూర్ఖత్వానికి పశ్చాత్తాపపడి తన తప్పు దిద్దుకొన్నాడు. ఈ నరసింగరాయడు గొప్ప వేంకటేశ్వర భక్తుడు. ఇతడు చాలాధనం వెచ్చించి స్వామివారి సన్నిధికి సోపానాలు, అచట మండపాలు, ప్రాకారాలు కట్టించడమే కాక స్వామివారికి ఎన్నో ఉత్సవాలు, నైవేద్యాలు, ఆభరణాలు నెలకొల్పాడు. వీటికి సంబంధించి 14శాసనాలున్నాయి. ఈయన తిరుమలలోని కందాళ రామానుజజియ్యంగారి శిష్యుడైనవాడు. పిల్లలమర్రి పినవీరన తెనుగు జైమినీ భారతకావ్యం ఇతనికి అంకితం చేయబడింది. అందులో నరసింగరాయడు 'శ్రీవేంకటాద్రి నాథ దయావర్ధిత రాజ్యు' డని వర్ణింపబడినాడు.

'సంకీర్తన లక్షణ'మనే ప్రస్తుతపు తెనుగు గ్రంథానికి ఆకరంగా చెప్పబడ్డ సంస్కృత గ్రంథాన్ని వ్రాసినవారు అన్నమాచార్యులే కనుకను, ఆయన్ని 'పద కవితా పితామహుడ'ని తెనుగు సంకీర్తన లక్షణకర్త స్తుతించడం వల్లను, తాళ్లపాక వారి సంకీర్తనల్లో రాశిలోను గుణంలోను అన్నమాచార్యుల సంకీర్తనలే ప్రధానాలుగా ఉండటం చేతను కర్ణాటక సంగీతానికి ఆయన చేసిన దోహదాన్ని సంగ్రహంగానైనా ఎన్నక తీరదు.

1. అన్నమాచార్యులకు పూర్వం 13 శతాబ్దిలో పాలకుమూరు భాగవతులూ, కృష్ణమాచార్యులూ వర్ధిల్లి భాగవత సంప్రదాయాన్ని నడిపినా అన్నమయ్యకు పూర్వపు సంకీర్తనలో కీర్తనలో తెనుగులో లభ్యం కాలేదు. కృష్ణమాచార్యుల సింహగిరి నరహరి వచనాలు- వచనాలే కాని సంకీర్తనల్లాగ పాడదగిన రచనలుకావు. అందుచేత పాడే సంకీర్తన సాహిత్యాన్ని సృష్టించిన తొలి కవి అన్నమయ్య అనుకోవటంలో తప్పులేదు. ఈ దృష్టిచేత ఆయన 'పితామహ' బిరుదం సార్థకం. పితామహుడంటే (సృష్టికర్త అయిన) బ్రహ్మ అని అభిప్రాయం. గాన యోగ్యమైన సంకీర్తన సాహిత్యానికి తెనుగులో మూల పురుషుడన్నమాట!

2. తెనుగు సంకీర్తన లక్షణ గ్రంథాన్నిబట్టి అన్నమయ్య భరతాచార్యుడు చెప్పిన 'పద నిర్యుక్త'మనే దేవస్తుత్యాత్మక రచనలను వాటిగానాన్ని పునరుద్ధరించాడని చెప్పాలి. 'పదం' అన్నపుడు 'పద నిర్యుక్తా'నికి సంగ్రహరూపం అనిగ్రహించాలి. అదే తాళ్ల పాక వారి పదకవిత. చినతిరుమలాచార్యులు తన తెనుగు 'సంకీర్తన లక్షణాని'కి 'పదచ్ఛందః'మని నామాంతరం సూచించటం ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నది. ఇందుచేతనే అన్నమయ్య 'పదకవితా పితామహుడు' అయినాడు తెనుగులో.

3. కర్ణాటక సంగీతానికి పురందరదాసుల వారిని 'పితామహుడు'గా ఎన్నుతుంటారు. వారు అన్నమాచార్యుల సంకీర్తనను అనుకరించటం వెనుక చూపబడ్డది. అన్నమాచార్యుల సంకీర్తనల్లో విశేషం అవి పల్లవి, (కొన్నిచోట్ల) అనుపల్లవి, వృత్తాలుగా విభజింపబడి ఉండటం. (పల్లవి అనేది విడిగా ఉండటం సంగీత సమయసారాదుల ప్రస్థాన ఫలమనీ, పల్లవాన్ని తొలి రెండు పంక్తుల చివరి మూడు పదాలకు లాగిన సంగీత రత్నాకర ప్రస్థానం అణగిపోయిందనీ నా విశ్వాసం). అన్నమాచార్యుల పదాల్లో అన్నింటిలోనూ పల్లవి ఉన్నది. ఈ యేర్పాటు వారుచేసిందనే భావించవచ్చు. అనుపల్లవి కొన్నింటిలో లేకపోవచ్చు. దానికి ఆయన ఇచ్ఛికతనే భావించినట్టు ఊహించవచ్చు. పదంలో నాలుగేసి పాదాల 'వృత్తా'లను వారు కూర్చారు. వాటిని 'వృత్త బంధాల'నవచ్చు. అవే నేడు 'చరణాలు'గా పిలువబడుతున్నాయి. పదం (ఉద్గ్రాహం, ధ్రువ, ఆభోగాలనే మూడు ధాతువులు కల) త్రిధాతుకమైన కూర్పనే భావంతో కాబోలు చాలా పదాల్లో మూడు చరణాలు (వృత్త బంధాలు) కూర్చారు. ఇంతకెక్కువ ఉన్నవీ- పది చరణాలున్నవి కూడా-ఉన్నాయి.

4. అన్నమయ్యకు పూర్వం, పల్లవానికి గణవర్ణ నియమాలు లేవనే కొందరు చెప్పారు. ఇది సంగీత రత్నాకర ప్రస్థానికి భిన్న ప్రస్థానం. ఆ పల్లవిని గ్రహించి అన్నమాచార్యులు దానికి నియతపరిమాణాన్ని ప్రసాదించి 'పద సమానమాన పాదయుగ్మము'గా నిలిపినాడని తలంపవచ్చు. దీనితో పల్లవికి పెద్ద పీట దొరికింది.

5. 'పద సమానమాన పాదయుగ్మం'తో ఏర్పడ్డ పల్లవి పద రచనలో ఒక వైశిష్ట్యాన్ని, సమగ్రతను కలిగించింది. పల్లవిలోనిది ప్రధానమైన భావం. అదే వృత్త బంధాలనబడ్డ చరణాల్లో విస్తరింపబడుతుంది. పల్లవిలోని ప్రధాన భావానికి భిన్నమైన మరొక భావాన్ని గ్రహించటం ఆ పదంలో ఉండదు. పదానికి పల్లవి ప్రాణ సమానం అనిచెప్పవచ్చు.

6. చివరి వృత్త బంధం (చరణం)లో అన్నమయ్యగారు తన పేరుతోటి 'ముద్ర' కూర్చటం చెయ్యలేదు. ఇష్టమైనచోట్ల వేంకటేశ్వర స్మరణతోనే తృప్తి పడ్డారు.

7. ఇంక భాషా విషయంగా అన్నమాచార్యుల రచన అనితర సాధ్యం అనిపిస్తుంది. తెనుగు ఆయన చేతిలో మైనపు ముద్దలాగ మెలిగింది. పద్య గ్రంథాలు వ్రాసిన ఇతర కవులెవరైనా ఇలాగ వ్రాయగలరా అనిపిస్తుంది ఆ రచన. వ్యావహారికం వ్రాసినా సంకీర్తనలకు సాహిత్య గౌరవాన్ని నిలిపినవాడు అన్నమయ్య.

ఇలాగ, భరతుని పద నిర్యుక్తాలనే దేవస్తుత్యాత్మక రచనల్ని పద సంప్రదాయంగా పునరుద్ధరించి, ఆ పద రచనను సంగీత రత్నాకర ప్రస్థాన పద్ధతిగా త్రిధాతుకాలనే ప్రధానంగా అంగీకరిస్తూ, సంగీత సమయ సారాదులు గణ వర్ణ నియమం లేకుండా పాదానికివెలుపల చెప్పిన పల్లవాన్ని గ్రహించి దానికి పట్టం కడుతూ పదరచనకు ఒక వైశిష్ట్యాన్ని సమగ్రతను చేకూర్చిన ఘనత అన్నమయ్యది. ప్రబంధం త్రిధాతుక చతుర్ధాతుకాలనే భిన్నమతాలను

సమన్వయపరచటమే కాదు, పదంలో పల్లవికి పట్టం కట్టడంతో ప్రబంధ రచనలో ధాతు మాతువులు రెండింటికీ ఒక సమగ్రత, సౌందర్యం నెలకొని పదం సజీవ రచన అయిందని చెప్పవచ్చు. మహా భక్తుడైన ఆయన రచనల్లో వర్ణ స్త్రీ పురుష ధనికాది విషక్షలకు అతీతమైన ఉదారభావాలు కొల్లలు. సంగీత ప్రపంచంలోను సాహిత్య ప్రపంచంలోను ఆయన ఒక సమన్వయ వాది అనవచ్చు. అన్నమాచార్యులు కర్ణాటక సంగీతానికి తెనుగు సాహిత్యానికి అనుగ్రహించిన అంశాలు ఇవి అనిస్మరించవచ్చు.

## నృసింహకవి

అన్నమాచార్యులకు తిరుమలమ్మ అనే పేరుగల్గిన భార్యయందు నరసింగన్న అనే కొడుకు కలిగి ఉండినాడు. తాళ్లపాక చిన తిరువేంగళనాథుడు తన 'అష్టమహిషీ కల్యాణం'లోను, క్రీ.శ. 1546లో కొండవీడు ప్రాంతంలోని చెందులూరు మల్లవరంగ్రామాలను వేంకటేశ్వరునికి దానం చేసిన శాసనంలోను (అతని ఆబ్దికదినం మాఘశుద్ధ చతుర్థినాడు కొన్నిపూజలకు) ఇతన్ని పేర్కొన్నాడు. ప్రసిద్ధుడైన తెనాలిరామకృష్ణ కవి నరసింగన్నను అతని సోదరులైన చిన్నన్న (చిన్న తిరువేంగళనాథుడు), పెద తిరుమలయ్యలతోకూడా స్తుతించి ఉన్నాడు. ఈ నరసింగన్నను కవి కర్ణ రసాయనకర్త అయిన సంకుసాల నృసింహకవిగా (నిష్కర్షగా కాకపోయినా) గుర్తించే వారున్నారు.

ఇక్కడ ఒక అసాధారణమైన అంశాన్నిచెప్పాలి. తన రాజ్య పరిపాలనా కాలంలో ఏడు సార్లు తిరుమలకు తీర్థయాత్ర చేసిన శ్రీకృష్ణ దేవరాయలు (క్రీ.శ. 1509- 1530) ఈ తాళ్లపాక కవికుటుంబం వారికి తన ప్రాపు చూపినట్లు కానరాదు. తాళ్లపాక గ్రామాన్ని వ్యాస రాయలకు అగ్రహారంగా దానం చేయటం అనేది మరొక ఆశ్చర్యకరమైన అంశం. తాళ్లపాక వ్యాసరాయలకు దానం కావడంతో నరసింగన్న అహోబలానికి సమీపంగా ఉండే కడపజిల్లాలో పులివెందల తాలూకాలోని సుంకేసుల గ్రామానికితరలిపోయినట్లు కొందరి ఊహ. ఛందోగ్రంథాలు ఇతన్ని 'సంకసాల నరసింగన్న'గా పేర్కొంటాయి. కవికర్ణ రసాయనం ఇతన్నిభట్టపరాశరుల శిష్యుడుగా, అహోబల మఠానికిచెందిన ఆదివన్ శఠకోప యతినెరిగిన వానినిగచెప్తుంది. ఈ గ్రంథం విశిష్టాద్వైతానికి సుముఖంగాను అద్వైతానికి వ్యతిరేకంగాను ఉంటూ రాజాశ్రయాన్ని ఈసడిస్తుంది. తాళ్లపాక వారికుటుంబానికి తన సౌమనస్యాన్ని ప్రదర్శించినవాడు అటు తర్వాతి అచ్యుతరాయలు!

తాళ్లపాక పదసాహిత్యం ప్రథమ సంపుటం పీఠకలో శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు సూచించినట్లు ఆ సంపుటంలోని అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల్లో 129 సంకీర్తనలో అన్నమాచార్యులకు అతన్ని నిర్దయగా వదలిపోయి తిరుగుతున్న కొడుకొకడుండినట్లు ఒక వ్యంగ్యమైన సూచన ఉంది. ఆ పంక్తులివి:

శ్రీరాగం

'బయలు పందిరి వెట్టి పరగఁ జిత్తముగలిగె '

దయమాలి తిరుగ నాత్మజుఁడొకడు గలిగె' -(పల్లవి)

(అధ్యాత్మ సంకీర్తనములు - 1సంపుటం, పుట 88/89- 1980 సంపాదిత ప్రతి)

ప్రధానాంశం ఈ నరసింగన్న, కవికర్ణరసాయన కర్త ఒక్కరేనా అన్నది. శ్రీ రామనుబ్బశర్మగారు డాక్టర్ జి. చలపతిగారి 'కవి కర్ణ రసాయన కావ్యానుశీలనము' అనే సిద్ధాంత వ్యాసమాధారంగా సుంకసాల తిరుమలకవి అనే అతడు తన 'భాగవత వైభవము' అనే గ్రంథంలో తాను నరసింహానికి మనుమడనని రఘునాథుని కొడుకునని చెప్పినట్లు చూపి అష్టమహిషీ కల్యాణాన్ని అనుసరించి నరసింగన్నకు కొడుకు ఒక్కడు కాక నారాయణ, అప్పలార్యుడు, అన్నమార్యుడు అనే వారు- ముగ్గురు ఉండినట్లు తెలుస్తోందనీ తిరుమల కవి చెప్పిన రఘునాథునికంటె వీరు భిన్నులని వ్రాసినారు. దీన్నిబట్టి అన్నమాచార్యుల కొడుకైన నరసింగన్న, కవికర్ణ రసాయనకర్త అయిన నృసింహకవి వేర్వేరు వ్యక్తులని తోచుతుంది. ఇప్పటికి ఈ విషయం ఈ స్థితిలోనే నిలిచి ఉంది.

## పెదతిరుమలాచార్యులు

పెదతిరుమలాచార్యులు సుమారు క్రీ.శ. 1473- 1553 మధ్య కాలంలో వర్ధిల్లినాడని చెప్పవచ్చు. ఇతని తల్లి అన్నమాచార్యుల మరొక భార్య అయిన అక్కలమ్మ. ఇతనికి తిరుమలమ్మ నరసమ్మ అనే ఇద్దరు చెల్లెండ్రు ఉండినారు. ఇతను గొప్ప విద్వాంసుడు. ఇతనికి '*వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కిక కేసరి, శరణాగత వజ్రపంజర*' అనే బిరుదులు ఉండినై. తన తండ్రి ఆజ్ఞ ప్రకారం ఇతడు కూడా వేంకటేశ్వరుల మీద రోజుకొక సంకీర్తన చొప్పన కూర్చినాడు. అంతే కాకుండా వైరాగ్య వచనగీతాలు, శృంగార దండకము, చక్రవాళమంజరి, శృంగార వృత్తశతకము, ఉదాహరణ కావ్యాలు, నీతి సీస శతకము, సుదర్శన రగడ, రేఫఱకారాలు, ఆంధ్రవేదాంతము (భగవద్గీత), ద్విపద హరివంశము (ఇది అలభ్యం) అనేవి రచించాడు.

ఈయన ఎంత గొప్ప భక్తుడంటే స్వామివారు తాను ఆయన కుటుంబంవారికి మూడు తరాలవారికి దర్శనమిస్తానని, ఏడు తరాల వారికి మోక్షమిస్తానని వరమిచ్చాడని చెప్పబడుతోంది. శ్రీ వేంకటేశ్వరస్వామికి ఈయన కావనూరు, మారువాకర్రై, కువ్వం, కీళాంగుణ్రమ్, మన్ననముద్రం, రాయలపాడు, సోమయాజులపల్లి, కొట్టంవారిపల్లి, ఎర్రగుంటపల్లి, పల్లిపురం, గండ తిమ్మాపురం అనే గ్రామాలు సమర్పించాడు. అచ్యుతరాయలు తనకిచ్చిన పూండి, సంగంకోట గ్రామాలనూ స్వామికిచ్చాడు. అచ్యుతరాయుల జన్మదినంనాడు ఆయనకై స్వామి సన్నిధిని స్వంత ఖర్చులతో పూజాదులకు ఏర్పాటు చేసినాడు. అచ్యుతరాయుల రాజ్యపాలన కాలంలో విజయనగరంలోని విఠలేశ్వరస్వామికి కూడా ఈయన కొన్ని భూములు సమర్పించాడు. ఎన్నో జీర్ణోద్ధరణలు చేయించాడు. సంకీర్తనలను రాగిరేకుల మీద వ్రాయించాడు. ఆళ్వార్ తీర్థంలో లక్ష్మీనారాయణస్వామిని ప్రతిష్ఠ చేయించాడు! కొన్ని రాగిరేకుల మీద సంకీర్తనలు చెక్కిన వ్రాయసగాని పేరు అన్నమరాజు తిమ్మయ్య అని ఉంది. సంకీర్తన భండారం క్రీ.శ. 1540 నుండి వైష్ణవ పరిచారకులతో, పాటగాండ్రతో సుప్రతిష్ఠితంగా నడిచింది.

## చిన తిరుమలాచార్యులు

పెద తిరుమలాచార్యుల పెద్ద కొడుకైన చిన తిరుమలాచార్యులకు అన్నమాచార్యుల చేతనే బ్రహ్మోపదేశం పొందే అదృష్టం కలిగింది. ఈయన క్రీ.శ. 1493 - 1553 నడుమ వర్ధిల్లినాడని చెప్పవచ్చు. ఈయన గొప్ప విద్వాంసుడు, 'అష్ట భాషా కవి

చక్రవర్తి' అని బిరుదు వహించినవాడు. ఈయన కూడా చాలా సంకీర్తనలు రచించాడు. అష్టభాషాదండకం కూర్చాడు. తెనుగులో 'సంకీర్తన లక్షణము' అనే గ్రంథం వ్రాశాడు.

ఈయన తిరుపతిలోని గోవిందరాజస్వామి కల్యాణోత్సవానికి తనకు 'నేడియం' గ్రామంలో వచ్చే ఆదాయంలో సగం దానం చేశాడు. చిత్రమాసంలో చిత్రా నక్షత్రంనాడు, వైశాఖ మాసంలో మృగశీర్షా నక్షత్రంనాడు కొన్ని కైంకర్యాలకు గాను వెదుమప్పాక్కమ్ గ్రామాన్ని దానం చేశాడు.

శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరాలయాన్ని జీర్ణోద్ధారం చేయించి క్రొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయించింది చిన తిరుమలాచార్యులే. (తి.తి.దే. శాసన సంపుటం IV - 144 నం. శాసనం. 22.3.1540 నాటిది) ఇతను తన తాతగారైన అన్నమాచార్యుల విగ్రహాన్ని భాష్యకారదేశికుల విగ్రహాలతోపాటు ప్రతిష్ఠ చేశాడు. అలయ ప్రథమ గోపురానికి ఇరువైపుల అన్నమాచార్య, పెద తిరుమలాచార్యుల విగ్రహాలు చెక్కించాడు. మనం లోనికి ప్రవేశించగానే కుడివైపున తనకుడిచేత్తో తిరుమలను చూపుతున్న తన (చిన తిరుమలాచార్యుల) విగ్రహమే ఉంది. మొదటిద్వారం దాటగానే కుడివైపున ఉండే తొలిస్తంభం మీద అన్నమాచార్యులు తన ఎడమ చేత్తో వెంకటేశ్వరులను చూపుతున్న విగ్రహం ఉంది. అదే వరుసలో మూడో స్తంభం మీద ఆ దేవాలయంలోని వేంకటేశ్వరుని ఎడమచేత్తో చూపుతున్న పెద తిరుమలాచార్యుల విగ్రహం ఉంది.

తాళ్లపాక కుటుంబం వారి దేవతార్చన విగ్రహాలు, తాళపత్రాలు భజన చిరుతలు వగైరాలు శ్రీనివాస మంగాపురంలోని ఈదేవాలయంలో నేటికీ భద్రపరుపబడి ఉన్నాయి.

## పెద తిరువేంగళనాథుడు

ఇతడు 'సాత్త్విక శుభమూర్తి' అనీ 'సంగీత నత్య విద్యాధికుడ'ని స్తుతింపబడినవాడు. ఇతని మేనత్తకొడుకు రేవనూరి వెంకటార్యుడు పెద తిరువేంగళనాథుడు పాడితే స్వామి నాట్యం చేసేవాడని చెప్పాడు. ఈ పెద తిరువేంగళనాథుడు క్రీ.శ. 1546 పూర్వమే తనువు చాలించినట్లు కనబడుతుంది.

## చిన తిరువేంగళనాథుడు

ఇతడు అష్టమహిషీ కల్యాణము, పరమయోగి విలాసం, ఉషాపరిణయం, అన్నమాచార్య చరిత్ర అనే గ్రంథాలు వ్రాసినవాడు. ద్విపదలో దిట్ట. రోజుకు వెయ్యి ద్విపదలు కూర్చ గలిగినవాడు. ఇతడు సంవత్సరానికి 620 వరహాల వరుమానంతో కొండవీటి ప్రాంతాన తనకుండిన చెందలూరు, మల్లవరం అనే రెండు గ్రామాలను దానం చేసి అన్నమయ్య, పెద తిరుమలాచార్యుల జన్మదినాలనాడున్ను, తన పెద తండ్రి అయిన నరసింగన్న, పెద్దన్న అయిన తిరువెంగళప్ప, తల్లి అయిన తిరుమలమ్మ అనే వారి మృతాహస్సుల నాళ్లలోను ధర్మకైంకర్యాలు జరిగేటట్లు ఏర్పాట్లు చేశాడు. ఈ దానం క్రీ.శ. 1546లో జరిగింది. శాసనం వేయబడింది.

సాలెకులంవారు పదివేల వరహాలు కానుకపెట్టి ఇతడు ఇతని వంశంవారు తమకు కులగురువులుగా ఉండేటట్లు ప్రార్థించి ఎన్నుకొన్నారు. ఈ విషయానికి ఒక శాసనం వేయబడింది.

## కోనేటి తిరువేంగళనాథుడు

ఇతడు చాల వైభవంగా జీవితం గడిపినట్లు కనబడుతుంది. ఇతనికి కాయసిద్ధి ఉండిందని లంబికాయోగం తెలుసునని చెప్తారు. ఇతడు విజయనగర ప్రభువైన సదాశివరాయుల వల్ల క్రీ.శ. 1544, 1545ల్లో అద్దంకి దగ్గర ఉండే బొల్లపల్లి ఓలపల్లి అనే అగ్రహారాలను పొందినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 1559లో కోనేటి తిరువేంగళనాథుడు (కడప జిల్లాలోని) పుష్పగిరిలో ఉండే చెన్నరాయుడనే దేవునికి కొన్ని భూములుదానం చేశాడు.

## తిరువేంగళప్ప

ఇతడు చిన తిరుమలాచార్యుల కొడుకు. ఇతడు సంస్కృతంలోని అమరుకావ్యాన్ని తెనుగులోకి పరివర్తించాడు. నామలింగాను శాసనానికి బాల ప్రబోధిక అనే తెనుగువ్యాఖ్య వ్రాశాడు. మమ్మటుని కావ్యప్రకాశకు 'సుధానిధి' అనే సంస్కృత వ్యాఖ్య వ్రాశాడు. ఇతడు తిరుపతిలోని గోవిందరాజస్వామి కల్యాణోత్సవానికిగాను తుప్పిల్ అగ్రహారాన్ని అంబత్తూరు అగ్రహారంలో కొంతభాగాన్ని క్రీ.శ. 1554లో దానం చేశారు; చిన్నకంచిలోని అరుళాళప్పెరుమాళ్లకు నల్లాట్టంజేరి, పెరిచ్చంబాక్కమ్ గ్రామాలను క్రీ.శ. 1553 లో ఇచ్చాడు.

## రేవనూరు వేంకటార్యుడు

అన్నమాచార్యుల కూతురైన తిరుమలాంబ కొడుకితడు. ఇతడు శకుంతలా పరిణయం అనే కావ్యాన్ని, వేంకటేశ్వరస్వామికి సంబంధించిన శ్రీ పాదరేణుమాహాత్మ్యం అనే గ్రంథాన్ని వ్రాశాడు.

పెద తిరుమలాచార్యుల కొడుకులు తళ్లికోటయుద్ధం నడిచిన క్రీ.శ. 1565దాకా కూడా ఉండక క్రీ.శ.1560 ప్రాంతం వరకే ఉన్నట్లు తోచుతుంది. ఈ కుటుంబంవారు తిరుపతి వేంకటేశ్వరస్వామిని సుమారు నూటయాభైయేండ్లు సాటిలేని భక్తితో సేవించారు. తాళ్లపాక వారనేది తెనుగులో కవిత్వానికి మారుపేరు. తెనుగు కవిత్వంలో అన్నమయ్య అనుకరణలకు అందనివాడు. మించ శక్యం కానివాడు.

## III
## చినతిరుమలాచార్యుల రచనలు

తాళ్లపాక చిన తిరుమలాచార్యుల రచనలు (1) అష్టభాషా దండకం (2) సంకీర్తన లక్షణం (3) అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు.

వీటిలో శ్రీ వెంకటేశ్వరుని మీద దండకచ్ఛందస్సులో (1) సంస్కృతం (2) ప్రాకృతం (3) శౌరసేని (4) మాగధి (5) పైశాచి లేదా అపభ్రంశభాష (6) ప్రాచి (7) అవంతి (8) సార్వదేశి భాష అనే ఎనిమిది భాషల్లో వ్రాసిన దండకం (హేవిలంబి సంవత్సర మార్గశీర్ష శుద్ధ పంచమి, బుధవారం) 7.11.1537 నాడు రాగి రేకులమీద వ్రాయింపబడింది. ఇదితొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానాధికారులచేత "అన్నమాచార్యుల అతని కుమారుల లఘుకృతులు" (The Minor works of Annamacharya and his sons) ప్రథమ సంపుటం (Vol.I) అనే గ్రంథంలో పండిత విజయరాఘవాచార్యుల పర్యవేక్షణ క్రింద 1935లో ప్రచురింపబడింది. ఈ దండకం చిన తిరుమలాచార్యులకు 'అష్ట భాషాకవి

చక్రవర్తి' అనే బిరుదం రావటానికి కారణంగా కనబడుతుంది.

చిన తిరుమలాచార్యుల సంకీర్తనలు కూడా ఆయన జీవిత కాలంలోనే రాగిరేకుల మీద వ్రాయబడ్డాయి. అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యుల వారి సంపాదకత్వాన వెలువడిన తాళ్లపాక వారి కృతులు-XVI సంపుటంలో అరవై అధ్యాత్మ సంకీర్తనలు నూట పందొమ్మిది శృంగార సంకీర్తనలు 1962లో ముద్రింపబడినై.

సంకీర్తన లక్షణం అనేది డెబ్బైయొక్క పద్యాలు (ఇరవై యైదు సంధి వచనాలు) ఉండే చిన్న గ్రంథం. ఇది సంకీర్తనల రూపాన ఉండేపదాలనుగూర్చి చెప్తుంది.

## సంకీర్తన లక్షణం- చరిత్ర, మూలాలు.

సంకీర్తన లక్షణంలోని పదునైదవ పద్యాన్నిబట్టి తాళ్లపాక అన్నమాచార్యులు సంకీర్తన లక్షణమనే సంస్కృత గ్రంథాన్ని రచించినట్లు తెలుస్తుంది. పదునేడోపద్యం ఈ అంశాన్ని మళ్లా చెప్పటమే కాకుండా తాళ్లపాక పెదతిరుమలాచార్యులు దాన్ని (బహుశః) సంస్కృతంలో వ్యాఖ్యానించినట్లు కూడా చెప్తుంది. పదునారో పద్యం చిన తిరుమలాచార్యులు తన తండ్రి అయిన పెద తిరుమలాచార్యుల అనుమతితో ఈ తెనుగు గ్రంథాన్నిరచించినట్లు చెప్తుంది. పదునేడో పద్యాన్నిబట్టి సంస్కృత సంకీర్తన లక్షణాన్ని అనుసరిస్తూ ('తద్వ్యాఖ్యానుసారంబుగన్) తెనుగు సంకీర్తన లక్షణ గ్రంథ రచనకు ఉపక్రమించినట్లు తెలుస్తుంది.

అన్నమాచార్యుల సంకీర్తనలు 17.5.1535 నాటికే జనరంజకమైన ప్రసిద్ధిని పొందినట్లు తెలియవస్తుంది. సంకీర్తనలతోడి కొన్ని రాగిరేకులు అహోబలం, శ్రీరంగం, చిదంబరం, సింహాచలం, కదిరి మున్నగు చోట్లకు చేరినట్లు తెలియవస్తుంది. కొన్ని తాళపత్రగ్రంథాలు శ్రీరంగం, తంజావూరుల్లో ఉన్నట్లు తెలుస్తుంది. తాళ్లపాక వారికుటుంబం రామానుజసిద్ధాంత ప్రచారానికి సంచారం చెయ్యటంలో ఇది జరిగినట్లు తెలుస్తుంది.

అన్నమాచార్యుల సంకీర్తనల జనరంజకత్వాన్ని సాక్షాత్తుగా చూచిన చినతిరుమలాచార్యులు తన తెనుగు సంకీర్తన లక్షణాన్ని నాలుగడుగులు వెడల్పు ఏడడుగుల ఎత్తు ఉండే బండరాళ్ల మీద శ్రీవేంకటేశ్వరుని ఆలయంలో చంపక ప్రదక్షిణక్రమాన చెక్కించినట్లు చెప్పబడుతున్నది. అలాంటి బండరాళ్ల మీదనే సంకీర్తనలను స్వరాలతో సాహిత్యంతో ఎలా పాడాలో ఉదాహరణలతో చెక్కించటం కూడా జరిగింది. శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యుల వారు ఈ బండరాళ్లను 1949లో కనుగొన్నారు. ఎన్ని బండరాళ్లు ఇలాగ చెక్కించబడినవో స్పష్టంగా తెలియదుకాని రెండు శిలాఫలకాలు మాత్రం కనుగొనబడి పరిరక్షింపబడుతున్నవి. సంస్కృత భాషలోని ఒక సంకీర్తన స్వరాలు, గమకాలు, సాహిత్యం అనేవాటితో చిత్రింపబడి ఉంది. 'ఉద్గ్రాహము, మేలాపము, ధ్రువము, అంతర, ఆభోగము, ఉగము, అవృత నియమము, ఝంప, అట, రూపకము, తివడ, ఆది, ఏకజ్యావళ, ఆదిజ్యావళ' వంటి పారిభాషిక పదాలు, పల్లవం, పదం వంటి పదాలు ఈ శిలాఫలకాల మీద కనబడతాయి. చిన తిరుమలాచార్యులవారు వీటిని ఆ శిలాఫలకాల మీద 7.11.1537కు ముందే చెక్కించి ఉంటారని శ్రీ శ్రీనివాసాచార్యులవారి అభిప్రాయం.

వారు తామ్ర శిలాఫలకాలను కొనుగొనటాన్ని గురించి తాళ్లపాక గేయ రచనలు- XV సంపుటంలో (1961)ని అన్నమాచార్య సంకీర్తనలకు వ్రాసిన పీఠికలోను చిన తిరుమలాచార్యుల వారి సంకీర్తనలతో ప్రచురించిన XVI సంపుటానికి వ్రాసిన పీఠికలోను వివరాలువ్రాశారు. రెండు అంశాలు మాత్రం స్పష్టం. నేడు లభ్యం కాకపోయినా సంకీర్తన లక్షణం శిలాఫలకాల మీద వ్రాయింపబడిందనేది మొదటి అంశం. సంగీతాన్ని స్వరాలు, గమకాలు, సాహిత్యంతో వ్రాసే పద్ధతి తెనుగులో పదునారో శతాబ్ది ఆరంభంనాటికే ఉండిందనేది రెండో అంశం. సంకీర్తన ప్రచురణల్లోని XVI సంపుటంలో ప్రచురింపబడ్డ నాలుగు ఫొటో ప్లేట్లు ఈ యధార్థానికి తిరుగులేని సాక్ష్యం.

తెనుగు సంకీర్తన లక్షణాన్ని సరిచూడడానికి శిలాఫలకాలు అందుబాటులో లేక పోయినా రాగిరేకులు అందుబాటులో ఉన్నాయి. చినతిరుమలాచార్యులు తన జీవిత కాలంలోనే ఈ గ్రంథాన్ని రాగిరేకుల మీద కూడా వ్రాయించాడు. కాని వ్రాయించిన కాలం మాత్రం గుర్తు వేయబడలేదు.

రాగిరేకుల మీది రచనలు కొన్నింటిని సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అనే ఆయన 1922-23లో ఎత్తి వ్రాయించారు. ఆ కాగితపు ప్రతులు శిథిలావస్థలో ఉండగా వాటిలో కొన్ని 'తాళ్లపాక అన్నమాచార్యుల, వారి కుమారుల లఘు కృతులు- 1 సంపుటం (The Minor works of Tallapaka Annamacharya and his sons' Vol.I) అనే పేరుతో పండిత విజయరాఘవాచార్యుల వారి సంపాదకత్వాన 1935లో అచ్చువేయించడం జరిగింది.

## సంపాదక కృత్యం- పాఠాలు

తెనుగు సంకీర్తన లక్షణానికి స్వల్ప భేదంగల రెండు పాఠాలు లభ్యమౌతున్నాయి. మొదటిది ముద్రిత పాఠం. రెండోది రాగిరేకులమీది పాఠం. ముద్రిత పాఠం రాగి రేకుల మీదినుండి ఎత్తి వ్రాసిన పాఠమే అయినా ఆ రెండూ ఒకటిగా లేవు. మురికిగా ఉన్న రాగిరేకుల మీద నుండి ఎత్తి వ్రాసేటప్పుడో చెడిన కాగితపు ప్రతి నుండి పాఠాన్నిగ్రహించి అచ్చు వేయించేటప్పుడో తప్పులు ఏర్పడినట్లున్నవి.

పాఠాన్ని సరిచూడడానికి ఇప్పుడు రసాయనికంగా శుభ్రం చేసిన రాగిరేకులు శ్రీ వెంకటేశ్వర మ్యూజియం, 223 గోవిందరాజస్వామి ఉత్తర మాడా వీధి, తిరుపతిలో లభ్యంగా ఉండటంవల్ల రాగిరేకులమీది పాఠాన్నే ప్రామాణికంగా గ్రహించి ముద్రిత పాఠాన్ని సరి దిద్దటం జరిగింది. ఈ సందర్భంలోని వివరాలివి :

1. తెనుగు సంకీర్తనలక్షణం పాఠం ఒక్కొక్కటి 40సెం.మీ.x18 సెం.మీ. కొలతలుండే నాలుగు రాగిరేకుల మీద వ్రాయబడి వుంది. వ్రాత రాగిరేకులకు ఇరుప్రక్కలా ఉంది. వ్రాసిన తిథి వార నక్షత్రాదులు శకసంవత్సరం ఇయ్యబడలేదు.
2. వ్రాత ప్రాచీన పద్ధతిగా అర్ధానుస్వారాలకు బదులు పూర్ణానుస్వారాలు హల్ ద్విత్వాలు వగైరాలతో వుంది.
3. ముద్రితపాఠం డెబ్బైయొక్క పద్యాల్ని చూపుతోంది. కాని రాగిరేకుల మీది చివరి పద్యానికి డెబ్బై మాత్రమే అంకె చూపబడింది. పరిశీలింపగా, 'నాలుగు పాదంబులు

నొక చాలున...'.అనే పద్యానికి ఇయ్యవలసిన వరుస సంఖ్య 32 చూపబడక 'విషమ పాదంబు లొకరీతి....' అని ఆరంభమయ్యే తర్వాతి పద్యం చివర చూపబడింది. ఇది లేఖక ప్రమాదమే కావాలి.

4. రాగి రేకుల్లో 'సంకీర్ణ వివిధ పాప....'అనే పద్యం తొమ్మిదోపద్యంగాను, ' మది దాళ్లపాక యన్నయు...' అనే పద్యం పదో పద్యంగాను ఉన్నె. ముద్రిత పాఠంలో ఇవి వరుసగా పదవతొమ్మిదవ పద్యాలుగా ఉన్నె. ప్రస్తుత పాఠంలో రాగిరేకుల మీది పద్యక్రమమే కొనితేబడింది.

5. రాగి రేకులు ఈ క్రింది శీర్షికతో మొదలవుతున్నె. "శ్రీరస్తు. శ్రీమతే రామానుజా యనమః తాళ్లపాక అన్నామాచార్యుల కుమారుండు పెద తిరుమలాచార్యులు వారి కుమారుడు చిన తిరుమలాచార్యులు ఆనతిచ్చిన సంకీర్తన లక్షణమైన పదచ్ఛందము.
ముద్రిత పాఠం 'పదచ్ఛందము' అనే మాటలు వదలివేసింది. ఇది చాలా ముఖ్యమైన అంశం. గ్రంథకర్త ఈ రచనకు 'పదచ్ఛందము' అనే దాన్ని పర్యాయనామంగా ఇచ్చినాడు. గ్రంథకర్తకు ఈ గ్రంథంలో ముఖ్యమైన ప్రమేయాంశం 'పదసంప్రదాయం'.

6. ఎనిమిదో పద్యం రెండోపాదంలో 'అన్నియు నడవంగ బూటయగు దాళ్లపా' అనేది రాగిరేకుల పాఠం. ముద్రిత పాఠం కూడా 'దాళపా' అని స్వల్ప వ్యత్యాసంతో ఉంది. ఛందోభంగం అవుతుండడంవల్ల రెండు పాఠాలూ సరికావు. ప్రస్తుత పాఠంలో ఇది 'దాళులపా' అని ఛందో భంగం లేకుండా ఉండేటట్లు దిద్దబడింది. ఇలాగే 12వ, 15వ 34వ పద్యాల్లోను 'తాళులపాక' అని సవరణ చేయడం జరిగింది.

7. 'సంకీర్ణ వివిధ పాప....' అనే తొమ్మిదోపద్యంలోని నాల్గోపాదం 'శంకాంతకములు <u>వలదు</u> శమనుని వలనన్' అని వుంది. క్రీ గీత గీచిన 'వలదు' అనేది రాగిరేకుల్లోను ముద్రిత పాఠంలోను ఒకే విధంగా సమానంగా వుంది. కాని అర్థం సరిగా వుండదు. 'వలదు' అనేమాటకు 'అవసరం లేదు' అనే విశేషార్థం స్ఫురిస్తుంది. భగవంతుని మీది సంకీర్తనలు పాడితే పలు రకాల పాపాల వివిధ తోడి చిత్తం కలవారికైనా యముని వలన కలిగే శంకాతంకాలు వదిలిపోవును' అనే అభిప్రాయం 'వదలు'అనే పాఠంతోనే వస్తుంది. ఈముద్రణంలో ఇది 'వదలు' అనే రూపంగా సవరించబడింది.

8. రాగిరేకుల పాఠంలోను ముద్రిత పాఠంలోను కూడా వృత్తాలను విడిపేర్లు చెప్పకుండా 'వృ' అనీ, అలాగే గీత పద్యాల విషయంలోను విడిపేర్లు చెప్పకుండా 'గీ' అని నిర్దేశించడం ఉంది. పాఠకుల సౌకర్యం కోసం 12, 15, 17, 26, 28, 34, 50, 64 పద్యాలుగా ఉన్న వృత్తాలను మత్తేభవిక్రీడితమైతే 'మ' ఇత్యాదిగా విడి పేర్లతో నిర్దేశించడం జరిగింది. అదే విధంగా గీత పద్యాల్లో 'ఆటవెలది'ని 'ఆ.వె.' అని 'తేటగీతి'ని 'తే.గీ.' అని నిర్దేశించడం జరిగింది.

9. రాగిరేకుల్లోని పాఠంలో 13వ పద్యం 'భరతాది గ్రంథంబుల' అని ప్రారంభం అవుతుంది. ముద్రిత పాఠంలో ఇది 'భరతాదుల గ్రంథంబుల' అని చూపబడింది. ఛందో భంగం అవుతుందన్న సందేహం చేత కాబోలు ముద్రణ సమయంలో ఈ మార్పు చేయబడినట్లు కనబడుతుంది. సమస్త పదరూపంగా గ్రహిస్తే 'గ్ర' అనే

సంయుక్తాక్షరంవల్ల దానికి ముందున్న 'ది' గురువు కావచ్చు. గ్రంథకర్త మనస్సులో ఆడుతున్నది నాట్యశాస్త్ర గ్రంథమేకాని దాని కర్త అయిన భరతుడు కాదు. తర్వాతి 18వ పద్యంలో గ్రంథకర్త భరతుని నాట్యశాస్త్రాన్ని 'భరత'మని నిర్దేశించడం దానికి ఉపబలకం. ప్రస్తుత పాఠంలో రాగిరేకుల మీది పాఠమే స్వీకరింపబడింది.

10. ముద్రిత పాఠంలోని పద్నాలుగో పద్యం చివరి పాదం 'తత్ప్రబంధ మమృతధారంబోలి' అని ముగుస్తున్నది. రాగి రేకుల పాఠం 'తత్ప్ర బంధ మమృత ధారంబోలు'. రాగి రేకులమీది ఈ పాఠమే ప్రస్తుత గ్రంథంలో స్వీకరింపబడింది.

11. ముద్రితపాఠంలో పదునెన్మిదో పద్యంలోని రెండో పాదం చివర 'తేటమయ్యె పదము' అని వుంది. రాగిరేకుల పాఠంలో అది 'తేటయయ్యె పదము' అనే ఉంది. 'తేటము' అనే పదరూపం కానరాదు కనుక రాగిరేకుల పాఠమే అంగీకరింపబడింది.

12. ముద్రిత పాఠంలో ఇరవయ్యోపద్యంలోని చివరి మాట 'బడదె'. రాగిరేకుల్లోని పాఠంలో ఆ చోట 'బడఁడె' అని ఉంది. మొదటి పాఠం 'కృతి'కి సంబంధించగా రెండో పాఠం 'కృతి చెప్పిన యాతఁడు' అనే కర్తృపదంతో సంబంధపడుతుంది. రాగిరేకుల పాఠమే సముచితంగా ఉంది. అందుచేత ఈ రెండో పాఠమే ఈ ముద్రణంలో స్వీకరంపబడింది.

13. ముద్రిత పాఠంలో ఇరవై మూడో పద్యంలోని రెండో పాదంలో 'మనుజు సత్కవితయు' అనే పాఠం వుంది. కాని రాగిరేకుల్లోని పాఠంలో 'మనుజ సత్కవితయు' అని ఉంది. తొలిపాదంలోని 'సంప్రదాయాగతజ్ఞానసహితుడై అనే కూర్పు 'మనుజు' అనేదాన్నే విశేషిస్తుంది గాని 'సత్కవిత'ను కాదు గనుక ముద్రిత పాఠాన్నే ఈ గ్రంథంలోను అంగీకరించడం జరిగింది.

14. ముద్రిత పాఠంలో ముప్పైఏడో పద్యం తర్వాతి వచనం 'ముందు జెప్పిన నిబంధన నామ పదంబునకు నవయవంబులైన యవాంతర పదంబులకు ననుకూలంబైన పల్లవి యెట్టిదనిన'. విడిపదాలకు పల్లవిని చెప్పబోతున్నట్లుగా భాసించటంచేత ఈ పాఠం చీకాకుకు కారణమైంది. రాగిరేకుమీది పాఠం 'నిబంధనామ పదంబునకు నవయవంబులైన యవాంతర పదంబులకు నామంబు లెయ్యవియనిన'. నిబంధ పదానికి విడిభాగాలైన వాటి పేర్లు చెప్పబోతున్న ఈ రెండో పాఠమే సరైన పాఠం. తర్వాతి పద్యం, ఊహింపదగినట్లుగానే, ఉద్గ్రాహం, మేలాపం వగైరా ధాతువుల్ని గణించి చెప్పబోతున్నది. ప్రస్తుత ముద్రణలో రాగి రేకుల మీది పాఠమే చేర్చబడింది.

15. ముద్రిత పాఠంలో నలభైయోపద్యం చివరి మాట 'మునులు' అని ఉంది. రాగి రేకుల పాఠంలో ఈ చోట 'ఘనులు' అని ఉంది. ప్రకరణం చరిత్రకందిన కాలానికి చెందిన సంగీత చూడామణి, సంగీత రత్నాకరం లాంటి గ్రంథాల్లో కనబడే 'శిఖాపదం' అనే దానికి సంబంధించింది. అందుచేత 'మునుల'ను పేర్కొనడం సముచితంగా ఉండదు. అందుచేత రాగిరేకుల పాఠమైన 'లక్షణజ్ఞులైన ఘనులు' అనే పాఠమే స్వీకరింపబడి నిబంధింపబడింది.

16. ముద్రిత పాఠంలో నలభైయోపద్యం తర్వాతి వచనంలో 'ప్రయోగ సంప్రదాయం బెట్టి దనిన' అని వుంది. రాగిరేకుల పాఠంలో ఈచోట 'ఎట్లంటేని' అని ఉంది. పల్లవ,

శిఖపదాల ప్రయోగానికి సంబంధించిన సంప్రదాయాన్ని విధానాన్ని చెప్పే సందర్భం గనుక రాగి రేకుల పాఠమే స్వీకరింపబడింది.

17. రాగిరేకులు ముద్రిత పాఠమూ కూడా నలభై నాలుగో పద్యం తొలి పదాన్ని 'వుగము' అని వుకారాదిగా ఇస్తున్నై. ఈ పదం 'ఉద్గ్రాహం' అనే పదానికి సంక్షిప్త రూపంగా కనబడుతోంది. యకారం, వు,వూ,వొ,వో లు తెలుగు పదాల మొదట రావనే సూత్రం కూడా ఒకటి ఉంది కనుక నేటి పాఠకుల సౌకర్యం కోసమై 'ఉగము' అనే రూపం గ్రహింపబడింది.

18. ముద్రిత పాఠంలో ఏబది ఒకటవ పద్యం నాల్గోపాదంలో 'పాద యుగళఘుగ' అని వుంది. రాగిరేకుమీద 'పాద యుగళమున' అని వుంది. ఈ సప్తమ్యంతరూపమే తగి వుంటుందనే భావంతో రాగి రేకు పాఠం గ్రహింబడింది.

19. ముద్రిత పాఠంలో యేబది రెండో పద్యం తర్వాతి వచనం 'అందు అర్థచంద్రకపదం బెట్లంటేని' అని ఉంది. రాగిరేకు పాఠంలో 'అందు అర్థచంద్రపదం బెట్లంటేని' అని ఉంది. అల్పార్థకమైన క ప్రత్యయం అర్థచంద్రపదంతో చేరడం అంత బాగుండదు కాబట్టి రాగిరేకు పాఠమే గ్రహింపబడింది.

20. ముద్రిత పాఠం రాగిరేకుల పాఠం కూడా అరవై నాలుగో పద్యం మూడోపాదంలో 'విస్తర పాద వాదముల' అనే పాఠాన్నే చూపుతున్నై. కవి ఆమ్రేడితంలో కూడా గసడదవాదేశసంధిని పాటించి ఉండవచ్చునేది ప్రాయోభావమే అయినా పాఠకుల సౌకర్యం కోసం 'పాద పాదముల' అనే గ్రహింపబడింది.

21. ముద్రిత పాఠం అరవైనాల్గో పద్యం తర్వాతి వచనంలోను అరవై ఐదో పద్యంలోను 'యేల పాట' అని యకారాది పదరూపాన్నే చూపింది. రాగిరేకులు కూడా 'యాలపదం' 'యాలపాట పదం' అనే రూపాల్నే ఇస్తున్నై. 'ఏలా ప్రబంధం'లోని 'ఏల', యేల పాటలోని 'యేల' అనేవి వేర్వేరని పాఠకులు గుర్తించుకోవటం కోసం పై చెప్పిన అరవై నాల్గో పద్యం తర్వాతి వచనంలోను అరవై ఐదో పద్యంలోను యకారాది పదరూపమే నిలుపబడింది.

22. ముద్రిత పాఠంలో అరవై ఏడో పద్యం నాలుగో పాదంలో 'భావజ్ఞులు వల్కు_నట్టి పద్ధతి' అని ఉంది. రాగిరేకుల పాఠంలో 'భావజ్ఞులు వలుకునట్టి పద్ధతి' అని ఉంది. పద మధ్యంలో అచ్లోపం కాకపోవడమే ఈ రెండోపాఠంలో విశేషం. రాగిరేకుల పాఠమే ఇందు తీసుకోబడింది.

## గ్రంథరచనా కాలం

'సంకీర్తన లక్షణం' ఎప్పుడు రచింపబడిందో నికరంగా తెలియరాదు. రాగిరేకుల మీద చెక్క_బడిన కాలం వివరాలు కూడా చెప్పబడలేదు. తండ్రి అనుమతితో గ్రంథకర్త ( చిన తిరుమలాచార్యులు ) రచనకు పూనుకొన్నట్లు పదునాలుగో పద్యంలో కనబడే అంతస్సాక్ష్యాన్ని బట్టి అతని తండ్రి అయిన పెద తిరుమలాచార్యులు సజీవులుగా ఉన్నట్లు తెలుస్తుంది. పెద తిరుమలాచార్యులు క్రీ.శ. 1453 వరకు జీవించి ఉన్నట్లు తెలుస్తున్నది. కాబట్టి ఈ సంవత్సరాన్ని ఒక హద్దుగా గ్రహింపవచ్చు.

గ్రంథకర్త అయిన చిన తిరుమలాచార్యులకు తన తాతగారైన అన్నమాచార్యులవల్ల బ్రహ్మోపదేశం పొందే అదృష్టం కలిగింది. అన్నమాచార్యులు క్రీ.శ. 1503 వరకు జీవించారు. చిన తిరుమలాచార్యులకు శాస్త్ర విధి ప్రకారం గర్భాష్టమంలో (అంటే తన ఏడో సంవత్సరం) ఉపనయనం జరిగి వుంటుంది అనుకొంటే అతడు క్రీ.శ. 1493 ప్రాంతంలో జన్మించి వుంటాడని ఉపనయనం క్రీ.శ. 1500 ప్రాంతంలో జరిగి ఉంటుందని ఊహించవచ్చు. చిన తిరుమలాచార్యులు జన్మించి వుంటాడనుకొనే క్రీ.శ. 1493 నాటికి అతని తండ్రి పెద తిరుమలాచార్యులు సుమారు ఇరవై ఏండ్ల వాడుగా వుంటాడు. ఇతడు క్రీ.శ. 1473 ప్రాంతాన పుట్టి వుంటాడని వెనుక చెప్పబడింది. చిన తిరుమలాచార్యులకు తాతగారైన అన్నమాచార్యులు బ్రహ్మోపదేశం చేశారనేది చిన తిరుమలాచార్యులే వ్రాసిన సంకీర్తన (అధ్యాత్మ సంకీర్తన 30 - XVI సంపుటి) వలన లిఖితరూపంగానే తెలుస్తోంది గనుక అతడు సంగీత సాహిత్యాల్లో నిష్ణాతుడై తన తాతగారి గొప్పదనాన్ని గుర్తించి ఆయన సంస్కృతంలో రచించిన సంకీర్తన లక్షణాన్ని తాను తెలుగులో కూర్చి గౌరవం నెరపటానికి ముప్పై లేదా ముప్పై రెండు సంవత్సరాల వయస్సైనా ఉంటుందనుకోవడం న్యాయంగానే వుంటుంది. తెనుగు సంకీర్తన లక్షణంలోని తొలి పది పన్రెండు పద్యాలు అన్నమాచార్య ప్రశస్తి పద్యాలలాగ ఉండటం ఈ భావనకు దోహదం చేసే సాక్ష్యాంశం. కాగా తెనుగు సంకీర్తన లక్షణం క్రీ.శ. 1525 ప్రాంతంలో రచింపబడిందని భావించవచ్చు. అన్నమాచార్యుల సంకీర్తనలు క్రీ.శ. 1535నాటికే చాలా జనరంజకాలై ఉండిన కారణంగా సంకీర్తన లక్షణాన్ని శిలా ఫలకాల మీద చెక్కించడం అనేది అష్ట భాషా దండకాన్ని రాగిరేకుల మీద చెక్కించిన క్రీ.శ. 1537 కంటే ముందే జరిగి వుంటుందని అనుకోవచ్చు.

## గ్రంథ ప్రమేయాంశాలు

1. ఇది దేవస్తుత్యాత్మక రచనలను గూర్చిన గ్రంథం. సంకీర్తన లక్షణం, పదచ్ఛందం అనేవి దీనికి గ్రంథకర్త ఇచ్చిన నామధేయాలు. పద సంప్రదాయం దీని ముఖ్యప్రమేయాంశం.

2. తొలి పద్యం వెంకటేశ్వరస్వామిని గూర్చి సంకీర్తనం చేసిన పదకవుల ప్రశస్తి కీర్తనం.

3. రెండో పద్యం మొదలు పన్నెండో పద్యం దాకా తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల ప్రశస్తి. పదమూడో పద్యం అన్నమాచార్యులను పదకవితా పితామహుడుగా చెప్తుంది. పద్నాలుగో పద్యం లక్ష్య లక్షణ జ్ఞానం ఆవశ్యకతను చెప్తుంది. పదహైదో పద్యం అన్నమాచార్యులు సంస్కృతంలో సంకీర్తన లక్షణం వ్రాయటాన్ని చెప్తుంది. పదహారు, పదిహేడు పద్యాలు గ్రంథకర్త తండ్రి పెద తిరుమలాచార్యులు సంస్కృత సంకీర్త లక్షణాన్ని వ్యాఖ్యానించడం, చిన తిరుమలాచార్యులు తెనుగులో సంకీర్తన లక్షణం చెప్పడానికి పూనుకోవడం చెప్తాయి.

4. పద్దెనిమిదో పద్యం భరతుని నాట్యశాస్త్రంలో పదం, సంగీత రత్నాకరంలో ప్రబంధం, సంగీత చంద్రిక, సంగీత చూడామణి, సంగీత సుధాకరం అనే గ్రంథాల్లో 'దేశైల' చెప్పబడటాన్ని స్పృశిస్తుంది. పందొమ్మిది, ఇరవై, ఇరవై యొకటో పద్యాల్లో క్రమంగా భగవద్భక్తి, ఆత్మవినయం, సంప్రదాయ పరిజ్ఞానం అనే వాని ఆవశ్యకత చెప్పబడింది.

ఇరవై యొకటో పద్యం దేవతానుగ్రహంవల్లకాని గురుముఖంగాకాని నేర్చుకోవటాన్ని గూర్చి హితవు చెప్తుంది. ఇరవై రెండో పద్యం సంప్రదాయ పరిజ్ఞానంతో కూర్చిన రచన దైవాన్ని తెలుసుకోవటానికి ఉపకరిస్తుందని చెప్తుంది.

5. ఇరవైనాల్గు, ఇరవై ఐదు, ఇరవై యారుపద్యాల్లో క్రమంగా పద నిర్వచనం, భరత మతం ప్రకారం సంగీతంలో నాల్గు పాదాల రచన వృత్తం అనటం, ఈ వృత్తబంధాలు సంగీతంలో వాత పిత్త శ్లేష్మ ధాతువుల్లాంటి వనటం ఉన్నాయి.

6. ఇరవై ఏడో పద్యంలో పదానికి సంబంధించిన భాషా నియమం, ఇరవై ఎనిమిదో పద్యంలో కన్నడ, తమిళ, తెలుగు, లాట, గౌడ భాషల్లో దేశైలను గూర్చి చెప్పటం జరిగింది.

7. పదం మూడు శీర్షికల క్రింద ప్రమేయాంశంగా గ్రహింపబడింది. (a)వృత్తపదం, (b) నిబంధపదం, (c) చూర్ణపదం. ఇది ఇరవై తొమ్మిదో పద్యంలో ఉంది.

8. వృత్తపదం అనేది దాని, సమ, విషమ, అర్థసమభేదాలతో ముప్పై నుండి ముప్పై మూడు పద్యాలవరకు గల భాగంలో చెప్పబడింది.

9. ముప్పై నాలుగో పద్యం నుండి యాభై మూడో పద్యం వరకు గల భాగంలో నిబంధ పదాన్ని గూర్చి చెప్పటం ఉంది. యతి ప్రాసలు, గురులఘు నియమం, దేశిమార్గ భేదాలుగల తాళం, ఉద్గ్రాహాది ధాతువులు, పల్లవి శిఖా పదాలు, చతుర్ధాతుక, త్రిధాతుక, ద్విధాతుక, ఏక ధాతుక, పదాలు స్పృశింపబడినై. అష్టపద పదం, పదమాలిక, శరభపాద పదం, ముక్తక (ఛేద్యక) కుళకాలు, దరువులు, జక్కులరేకులు, ఏలలు, గొబ్బిళ్లు, వాక్యాలు, చందమామ పదాలు స్పృశింపబడినై. రెండు పాదాలుగా ఉండే పదాలూ చెప్పబడినై. అర్ధచంద్రపదం వివరించబడింది.

10. యాభై నాలుగు యాభై ఐదు పద్యాలు చూర్ణపదానికి తాళగంధికి కేటాయింపబడినై.

11. గ్రామ్యోక్తులు, పాత్రోచిత భాష, నానుడ్లు అనే వానివాడకం యాభైఆరు నుంచి యాభై తొమ్మిదివరకు గల పద్యాల్లో సమర్థింపబడినై.

12. అరవై, అరవై ఒకటో పద్యాల్లో ఆధ్యాత్మిక సంకీర్తన నిర్వచింపబడింది.

13. అరవై రెండు నుండి అరవై ఆరు వరకు ఉండే పద్యాల్లో వాక్యం, దరువు, చంద మామ పదం, యేలపాట పదం, వగైరాలు వివరింపబడినై.

14. అరవైఏడో పద్యంలో తెనుగులో సంధివిధానం స్పృశింపబడింది. అరవై ఎనిమిదో పద్యంలో దేశిపదం ప్రశస్తి చెప్పబడింది. అరవై తొమ్మదో పద్యంలో అవి ఎట్లా ప్రకాశింపగలవో చెప్పబడింది. డెబ్బైయ్యో పద్యంలో నీరస రచన ఈసడింపబడింది.

15. డెబ్బై ఒకటో పద్యంలో గ్రంథ చౌర్యంలాగ ఇతరుల పదాలను అపహరించడం నిందింపబడింది.

## ముఖ్య లక్షణాలు

1. 'సంకీర్తన లక్షణం' అనే ఈ గ్రంథం విశిష్టమైంది. సంకీర్తనం ప్రమేయాంశంగా ఇదొక్కటే లభ్యమౌతూంది.

2. కర్ణాటక సంగీతానికి కీర్తనలు సంకీర్తనలు మూలస్తంభాల్లాంటివి గనుక దానికి ఈ గ్రంథం ప్రాముఖ్యం ఎలాంటిదో చెప్పబనిలేదు.

3. భరతుడు 'పదా'న్ని ప్రకరణ గీతాల సందర్భంలో చెప్పినా, 'ప్రబంధం' అనేది అనంతరకాలంలో సంగీత రత్నాకరాది సంగీతశాస్త్ర గ్రంథాల్లో చెప్పబడిందే అయినా, 'దేశైల' అనేది అందులో అంతర్భవించేదే అయినా ఈ గ్రంథం ఆ మూడింటినీ పద సంప్రదాయంగా ఏకీకరించి చెప్తున్నది. సంకీర్తనం లాంటి భక్తి ప్రధాన రచనను భరతుడు చెప్పిన 'పదనిర్యుక్తం' అనే ఊహాపోహన ప్రత్యూహోహనాలు లేని దేవస్తుత్యాత్మక రచనగానే దర్శించవచ్చు. భరతుడు ఇచ్చిన వింగడింపులు కాని, అనంతరకాలపు సంగీత రత్నాకరాదులు ఇచ్చిన వర్గీకరణాలుకాని ఈనాటి సంగీత ప్రపంచంలో వ్యవహారంలో లేవు. కాబట్టి పుస్తక పాండిత్యంతోడివాదాలకు దిగకుండా ఈ పదం, ప్రబంధం, దేశైల అన్నీ ఒకదానికే పర్యాయపదాలనే ఏకీకరణవాదాన్ని అంగీకరించటం ప్రయోజనకరంగా ఉంటుందని తలంచవచ్చు.

4. ఈ గ్రంథం తాళ సంబంధమైన మార్గదేశి భేదాల్ని స్మరిస్తున్నది. పదహారో శతాబ్దంలో కూడా మార్గ తాళాల వాడకం ఉండటాన్ని ఇది సూచిస్తున్నదనుకోవచ్చు.

5. భరతుడు 'పదం' అనేదాన్ని గాంధర్వపరంగా 'స్వరతాళాత్మకం' అని నిర్వచించినా శార్ఙ్గదేవుడు భరతుణ్ణే అనుసరించి 'పదనిర్యుక్తా'న్ని తానూచెప్పినా- ఈ పద నిర్యుక్తమనేదాని సంక్షిప్త నామంగా పదాన్ని గ్రహించి ఈ పదం అనేది కీర్తన సంకీర్తనలు అనేవానితో అభిన్నమని గ్రహించవచ్చు. ఈ గ్రంథకర్త 'పదం' అనే మాటను కీర్తన, సంకీర్తన అనే అర్థంలోనే వాడాడు.

6. ఈ గ్రంథంలో 'కృతి' (20 పద్యం), 'ముద్ర' (44 పద్యం) అనే పదాలు వాడబడి ఉన్నందువల్ల దీనికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. ఈ గ్రంథానికి సమకాలంలో వచ్చిన సంగీత సూర్యోదయం అనే గ్రంథంలో 'ముద్ర' అనే మాట వాడబడలేదు. వాగ్గేయకార ముద్ర 'స్వాభిధాన విభూషితః' అని మాత్రమే చెప్పబడింది. ('పదం షోడశమాభోగః స్వాభిధాన విభూషితః'- సం. సూ. 5-73)

7. ఈ గ్రంథంలో 'పల్లవము' 'పల్లవి' అనే రెండు మాటలూ వాడబడి ఉన్నాయి.

8. 'శిఖాపదం' అనేది ఈ గ్రంథంలో పేర్కొబడింది. సాధారణంగా ఈనాడు ఈ మాట సంగీత ప్రపంచంలో వినిపించదు.

9. ఈ గ్రంథకర్త తాను 'వృత్తములు'గా చెప్పిన వాటికే ఉద్గ్రాహం, మేలాపకం, ధ్రువం, అంతరం, ఆభోగం అనేపేర్లు చెప్పాడు. ఈ వృత్తాలను నాల్గుపాదాల రచనగల వృత్త బంధాలుగా గ్రహిస్తే ఆ వృత్తాలు పాటలో భాగాలైన 'చరణముల'నే సూచిస్తాయనేది స్పష్టం. ఈ గ్రంథంలో 'చరణం' అనే మాట వాడబడలేదు అనేది ప్రాసంగికంగా

గమనింపదగిన అంశం.

10. ఈ గ్రంథం 'దేశైల'కు భిన్నంగా 'మేలపాట' నొకదాన్ని పేర్కొంటున్నది. ('దేశైల' అనేది ఏలా ప్రబంధంలో అంతర్భావం పొందుతుంది).

11. అరవై మూడో పద్యంలోని 'చిత్రవర్ణంబు' అనేదాని నికరమైన అర్థమేమో ఇంకా శోధింపవలసి ఉంది.

12. ఈ గ్రంథంలో 'తానం' అనే అర్థంలోనే 'తానకరాగం' అనే పదబంధం వాడబడి నట్లు కనబడుతుంది.

13. 'ధాతువు' అనే పదం పదహారో శతాబ్దాదిలో వాడకం నుండి తొలగిపోతున్నట్లు కనబడుతుంది. సంగీత సూర్యోదయం ప్రధానంగా 'స్వరాల'ను చెప్పి ఆ వెంటనే వీటిని విద్వాంసులు కొందరు 'ధాతువు' అంటారు అని చెప్తున్నది:
'రంజక స్వర సమూహో గీతమిత్యభిధీయతే
తదేవ కైశ్చిద్విద్వద్భిః ధాతురిత్యభిధీయతే॥' (సం. సూ. 5-2)

వివరణ, వ్యాఖ్యానం వగైరా.

ఈ గ్రంథాన్ని నివేదించటంలో పద్యం, దాని తాత్పర్యం, వ్యాఖ్యానం అనేవి వేర్వేరుగా ఇయ్యబడినై. ఇంగ్లీషులో పద్యాభిప్రాయం, అటు తర్వాత వివరణ వ్యాఖ్యానం వగైరాలు కూర్చబడినై. మూలమైన తెనుగు గ్రంథాన్ని చూడగోరే ఆంధ్రేతర పాఠకుల కోసం రోమన్ స్క్రిప్టులో వ్రాసిన తెనుగు గ్రంథం చివర అనుబంధంగా ఇయ్యబడింది. ఆంధ్ర, ఆంధ్రేతర సామాన్య పాఠకులకు వీలైనంత విషయాన్ని అందజేయటమే ప్రధాన లక్ష్యంగా వివరణాదులు కూర్చబడినై. ఇందులో తగిలే పలు శాస్త్ర విషయాలతో పరిచయం లేనివారికి కూడా సహాయపడాలనే ఉద్దేశ్యంతో ప్రాథమిక విషయాలు కూడా వెనుకాడకుండా చెప్పటం జరిగింది. శాస్త్ర సంబంధమైన క్లిష్టాంశాలను వివరించే ప్రయత్నం చెయ్యలేదు. ఈ గ్రంథం ఉపయోగకరం అనిపించుకుంటుందని ఆశిస్తున్నాం.

మద్రాసు, 9.8.89 — ఆచార్య సాంబ్యకృష్ణమూర్తి

# LIST OF ABBREVIATIONS

| | |
|---|---|
| A.B | - Arjuna Bharatamu(Skt) |
| A.C. | - Annamācārya Caritra (Tel) |
| A.K. | - Appa Kavīyamu (Tel) |
| A.S.C | - Āndhra Śabda Cintāmani (Skt) |
| A.Y.G.U.C | - Āndhra Yaksagāna Vāngmaya Caritramu (Tel) |
| B D. | - Bṛhad Dēśi(Skt) |
| C.D | - Chandō Darpanamu (Tel) |
| C P | - Caturdandi Prakāsika(Skt) |
| Ch Am | - Chandōmbudhi (Kannada) |
| Dm | - Dattilam(Skt) |
| G G | - Gīta Gōvindamu (Skt) |
| K A C. | - Kāvyālaṃkāra Cūdāmaṇi (Tel) |
| K J A | - Kavijanāśrayamu (Tel) |
| K S | - Kumāra Sambhavamu(Tel) |
| L D | - Laksaṇa Dīpika(Tel) |
| L S | - Laksana Śirōmaṇi (Tel) |
| L S.S. | - Laksana Sāra Sangrahamu (Tel) |
| N R | - Nṛtta Ratnāvali (Skt) |
| N S | - Nāṭya Śāstra(Skt) |
| P C. | - Panditārādhya Caritramu(Tel) |
| S A V.R | - Sarasāndhra Vrttaratnākaramu (Tel) |
| S Ca | - Sangīta Candrika (Skt) |
| S C. | - Sangīta Cūdāmani(Skt) |
| S.Dw.Tr. | - Simhāsana Dwātrimśika (Tel) |
| S.L | - Sakīrtana Lakṣanamu(Tel) |
| S.M. | - Sangīta Makarandam |
| S R. | - Sangīta Ratnākaramu(Skt) |
| S.S | - Sangīta Sudhākara (Skt) |
| S.S.S. | - Sangīta Samayasāra (Skt) |
| V R. | - Vṛtta Ratnākara (Skt) |
| Y K | - Yāpparungala-k-kārikai(Tamil) |

శ్రీ

కం॥ శ్రీ వెంకటేశ్వరప్రియ
పావన చారిత్ర పూర్వపదకవి మణితే
జోవరహారంబునకుఁ బ్ర
భావహ కవినాయకత్వమలవడుచుండున్ 1

తా.॥ శ్రీ వెంకటేశ్వరునికి ఇష్టులై పవిత్ర చరిత్రులైన తొల్లింటి పదకవి మణుల తేజస్సనే మేలైన ముత్యాల సరానికి మెఱుగుగొల్పే కవి నాయకత్వం సిద్ధిస్తున్నది.

వ్యా॥ ఇది కృత్యాదిలో కవి శ్రీకారంతో మొదలుపెట్టి చేసిన మంగళాచరణం. తొలినాళ్ల వేంకటేశ్వర సంకీర్తనాచార్యులందరికి కవి నాయకత్వం ఈ పద్యంలో చెప్పబడింది. నాలుగోపాదంలో 'ప్రభావహాక+వినాయకత్వము' అని విరుచుకుంటే విఘ్నేశ్వరస్మరణం కూడా సిద్ధిస్తుంది. శ్రీ శబ్దానికి శోభ అనే అర్థంతోపాటు మఱి కొన్ని అర్థాలు ఉన్నాయి. ధర్మం, అర్థం, కామం అనే త్రివర్గం కూడా శ్రీ అనే మాటకు గల ఒక అర్థం. మఱి ఈశ్వరుడు అంటే నిగ్రహించటానికి అనుగ్రహించటానికి సామర్థ్యం కలవాడు అని అభిప్రాయం. మనం లౌకికమైన మేలు ( అభ్యుదయం) అనుకొనే ఈ త్రివర్గాన్ని అనుగ్రహించే శక్తి లేదా నిగ్రహించే శక్తి శ్రీ వేంకటేశ్వరునికి ఉంది. ఆయన భక్తప్రియుడు. కనుక ఆయనకు ఇష్టులైన పదకవి శ్రేష్ఠుల్ని స్మరించటం లౌకికమైన మేలునూ ఇస్తుందని అభిప్రాయం. అలాగే శ్రీ శబ్దానికి సరస్వతి అని కూడా అర్థం. 'వేం' అనేది మంత్రశాస్త్రంలో సాహిత్య విద్యనిచ్చే 'వేణు శ్యామలా' విద్యలో బీజాక్షరం. శ్రీ వేంకటేశ్వరుడు సరస్వతి స్వరూపమైన 'వేం' అనే బీజాక్షరం కటం (దవడ లేదా చెక్కిలి ప్రదేశం)లో కల ఈశ్వరుడు అని అభిప్రాయం. ఆయన్ని సంకీర్తనం చేసిన పదకవి శ్రేష్ఠులకు కవి నాయకత్వం సిద్ధించటం సహజమని అభిప్రాయం. తాను శ్రీ వేంకటేశ్వరుణ్ణి పేరుపెట్టి స్మరించటం తనకూ అట్టి కవి నాయకత్వం కావాలనే కోరికతోనే అని చెప్పనక్కరలేదు.

1. ఈ పద్యంలో తొలినాళ్ల పద కవిశ్రేష్ఠులకు కవి నాయకత్వం చెప్పబడినా కృతికర్త మనసులో ఆడుచుండినవాడు ఆయన తాతగారు, 'పదకవితా పితామహు'డూ అయిన తాళ్లపాక అన్నమాచార్యులని ఊహించటం కష్టం కాదు. 'పూర్వ పదకవి మణి' అనే పదబంధాన్ని 'వెనుకటినాళ్ళ పదకవిశ్రేష్ఠుడు' అని ఏక వచనంలోనే గ్రహిస్తే అన్నమాచార్యులే స్ఫురణకు వస్తాడు. అప్పుడు 'వరహారంబునకు' అనే మాటలకు కొత్త ప్రాణం వస్తుంది. బాలుడైన అన్నమయ్య తొలిసారిగా శ్రీ వేంకటేశ్వరుణ్ణి దర్శించి తానుచెప్పిన 'వేంకట శతకా'న్ని విన్నవిస్తే స్వామి సంతోషించి తన మెడలోని ముత్యాలహారాన్ని తన పాదాలమీదే పడేటట్లుగా జారవిడిచి అన్నమయ్యను అనుగ్రహించాడట. వరము అంటే దేవతాదుల అనుగ్రహంవల్ల కోరిక తీరటం. హారమంటే ముత్యాలసరం. స్వామి అన్నమయ్యకు ముత్యాలసరాన్ని ప్రసాదించిన అంశం ఈ కవికి సోదరుడైన తాళ్లపాక చిన్నన్న (చిన తిరువేంగళనాథుడు) వ్రాసిన 'అన్నమాచార్య చరిత్ర' అనే ద్విపదకావ్యంలో ఇట్లా చెప్పబడింది:

'నంది చెంగటఁ బూజనము సేయుతఱిని
పంచిన భక్తి నబ్బాలుండు మఱియు
వేంకటప్పకు విన్నవించిన తొంటి
వేంకట శతకంబు విన్నవించుటయు
పెట్టిన ముత్యాల పేరా యశోద-
పట్టి పాదముల పైఁబడఁ బ్రసాదించె-
నది చూచి యర్చకుం దరుదంది వచ్చి
ముదమున శఠకోపమును బ్రసాదించె' (అన్నమాచార్య చరిత్ర- పుట. 26)

ఈ గ్రంథకర్త పదకవి శ్రేష్ఠుడు, సంస్కృతంలో 'సంకీర్తన లక్షణం' చెప్పినవాడూ అయిన అన్నమాచార్యుల్ని కవినాయకుడుగా ధ్యానిస్తున్నాడని గ్రహించడం ఇక్కడి పరమార్థం.

2. 'పదకవి' అంటే 'వాగ్గేయకారుడు' అని ఇక్కడ గ్రహించాలి- 'మణి'శబ్దం శ్రేష్ఠ వాచకం. 'పదకవిమణి' అంటే 'ఉత్తమ వాగ్గేయకారుడు' అని అభిప్రాయం. గానంలోని 'రాగం' కేవలం లక్షణం తెలిస్తే తెలియవచ్చేది కాదు. దానికి వాగ్గేయకారుడొకడు కావాలి. పాడటానికి (గానానికి) అనుకూలంగా కూర్చిన కావ్యం పాట. ఈ పాటలోని మాటల్ని గాయకులు 'మాతువు' అంటారు. అలాగే పాటలోని గేయాంశాన్ని (musical element) 'ధాతువు' అంటారు. ఇలా మాతు- ధాతు రూపమైన వాగ్-గేయాల్ని నిర్మించేవాడు 'వాగ్గేయకారుడై'నాడు. వాగ్గేయకారుల్లో ఉత్తమ, మధ్యమ, అధమ బేదాలు, వారి లక్షణాలు ప్రాచీనమైన సంగీత శాస్త్ర గ్రంథాల్లోచెప్పబడినై. నారదుని 'సంగీత మకరందం' అనే గ్రంథంలో సంగీతాధ్యాయం నాల్గో పాదంలో వాగ్గేయకారాది గాయక భేదాలు లక్షణాలు చెప్పబడినై. అట్లే క్రీ.శ. 11-13 శతాబ్దుల మధ్య కాలంనాటిదని తలపబడే పార్శ్వదేవుని 'సంగీత సమయసార'మనే గ్రంథంలోని 'గీతాధికరణ'మనే అష్టమాధికరణంలోను వాగ్గేయకారాదుల లక్షణాలు, వాళ్లను పరీక్షించే విధమూ చెప్పబడినై. క్రీ.శ. 13శతాబ్దినాటి 'శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరం' ప్రసిద్ధమైన గ్రంథం. ఈ గ్రంథంలో చెప్పబడిన వాగ్గేయకార లక్షణాలు దీనికి వ్యాఖ్యాతలైన కల్లినాథునిబట్టి, (సర్వజ్ఞ) సింహభూపాలునిబట్టి ఇట్లా ఉంటాయి:

వాగ్గేయకారునికి సుశబ్ద, అపశబ్ద వివేకం కోసం వ్యాకరణ శాస్త్రం తెలిసి ఉండాలి. శబ్దాధికారంకోసం అభిధానకోశాలు అంటే అమరకోశాదులు తెలిసి ఉండాలి. సమ, అర్ధసమ, విషమాది వృత్త భేదాలు తెలియుటం కోసం ఛందశ్శాస్త్రం తెలియాలి. అనుప్రాసాది శబ్దాలంకారాలు, ఉపమాది అర్థాలంకారాలు తెలిసి కూర్చగల్గిన ప్రావీణ్యం ఉండాలి. శృంగారాది రసాలు, విభావ అనుభావ సంచార్యాది భావ విశేషాలు తెలిసిన రసభావపరిజ్ఞానం ఉండాలి.

పాంచాలి మొదలైన కాకువిశేష పరిజ్ఞానం కోసం ఆయా దేశ స్థితులను గూర్చిన చాతుర్యం ఉండాలి. దేశైలాది ప్రబంధాల్ని నిర్మించే శక్తికోసం అశేషమైన భాషావిజ్ఞానం ఉండాలి. సంగీత శాస్త్రం మొదలుకొని 64కళలు తెలిసి ఉండాలి. నృత్త గీత వాద్యాలనే 'తౌర్యత్రికం'లో నేర్పుండాలి. హృద్యమైన శారీరం (గాత్రం) ఉండాలి. ద్రుత విలంబి తాదిలయ పరిజ్ఞానం, చచ్చత్పుటాది తాల పరిజ్ఞానం, నిశ్శబ్ద రూపమైన ఆవాపాదులు, సశబ్దరూపమైన ధ్రువాదులు అనే కలా పరిజ్ఞానం ఉండాలి. షడ్విధమైన స్వరకాక్వాదులు, దేశ కాక్వాదులకు సంబంధించిన కాకు వివేకముండాలి. ప్రమేయాంశానికి స్ఫూర్తిగొలిపే ప్రజ్ఞారూపమైన గొప్ప ప్రతిభ ఉండాలి. శ్రావ్యంగా పాడగలిగిన శక్తి ఉండాలి. దేశిరా గాదులుగా చెప్పబడిన శ్రీ రాగాదులు చక్కగా తెలిసి ఉండాలి. సభాజయం కోసం వాక్పటుత్వం ఉండాలి. వాదాల్లో ప్రాశ్నికుడుగా ఉండేకొరకు రాగద్వేషాలు వదలినవాడు కావాలి. సరసచిత్తుడుగా ఉండాలి. రసనిర్వహణ శక్తికోసం ఉచితజ్ఞుడుగా ఉండాలి. (అనౌ చిత్యమే రసభంగానికి కారణం). మరొకడు కూర్చిన మాటలను తీసుకోకుండా తాను ఏలాది ప్రబంధాల్ని మధురంగా కూర్చే శక్తి ఉండాలి. గేయాంశమైన ధాతువును కొత్తగా నిర్మించే శక్తి ఉండాలి. పరచిత్త పరిజ్ఞానం ఉండాలి. కూర్చే ప్రబంధాల్లో లక్షణ పరిజ్ఞానంతోపాటు శక్తి కూడా ప్రగల్భంగా కనిపించేటట్లుండాలి. శీఘ్రంగా గీతాన్ని నిర్మించే శక్తి ఉండాలి. పలు విధాలైన గీతచ్ఛాయలను అనుకరింపగల గీత నిర్మాణశక్తి (పదాంతర విదగ్ధత) ఉండాలి. మంద్ర మధ్య తారస్థాయుల్లో అలవు లేకుండా గమకంవేసే ప్రౌఢి ఉండాలి. రాగాలప్తి, రూపకాలప్తి అనే ఆలప్తులను వాని అంతర్భేదాలతో నిర్వహించే నైపుణ్యం ఉండాలి. పూర్వాపర వినిశ్చయం కొరకు చిత్తైకాగ్రత అనబడే అవధానం ఉండాలి. ఇట్టి గుణాలు కలవాడు ఉత్తమ వాగ్గేయకారుడు.

ఇంక 'ధాతువు'ను సమృద్ధిగా కూర్చగలిగి 'మాతు' రచనలో మందకొడిగా ఉండే వాడు మధ్యమజాతివాగ్గేయకారుడు. అట్లే 'ధాతు' 'మాతు'లు రెండూ తెలిసినా పద (ప్రబంధ) రచనలో ప్రౌఢిచాలని వాడు కూడ మధ్యముడే.

'మాతువు'ను రమ్యంగా నిర్మింపగలిగి 'ధాతు' విషయంలో మందకొడిగా ఉండేవాడు అధమ వాగ్గేయకారుడు.

'వస్తుకవి' అనగా కథాకవి అయినవాడు ఉత్తముడు. 'వర్ణక కవి' అనగా వర్ణనాకవి అయినవాడు మధ్యముడు. ఇతరులు నిర్మించిన 'ధాతువు'న 'మాతు' రచన చేసేవాడు మిక్కిలి అధముడు. ఇట్టివానికి 'కుట్టికారుడు' అని పేరు. (చూడు: సం. రత్నా-3 ప్రకీర్ణాధ్యాయం. అడయార్ లైబ్రరీ. ప్రచురణ- 1976)

కం॥ వరకవితా గుణ చతురత
    లరుదారఁగఁదాళ్లపాక యన్నయ ధరలోఁ
    దిరువేంకటాద్రిపతిపై
    దొరకొని చెప్పంగఁబదము తుదిపదమయ్యెన్. 2.

తా. తాళ్లపాక అన్నయ తనమేలైన కవితాగుణాలనేర్పులాశ్చర్యం గొలిపేటట్లుగా వచరించి శ్రీ వేంకటాచలపతి మీద పదం చెప్పగా ఆ పదం ఉత్తమోత్తమమైంది.

వ్యా॥ ఈ రెండో పద్యంలో కవి తనకు తాతగారు, సంకీర్తనాచార్యుడు, పద కవితా పితామహుడూ అయిన తాళ్లపాక అన్నమయ్యను నేరుగానే పేర్కొంటున్నాడు. అన్నమాచార్యుల్ని అన్నమయ్య, అన్నమయ్యంగార్, అన్నయార్య, అన్నయగురు, అన్నమాచార్య అని పేర్కొనడం ఉంది.

1. తొలి పద్యం దగ్గర చెప్పిన ఉత్తమ వాగ్గేయ కార లక్షణాలన్నింటినీ ఇక్కడ అన్నమయ్య 'వర కవితాగుణ చతురతలు'గా అన్వయించుకోవాలి.

2. 'పదం' 'తుదిపద'మైంది అనటంలో వేంకటాచలపతిపై చెప్పటం వల్ల పదం పవిత్రతను శ్రేష్ఠత్వాన్ని పొందిందని ఒక అభిప్రాయం. 'తుదిపద'మన్నపుడు ఊర్ధ్వ లోకాల్లో చివరిదైన బ్రహ్మపదం (సత్యలోకం) కూడా స్ఫురిస్తుంది కనుక పదం సత్యమూ, జ్ఞానమూ, అనంతమూ అయిన బ్రహ్మ పదార్థాన్ని గానం చేసేదయిందని మరొక అభిప్రాయం. ఆ బ్రహ్మపదం ఆనంద స్వరూపమే కనుక పదం పరమానందస్థానమైందనీ అభిప్రాయమే. అన్నమయ్య చేతిలో పదం పరాకాష్ఠకు వచ్చిందని కూడా స్పష్టమైన స్ఫురణ.

3. 'పదం పాడటం' 'దరువు వెయ్యటం' అనేవి తెనుగుల వ్యవహారం. పాటను పదమనీ, తాళాన్ని దరువనీ అంటారు. భరతముని తన నాట్య శాస్త్రంలో పదాన్ని ఇట్లా నిర్వచించాడు:

"గాంధర్వం యన్మయా ప్రోక్తం స్వరతాళపదాత్మకమ్

పదం తస్య భవేద్వస్తు స్వరతాళానుభావకమ్॥

యత్కించి దక్షరకృతం తత్సర్వం పదసంజ్ఞితమ్

నిబద్ధంచానిబద్ధంచ తత్పదం ద్వివిధం స్మృతమ్॥

అతాలంచ సతాలంచ ద్విప్రకారంచ తద్భవేత్

సతాలంచ ధ్రువార్థేషు నిబద్ధం తచ్చవై స్మృతమ్॥"

(నాట్య. శా. 32 అధ్యా- 25, 26, 27)

'స్వర, తాళ, పదాత్మకమైనది 'గాంధర్వ'మని చెప్పానుగదా, దాంట్లో స్వరానికి తాళానికి అనుభావకంగా ఉండే వస్తువు 'పదం'. అక్షర కృతమైనది (అర్థవంతమైన మాటలతో కూర్చింది) ఏ కొంచెమైనా 'పద' మనిపించుకుంటుంది. అది నిబద్ధమని అనిబద్ధమని రెండు విధాలుగా ఉండవచ్చు. తాళంతో కూడి, తాళం లేకుండా కూడా ఉండవచ్చు'- అనేది ఇక్కడి అభిప్రాయం. 'గాంధర్వ'మనేది మార్గ సంగీతానికి పేరు. దేశి సంగీతాన్ని 'గానం' అంటారు. గాంధర్వం గంధర్వులు ప్రయోగించింది; అనాది సంప్రదాయం. 'గానం' వాగ్గేయకారులు కూర్చింది. గానానుకూలంగా కూర్చిన అర్థవంతమైన పదాలకూర్పు ఏదైనా 'పదం' అనిపించుకుంటుంది. స్వరతాళాల ఆవిష్కారం కోసం వానికి ఆశ్రయంగా ఏర్పడినటువంటిది పదం. 'పదం'లోని అర్థవంతమైన మాటల్ని గాయకులు 'మాతు' అంటారు. సరిగమాది స్వరాలతో పాడదగిన గేయాంశాన్ని 'ధాతువు' (music/musical element/musical setting) అంటారు. ధాతుబద్ధమైన గానం నిబద్ధగానం. ఈ నిబద్ధగానం కోసమైన ప్రబంధాలకు (పదాలకు) ఉండే ఆరు అంగాల్లో 'పదం' ఒకటి. అర్థప్రకాశకమైన మాట లేదా అర్థవంతమైన మాట పదం అని స్పష్టం. 'నృత్తం' తాళలయాత్మకమని,నృత్యం పదాభినయమని, నాట్యం త్రైలోక్య భావానుకరణమని నిర్వచనాలు. నృత్యంలోని పదాభినయం చిరకాలంగా ఉన్నదే. పదం అంటే పాట అనటానికి ఇదే సాక్ష్యం. (ఇక్కడ ఒక జాగ్రత్త అవసరం. సంగీత శాస్త్రంలో 'పాట' అనే పారిభాషిక పదం ఒకటి ఉంది. మన మామూలు పాటను ఆ పారిభాషికంగా పొరబడకూడదు. ప్రబంధానికి చెప్పిన ఆరు అంగాల్లో 'పాట' ఒకటి. అవనద్ధవాద్యాల మీద చేతితో పుట్టించే ధిగిధిగిత్యాది వాద్యాక్షరాలకు 'పాట' అని పేరు.) అట్లే తాళాధ్యాయంలో చెప్పబడే ప్రకరణ గీతాలు (1) నిర్యుక్తము (2) పదనిర్యుక్తము (3) అనిర్యుక్తము అని మూడు విధాలు (సం. ర. 5-57,58) వీటిలో అంగాలు లేకుండా కేవలం స్తుతి మాత్రబద్ధమైనది 'పదనిర్యుక్తం'. ఇది స్తుతి పదం లేదా సంకీర్తన పదం. కాగా పదం అనేది స్తుతిపరమైన పాటే అవుతుంది. అంటేపదమన్నా కీర్తన అన్నా సంకీర్తన అన్నా అభిప్రాయం ఒకటేనన్నమాట.

గానానుకూలంగా కూర్చిన నిబదపదానికి సంగీత శాస్త్ర గ్రంథాల్లో ప్రబంధము, వస్తువు, రూపకము అన్నవి సమానార్థకాలైన పేర్లు. ప్రబంధము, పదము అనే పేర్ల వినిమయమూ కనబడుతుంది. సంగీత శాస్త్ర గ్రంథాల్లో 'ధ్రువా ప్రబంధము' అని పేర్కొనబడిందే 'ధ్రువాపద'మై నేడు ఉత్తర భారతంలో 'ధ్రుపద్ సంగీతం'గా పిలువబడుతున్నది. కీర్తన శబ్దానికి పద శబ్దానికికూడా వినిమయం ఉన్నదే. మహారాష్ట్ర కీర్తనకార సంప్రదాయంలో 'కీర్తన్'ను 'పద్' అనటం కద్దు. కర్ణాటకంలో దాససాహిత్యమనబడే కీర్తనల్ని పదాలనటం ఉన్నది. ఉదాహరణకు పురందరదాసు కీర్తనల్ని పదాలనటం ప్రసిద్ధమే. బెంగాల్ వైష్ణవ సంప్రదాయంలో కీర్తనలున్నాయి; వాటిని 'పదావలి' అనటమూ ఉంది. ఒరిస్సాలో 'పదావలీ కీర్తన' నాట్యసంప్రదాయం ఒకటి ఉంది. తెలుగులోనూ ఇదే పద్ధతి. రామదాసు,

పెద్దిదాసుల పదాలను రామదాసు కీర్తనలు, పెద్దిదాసు కీర్తనలు అనటం ఉన్నదే. కీర్తన ప్రాయికంగా విష్ణుపరమై ఇటు దక్షిణ దేశంలో రుక్మిణీ కృష్ణపరము, అటు ఉత్తరదేశంలో రాధాకృష్ణ పరమూ కావటం వల్ల కీర్తన/సంకీర్తనల్లో శృంగారానికీ నాయికా నాయక భావానికీ మధుర భక్తికీ ప్రాముఖ్యం వచ్చినవుడు 'పద'మనే మాటకు శృంగార ప్రధానమై గానాభినయ యోగ్యమైన రచన అనే అర్థం ఏర్పడింది. తమిళదేశంలో పదమంటే ఈ పరిమితార్థమే గోచరిస్తుంది. తెనుగులో కూడా శృంగార ప్రధానాలై అభినయానికి తరచుగా వాడుకోబడే క్షేత్రయ్య పదాలు, సారంగ పాణిపదాలు ఇలాంటివే. వీటిని కీర్తనలనటం వాడుకలో లేదని మనకు తెలుసు. అలాగే ఎందుచేతనోకాని త్యాగరాజు, శ్యామాశాస్త్రి, దీక్షితర్‌ల కృతులను కృతులనీ కీర్తనలనీ అంటామే కాని పదాలనటం వాడుకలో ఉన్నట్లు కన్పించదు.

వ.॥ మఱియుఁదత్సంకీర్తనంబు లెట్టివనిన

కం.॥ పావనములు హరిభక్తి వి
భావనములు సర్వమంత్ర పరమరహస్యో
ద్భావనములు గాయకవిత
రావనములు తాళ్లపాకయన్నయపదముల్ 3

కం.॥ రంజనములు దుర్గుణగణ
భంజనములు విమలకమలభవజనక గుణా
సంజనములు సుజ్ఞాన ధ
నాంజనములు తాళ్లపాకయన్నయపదముల్ 4

కం.॥ సారంబులు హరికరుణా
సారంబులు విబుధనికర సంపూర్ణసుధా
హారంబులు బహుదేశ వి
హారంబులు తాళ్లపాక యన్నయపదముల్ 5

కం.॥ వేదంబులు పౌరాణిక
వాదంబులు వరకవిత్వవాణీ వీణా
నాదంబులు కృతసుజనా
హ్లాదంబులు తాళ్లపాక యన్నయపదముల్ 6

తా॥ తాళ్లపాక అన్నమాచార్యులు వేంకటాచలపతి మీద పచరించి చెప్పిన సంకీర్తన పదాలు ఎలాంటివంటే అవి-

పాపాన్ని కడిగివేస్తాయి. విష్ణు భక్తిని విశేషంగా ఊహకు తెస్తాయి. మంత్రాలన్నింటిలోను ఉండే ప్రభావశక్తుల్ని పుట్టించి చూపిస్తాయి. పాడేవారిని కాపాడుతాయి. (గాయకులకు తృప్తినిస్తాయి). (3)

మనసుకు రంగుగా ఉంటాయి. చెడు గుణాలకదుపుల్ని విఱిచి వేస్తాయి. బ్రహ్మను గన్న విష్ణువు చొక్కపు గుణాలతో విక్కవిరిసి ఉంటాయి. శోభనకరమైన జ్ఞానధనమనే విధులను చూపించటానికి పలురకాలైన అంజనాల లాగ పనిచేస్తాయి. (4)

చేవగలవి; శ్రీహరికృపను జడివానగా కురిపిస్తాయి. దేవతాగణాలందరికీ కొదవలేని అమృతాహారాలూ అవుతాయి. పలుదేశాల్లో వేడుకగా తిరుగుతున్నట్లుంటాయి. (5)

అవి వేదాలే. పురాణజ్ఞులు చెప్పే తగవులే. మేలైన కవితా సరస్వతి వీణానాదాలే. సజ్జనులు ఆహ్లాదపడినట్టివి. (6)

వ్యా. అన్నమయ్య పదాలు పాడి హరిసంకీర్తనం చేసేవారికి మంత్రోపాసనలతో పని లేదు; వాటికి మంత్రాలతో సమానమైన ప్రభావం ఉందని అభిప్రాయం. (సాళువ నరసింగరాయుడు తన మీద పదమల్లి చెప్పలేదని అన్నమయ్యకు సంకెళ్లు వేయిస్తే ఆయన 'సంకెలలిడువేళ' అనే పదం వేంకటేశ్వరుణ్ణి ఉద్దేశించి పాడేడట. వెంటనే సంకెళ్లూడిపడ్డవట. ఈ అంశం అన్నమాచార్య చరిత్రలో అభిలిఖింపబడింది). గుప్తంగా ఉండే నిధి నిక్షేపాల గుర్తు తెలుసుకోవటానికి పలు రకాల అంజనలు ఎట్లా సులభోపాయాలో అట్లాగే జ్ఞానధనాన్ని గుర్తెఱగటానికి ఇవి సులభోపాయాలు. వేంకటేశ్వర సంకీర్తనం స్వామిదయను జడివానగా కురిపించటమే కాదు దేవతలందఱిని కొలిచిన ఫలమిస్తుంది. ఒకరిని కీర్తిస్తే అందఱినీ కొల్చినఫలమిచ్చే దైవం పరతత్వం కదా! వేంకటేశ్వరుడు సర్వదేవతామూర్తి. అన్నమయ్యపదాలు ఇష్టసిద్ధికీ అనిష్టపరిహారానికీ ఉపాయాన్ని ప్రభు సమ్మితంగా చెప్పే వేదాలకు, మిత్ర సమ్మితంగా చెప్పే పురాణాలకూ, కాంతాసమ్మితంగా చెప్పే కావ్యాలకు ఏమాత్రం తీసిపోవు. వాటి సారస్వత సిద్ధి ఇలాంటిది అనటం.

1. 'కౄాత్ సంశబ్దనే' అనే ధాతువునుండి 'కీర్తన' అనే పదంపుట్టింది. పరమేశ్వర గుణాలను పాడటమే కీర్తన. అది తఱచుగా విష్ణుపరం. 'కీర్తనం మునిభిః ప్రోక్తం హరేర్లీలా ప్రగాయనం' అని పూర్వుల మాట. 'సంకీర్తనం భగవతో గుణకర్మ నామ్నాం' అని శ్రీమద్భాగవతం. భగవంతుని పేర్లను, గుణాలను, లీలలను గానం చెయ్యటం సంకీర్తనం. ఇది భక్తిలో భాగమని చెప్పనవసరం లేదు. నవవిధ భక్తిలో చెప్పబడే శ్రవణ, స్మరణ, పాదసేవన, అర్చన, వందన, దాస్య, సఖ్య, ఆత్మనివేదనలు (సం)కీర్తనలోనే అంతర్భవిస్తాయని చెప్పవచ్చు. క్రీ.శ. 7శతాబ్ది నుండి క్రీ.శ. 17శతాబ్ది చివరిదాక భారతదేశంలో భక్తి ఉద్యమప్రభావం నడిచిందనే చెప్పాలి. దక్షిణభారతంలో మహారాష్ట్ర దేశం క్రీ. శ. 10 శతాబ్దినాటికే పరదేశీయుల దాడులకులోనైంది. స్వధర్మ రక్షణాదులకు నాథసంప్రదాయం దోహదానికి వచ్చింది. (కర్ణాటకంలో బసవన వీరశైవోద్యమం వచ్చింది). మహారాష్ట్రలో కీర్తనకార సంప్రదాయానికి దారి యేర్పడింది. నామ్‌దేవ్, తుకారామ్ వంటి భక్తవర్గం దీనివిపాకానికి కారణం. ఈ కీర్తనకార సంప్రదాయంలో నారదీయ సంప్రదాయమని, వార్కరీ సంప్రదాయమని రెండు సంప్రదాయాలున్నాయి. వీటిలో నారదీయ సంప్రదాయం కీర్తన/సంకీర్తన పద్ధతికి సన్నిహితం అనవచ్చు. వార్కరీ సంప్రదాయం భజనపద్ధతిని జోడించుకుంటుంది. ఈ 'కీర్తన'ను 'పదము' అని 'హరికథ' అని అనటం కద్దు. స్వరతాళాలకు అనుభావకమైంది పదమని భరతుడు చెప్పాడు. కేవలంస్తుతి మాత్ర పదయుక్తమైన గీతం 'పదనిర్యుక్త'మని సంగీతరత్నాకరం (5-58, 59) చెప్తున్నది. కీర్తన, పదం సమానాలే అని స్పష్టం. కన్నడ భాషలోని పురందరదాసుల 'దేవరనామా'లను కీర్తనలనీ, పదాలనీ అనటం ఉంది. ద్వారక కారణంగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో

కృష్ణభక్తి ఎక్కువ. మహారాష్ట్ర కర్ణాటాంధ్రాది దక్షిణ ప్రాంతాల్లో రుక్మిణీ కృష్ణుల కథ, గుజరాత్ మొదలుకొని ఉత్తరభారతం పూర్తిగా రాధాకృష్ణుల కథ భక్తికి ఆలంబనమైంది. బెంగాల్‌లోని వైష్ణవ సంప్రదాయంలో ఈ భక్తిపాటల్ని 'పదావళి' అని 'కీర్తనలని కూడా అంటారు. సంధి వచనంలోని 'సంకీర్తన శబ్దము,' పద్యాల్లోని 'పదము' సమానార్థకాలన్నది పరమార్థం. ఈ 'పదము, ప్రబంధము' సమానార్థకాలనేది 14 పద్యంలోని రెండు శబ్దాల ప్రయోగాన్నిబట్టి నిర్ధారితం అవుతుంది.

2. 'మననాత్ త్రాయత ఇతి మంత్రః' (మననము చేయుటవలన సాధకుణ్ణి కాపాడేది కనుక మంత్రము) అని వ్యుత్పత్తి. మంత్ర శాస్త్రం 'గుప్త విద్యల్లో' ఒకటి. మంత్రం ఎప్పుడూ రహస్యమే. గురువు పేరుకూడా చెప్పరాదు. జపంలోకూడా మౌనజపం శ్రేష్ఠం. తనకు మాత్రం వినబడేట్లు ఉపాంశువుగా జపించడం మధ్యమం. ఇతరులకు వినబడేట ట్లుగా జపించటం అధమం. మంత్రశక్తి కూడా కార్యాన్ని ( effect) బట్టి అనుమానింపద గిందే (inferable)కాని అది పనిచేసే తీరు మనకు స్పష్టంగా ఉండదు. అన్నమయ్యగారి సంకీర్తనలకు మంత్రత్వం చెప్పటం ఇక్కడ విశేషం. అంతేకాదు. సంకీర్తనలు గొంతెత్తి పాడవలసినవి. మంత్ర జప పద్ధతికి విరుద్ధంగా అట్లా పాడినా మంత్రం ప్రదర్శించే రహస్య శక్తుల్ని ఇవీ ప్రదర్శిస్తాయనటం మరింత గొప్ప విశేషం.

3. నిధి నిక్షేపాలకోసం వెదకేవారు పలురకాలైన అంజనలతో అవి ఉండే స్థలాలను గుర్తు తెలుసుకుంటారు.కాటుకలాగు కంటికి రాచుకొని చూచే అంజనము,(తమలపాకు) మీద రాచి చూచే అంజనము, చేతి బొటనవ్రేలి గోటిమీద రాచి చూచే అంజనము వగైరాలు వినికిడిక అందినవే. నిక్షిప్తధనం గుప్తం. దాన్ని తెలుసుకోటానికి 'అంజనము' సులభోపాయం. వేద శాస్త్రాల్లోను, పురాణాల్లోను, కావ్యాల్లోను క్లేశసాధ్యంగా గర్భీకరింప బడి ఉన్న జ్ఞానధనాన్ని కండ్లకు కట్టినట్లుగా చూపించేవి ఈ పదాలనటం విశేషం. ఈ కారణంచేతనే ఇవి వేదాలకు, పురాణాలకు, కావ్యాలకు తీసిపోయేవికావని తర్వాతి పద్యం చెప్తున్నది.

4. సర్వ ప్రాణులు కోరేది సుఖం. అది ఇష్టసిద్ధి రూపమేకాక అనిష్ట పరిహార రూపం కూడా. ఈ ప్రయోజనానికి అలౌకికమైన ఉపాయాన్ని బోధించేది వేదం అని సాయణాచార్యుల నిర్వచనం. వేదాలు అపౌరుషేయాలు, అంటే లౌకికులైన మనుష్యులు కూర్చినవికావనీ, అవి ఋషులకు తాముగా దర్శనానికి వచ్చిన 'శ్రుతుల' నీ విశ్వాసం. సంగీత శాస్త్రంలోను 'గాంధర్వ'మనబడే సంగీతానికి ఉండే అనాది సంప్రదాయం వల్ల అది అపౌరుషేయగా చెప్పబడింది. 'గాన'మనేది పౌరుషేయమే అని కూడా చెప్పబడింది. అన్నమాచార్యుల సంకీర్తనలు 'గానం'. అవి పౌరుషేయాలు- అనగా అన్నమాచార్యులనే లౌకిక పురుషుడు కూర్చినవి. వీటిని వేదాలనటంలో వీటికీ అపౌరుషేయత చెప్పినట్ల యింది. అప్పుడు అన్నమయ్య, వేద మంత్రాలకు ఋషుల్లాగ, ద్రష్ట అవుతాడు. అన్నమయ్య సంకీర్తనలు భవ్యావేశంలో దర్శనానికి వచ్చినవని ఆయన ఋషి కల్పుడని అభిప్రాయం.

5. అన్నమయ్య పదాలు 'బహుదేశ విహారంబులు' అనడంలో అందలి కాకు విశేషాలు సూచింపబడుతున్నవి. కాకువులు ప్రధానంగా (1) స్వరకాకువు (2) రాగకాకువు (3) అన్యరాగ కాకువు (4) దేశకాకువు (5) క్షేత్రకాకువు (6) యంత్ర కాకువు అని ఆరు రకాలు. కాకువు అంటే ధ్వని వికారం. ఒక స్వరంలో మరొక స్వరచ్ఛాయ స్వరకాకువు. ఇది రాగంలో ఏర్పడుతుంది. ఏది రాగానికి ముఖ్యచ్ఛాయో అది రాగకాకువు. ఒక రాగంలో వేరొక రాగచ్ఛాయ విన్పిస్తే అది అన్యరాగకాకువు. దేశస్వభావాన్నిబట్టి ఆయా దేశాల్లో కనబడే ఛాయ దేశకాకువు. మనుష్యుల దేహమొక ఛాయా విశేషం గనుక అట్టిది క్షేత్రకాకువు. వీణ, పిల్లనగ్రోవి మొదలైన యంత్రాల్లో ప్రతీతికి వచ్చే రాగచ్ఛాయ యంత్రకాకువు. ఈచోట దేశకాకు విశేషాలు ఉద్దేశింపబడినవి అనవచ్చును.

6. అన్నమాచార్యుల సంకీర్తన సంప్రదాయం ఆంధ్రదేశానికి క్రొత్తది కాదు. క్రీ.శ. 14 శతాబ్దికి చెందిన సింహగిరికృష్ణమాచార్యులు భజనసంప్రదాయానికి ఆద్యుడు. ఆయన సంకీర్తన పద కవితా పితామహుడు. ఆయన రచనలను 'వచనాల'నీ 'విన్నపా'లనీ అంటారు. ఈయన రచించిన 'సింహగిరి నరహరి వచనాలు' 4లక్షలకు మించినవని అంచనా. ఈయన కాలంలో పాతకమూరి భాగవతులు ప్రసిద్ధులు. కృష్ణమాచార్యులు ఈ పాతకమూరి భాగవతుల సన్నిధిని తన వచన సంకీర్తనాలనుగానం చేసినట్లు తెలుస్తున్నది.

కం.॥ లక్షణములు పదకవితా
రక్షణములు వివిధ కుకవిరాజీ మదన
మోక్షణములు వేంకటపతి
వీక్షణములు తాళ్లపాక విభుసత్కవితల్ 7

తా॥ తాళ్లపాక అన్నమాచార్యుల సత్కవితలు పదకవిత్వానికి లక్షణాలు చెప్పేవీ పదకవిత్వాన్ని కాపాడేవి, పలు విధాలైన కుకవి సమూహాల పొగరు వదిలించేవి, సాక్షాత్తు వేంకటాచలపతి చూపులే అయినట్టివి.

వ్యా॥ సత్కవిత అనగానే అసత్కవిత కూడా గుర్తుకువస్తుంది. సత్కావ్యం, అసత్కావ్యం అన్న వాడుక కూడా మనకు తెలును. సత్వశుద్ధి గలిగి సత్వశుద్ధికి సహాయపడే కవిత, కావ్యం, సత్కవిత, సత్కావ్యం అవుతాయి. సత్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు ప్రాణుల స్వభావాన్ని నడుపుతున్నాయి. రజోగుణతమోగుణాల స్పర్శ లేని మనస్సే సత్వమనీ సత్వోద్రేకమే భోగరూపమైన ఆనందం అని ఆలంకారికుల వివరణ. అన్నమాచార్యుల సత్కవితలైన పదాలు ఆనందం చిన్నెలని ఒక అభిప్రాయం. పదరచన ఎలా ఉండాలో గుర్తుగా చూపి చెప్పేవని మరొక అభిప్రాయం. పద కవిత అనమర్థుల చేతిలో పడి నిందలపాలు కాకుండా కాపాడేవని పదకవితా రక్షణములన్నదాని అభిప్రాయం. అన్నమయ్యకు సమకాలీనుడే అయిన శ్రీనాథుడు 'ముది విటులు విధ వలంజలు, పదకవితలు' ఇత్యాదిగా ఈసడించిన చాటు పద్యం ప్రసిద్ధమే. సత్కవులు కానివారు కుకవులు. సత్కవిత కుకవులకు సాధ్యం కాదు. సత్కవిత్వరచనకు చాలని వారై కుకవులు పొగరు విడుస్తారు. అన్నమయ్య కవితలు కుకవుల పొగరుదించేవి. ఇంత మాత్రమే కాదు. అవి సాక్షాత్తు వేంకటపతి చూపులన్నప్పుడు మిక్కిలిగా పునీతం చేసేవి, ఆనంద ప్రదాలు అని అభిప్రాయం. 'యతేర్దృష్టిః కవేర్వచః' అని పెద్దలమాట. యతీశ్వరుని చూపు, కవి వాక్కు-మనల్ని పునీతం చేస్తాయని భావం. 'వర్ణనా నిపుణః కవిః' అన్నపుడు నిపుణ శబ్దానికి నేర్పరి అని మాత్రం కాక 'మిక్కిలి పవిత్రీకరించువాడు' (నితరాంపునాతీతి నిపుణః) అని కూడా అర్థం. వేంకటేశ్వరుడు ఈశ్వరుడన్నా కృష్ణుడన్నా యోగేశ్వరుడే అవుతున్నాడు. అన్నమయ్య పదాలు మంత్రాలని చెప్పబడిందిగనుక ఆ మంత్ర జన్యమైన కిరణరూపాన అవే స్వామిచూపులూ అవుతున్నవి. మంత్రమే దేవత. మంత్రోచ్చారణ వల్ల మంత్రరూప దేవత ప్రకాశిస్తుంది. ఆ వెలుగు విశిష్టం. మంత్ర శాస్త్రంలో కిరణ శబ్దం దాదాపు పారిభాషికంలాంటిది. తేజోరూపాన దేవతనుచెప్తుంది. ఇక్కడి గొప్ప అభిప్రాయం ఇది.

1. లక్షణమన్నపుడు ఛందోవ్యాకరణాది శాస్త్రమని అర్థం. ఇక్కడ పద రచనకు ఉండవలసిన గుర్తుల్నీ గుణాల్నీ నియమాల్నీ చూపి చెప్పేవని (అన్నమయ్య రచనల పరంగా) గ్రహించాలి.

2. సంగీతంలో ఉన్నట్లుగానే దేశ భాషా సాహిత్యాల్లోను మార్గ- దేశి సంప్రదాయాలున్నాయి. తెనుగులో ఈ మార్గదేశి భేదం తొలిసారిగా దేనటిపండని శాసనం (క్రీ. శ. 1145)లోను అటు మీద పాలకురికి సోమనాథుని రచనల్లో, నన్నిచోడుని కుమార సంభవంలోను కనబడుతుంది. అయినా ఈ దేశి సంప్రదాయం క్రీ. శ. 9శతాబ్ది నుండి దొరికే శాసనాల్లోకూడా కనబడుతుంది. అంతకు మునుపు శాసనాలకెక్కకుండా కొంతకాలం ఉండిందని కూడా మనం విశ్వసించవచ్చు.

దేశి సంప్రదాయం పద్యకవిత పదకవిత అని రెండు రకాలు. తెనుగులో పద్యకవితకు వచ్చిన గుర్తింపు పదకవితకు రాలేదనే చెప్పాలి. శాసనాల్లో దేశిచ్ఛందస్సుల్లో వ్రాసిన పద్యాలు కనపడతాయి. క్రీ.శ. 848 నాటి పండరంగని అద్దంకి శాసనంలో 'తరువోజ,' క్రీ.శ. 848-892 ప్రాంతపు గుణగ విజయాదిత్యుని కందుకూరి శాసనంలోను, క్రీ.శ. 892-929 ప్రాంతపు చాళుక్యభీముని ధర్మవర శాసనంలోను 'సీస' పద్యం, క్రీ.శ. 927-934 ప్రాంతపు యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో 'మధ్యాక్కరలు' కనబడతాయి. దేశిలో పద్యకవిత ఉండగా పద కవిత లేదనుకొనటానికి వీల్లేదు. తెనుగు భాషకు క్రీ.శ.10 శతాబ్దినాటికే ఛందోగ్రంథమున్నట్లు తెలుస్తున్నది. 'యాప్పెరుంగల క్కారికై' అనే 10 శతాబ్దినాటి తమిళ గ్రంథంలో 'వాంచియార్ సెయ్‌ద వడుగచ్ఛందము' (వాంచియార్‌చేసి తెలుగు ఛందస్సు) పేర్కొనబడింది. క్రీ.శ. 1000 ప్రాంతపు విరియాల కామసాని గూడూరు శాసనంలో తొలిసారిగా చంపకమాల ఉత్పలమాల అనే సంస్కృత వృత్తాలు కనబడుతున్నాయి. దీన్నిబట్టి అంతకు మునుపు దేశిచ్ఛందమే వ్యాప్తిలో ఉండేదని తలంచవచ్చు.

దేశి సంప్రదాయానికిచెందిన పదకవిత్వం 13శతాబ్ది చివర వెలసిన పాల్కురికి సోమన 'పండితారాధ్య చరిత్ర'లో పేర్కొబడింది. మల్లికార్జున పండితారాధ్యుడు 12 శతాబ్దివాడు. తెనుగుదేశంలో ఆరాధ్యశైవ సంప్రదాయానికి ప్రవర్తకుడు. ఆయన బౌద్ధుల్ని వాదంలో గెలువబోయేటప్పుడు 'తుమ్మెద పదములు, ప్రభాత పదములు, పర్వత పదములు, ఆనందపదములు, శంకరపదములు, నంజవర్ణన, గణవర్ణన పదములు' పాడుచు సద్భక్తులు వెంటవచ్చిరని సోమనవర్ణన. (పండితారాధ్య చరిత్ర. 513 పుట.)

ప్రాచీనాంధ్ర లాక్షణికులుచాల కాలము, తెనుగును కూడా ఒక ప్రాకృతముగా పరిగణిస్తూ వచ్చినా దేశిచ్ఛందస్సుల కొన్నింటిని పేర్కొంటూ వచ్చినా పద కవితను సమగ్రంగా చెప్పినవారు కారు. క్రీ.శ. 1402- 1407 నాటి విన్నకోట పెద్దన 'కావ్యాలంకార చూడామణి' దేశి సంప్రదాయంలో రగడ, మంజరి, ఉదాహరణాలను పేర్కొంటుంది; కాని యక్షగానాన్నిచెప్పదు. ఛందస్సుల్లో కంద, సీస, గీతి, అక్కర భేదాలను త్రిపది, చౌపది, షట్పదులను తరుపోజను చెప్తుంది. క్రీ.శ. 1453 నాటి అనంతుని 'ఛందోదర్పణం'లో పదకవితకు ఆశ్రయభూతమైన నవ విధరగడలు చెప్పబడినై. క్రీ.శ. 1550 ప్రాంతపు చిత్రకవి పెద్దన 'లక్షణ సారసంగ్రహం'లో రగడ భేదాలను యక్షగానంలో విత్రిపుటాది తాళాలకు ఎట్లావాడుకోవచ్చునో చెప్పబడింది. క్రీ.శ. 1600 ప్రాంతపు వెల్లటూరి లింగనమంత్రి 'సరసాంధ్రవృత్త రత్నాకరము'లో ( కర్ణాట చౌపది లక్షణమే) 5 మాత్రలగణములైన 3స్మరగణాల మీద ఒక సూర్యగణమనుచు, ఆద్యంత ప్రాసలతో, 2గణాలమీద యతితో 'పదలక్షణ'మని చెప్పబడింది. స్మరగణాలనేవి సంగీత శాస్త్రంలో 3అక్షరాల గణాలకు వాడే పరిభాష. క్రీ.శ. 1656 నాటి అప్పకవి తన 'అప్పకవీయము'లో చిత్రకవి పెద్దన చెప్పిన రగడ, యక్షగానలక్షణాలను అనువదించటంతోపాటు లాలిపాటి, పెండ్లిపాట, ధవళము, సువ్వాల, అర్ధ చంద్రికలు అనే విశేష రచనలు చెప్పినాడు. పదలక్షణాన్ని యక్షగానలక్షణాన్ని చెప్తూ పద కవితా భేదాల్ని మధురకవితా శాఖ క్రింద సంగ్రహించింది క్రీ.శ. 1656 తర్వాతి వార్తా కవి రఘునాథయ్య 'లక్షణ దీపిక'. అందిట్లున్నది: 'యక్షగానంబునన్ వెలయు పదంబులు, దరువులు, నేలలు, ధవళంబులు, మంగళహారతులు, శోభనంబులు, ఏకపద, ద్విపద, త్రిపద, చతుష్పద, అష్టపదులు నివి యాదిగా గల్గునన్నియు లయప్రమాణంబుల నొప్పి మృదు మధుర వచన రచనల ప్రసిద్ధంబైన యవి మధుర కవిత్వంబులు'. క్రీ.శ. 17 శతాబ్ది చివరివాడైన పొత్తపి వేంకటరమణకవి తన 'లక్షణ శిరోమణి'లో సంగీత రత్నాకరాన్ని అర్జున భరతాన్ని స్మరించి ఏలలే పదాలని, మాత్రాసమకనిబద్ధాలైన 'ప'గణాలతో వానిని కూర్చాలని అవి సూళాదులకు అనుగుణంగా ఉండాలని చెప్పి అవి రాగతాళాలతో సంగీత రీతిని తేటపడి ఉంటాయి గనుక సాహిత్య మార్గాన లక్షణంలో రావని చెప్పాడు. (లక్ష. శిరో. 3-425, 426, 427).

కం.॥ విన్నంతఁ బాప సంఘము
అన్నియు నడపంగఁ బూఁటయగు తాళ్ళపా
కన్నయ పదములు పాడిన
యన్నయకోవిదుల వేంకటాధిపుఁడేలున్ 8

కం. ॥ సంకీర్ణ వివిధ పాప వి
శంకట చిత్తులకునైన సర్వేశ్వరుపై
సంకీర్తనములు పాడిన
శంకాతంకములు వదలు శమనుని వలనన్ 9

కం. ॥ మదిఁ దాళ్లపాక యన్నయ
పదములపై భక్తిగలిగి పాడిన విభవా
స్పదములగు వివిధ సంపత్
ప్రదములు శ్రీవేంకటేశుపదములు దెలియున్ 10

కం. ॥ నక్తంచరారి తనకును
భక్తుండైనట్టి తాళపాకన్నయ చా
టూక్తి పదబంధ కవితా
రక్తుండై యితర వాగ్విరక్తుండయ్యెన్ 11

మ. ॥ శ్రుతులై, శాస్త్రములై, పురాణ కథలై, సుజ్ఞాన సారంబులై ।
యతిలోకాగమవీథులై, వివిధ మంత్రార్థంబులై, నీతులై।
కృతులై వేంకటశైల వల్లభ రతి క్రీడారహస్యంబులై
నుతులై తాళుల పాకయన్నయ వచోమాత్నక్రియల్ చెన్నగున్ 12

తా॥ విన్నంత మాత్రానికే పాపాల కదుపులనన్నింటినీ అణచటానికి పోషి యిచ్చే తాళ్లపా కన్నయగారి పదాలు నోరార పాడేటటువంటి లాభమెఱిగిన చదువర్ల ( నీతిమంతులైన విద్వాంసుల)ను వేంకటాచలపతి చేపడతాడు (8).

కలగాపులగంగా కలిసి పాకిన పాపాల విరివితోడి మనసుగల వారికి కూడా సర్వేశ్వరుని మీద (ఈ)సంకీర్తనలు పాడితే యమునివల్ల కలిగే భయ విచారాలు లేదా ఆధి వ్యాధులు విడిచిపోతాయి. (9)

తాళ్లపాకన్నయ పదాలమీద మనసులో భక్తిగలిగి పాడినట్లయితే (ఆ పాడినవారికి) వైభవ స్థానాలైన పలువిధాల సంపదలిచ్చే శ్రీవేంకటేశ్వరుని పాదాలు ( అనుభవపూర్వకంగా) తెలిసి వస్తాయి. (10)

రాక్షసుల్ని మర్దించే శ్రీ మహావిష్ణువు తనకు భక్తుడైన తాళ్లపాకన్నయ ప్రియం గొలిపే పద బంధాల కవితలో తగులుకొన్నవాడై యితరుల మాటలనొల్లని వాడైనాడు. (11)

తాళ్లపాకన్నయ మాటల క్రొత్త కూర్పులు లేదా విచ్చిత్తి విశేషాలు, వేదాలు, శాస్త్రాలు, పురాణ కథలు, జ్ఞానసారాలు, ఆగమాల వరుసలు, వలు మంత్రాల అర్థాలు, నీతులు, కృతులు, వేంకటాచలపతి రతి క్రీడల రహస్యాలు, స్తోత్రాలు అవుతూ అందంగా ఉంటాయి. (12).

వ్యా. ॥ ఎనిమిదో పద్యంలో 'అన్నయకోవిదుల' అనేచోట చిన్న శ్లేష. అ+నయ కోవిదులని ఒక విరుపు- ఆ లాభమెఱిగిన చదువరులు /నీతి తెలిసినవిద్వాంసులని అర్థం. 'అన్నయ+కోవిదుల' అనేది రెండో విరుపు. ఈ చోట అన్నయను గూర్చి తెలిసిన చదువర్లు /విద్వాంసులు అని అర్థం. అన్నయ భక్తిని వ్యక్తిత్వాన్ని చదువుసాములను తెలిసి ఆయన సంకీర్తనలు పాడేవారిని వేంకటాచలపతి చేపడతాడని అభిప్రాయం. అన్నమయ్యను తెలిసి ఆయన పదాలు పాడటానికీ స్వామి చేపట్టడానికీ ఏమి సంబంధం? స్వామి భక్తపరతంత్రత. స్వామికి తన మీది భక్తికంటె తన భకుల మీద భకి ప్రియతరం అనటం. ఇది వైష్ణవ సంప్రదాయ భావం.

పదో పద్యంలోను 'తాళ్లపాక యన్నయ పదములపై' అన్నచోట కూడా చిన్న శ్లేష. తాళ్లపాకన్నయ పదములంటే సంకీర్తనలనేది ఒక అర్థం. పదములంటే పాదాలనేది రెండో అర్థం. అన్నయ పదాలమీద భక్తిగలిగి ఆయన పదాలు పాడితే వేంకటేశ్వరుని పాదాలు తెలుస్తాయనేది రెండోచోట అభిప్రాయం. ఆయన వైకుంఠవాసి అయి విష్ణు సాలోక్యాన్ని సారూప్యాన్ని పొందాడని గమ్యం. ఈ పద్యంలో ఆస్పదశబ్దానికి, సంపత్ పదములనే చోటి పద శబ్దానికి చోటు, స్థానం అని ఒకే అర్థమైనందున సంపత్ప్రదములని 1935 నాటి దేవస్థానంవారి అచ్చుప్రతి పాఠానికి భిన్నంగా సవరించబడింది.

పదకొండో పద్యంలో వేంకటాచలపతి అన్నమయ్య చాటూక్తి పదబంధ కవితారక్తుడు కావడం, ఇతర వాగ్విరక్తుడు కావటం చెప్పబడింది. అన్నమయ్య 'శృంగార మంజరి' చేసి శేషాద్రి శృంగవాసునికి అర్పించినపుడు స్వామి తాను వెనుకటి కృష్ణమాచార్యుల వినుతి చేత కొన్నాళ్లు విరక్తుడుగా నుంటినని, అన్నమయ్య శృంగార సంకీర్తనలకు లోబడి మంచి ప్రాయపువాడ నైనానని మెచ్చుకొని చెప్పి గౌరవించినట్లు 'అన్నమార్య చరిత్ర.' 42పుటలో అభిలిఖింపబడి ఉంది. సంకీర్తనలక్షణం అన్నమాచార్య చరిత్ర రచనకు కొంచెం తర్వాతి రచన కావచ్చు.

1. పన్నెండో పద్యంలో అన్నమయ్య పదాలు/సంకీర్తనలు- 'కృతులై' అని విశేషింపబడినై. అనంతర కాలంలో త్యాగరాజాదుల రచనలకు కృతులన్న పేరు గట్టిగా నిలవటానికి కారణమిదేనేమో! 'కృత మస్యాస్తీతి కృతిః'. అని వ్యుత్పత్తి; సాహిత్యకృతి, సంగీతకృతి, ఆలేఖ్యకృతి, శిల్పకృతి - ఏదైనా కావచ్చు. ఈనాడు ఇంగ్లీషులోని a piece of art అనే పదబంధానికి మొరటు తర్జుమాగా తెనుగులో వాడబడుతోన్న 'కళాఖండం' అనే దానికంటే ఇది చాలా మెరుగైన మాట.

కం॥ భరతాది గ్రంథంబుల
విరచించిన లక్షణములు వేంకటభూమీ
ధర వర కీర్తన లక్ష్యము
లురు పదకవితా పితామహుండేర్పఱచెన్ 13

ఆ॥వె॥ అట్టి యన్నయార్యుఁడానతిచ్చిన పద
లక్ష్య లక్షణముల లాగుదెలిసి
పలుక నేర్చెనేని బాలుండుఁబ్రోడయౌ
దత్ప్రబంధ మమృతధారఁబోలు. 14

మ॥ ధరలో దాళులపాకయన్నయ గురూత్తంసుండు సంకీర్తనా
పరిశుద్ధిన్ మునుజేయఁబూని తగనుత్పాదించెఁదల్లక్షణం
బరుదై మించిన సంస్కృతంబునఁగవీంద్రానంద సంధాయియై
పరిపూర్ణాఖిల శాస్త్రసమ్మతముగా భావజ్ఞలౌనౌననన్ 15

ఆ॥వె॥ అలరుఁదాళపాక యన్నయార్యసుతుండు
తిరుమలార్యుఁడఖిల దేశికుండు
తత్పుత్రాగ్రజుండ ధరలోనఁజినతిమ్మ
యాహ్వయుండఁదండ్రి యనుమతమున 16

మ॥ పరమామ్నాయ సమానమై వెలయు మత్పైతామహ గ్రంథమున్
పరచాటూక్తి మదీయ పుణ్యజనక వ్యాఖ్యాతమున్ వేడ్కఁద
చ్చరణాంభోరుహముల్ మదిందలచి సచ్ఛాస్త్రజ్ఞులింపొందఁగా
వరుసం జెప్పెదఁబద్యరూపమునఁదద్వాక్యానుసారంబునన్ 17

తా॥ భరతం అనబడే నాట్యశాస్త్రం మొదలైన గ్రంథాల్లో విశేషంగా కూర్చబడిన శాస్త్రీయమైన నియమాలను వేంకటాచలపతి కీర్తనలనే లక్ష్యాలను గొప్పపదకవితా స్రష్ట (అయిన అన్నమాచార్యుడు) రూపుగట్టచేసినాడు. (13)

పదకవితాపితామహుడైన అన్నయార్యుడు చెప్పిన పదరచన లక్ష్యాల, లక్షణాల రీతి తెలుసుకొని తానూ చెప్పగలిగినట్లయితే ఆచెప్పినవాడు బాలుడైనాసరే అతని ప్రబంధం అమృతధారవలె ఉంటుంది. అతడు ప్రౌఢుడనిపించుకుంటాడు (14).

గురువుల్లో సిగబంతి అనదగిన తాళ్లపాకన్నయ లోకంలో సంకీర్తనను గరగరగా చేయ గోరినవాడై మునుపు తానద్దాని లక్షణాన్ని అపూర్వంగా సంస్కృతభాషలో కవులకు ముచ్చటగొల్పేటట్లుగాను, శాస్త్రగ్రంథాలన్నింటికి పూర్ణసమ్మతమౌనట్లుగాను, రసికులైనవారు తల ఊచి ఆమోదించునట్లుగాను గ్రంథరూపాన పుట్టించాడు (15).

తాళ్లపాకన్నయకు తిరుమలార్యుడనే కొడుకున్నాడు. ఆయన అన్నింటికి గురుస్థానీయుడు. నేను అతని కొడుకుల్లో పెద్దవాడను. చినతిమ్మయ అనే పేరుగలవాడను. మాతండ్రి సమ్మతిమీద తొలివేదంతో సమానంగా ప్రకాశించే మాతాతగారి గ్రంథాన్ని, ఆహ్లాదకరమైన మాటలతో మానాన్నగారు వ్యాఖ్యానించిన దాన్ని, నేనుకూడ వాళ్ల శ్రీ చరణాల్ని స్మరించి ఆవారి వాక్యాలను అనుసరిస్తూ, శాస్త్రజ్ఞులు సంతోషించేటట్లు, వరుసగా (తెలుగులో) పద్యరూపంగా చెప్తాను. (16, 17).

వ్యా॥ పితామహుడంటే బ్రహ్మ. సృష్టికర్త. పదకవితా పితామహుడు అంటే పదకవిత్వాన్ని సృష్టించినవాడని అభిప్రాయం. బిరుదప్రాయమైన ఈమాట రచనలోని సృజన ధర్మాన్నిబట్టి రావచ్చు; రచించిన కవితల పరిమాణాన్నిబట్టి రావచ్చు. అన్నమాచార్యులకిది బిరుదమని చెప్పటానికి ఇచ్చిన వారెవరనే ప్రశ్న ఉంటుంది. అన్నమయ్యను కొంతకాలం ఆదరించి సేవించిన సాళువ నరసింగరాయలు కూడ 'పదకవితాపితామహు'డని బిరుదమిచ్చినట్లు సాక్ష్యంలేదు. 'కన్నవిన్నవిగావుగదర యీపదము లన్నయార్యునివి మోహనమూర్తులనుచూ' మెచ్చుకొని విన్నట్లు మాత్రమే 'అన్నమాచార్య చరిత్ర' చెప్తున్నది. చిన తిరుమలాచార్యునికి (1537) కృష్ణరాయల ఆస్థానంలో 'ఆంధ్రకవితా పితామహుడు' అల్లసాని పెద్దన (1509-1520) ఉండటం తెలుసు. ఆయన బిరుదులు విన్న చినతిరుమలాచార్యుడు తన తాతగారిని 'పదకవితా పితామహు'డని పిలిచి ఉండవచ్చు. బ్రహ్మదేవునికి నాల్గుమొగాలు; కవిత్వం ఆశు, విస్తర, చిత్ర, మధుర కవిత్వాలని నాల్గు రకాలు. ఈసామ్యంతోను, బ్రహ్మదేవుడు ప్రపంచాన్ని సృష్టించినట్లు కవి కావ్యప్రపంచాన్ని సృష్టిస్తాడు గనుకను 'కావ్యకమలాసన' 'కవిబ్రహ్మ' 'కవితా పితామహ' ఇత్యాది బిరుదుల్లాంటి పదబంధాలు ఏర్పడినవని చెప్పవచ్చు. ఏమైనా అన్నమయ్యగారి విషయంలో 'పదకవితా పితామహత్వం' సార్థకమనటంలో సందేహంలేదు. అన్నమాచార్యులు 32,000 సంకీర్తనలు, ద్విపదప్రబంధంగా తెనుగులో రామాయణం, శృంగారమంజరి, 12 శతకాలు, సంస్కృతంలో వేంకటాద్రి మాహాత్మ్యం, సకల భాషల్లో నానా ప్రబంధాలు (గీతప్రబంధాలు?) వ్రాశాడు. అన్నమాచార్య చరిత్ర దీనికి సాక్ష్యం. ఇంక తెనుగు సాహిత్యంలో నందంపూడి శాసనంలో పేర్కోబడ్డ నారాయణభట్టు సంస్కృత, కార్ణాట, ప్రాకృత, పైశాచి,కాంధ్ర భాషల్లో కవిరాజశేఖరుడు (1053AD). బద్దెనకవి (C 1150) కావ్యకమలాసనుడు, కావ్యచతుర్ముఖుడు; శివదేవయ్య (12/13 C) ఆంధ్రకవితాపితామహుడు; తిక్కన కవిబ్రహ్మ అన్నది ప్రసిద్ధమే. శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు కూడ కవితాపితామహుడే. అల్లసాని పెద్దన 'ఆంధ్రకవితాపితామహుడు'. అన్నమయ్య 'పదకవితాపితామహుడు' అనబడ్డాడు.

దీనితోపాటు అష్టభాషా పాండిత్యం తెనుగులో ప్రసిద్ధం. సంస్కృతం, ప్రాకృతం, శౌరసేని, మాగధి, పైశాచి, చూళిక, అపభ్రంశం, ఆంధ్రం - ఇవి అష్టభాషలని అప్పకవి చెప్పినాడు. భాస్కర రామాయణ కర్తలలో ఒక్కడైన మల్లికార్జునభట్టు అష్టభాషాకవిమిత్రుడు. అష్టభాషాకవుల్లో సూర్యుని వంటివాడని అభిప్రాయం. వెంచుకలదిన్నె శాసనాన్ని బట్టి నాచన సోమనాథుడు అష్టభాషల్లో విద్వాంసుడు. నిశ్శంకకొమ్మనకూడ 'అష్టభాషా కవితాప్రవీణుడు'. ఈసంకీర్తన లక్షణకర్త అయిన తాళ్లపాక చినతిరుమలాచార్యుడు కూడ అష్టభాషాదండకం చెప్పి (7-11-1537 నాడు) రాగిరేకులమీద చెక్కించినాడు. కాగా ఇతని తాతఅయిన అన్నమయ్యకు పలుభాషలు తెలిసి ఉండటం సంభావ్యమే. అది వాగ్గేయకారునికి ఉండవలసిన యోగ్యతకూడ.

పద్నాలుగో పద్యంలో 'పదలక్ష్యలక్షణములు తత్ప్రబంధము' అన్నపుడు పదము, ప్రబంధము అనేపదాలు సమానార్థకాలుగా వాడబడటం గమనించాలి.

పదునైదో పద్యంలో భావజ్ఞులను రసికులన్నపుడు అలంకారశాస్త్రమనే రసశాస్త్రం తెలిసినవారని గ్రహించాలి. భావం అంటే మనోవికారం; అది ఉద్రేకరూపంగా ఉంటుంది. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనేవాటిని క్రమంగా చెవితోవినటం, చర్మంతో ముట్టుకొవటం, కంటితో చూడటం, నాల్కతో రుచిచూడటం, ముక్కుతో వాసన చూడటంవల్ల మనస్సుకు వికారం, ఉద్రేకం కలుగుతుంది. ఉద్రేకాన్ని పడబోసిన సారమే 'రసం' అనిపించుకుంటుంది. లౌకికానుభవంలోని ఇంద్రియజన్యమైన జ్ఞానప్రతీతిని పరవశింపజేసే రసానుభవంగా మార్చటమే లలితకళలన్నింటి ప్రమేయం. రసంలేని భావంలేదు. భావంలేని రసంలేదు. (నభావ హీనో స్తి రసః, నభావోరస వర్జితః) అని ఆలంకారికుల అభిప్రాయం.

పదునారోపద్యంలో కవి తన్ను 'చిన తిమ్మయ' గా చెప్పకొన్నాడు. చిన తిరుమలాచార్యునే చిన తిరుమలయ్య, చినతిమ్మయ్య, తిరుమలదీక్షిత, తిమ్మాదీక్షిత, చినతిమ్మ, చిన్న తిమ్మన్న, చిన్న తిరుమలయ్యంగార్, సిరుతిరుమలై అయ్యంగార్, తిరుమల - అనే పేర్లతో వ్యవహరించడం ఉంది.

పదునేడో పద్యంలో 'పరమామ్నాయసమానమై' అనేచోట పరమము అంటే ఆద్యం, ఉత్కృష్టం, ప్రధానం అని అర్థాలు; అలాగే ఆమ్నాయము అంటే వేదం, ఉపదేశం, సంప్రదాయం అని అర్థాలు. పరమామ్నాయమనే పదబంధానికి తొలువేదం, ఉత్కృష్టమైన ఉపదేశం, ముఖ్యసంప్రదాయం అనే మూడురకాల అభిప్రాయాలూ కుదురుతాయి, బాగుంటాయి. పాఠకులు తమకు నచ్చినట్లు గ్రహించవచ్చు.

1. భరతం అన్నపుడు నాట్యశాస్త్రం, ఆదిశబ్దంచేత దానితోపాటు మరికొన్ని నాట్య సంగీత శాస్త్రగ్రంథాలు అనిగ్రహించాలి. భరతుడు 'నాట్యశాస్త్ర' కర్త. దీని రచనాకాలం క్రీ.పూ. 100-క్రీ.శ. 300. మధ్యకాలం అని అంచనా. ఇది నాట్యానికి దానికి సంబంధించి సంగీతసాహిత్యాలకూ తొలిలక్షణ గ్రంథం. (భరతునికి పూర్వం శిలాలి, కృశాశ్వులనే నటసూత్రకర్తలున్నట్లు తెలుస్తున్నా వారి గ్రంథాలు దొరకలేదు.) భరతుడనే మాటకు భావ-రాగ-తాళాలతో పాడేవాడని, నటుడని అర్థం చెపుతూ నాట్యశాస్త్రం సంకలన గ్రంథమనీ భరతుడు కల్పితవ్యక్తి అని అనటానికి అవకాశంఉంది. కాని నాట్య శాస్త్రంలో పరస్పర విరుద్ధాంశాలు, స్వవచోవ్యాఘాతాలు కనబడవు; గొప్పపరిశీలనా శక్తి కనబడుతుంది. అందుచేత ఎవరో ఒక మహాపురుషుడు దీన్ని రచించినాడని నమ్మవచ్చు. తర్వాతివారు కోహల, దత్తిలులు. కోహలగ్రంథంకనరాదు. దత్తిల గ్రంథం సంగ్రహమొకటి 242 శ్లోకాలతో లభించింది. ఇది క్రీ.శ. 3-4 శ. నాటిదని భావిస్తారు. మతంగుని 'బృహద్దేశి' తర్వాతిది. దీన్ని క్రీ. శ. 5-9 శ. మధ్యవచ్చిందంటారు. కొందరు క్రీ.శ. 5 శతాబ్ది అనే నమ్ముతారు. తర్వాతిది చాళుక్య సోమేశ్వరుని అభిలషితార్థచింతామణి (11శ) అటుపిమ్మటిది జగదేక మల్లుని 'సంగీతచూడామణి'. జగదేకమల్లుడు చాళుక్యసో మేశ్వరుని కొడుకు. క్రీ.శ. 1134-43 మధ్యపాలించినరాజు. ఆపైది హరిపాలమహీపాలుని 'సంగీత సుధాకరం'. హరిపాలుడు సౌరాష్ట్రరాజు. క్రీ.శ. 1175 ప్రాంతమువాడు. ప్రసిద్ధమైన 'సంగీత రత్నాకరం' అటుతర్వాతిది. శార్ఙ్గదేవుడు కర్త. క్రీ.శ. 1230 ప్రాంతపు రచన. దీనికి సర్వజ్ఞసింగభూపాలుడు 'సుధాకర'మనే వ్యాఖ్యానాన్ని (క్రీ.శ. 1380 ప్రాం.), ఇమ్మడిదేవరాయల (క్రీ.శ. 1446-65) ఆస్థాన విద్వాంసుడైన కల్లి నాథుడు 'కలానిధి' అనే వ్యాఖ్యానాన్ని వ్రాశారు. పార్శ్వదేవుని 'సంగీతసమయసారం' మతంగుని, సోమేశ్వరుని, భోజుని పేర్కొంటుంది; సింగభూపాలుడీ గ్రంథాన్ని తొలిసారిగా పేర్కొన్నాడు గనుక దీన్ని 1140 -1380 క్రీ.శ. మధ్యకాలపు రచనగా భావిస్తారు. వీటిలో మనసంకీర్తనలక్షణకర్త సంగీతరత్నాకరాన్ని, సంగీతచంద్రికను, సంగీతచూడామణిని, సంగీతసుధాకరాన్ని 18 పద్యంలో కంఠోక్తిగా పేర్కొన్నాడు. కాని కర్తలపేర్లు చెప్పలేదు.

2. నిబద్ధమైన దేశిగానంలో 'ప్రబంధ'మనేది గానవిశేషం. నారదుని సంగీతమక రందంలోని గాయకలక్షణంలో 'ప్రబంధగాన నిష్ణాతః' (సంగీతాధ్యాయ 4పా-34 శ్లో) అనిప్రయోగం. సంగీతరత్నాకరంలో నిబద్ధగానానికి ప్రబంధం, వస్తువు, రూపకం అనే మూడున్నూ సంజ్ఞలని ఇలా చెప్పబడింది.

"సా చాస్మాభిః పురాప్రోక్తా నిబద్ధం త్వధునోచ్యతే

సంజ్ఞాత్రయం నిబద్ధస్య ప్రబంధో, వస్తు, రూపకమ్"

(సంగీ.రత్నా. 4-6)

సంగీత సమయసారం (పార్శ్వదేవ)లోను

'ప్రబంధోరూపకంవస్తు నిబద్ధస్యాభిధాత్రయమ్' (అధికరణం. 4-1)

అనిచెప్పబడింది. వీటిలో ప్రబంధశబ్దం గీత, వాద్య, ప్రబంధాలకు వాడబడుతున్నది. అంటే గీతప్రబంధాలు, వాద్యప్రబంధాలు, ఉన్నాయన్నమాట. రూపకమనేది రాగాలప్తి - రూపకాలప్తి అనే ఆలాపభేదంలో వాడబడుతున్నది. రూపకాలప్తి అంటే ఒకపాటకు నియమించిన రాగతాళాలతో ఆలాపంచెయ్యడం. వస్తువనేది వస్తు-వర్ణక భేదంలో కూడా వాడబడుతున్నది. వస్తుప్రబంధమనేది వర్ణక ప్రబంధానికి భిన్నమైనప్రబంధవిశేషం.

3. పద్యాలుగో పద్యం ఒకవిధంగా అన్నమయ్య సంస్కృతంలో చెప్పిన పదలక్షణ కృతికి ఆవాక్యాలను అనుసరించి తాను తెనుగులో వ్రాస్తున్న సంకీర్తన లక్షణమనే గ్రంధానికి 'అనుబంధచతుష్టయాన్ని' సూచిస్తుందనవచ్చు. గ్రంథవిషయం ఏమిటి, ఎవరికొరకు ఈగ్రంథం వ్రాయబడుతున్నది? ఏప్రయోజనంకోసం వ్రాయబడుతున్నది? విషయప్రయోజనాల సంబంధం ఎలాంటిది? అనే వాటిని 'అనుబంధచతుష్టయం' అంటారు. సంకీర్తన నామకపదానికి లక్ష్యలక్షణాలు విషయం, పదరచనా ప్రౌఢి ప్రయోజనం. సాధ్యసాధకభావం సంబంధం. జిజ్ఞాసువులై గ్రహణధారణపటువులైన పిన్నలైనా (బాలురైనా) అధికారులె.

4. సంస్కృతంలోని విషమవృత్తవిశేషాల్లో 'అమృతధార' ఒకటి. అక్షర సంఖ్యామాత్రమే ఇందు ముఖ్యము. ఇందు 1పాదం 20 లఘు+2గురువులు, 2పాదం 8లఘు+2గు, 3పాదం 16లఘు+2గు, 4పాదం 12ల+2గు.

5. పదునేడో పద్యం సంకీర్తన లక్షణకర్త ప్రతిజ్ఞావాక్యం. తాతగారి గ్రంథాన్ని వ్యాఖ్యానించిన తండ్రి అనుమతితో మూలగ్రంథ వాక్యాలను అనుసరిస్తూ వరుసగా పద్యరూపంలో శాస్త్రజ్ఞులకు ప్రియంగా చెప్తాను అనటంలో అన్నమయ్య గ్రంథానికి ఉన్నప్రామాణికత్వం దీనికి పూర్ణంగా ఉన్నదని చెప్పినట్లయ్యింది. అన్నమయ్య సంస్కృతగ్రంథం లభ్యంకాలేదు. దానికి ఇది భాషాంతరీకరణం అనటానికి వీల్లేకపోయినా 'వరుస'గా చెప్తాననటంవల్ల మూలగ్రంథక్రమాన్ని పాటిస్తున్నదని తనదికూడా శాస్త్రగ్రంథమనీ అభిప్రాయం.

6. వాక్యంఅంటే తెలియజెప్పే ఉద్దేశంతో చేసిన పదప్రయోగం. ఇది ఒకేపదంకావచ్చు. పలుపదాలూకావచ్చు. ఎదుటివానికి చెప్పడంకావచ్చు. ఎదుటలేనివారికి చెప్పటంకావచ్చు. చెప్పేతున్న అభిప్రాయం కొదవలేకుండా పూర్తిగా ఉండాలి.

7 ఈ'సంకీర్తన లక్షణం' అనే గ్రంధాన్ని తెనుగులో వ్రాసిన తాళ్లపాక చినతిరుమలాచార్యుల తండ్రి పెదతిరుమలాచార్యుడని అతడు అన్నమయ్యగారు సంస్కృతంలో వ్రాసిన పదలక్షణ గ్రంథానికి వ్యాఖ్యానంచేసినాడని 16, 17 పద్యాలు చెప్తున్నవి. తాళ్లపాక చినతిరుమలాచార్యుల తమ్ముడు తాళ్లపాక చిన్నన్న (చిన తిరువేంగళనాథుడు). ఇతడు అన్నమాచార్య చరిత్రమును తెనుగులో ద్విపదగా వ్రాసినాడు. ఈచిన్నన్న ద్విపదను గౌరవించినవాడని పెదతిరుమలాచార్యులు పదాన్ని గౌరవించినాడని తెనాలి రామకృష్ణకవి 'చిన్నన్న ద్విపద కెరఁగుము, బన్నుగఁబెద తిరుమలయ్య పదమునకెరఁగున్' అనేపద్యంలో చే[illegible]డు. పెదతిరుమలాచార్యులు తనతండ్రి అన్నమయ్యలాగే తానుకూడా 'శృంగార సంకీర్తనలు' 'వైరాగ్యవచనమాలికాగీతాలు' రచించిన పదకవి. అన్నమయ్య లక్షణగ్రంథానికి పెదతిరుమలాచార్యుడు వ్యాఖ్యానం వ్రాయడం ఆయనకు పదంమీద ఉన్న గౌరవాన్ని సూచిస్తుంది. 16 పద్యంలోని 'అలరున్' 'తండ్రి యనుమతమున' అనేమాటలు చినతిరుమలాచార్యులు 'సంకీర్తన లక్షణము' రచించునాటికి అతడు సజీవుడుగా ఉన్నట్లు సూచిస్తాయి. ఈగ్రంధం సంస్కృతంలోని మూలగ్రంథాన్ని అనుసరించి ఉంటేనే ఆయన ఆమోదించి ఉంటాడనేది స్పష్టం.

వ॥ మహనీయంబగు సంకీర్తన నామక పదసంప్రదాయం బెట్టిదనిన

సీ॥ రమణీయ సంగీత రత్నాకర ప్రబంధాధ్యాయమున నుక్తమయ్యెఁబదము
సముచిత సంగీత చంద్రికాదేశైల యందు మిక్కిలిఁదేటయయ్యెఁబదము
అతులతత్సంవాదమైనట్టి సంగీత చూడామణికిఁబల్కుచోటు పదము
ధన్యసంగీత సుధాకర గ్రంథంబునందు మిక్కిలిఁజెలువొందుఁబదము

తే॥ గీ॥ తానె యిన్నిఁటికిని మూలమైన భరత
మందుఁబంచ దశాధ్యాయ మందు విమల
వృత్త చూర్ణ నిబంధక వివిధనామ
భవ్య లక్షణములకు నా స్పదము పదము 18

తా॥ సంకీర్తనమనే పేరుతో వస్తున్న ఈ గొప్ప పదసంప్రదాయం ఎలాంటిదంటే చెప్తాము. ఈ 'పద'మనేది 'సంగీతరత్నాకరం' ప్రబంధాధ్యాయంలో చెప్పబడింది; 'సంగీత చంద్రిక'లో దేశైలను చెప్పినచోట విశదం చేయబడింది; సంగీత చంద్రికతో సంవదించే 'సంగీత చూడామణి'కి పదం పలుకుచోటైంది ; 'సంగీత సుధాకరం' లోను చెప్పబడింది. ఈ సంగీత గ్రంథాలన్నింటికి మూలమైన భరత మనబడే నాట్యశాస్త్రంలో 15 అధ్యాయంలో వృత్తపదం, చూర్ణపదం, నిబంధ పదం మొదలైన పేర్లతో లక్షణ నిర్వచనం చేయబడింది ఈపదమే.

వ్యా॥ గ్రంథకర్త ఈపద్యంలో సంకీర్తనమే పదమని, సంకీర్తన సంప్రదాయం పదసంప్రదాయమని స్పష్టం చేస్తున్నాడు. అంతేకాదు. ఈ పదసంప్రదాయం భరతుని నాట్యశాస్త్రకాలం నుండి వస్తున్నదని అనాదియని చెప్తూ ఈపదాన్ని గురించి సంగీతరత్నాకరం, సంగీత చంద్రిక, సంగీత చూడామణి, సంగీత సుధాకరం వంటి శాస్త్రగ్రంథాలు చెప్తున్నాయంటూ దాని యెడతెగని గురుపారంపర్యాన్ని ప్రశస్తిని సూచిస్తున్నాడు.

1. భరతం అంటే భరతముని ప్రణీతంగా చెప్పబడుతున్న నాట్యశాస్త్రం. వాచికాభినయం కోసం వ్యాకరణచ్ఛందోవిధానాలు ఇందులో చెప్పబడినై. పదానికి సంబంధించి వృత్త, చూర్ణ, నిబంధకాది లక్షణాలు చెప్పిన అధ్యాయం 15 అని గ్రంథకర్త చెప్పాడు. నేడు నాట్యశాస్త్రం కాశీ, బొంబాయి, బరోడా ముద్రణలలో లభిస్తున్నది. వీటిలో కాశీముద్రణంలో మాత్రమే ఈ విషయం 15 అధ్యాయంలో ఉంది. బొంబాయి బరోడా ముద్రణల్లో 14 అధ్యాయంలోనే వస్తుంది. మన గ్రంథకర్త పాఠమే కాశీముద్రణ పాఠమైందనవచ్చు.

అముఖ్య శ్లోకాలివి:

ఏభిః శబ్దవిధానైః విస్తారవ్యంజనార్థ సంయుక్తైః
పదబంధాః కర్తవ్యా నిబద్ధబంధాస్తు చూర్ణావా॥

విభక్త్యంతం పదంజ్ఞేయం నిబద్ధం చూర్ణమేవచ
తత్ర చూర్ణపదస్యేహ సువిబోధత లక్షణమ్॥
అనిబద్ధ పదం ఛందస్తథాచానియతాక్షరమ్
అర్థాపేక్ష్యాక్షరన్యూతం జ్ఞేయం చూర్ణపదం బుధైః॥
నిబద్ధాక్షర సంయుక్తం యతిచ్ఛేదసమన్వితమ్
నిబద్ధంతు పదంజ్ఞేయం ప్రమాణనియతాత్మకమ్॥
ఏవం నానార్థసంయుక్తైః పాదైర్వర్ణవిభూషితైః
చతుర్భిస్తు భవేద్యుక్తం ఛందోవృత్తాభిధానవత్॥

(నా.శా.బరోడా ముద్రణం. 14 అధ్యా-38-42)

అంతేకాదు. నాట్యశాస్త్ర తాళాధ్యాయం (బరోడా ముద్రణం. 31 అధ్యా)లోనే సప్త గీత ప్రకృతి సందర్భంలో గీతం దేవతారాధకము, పుణ్యము అని బహిర్గీతాంగ శాఖావిహీనం ' పదనిర్యుక్త 'మని చెప్పబడింది. ఇది స్తుతిమాత్రపరమైన పదం; సంకీర్తనమన్నమాట. విప్ర దాసు డనే సంగీతశాస్త్రవిద్వాంసుడు తన 'సంగీత చంద్రము' (క్రీ.శ. 1625 పూర్వప్రాంతి) అనే గ్రంథంలో దేవస్తుత్యర్థాలైన ఆశ్రవణాద్యంగాలు అపదం, పదబద్ధం అని రెండుర కాలని, అపదం 'నిర్గీతం' అనబడుతుందని, పదబద్ధమైంది 'బహిర్గీతం' అనుబడుతుందని, ఇది సర్వదేవ ప్రియావహమని అందుచేత ఆశ్రవణాదుల్ని పదబద్ధాలుగానే ప్రయోగించాలని చెప్పాడు. (చూడు : డా.పి.యస్.ఆర్. అప్పారావుగారి నాట్యశాస్త్రానువాదం. తెలుగు. పుట 1161-16 అధ స్సూచిక మరియు 890 పుట) కాబట్టి దేవస్తుత్యాత్మకమైన పదం నాట్యశాస్త్రకాలంనుండి అవిచ్ఛిన్నంగా సాగుతున్నదే.

2. గ్రంథకర్త ఈపద్యంలో కొన్ని సంగీత గ్రంథాల పేర్లయితే చెప్పాడుకాని ఆశా స్త్రగ్రంథాల కర్తలపేర్లు చెప్పలేదు; వాటి కాలక్రమాన్నీ పాటించలేదు. నేడు భరతుని నాట్యశాస్త్రంగా మనకు దొరుకుతున్న గ్రంథం 'షట్సాహస్రి' (అంటే ఆరువేలశ్లోకాల గ్రంథం) అంటారు. దీనికి ముందు 'ఆదిభరతం' 'వృద్ధభరతం' అనేపేరుతో 'ద్వాదశసా హస్రి' (12 వేలశ్లోకాల గ్రంథం) ఉండేదని అది యిప్పుడు అలభ్యమని శారదాతనయుని 'భావప్రకాశన' (క్రీ.శ. 1175-1250 ప్రాం.) మనేగ్రంథం వల్ల తెలుస్తుంది. నేడు దొరుకుతున్న నాట్యశాస్త్రం క్రీ.పూ. 100- క్రీ.శ 300 మధ్యకాలానికి చెందిందని ఒక అంచనా.

దీనికి తరువాతిది 'సంగీత చూడామణి'. ఈ పేరుతో నాలుగు గ్రంథాలు వినబడుతున్నాయి. అందులో మూడు శిథిలస్థితిలో మైసూరు ఓరియంటల్ రిసర్చి ఇన్స్టిట్యూట్‌లో ఉన్నై. ఒకటి బరోడా ఓరియంటల్ ఇన్స్టిట్యూట్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. మైసూరులో ఉండేవాటిలో కర్త పేరు తెలియనిదొకటి (P 1298/1). జగదేకమల్లుని పేరుతో ఉండేది ఒకటి (P 5081). హరిపాల మహీపాలుని పేరుతో ఉండేది ఒకటి (P 105/1). ఈ మూడుగ్రంథాల పత్రాలు తాళానికి సంబంధించినవని 'ప్రబంధాల'నుగురించి వీనిలో లేదని తెలుస్తున్నది. బరోడా ప్రతి కవిచక్రవర్తి పేరుతోఉన్నట్లు, మళయాళలిపిలో ఉన్నట్లు తెలుస్తున్నది. దాని ప్రతినే కాబోలు జగదేకమల్లుని పేరుతో సంగీత నాటక అకాడమీ, ఢిల్లీ, వారు ప్రచురించినారు. ఇది తాళసంబంధిమాత్రమే. ఇది యిట్లుండగా తాళానికి ప్రబంధాలకూ సాధికారగ్రంథమనదగిన జగదేకమల్లుని 5 ప్రకరణాల సంగీతచూడామణి వరలక్ష్మి సంగీత అకాడమీ, మైసూరు, వారివద్ద లభ్యంగా ఉన్నట్లు డాక్టర్ వి.యస్. సంపత్కుమారాచార్యగారి 'కర్ణాటక సంగీత పారిభాషిక శబ్దకోశ' (1 వాల్యూం. 286,287 పుట) (కన్నడగ్రంథం) చెప్తున్నది. కాని ఇదిపై (P 5081) కి పుత్రిక అని తెలుస్తున్నది. చినతిరుమలాచార్యులు పేర్కొన్న సంగీతచూడామణి జగదేకమల్లునిదే అనుకోవాలి. ఇతని రాజ్యకాలం క్రీ.శ. 1134-43. చిన తిరుమలాచార్యులు 41 పద్యంలో పల్లవముంటే శిఖాపదంఉండదు, శిఖాపదం ఉంటే పల్లవం ఉండదంటూ 'చూడామణి' గ్రంథంలో చెప్పబడిందని చంద్రికాకర్త చెప్పినారని వ్రాయటం వల్ల - తాను స్వయంగా సంగీత చూడామణిని చూడలేదనుకోవాలి. అంతేకాదు. సంగీత చూడామణికి తర్వాతి గ్రంథం సంగీత చంద్రిక అనికూడా తెలుస్తున్నది.

'సంగీత చంద్రిక' అనే సంస్కృత గ్రంథం రెండధ్యాయాల (శారీర లక్షణం వరకు) జెరాక్స్‌ప్రతిని ఈ టీకాకర్త మద్రాసు యూనివర్సిటీ సంగీతశాఖలో రీడరు డా. ఎన్. రామనాథన్ గారివద్ద చూచారు. కర్తమాధవభట్టు అని తెలుస్తున్నది. తంజావూర్ సరస్వతీ మహల్ లైబ్రరీలో దీని మూలప్రతి ఉన్నట్లు తెలుస్తున్నది. వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతిలోను (స్టాక్ నం. 7012) ఇది ఉంది. అముద్రితంగా ఉన్న విప్రదాసుని 'సంగీత చంద్రము' ఇదీ పేరు గ్రంథాలవునోకాదో తెలియదు.

తర్వాతి గ్రంథం హరిపాలమహీపాలుని సంగీత సుధాకరం. ఇది క్రీ.శ. 1175 ప్రాంతానిది. మద్రాసు గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరిలో ఒక కాగితపు లిఖిత ప్రతి (R. 3082) ఉంది.

అటుతర్వాతిది ప్రసిద్ధమైన 'సంగీత రత్నాకరం'. శార్ఙ్గదేవుడు దీనికర్త. క్రీ.శ. 1230 ప్రాంతపు రచన.

3. సంగీత చంద్రికలోని 'దేశైల' భాగం మనకు దొరకదుకాని సంగీత రత్నాకరంలోని ప్రబంధాధ్యాయమే మనకిప్పటికి చాలు. ఈ అధ్యాయంలో సూడప్రబంధాలు, ఆలిప్రబంధాలు, విప్రకీర్ణప్రబంధాలు, సాలగసూడ ప్రబంధాలు, రూపక ప్రబంధాలు అనే శీర్షికల క్రింద చాల ప్రబంధాలు చెప్పబడినై. 'ఏలాప్రబంధం' అనేది సూడప్రబంధాల్లో ఒకటి.

ఏలా, కరణ, డేంకీభిర్వర్తన్యా ఝొంబడేన చ

లంభ రాసైకతాలీభి రష్టభిః సూడ ఉచ్యతే ॥

(సంగీ. రత్నా. 4 అధ్యా - 23 శ్లో)

ఏలా, కరణ, డేంకీ, వర్తనీ, ఝోంబడ, లంభ, రాస, ఏకతాలీ అనే ఎనిమిది ప్రబంధాలు సూడప్రబంధాలని చెప్పబడతాయని అర్థం. ఏలా సామాన్యం పదమౌతుందని అందులో దేశైల తెనుగు పదం అనీ చినతిరుమలాచార్యుల స్పష్టమైన అభిప్రాయం. తెనుగులో 'లక్షణశిరోమణి' రచించిన పొత్తపి వేంకట రమణ కవి (క్రీ.శ. 1700 ప్రాం) ఏళలనే పదాలంటూ అవి సూళాదుల కనుగుణంగా ఉండవలెనంటూ ఇలా వ్రాశాడు.

"ఇవి సంగీత తాళనిర్ణయములు గీతసృష్టి గీతపుష్టి మాత్రాధిక్య మాత్రలోపమ్ముల రాగ తాళమ్ముల పదమ్ముల నర్జునభరతమ్ము ఏలలని వాని లక్షణమ్ములు చెప్పబడియుండు ; నందు

"కర్ణాటలాట గౌళాంధ్ర ద్రవిళానాంతు భాషితం

ఏళాస్సప్తవిధా జ్ఞేయా ప్రోక్తా మత్యాధి తాళతః"

అన్నారుగావున నీ దేశభాషల పదముల చెప్పవచ్చుననిన్ని, మూడు చరణములకు ఖండికాత్రయము అని పేరుగలదనిన్ని పల్లవము ఉపపల్లవము అనిన్ని, యివి మాత్రాసమక నిబద్ధములైన 'ప'గణాదులతో గూర్చవలెననిన్ని సూళాదుల (క)ను గు (ణ)ముగా నుండవలెననిన్ని, సంగీతరత్నాకరము మొదలైన గ్రంథము(లు) అర్జున భరతాది ఏళాప్రకారంబున పగణాదుల రాగతాళమ్ముల సంగీతరీతిని తేటపడియుండుగాన నీసాహిత్యమార్గంబున లక్షణంబున జొరవవి యట్లుండె." (లక్షణ.శిరో. 3 ఆ-425, 426,427). పదం సూళాదులకు చెందిన ఏల అనేది దీనితో గట్టిపడుతున్నది.

పై సంగీతరత్నాకరంలో చెప్పిన 'సూడ' శబ్దం గీతి విశేషసమూహాన్ని చెప్పే దేశి శబ్దమని కల్లినాథుని వ్యాఖ్య. 'చతుర్దండి ప్రకాశిక' అనే సంగీత గ్రంథం వ్రాసిన వేంకటమఖి (17 శ), సంగీత సారామృతము రచించిన తులజాజి మహారాజు (18 - శ) ఈ అభిప్రాయన్నే అనుసరించారు. కాని కన్నడంలో సుళు+హోది=సుళాది అని విడదీసి చెప్పి

ముముక్షువులు నిత్యానందం పొందటానికి సులభమార్గమని ఒకవ్యుత్పత్తి చెప్పటం ఉంది. ఈ 'సూళాదు' అనే పదాలు భిన్నతాళాల్లో పాడే వేర్వేరు భాగాలుగల కొంచెం పొడవైన పాటలు. ధ్రువ, మఠ్య, రూపకం, ఝంప, త్రిపుట, అర్థ, ఏకతాళం అనే ఏడు సూళాదిసప్తతాళాలు. కన్నడంలో ఈసూళాదులను కూర్చిన మొదటి వాగ్గేయకారుడు శ్రీపాదరాయరు. వ్యాసరాయరు, పురందరదాసరు సూళాదులు ప్రచలితంచేసిన వారే. ఇవి కన్నడంలోని దాససాహిత్యానికి విశిష్టాలంటారు. సంగీతశాస్త్రంలో 'ఛాయాలగ' మనే పదబంధం 'సాలగ' అయింది. 'కరపాట' అనే పదబంధం 'కైవార'(డ) అయింది. ప్రబంధాల్లో సాలగసూడ ప్రబంధాలు ఉన్నవి. 'సాలగ' శబ్ద సాహచర్యంతో సూడ శబ్దంకూడ 'సూళ' గా మారినట్లు తోచుతుంది. ఇంక ఈసూళాదికి చేరిన 'ఏల' ఎలా వచ్చిందో చూద్దాం. ఏలా శబ్దాన్ని ఏలకితీగే అనేఅర్థంలో పాటకు పేరుగా చెప్పడం కుదరదు.

'ఏలా' శబ్దం సంస్కృత 'హేలా' శబ్దంనుండి వచ్చిందనటం సులభం. కాని అర్థం పొసగదు. 'హేలా' శబ్దానికి కండ్లు కనుబొమల వికారంచేత తెలియదగిన మనోవికారం అని, తిరస్కారం అని అర్థాలు. ఇది ఒక నది పేరుకూడ. ఏలా ప్రబంధం అనేపాటకు ఈ అర్థాలు సరిపడవు. 'ఏల' శబ్దంలోని శబ్దాంత దీర్ఘం సంస్కృతభాషాలక్షణం వల్ల వచ్చింది 'ఏల' అనేది ద్రావిడ భాషా శబ్దమని చెప్పవచ్చు. 'ఏల' అనే పేరుతో సంస్కృత వృత్తరత్నాకరంలో 15 ఛందంలో పుట్టిన ఒక వృత్తం ఉంది. దీనికి స-జ-న-న-య గణాలు. 6 అక్షరంమీద యతి. మాత్రాసంఖ్య 19 అవుతుంది. ఇదే ఛందస్సునే తెలుగులో అప్పకవి 'ఇల' అనేపేరుతో చెప్పాడు. గణాలు స-జ-న-న-స. 8యతిస్థానం. మాత్రల సంఖ్య 18 అవుతుంది. చిత్రకవి పెద్దన్న 5-8 మీద రెండు యతులు చెప్పాడు. ఈచోట సంస్కృత వృత్తరత్నాకరంలో చివరిగణం 'య' గణం కావటం పొరబాటనకతీరదు. వృత్తరత్నాకరంలో గణం తప్పుగా ఎక్కితే తెనుగులో అప్పకవి పేరు తప్పుగా చెప్పాడు.

నిజానికి రెండూ ఒకే వృత్తమే. ఏలకు మంఠ్య, ద్వితీయ, కంకాల, ప్రతితాళాల్లో ఒకదాంతో పాడాలని నియమం ఉంది. ఈమంఠ్యాదులకు 18 అక్షరాలు ఉంటాయి. అప్పకవి చెప్పిన గణాలతో ఇది ఏలా భేదం కావచ్చు. ఈఏలలు శ్రోతలకు ప్రయోక్తకు ధర్మకామార్థసిద్ధిదములని చెప్పబడింది. అందుచేత వస్తువు ఉదాత్తంగా ఉంటుంది. 'ఎళు' అనే ద్రావిడ శబ్దానికి ఎత్తు, మిఖ్ఖు, ఉదాత్తత అనే అర్థాలున్నాయి. **(DEDR 851)** ఏళిమలై అంటే ఎత్తైన కొండ. ఏలూరు అన్నపుడు మిఖ్ఖున ఉన్న ఊరని అర్థం. ఏలా శబ్దాన్ని ఇట్లు గ్రహించడం ఒకపద్ధతి. రెండవపద్ధతి: తమిళంలోని 'యాళ్' శబ్దమే ఏలగా మారిందని తలచవచ్చు. 'యాళ్' అనేది ప్రాచీనకాలపు తంత్రీవాద్యం. 'పాణర్లనే వారు ఈవాద్యంతో గానంచేసేవారు. శ్రీలంకలోని 'జాఫ్నా' నగరం అసలుపేరు 'యార్పాణమ్' యాళ్ వాద్యంతో పాడిన 'పాణర్' కిచ్చిన ఊరట. తమిళ సాహిత్యంలో ముల్లై, కురించి, మరుదమ్, నెయ్దల్, పాలై అనే ప్రాదేశిక విభాగాలున్నాయి.

ఒక్కొక్క ప్రాంతానికి ఒక రకమైన సంగీతం (పన్) ఉంది: ముల్లైప్పన్, కురించిప్పన్, మరుదప్పన్, నెయ్‌దల్‌పన్, పాలైప్పన్. యాళ్‌వాద్యం ఆటుతర్వాత ఆయాప్రాంతాల సంగీతానికి కూడా పేరైంది. పాలైయాళ్, కురించియాళ్, మరుదయాళ్, నెయ్‌దలియాళ్. ఇవి ప్రాచీన తమిళసంగీతంలో ఉండిన సెరుపాలై, కూడిప్పాలై, నదుమలైప్పాలై విల్‌కరిప్పాలై అనే మేళాలే అని తమిళ సంగీత శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. పురావస్తు పరిశోధనను అనుసరించి గ్రీసు దేశంలో యాళ్‌వంటి, జగల్, (Zagal) అనే తంత్రీవాద్యం ఉండేది. సుమేరియన్ తంత్రీవాద్యానికి 'అల్' (al) అనిపేరు. ఈజిప్టు బాబిలోనియా దేశాల్లోను యాళ్‌వంటి తంత్రీవాద్యాలు దొరికినై. కాగా 'యాళ్‌పాట్టు' 'ఏలపాటగా' మారటం సులభమనవచ్చు. తమిళంలోని 'యార్' తెలుగులో 'ఏఱు' అయినట్లుగా ఇది మార్పుచెంది ఉంటుంది.

ఈ ఏలా ప్రబంధాలు (1) గణైల (2) మాత్రైల (3) వర్ణైల (4) దేశైల అని నాల్గు రకాలు. అందులో 'దేశైల' మరల 5 రకాలు.

'కర్ణాట లాట గౌడాంధ్ర ద్రావిడానాంతు భాషయా
దేశాఖ్యైలా బుధైః పంచ ప్రోక్తా మంతాది తాలతః' ॥

(సంగీ. రత్నా. 4 అధ్యా - 114 శ్లో)

(పొత్తపి వెంకటరమణకవి గ్రంథంలో వెనుక చూపిన శ్లోకం సరిగాలేదనేది స్పష్టం)

కర్ణాటైలలో ఆదిమధ్యాంతవర్తులైన అనుప్రాసలుంటాయి. లాటైల ప్రాంతప్రాసతో రస విరాజితంగా ఉంటుంది. గౌడి గమకప్రాసలు లేకుండా ఒకే రసంతో ఉంటుంది. ఆంధ్రైల నానాగమకాలతో రాగాంశలతో రసభావోత్కటంగా ఉంటుంది. ద్రావిడైల ప్రాసవర్జితంగా భూరిభావరసోత్కర్షగా ఉంటుంది.

4. వివిధ వర్ణాలతో అలంకృతమైనట్టి వివిధార్థ బోధకాలైనట్టి నాల్గు పాదాలతో కూడిన ఛందస్సు 'వృత్తం' అనబడుతుంది. వృత్తబద్ధం కాకుండా అక్షర సంఖ్యానియమంకాని గురులఘువుల నిక్కడిక్కడ నిలపాలనేనియమం కాని లేనిది అర్థాపేక్ష ఉండే (వీరశృంగారాదిరసాలను స్ఫురింపచేసే) అక్షరాలకూర్పు గలది 'చూర్ణపదం' అనబడుతుంది. ఛందోబద్ధమైన అక్షరాలకూర్పు, యతినియమం, అక్షరసంఖ్యానియమం ఉండేది 'నిబద్ధపదం' అనబడుతుంది.

కం॥ అందఱిలోఁ బదమార్గ
చ్ఛందో మూర్ధాత్ము కవిత ఛందంబుల గో
వింద పదభక్తి విరహిత
మందుని ధర్మక్రియా క్రమంబున వడఁగున్॥ 19

తా॥ కవిత్వం చెప్పేవారందఱిలోకి పదకవితా ప్రస్థానానికి సంబంధించిన ఛందః పద్ధతి తెలియనివాని కవిత్వం ధర్మాచరణం చేసే వారందఱిలోకి గోవిందుని పాదాలయందు భక్తిలేకుండ వేదమంత్రాలతో చేసే ధర్మక్రియాల్లాగ తక్కువ రకమౌతుంది.

వ్యా॥ వేదమంత్రాలతో విధివిధానమైన నిష్ఠురాచారంతో జపహోమయజ్ఞాదులు చేసి నంత మాత్రాన చాలదు. గోవిందుని పాదాలయందు భక్తికూడా ఉన్నప్పుడే ఆధర్మక్రియలు శ్రేష్ఠంగా ఉండి సార్థకమౌతాయి. అలాగే ఛందోబద్ధంగా గణయతిప్రాస నియమాలు తప్పకుండా కవిత్వం చెప్పినంత మాత్రాన చాలదు. అది భగవత్సంకీర్తనమై దేవ స్తుత్యాత్మకమైన పదరచనగా ఉన్నప్పుడే ఆకవితారచన శ్రేష్ఠంగా ఉండి సార్థకమౌతుందని అభిప్రాయం. పద్యకవులు ఈసడించిన పదకవిత దేవస్తుత్యాత్మకమై కవిత్వానికే సార్థక్యాన్ని శ్రేష్ఠత్వాన్ని కల్పిస్తుందనే కవి అభిప్రాయం గమనించదగ్గది. అలాగే కర్మఠులు ఈస డించే భక్తి ధర్మాచరణానికే సార్థక్యాన్ని శ్రేష్ఠత్వాన్ని కల్పిస్తుందనే అభిప్రాయంకూడ గమనించదగ్గదే.

1. 'పదం' అంటే ఇక్కడ దేవస్తుత్యాత్మకంగా కూర్చిన పాట అని గ్రహించాలి ( పదనిర్యుక్తం).

2. 'ఛందస్' అనే మాటకు వేదం, గణయత్యాదులతో పద్యరచనను పదరచనను చెప్పే శాస్త్రం, స్వాతంత్ర్యం అని అర్థాలు. 'పదమార్గచ్ఛంద' మన్నచోట పదరచనా ప్రస్థానానికి చెందిన రచనాక్రమాన్ని బోధించే లక్షణ శాస్త్రం అని అర్థం. రెండోపాదం చివర 'ఛందంబుల' అన్నచోట వేదాలతో అని అర్థం.

3. 'ధర్మం' అనే మాటకు 'సర్వం ధరతీతి ధర్మః' (అన్నింటిని ధరించేది) అనీ 'ధ్రియతేజనైరితి ధర్మః' (జనులచేత పూనబడేది) అని వ్యుత్పత్తి. వేదచోదిత మైన ధర్మంలో ఆచారం నిష్ఠురంగా ఉంటుంది. వేదం (1) సంహిత (2) బ్రాహ్మణం (3) ఆరణ్యకం (4) ఉపనిషద్ అని 4భాగాలు. వీటిలో బ్రాహ్మణం యజ్ఞయాగాది క్రతువుల స్వరూపాన్ని వాటిని నిర్వహించే క్రమాన్ని చెప్తుంది. సంహితలోని మంత్రాలు ప్రయోగసమయంలో గుర్తుండవలసిన అర్థాన్ని జ్ఞప్తిచేస్తాయి.

ఈవేద చోదితమైన ధర్మాన్ని గూర్చి విపులంగా చర్చించే దర్శనం జైమినికృతమైన 'పూర్వమీమాంస'. ఇది కర్మాచరణాన్ని మాత్రమే చెప్పడం వల్ల ఈశాస్త్రంనిరీశ్వరమని **(atheistic)** కొందరంటారు. 'యజ్ఞోవైవిష్ణుః' అని యజ్ఞాన్ని విష్ణుస్వరూపంగా వేదం చెప్తుండగా యజ్ఞయాగాదిక్రతువులను చెప్పే వైదికదర్శనం నిరీశ్వరం కావటానికి అవకాశం లేదు. ఈశాస్త్రంలో భగవంతుని గూర్చి నేరుగా చెప్పకపోయినా 'అపూర్వం' 'అదృష్టం'

అనే ముఖ్యాంశాలు చెప్పబడ్డాయి. ఇవి భగవంతునికి ఉపలక్షణంగా తీసికోదగ్గభావాలు. వైదిక ధర్మంలో 'శ్రద్ధ' గా చెప్పబడిందే 'భక్తి' అనిపించుకుంటుంది. వైదిక ధర్మాచరణంలో కర్మరతత్వంతో పాటు భక్తికూడా అవసరమే. భక్తిలేని కర్మరత్వం, భగవత్సంకీర్తనం చెయ్యని కవిత్వం హీనమంటున్నాడు మనకవి. విష్ణుసహస్రనామపీఠికా భాగంలో

'కోధర్మస్సర్వ ధర్మాణాం భవతః పరమోమతః' అని ధర్మజుడు అడిగిన ప్రశ్నకు భీష్ముడు సమాధానంగా చెప్పిన

'ఏషమే సర్వధర్మాణాం ధర్మోఽధిక తమో మతః
యద్భక్త్యా పుండరీకాక్షం స్తవైరర్చేన్నరస్సదా'॥

అనేది కర్మరూపమైన అర్చనకు కావలసిన భక్తిని స్తవరూపమైన ధర్మాన్ని రెంటిని చెప్తున్నది. కవికి కర్మిష్ఠికి 'పదభక్తి' అవసరం. కవివిషయంలో అది స్తవరూప పదరచన. కర్మరుని విషయంలో గోవిందపదభక్తి. ఛందస్సు వేదపురుషుని పాదాలని చెప్పటం ప్రసిద్ధమే.

4. 'భక్తి' అన్నపుడు భక్తుడు, భగవంతుడు - ఇద్దఱు ఉంటారు. కనుక ఇది ద్వైత విశిష్టాద్వైతానుయాయులకు ముఖ్యమైన సాధనశాస్త్రం. భక్తిశాస్త్రాలుగా (1) నారద భక్తిసూత్రాలు (2) శాండిల్య భక్తిసూత్రాలు ప్రసిద్ధాలు. రూపగోస్వామి 'ఉజ్జ్వలనీల మణి' కృష్ణభక్తినే బోధిస్తుంది. మధుసూదనసరస్వతి 'భక్తిరసాయనం' భక్తిని 'చిత్త ద్రుతి' స్థాయి భావంగాగల ఒక రసంగా నిరూపిస్తుంది. ఇవన్నీ సంస్కృత గ్రంథాలు.

కం॥ కృతి చెప్పిన యాతఁడలం
కృతియుఁజమత్కృతియుఁ గల్గఁగీర్తించినచోఁ
గృతియగు నటుగాక యహం
కృతిఁగృతి సేయంగ మిగుల గేలింబడఁడే 20

తా॥ ప్రబంధ రచన చేసిన వాడు అలంకారం చమత్కారం ఉండేటట్లుగా స్తుతిస్తే తన ఉద్దేశం చక్కగా నెరవేరిన వాడౌతాడు. అలాకాకుండా అహంకారంతో పదం కూర్చితే అతడు మిక్కిలిగా నవ్వులపాలు కాకుండునా? అయితీరుతాడని అభిప్రాయం.

వ్యా॥ దేవస్తుత్యాత్మకమైన పదరచనలో కూడ అలంకారచమత్కారాలు ఉండాలని, అప్పుడే పదకర్త కార్యసిద్ధి పొందిన వాడౌతాడని, అహంకారంతో కూర్చితే ఆ కృతి నవ్వులపాలు కాకుండా ఉండదని కవి చెప్తున్నారు. ప్రకృష్టమైన బంధం - అంటే మేలైన కూర్పు కలది - ప్రబంధం. కృతము అంటే పనితనం, కలది కృతి. పదరచనలో అలంకారచమత్కారా లుంటేనే కర్తకు సిద్ధి (success). అలంకారం అంటే అందం చెయ్యటం; అలమ్ = చాలు అనేటట్లుగా చెయ్యటం; ఇంతకంటే అందంగా చెయ్యలేము; ఇది చాలా తృప్తిగా ఉంది అనిపించేటట్లు చెయ్యడం. ఈ అందానికి ఫలం తృప్తి. ఈ అలంకరించడం అనేది రచనలో శబ్దాలంకారరూపంగాను అర్థాలంకార రూపంగాను ఉండవచ్చు. పదరచనలో ముఖ్యంగా అనుప్రాస రూపమైన శబ్దాలంకారం తప్పకుండా కనబడుతుంది. 'అంఘ్రౌ ఖండద్వయం సానుప్రాస మేకేనధాతునా' (సంగీ. రత్నా. 4-33) ఇత్యాదిగా ఏలాప్రబంధ లక్షణం. అర్థాలంకారాలూ ఉండవచ్చు. పాట అనేది ధాతువుకు ఆధారభూతంగా వచ్చే 'మాతు' గనుక శబ్దాలంకారానికే ప్రాధాన్యం. చమత్కారం అభిప్రాయాన్ని చెప్పేతీరును బట్టి కలుగవచ్చు. ఇది అర్థక్రియా పద్ధతి కావచ్చు, అర్థాలంకారమూ కావచ్చు. సౌంద ర్యచమత్కారాలు లేకపోతే అలంకారప్రయోజనం సిద్ధించదు. గర్వంతో రచనచేస్తే అది నవ్వులపాలు అయితీరుతుంది. లలితకళల్లో దేనికి సంబంధించిన కృతి రచన అయినా సరే కర్త అహంకార నిరాసం చేసుకోవడం అవసరం. కాళిదాసాది మహాకవులు కూడా కావ్యాదిలో స్వీయాహంకారనిరాసం చెయ్యడం ప్రసిద్ధమే. తన అహంకారాన్ని దుల్చివేసుకుంటేనే కృతికర్త తానుచేపట్టిన వస్తువు భావకోశం (emotional sheath) లోకి ప్రవేశించగలుగు తాడు. లేకపోతే లేదు. ఇంగ్లీషు సాహిత్యంలో కీట్స్ మహాకవి దీన్నే 'నెగెటివ్ కేపబిలిటీ' (Negative capability) అని వ్యవహరించాడు. 'భజసేవాయాం' అనే ధాత్వర్థాన్ని బట్టి భజించుట భక్తి; అంటే సేవించుట అనిఅర్థం. అహంకారం వదలుకుంటేనే భక్తి సాధ్యం అవుతుంది. పదకర్త అహంకారం వదలుకొని రచన చేయ్యాలి అన్నపుడు అది దేవస్తుత్యాత్మకమైన రచన కనుక భక్తితో రచన చెయ్యాలి అని చెప్పినట్లయ్యింది.

1. పద్యప్రారంభంలోని 'కృతి' - 'పదనిర్యుక్తం' 'ప్రబంధం' అనే అర్థంలో వాడ బడింది. ఇది కళారచనకు సంబంధించింది. మూడోపాదం మొదట ఉండే 'కృతి' కార్యసిద్ధిని పొందినవాడు, తలచిన పనినెరవేరినవాడు అని మాత్రమే కాకుండా 'పుణ్యుడు' అనే అర్థంలో కూడా వాడబడింది. అనగా కళారచనలో సిద్ధికలగటం మాత్రం కాక పుణ్యంకూడా సంపాదించుకుంటున్నాడన్నమాట. కృతి అనేది 26 ఛందములలో 20వ ఛందానికిని పేరు. 20 అక్షరాలపాదం ఉండేది కృతిచ్ఛందం.

2. అలమ్+కృ+తి-చాలు అనేటట్లుగా అందగించటం అలంకృతి. కాని అందాన్ని నిర్వచించటం కష్టం. తృప్తి, వాల్లభ్యం అనగా కోరవలసినవారు కోరటం, దీనికి ఫలం. ఈ అలంకారాలు గజ్జెలు, అందెల్లాగా బాహ్యాలు. కాని మితంగా ఉండి చాల ఒప్పిదంగా ఉండాలి. రెండో అంశం ఇవి పనిగట్టుకొని నగలు దిగవేసుకొన్నట్లు ఉండక ప్రయత్నరహితంగానే ఒప్పిదం ఉన్నట్లు కూర్చబడాలి (అపృథగ్యత్న నిర్వర్త్యములు కావాలి).

3. చమత్కారం అనేది ఒకవస్తువును చూడగానే తాత్కాలికంగా మనసు విప్పారినట్లు కావటం. ఇది ముఖవికాసంలో కనబడవచ్చు. దీన్నే మనం ఆశ్చర్యం అంటుంటాము. రచనలోని ఒప్పిదంవల్ల మనస్సు అనుపదమూ విప్పారుతూ పోవటమే చమత్కారం.

4. కీర్తి అంటే దానాదులవల్ల కలిగే పేరు ప్రతిష్ఠలు. యశస్సు అంటే వ్యక్తిత్వ విశేషం వల్ల కలిగే ప్రతిష్ఠ. కీర్తించటం అన్నపుడు భగవంతుని ఔదార్యకారుణ్యాదులను చెప్పడం అని ముఖ్యాభిప్రాయం. గాంభీర్యశౌర్యాదులను వర్ణించటం (గుణకీర్తనం) అనేది గౌణాభిప్రాయం.

5. అహంకృతి - 'నేను' అనే భావంలోగల గర్వం, మదం. 'అహంతా' అనేది నేను అనే ఎఱుకమాత్రం. 'అస్మితా' (I am) అనే తావన్మాత్రమైన ఎఱుకఅన్నమాట. వర్ణసమామ్నాయంలో అకారం మొదలుకొని హకారం వరకుగల వర్ణాలను సమాహారంచేసి మకారంతో మూసివేస్తే 'అహమ్' అవుతుంది. ఈ 50 అక్షరాల- మాతృకల-కూర్పే కాళికాదేవి మెడలోని పుఱ్ఱెలదండ అని శాక్తేయులు చెప్తారు. వర్ణమాతృకల చైతన్య సమాహారమే వ్యష్టిచైతన్యమని అభిప్రాయం. కర్పూరాది స్తోత్రం ఈవివరణకు ముఖ్యమట్టం.

ఈఅహంకారం సాత్త్వికాహంకారమని రాజసాహంకారమని తామసాహంకారమని మూడు రకాలు. ఈపద్యంలో రాజసతామసాహంకారాలే గ్రహించాలి.

తే॥గీ॥ పెటులు నేరక చూఁడిన బెనురవంబు
లొదవ లక్ష్యంబునైనఁ బ్రయోక్తనైన
సాధనమునైనఁ జెఱుచు నీసరవిగాదె
సంప్రదాయంబు నెఱుఁగని జడునికవిత 21

కం॥ వరదానంబున నైనను
గురుముఖమున నైనఁదెలిసికొను కవివలుకుల్
వరమామృతమౌ లేదా
దురహంకృత కవిత నోరఁదోఁడంద్రు బుధుల్ 22

తే॥గీ॥ సంప్రదాయాగత జ్ఞానసహితుఁడైన
మనుజు సత్కవితయు వేదమంత్రసమము
అదియు చాలదె శ్రీవేంకటాచలేశు
చరణములు గను మనువునశ్వరణ మేల 23

తా॥ తెలియక కాల్చినప్పటికి పెట్లుక్రోవి పెద్దచప్పుడుతో దానికి గుఱిగానున్నదానిని గాని, నడపిన వానినిగాని, కడకు క్రోవినేగాని నశింపజేస్తుంది. సంప్రదాయం తెలుసుకోని తెలివిమాలినవాని కవిత్వంకూడ ఇలాగే లక్ష్యాన్నికాని చెప్పినవానినికాని చివరకా కవితనేకాని పాడుచేస్తుంది. (21)

దేవతావరప్రసాదం వల్లగాని గురువునోటిగుండకాని తెలిసికొనే కవిమాటలు అమృతప్రాయాలే ఔతాయి. అలాతెలుసుకోకుండ నేనే చెప్తానని చెప్పినకవిత నోరనే గుంటలో త్రవ్విన మట్టిలాంటిదని తెలిసిన వారంటారు. (22)

సంప్రదాయజ్ఞానం కలవాడు చెప్పినకవిత్వం సత్కవిత్వమై వేదమంత్రాలతో సమానమౌతుంది. శ్రీ వేంకటేశ్వరుని పాదపద్మాలుతెలుసుకోడానికి అలాంటి కవిత్వమే చాలు. వేరే మంత్ర జపం చెయ్యనక్కఱలేదు. (23)

వ్యా॥ ఈ మూడు పద్యాలు సంప్రదాయానికి ఉండే ప్రాముఖ్యాన్ని చెప్తాయి. జడునికి ఎలాగూ గురువు దైవం రెండూ ఉండవు. అలాంటివాడు సంప్రదాయజ్ఞానం లేకుండా చెప్పే కవిత్వం ఎలా కీడు చేస్తుందో తొలి పద్యం చెప్తుంది. జడుడు కాకపోయినా గురువువల్లకాని దేవతా ప్రసాదం వల్లగాని సంప్రదాయం తెలుసుకోకుండా చెప్పేవాని కవిత్వం గుంటలో మన్ను త్రవ్వినట్లు నోటికి మాత్రం చేడ్పాటవుతుందని మలిపద్యం చెప్తుంది. గురుశిష్య పరంపరాగతంగా వచ్చిన జ్ఞానంతో చెప్పిన కవిత్వం వేద మంత్రంతో సమానంగా ఉండి జ్ఞానమోక్షాలకు కారణమౌతుందని మూడో పద్యం చెప్తుంది. సంప్రదాయమనేది గురుశిష్యపరంపరగా వచ్చిన పరిజ్ఞానం. అది శ్రేయస్కరం. శ్రేయస్సు అంటే రాగలశుభం. అది ఐహిక సుఖం కావచ్చు. ఆముష్మికంగా స్వర్గసుఖం కావచ్చు, మోక్షం కూడా కావచ్చు.

'సర్వాగమానా మాచారః ప్రథమం పరికల్పితః
ఆచార ప్రభవోధర్మో, ధర్మస్య ప్రభురచ్యుతః'

అనే విష్ణు సహస్ర నామస్తోత్ర శ్లోకాన్ని సంప్రదాయపరంగా అన్వయించుకోవచ్చు. ధర్మశాస్త్రం కూడా కుటుంబ సంప్రదాయాన్ని కుల సంప్రదాయాన్ని పాటించమనే చెప్తుంది. కవిత్వంలోను సంగీతంలోను అంతే. జడుని నోటి కవితను పెట్లు క్రోవితో పోల్చి చెప్పడంలో వాక్కు అగ్నితత్త్వమని, అక్షరాల మాతృకావిజ్ఞానం, తత్త్వాలు, విషామృతాది లక్షణాలు, కృతికర్త కృతి భర్తలకు జ్యోతిష సంబంధమైన పొంతనం వగైరాలు తెలియకుండా చెప్పే కవిత్వం కీడు చేస్తుందనే అభిప్రాయం ఉన్నట్లుకనబడుతుంది. ఈ సంప్రదాయక విజ్ఞానం తెనుగులక్షణ గ్రంథాల్లోను తెనుగు నాట పుట్టిన సంస్కృత లక్షణ గ్రంథాల్లోను విశేషంగా ఉంది. మంత్రోపాసన చేసి దేవతా ప్రసాదం వల్ల చక్కటి ప్రతిభనుపొంది కవిత్వం చెప్పటం గాని గురు శుశ్రూషచేసి పాండిత్యం సంపాదించి కవిత్వం చెప్పటంకాని చిరకాలంగా వస్తున్న సంప్రదాయాలే. ఈ రెండూ కాకుండా స్వయంకృషితో సాధన చేసిన కవిత్వం నోటికి శ్రమ మాత్రమే అవుతుందని తర్వాత పద్యంలో కవి చెప్తున్నాడు. దేవతా ప్రసాదం వల్లగాని గుర్వనుగ్రహం వల్లగాని సంప్రదాయం తెలుసుకొన్న వాని రచన వేదమంత్ర సమమంటున్నాడు గ్రంథకర్త. మంత్రం సరహస్యం. సంప్రదాయజ్ఞానమనేది ఆ రహస్య జ్ఞానమన్నమాట. అది తెలిసినవ్వాడు రచనకు గొప్ప శక్తి వస్తుందని అభిప్రాయం. వేదాధ్యయనం గురుశిష్య పరంపరాగతమే కాని స్వయంకృషి లభ్యం కాదు. అట్లే ఇక్కడ కూడ. శ్రీ మద్రామాయణ శ్రీ మహాభారతాలకు వేద తుల్యత్వం, మార్కండేయ పురాణాంతర్గతమైన దుర్గాసప్తశతికి మంత్రత్వం, శంకరకృత సౌందర్యలహరికి శ్రీ విద్యామంత్రతంత్ర గౌరవం ఈ సందర్భంలో గమనించదగ్గవి.

1. సంప్రదాయం అన్నపుడు రహస్యంగా చెప్పబడిందని అభిప్రాయం.
2. వేంకటాచలేశు చరణములు- అన్నపుడు 'పాదోऽస్యవిశ్వాభూతాని' అనే పురుష సూక్త శ్రుతిని బట్టి సృష్టిరూపమైన చతుర్దశ భువనాలు, అందలి ప్రాణులు భగవంతుని పాదస్థానీయములని గ్రహించాలి. భగవంతుని చరణాలు తెలుస్తాయి అంటేసృష్టి రహస్యం తెలుస్తుందని అభిప్రాయం.
3. 'మను' అనే సంస్కృత శబ్దానికి మంత్రమని అర్థం. పునశ్చరణం అనేది మంత్ర శాస్త్రంలో మాట. మంత్రజపం చెయ్యటం అని అర్థం. మంత్రసిద్ధికి అక్షరలక్ష అని కాని నియతమైన జపసంఖ్య కాని ఉంటుంది. నియమంగా ఆ జపసంఖ్యను నిర్వహించటం పునశ్చరణ చెయ్యటం అంటారు.

కం.॥ పదమగును సుప్తిఙంతము,
పదమవయవ, మవయువియును బదమనఁబరఁగున్
దుదిసీ తెలుంగులన్ని యుఁ
బదకవితా మార్గ సార్వభౌముఁడు దెలిపెన్ 24

వ॥ అందు నవయవ పదం బెట్టిదంటేని

కం॥ విదిత చతుష్పాదంబగు
నది వృత్తం, బదియధాతు, వవయవ సంజ్ఞం
బదియు యని యన్నయార్యుఁడు
పదిలముగా భరతశాస్త్ర పద్ధతిఁబలికెన్ 25

తా॥ సుబంత మనబడే నామవాచక పదమైనా తిఙంత మనబడే క్రియాపదమైనా పదమౌతుంది. పదం అవయవము కూడా ఔతుంది. అవయవి కూడాపదమనిపించుకుం టుంది. పదకవిత్వ మార్గానికి సార్వభౌముడైన అన్నమాచార్యుడు ఈ చందాలన్నీ చెప్పి ఉన్నాడు. (24)

ఇంక అవయవ పదం ఎలాంటిదో చెప్పబడుతున్నది. స్పష్టంగా నాల్గు పాదాల్లో ఉండేది వృత్తం. అదే ధాతువు. అవయవమనే పేరుతో పిలువబడేది అదే- అని భరతశాస్త్ర పద్ధతిగా అన్నయార్యుడు చెప్పాడు. (25)

వ్యా॥ ఈ చోటి రెండు పద్యాల్లో తొలి పద్యం 'పద'మనేదాన్ని పరిచయం చేసి గీతిపరంగా అవయవ, అవయవి భేదాన్నిప్రవేశపెడుతున్నది. రెండో పద్యం అవయవ పదాన్నిగూర్చి చెప్తున్నది.

'సుప్తి ఙంతం పద'మ్మనేది సంస్కృత వ్యాకరణ ప్రసిద్ధమైన అంశం. 'సుప్పు'లనే నామ విభక్తులచేత నామవాచకాలైన పదాలను సుబంతాలని 'తిఙ'లనబడే క్రియావిభక్తులుచేరిక్రియలైన పదాలను తిఙంతాలని అంటారు. భాషలోని నామవాచకాలుక్రియలు అయిన వాటిని 'పదం' అంటారని అభిప్రాయం. భాషలో కనబడే ఉపసర్గలు, అవ్యయాలు, తద్ధితాలు అనేవాటికి ఈ వ్యవహారం వర్తించదు. భరతుడు వాచికాభినయ సందర్భంగా కవి నటుల శిక్షకోసం వ్యాకరణఛ్ఛందసుల్ని చెప్పినాడు. ధ్రువాగాన సందర్భంగా (32 అధ్యా.) 'యత్కించి దక్షరకృతం తత్సర్వం పదసంజ్ఞితమ్మ'ని పదరచనా పరంగాను చెప్పినాడు. అన్నమయ్య భరత మతాన్ననుసరిస్తూ పద రచనాపరంగా ఈ పద్యాల విషయాలు చెప్పినట్లు గ్రంథకర్త చెప్తున్నాడు. అవయవం అంటే కాలు చేయిలాంటి శరీరభాగం. అవయవాలు కలది అవయవి, అంటే శరీరం అన్నమాట. భరతుడు సప్తగీతక సందర్భంగా సమస్త గీతాలకు (1) వస్తువు (2) అవయవాలు ఉంటాయని చెప్పాడు. అవయవాలకు సంబంధించి 'విదారులు (సంగీత విభాగాలు) చెప్పబడినవి. ఒక విదారి ఉంటే 'ఏకకం,'

రెండుంటే 'వివధం,' మూడు మొదలు అరు వరకు విదారులుంటే 'వృత్తం-' అనబడుతాయి. 'వృత్తం అన్నపుడు అందులో అంశం, అవన్యాసం, న్యాసం అనే మూడూ ఉంటాయి. రాగాన్ని లేదా గీతాన్ని ప్రారంభించే స్వరం అంశస్వరం లేదా జీవస్వరం అంటారు. ఇది ఆ రాగాన్ని అభివ్యక్తికి తెస్తుంది.నడుమనడుమ గీతంలో ముగింపు చూపించే స్వరం అవన్యాస స్వరం. గీతాన్ని పాడి ముగించే స్వరం న్యాసస్వరం. వృత్త విషయంగా ఇవి గుర్తుంచుకోవాలి. పదం అవయవం కూడా అవుతుంది అన్నపుడు స్వల్ప భేదంతో రెండు రకాలుగా చెప్పకోవచ్చు. పదం అనేది గీత భాగం అనేది మొదటిది. ఇలా చెప్పకున్నప్పుడు పదమనేది పైన చెప్పిన 'విదారి' అవుతుంది. అంతేకాని భాషాపదాలైన సుబంత తిజంతపదాలు కావు. ప్రబంధ పురుషునికి (1) స్వర (2) బిరుద (3) పద (4) తేనక (5) పాట (6) తాలాలు అంగాలుగా చెప్పబడినై. వీటిలో పదతేనకాలు కళ్లు, పాట బిరుదాలు చేతులు, స్వరతాలాలు చెవులు. స్వరాలు సరిగమలు. బిరుదం ఓజస్వీగా కూర్చబడిన మహారాష్ట్రాది భాషా బిరుదమే. పదం అర్థాన్ని ప్రకాశింపజేసేది - తేనకం అనేది మంగళస్వరూపమై పరతత్వాన్ని సూచించే 'తేన' అనే సంస్కృత భాషాశబ్దం. తచ్ఛబ్దానికి తృతీయా విభక్తి ఏకవచన రూపం. పాట అనేది మృదంగాది వాద్యాలమీద చేతో పుట్టించే వాద్యస్వరాలు. తాలం మనం విన్నదే. ప్రబంధాంగంగా చూచినప్పుడు పదం అర్థ ప్రకాశకమైన మాట అవుతుంది.

అవయవమే కాదు. అవయవి కూడా చివరకు పదమనబడుతుందని చెప్పినపుడు ధాతు మాతువులు రెండూ చేరి సమగ్రంగా ఉంటూ పాడబడే ప్రబంధం మొత్తం 'పదం' అనిపించుకుంటుందని అభిప్రాయం. ప్రబంధ భాగం పదం అనిపించుకుంటుందని సంగీత రత్నాకరం మీద కల్లినాధుని వ్యాఖ్యలోను ఉంది. రూపకాలప్తి సందర్భంగా వ్యాఖ్య వ్రాస్తూ కల్లినాథుడు ఇలా చెప్తున్నాడు:

"పదవత్ పదాని। యథా వాక్యస్య పదాన్యవయవాః తథా
ప్రబంధస్యావయవా విదారీభాగాః పదాన్యుచ్యంతే। నతు
వాచకాని సుబంతాదీని వా భాషా పదాని।"

సంగీ. రత్నా-అధ్యా. 3-201

పదాన్ని ప్రబంధావయంగా చెప్పిన తర్వాత అవయవపదం వివరింపబడింది. ఈ అవయవపదం చతుష్పాదమైన వృత్తం అన్నపుడు మామూలు పద్యమనేది పాదబద్ధమైన పదనికురుంబం అనేది వాస్తవమే అయినా పాటకు సంబంధించి ఇది నాలుగు పాదాల్లో యతి ప్రాసలతో కూడి వృత్తబంధంగా ఉండే ప్రబంధభాగం అని గ్రహించాలి. ఈ వృత్తబంధంగా ఉండే గీతి ఖండంలో వెనుక చెప్పిన అంశ, అపన్యాస, న్యాస స్వరాలకు అవకాశం వుంటుందనీ గ్రహించాలి. ఇలాంటిప్రబంధ భాగమే 'ధాతువు' అవుతుంది అన్నప్పుడు అభిప్రాయం ఇది: ధాతువనే మాటకు సంగీత శాస్త్రంలో (1) గేయం (2) అవయవం అని రెండు అర్థాలు ఉన్నాయి. వీటినిబట్టి వృత్తబంధంగా ఉండే ప్రబంధ భాగం ప్రబంధావయవం అవుతుంది. అలాగే సకల ప్రబంధానుగతంగా ఉండె గేయాంశం (పాటలో ఉండే సంగీతం) గాను ఉండి ముందు ముందు చెప్పబోయే ఉద్గ్రాహాది ధాతు ఖండాలుగాను పేర్కొబడతాయి. ఇవే నేడు చరణాలు అనబడుతున్నాయి.

తర్వాతి పద్యంలో శరీర ధాతువులైన వాత పిత్త శ్లేష్మాల సాదృశ్యంతో ఈ 'వృత్తా'లకు ధాతుత్వం చెప్పబడుతోంది గనుక గీత ప్రబంధం లేదా 'పదం' అనేది ప్రధానంగా త్రిధాతు నిర్మితి అనే అభిప్రాయం ఉన్నట్లు చెప్పవచ్చు. అన్నమయ్యగారి కృతుల్లో చాల వాటికి మూడేసి చరణాలు ఉండటం కూడా గమనించవచ్చు.

1. వృత్తమ్. 'వేదే గాయత్ర్యాదౌ వర్తత ఇతి వృత్తమ్' అని ఒక నిర్వచనం. దీన్నిబట్టి ఆయా ఛందస్సుల్లోని గురులఘువుల క్రమాన్ననుసరించి ఏర్పడే సౌష్ఠవయుక్తమైన సూక్ష్మశరీరాన్ని ఊహించుకోవాలి. పాటలో అయితే ఛందస్సువల్ల ఏర్పడే నాదశరీరాన్ని ఊహించుకోవాలి.

   'ఏవం నానార్థ సంయుక్తైః పాదై ర్వర్ణ విభూషితైః
   చతుర్భిస్తు భవేద్వ్యక్తం ఛందోవృత్తాభిధానవత్॥'

   (నాట్య శాస్త్రం. అధ్యా. 14-శ్లో 42)

   భరతుని ఈ శ్లోకం గణాల గొడవకు పోకుండా నాల్గు పాదాల కూర్పును 'వృత్త'మని చెప్తున్నది. పద్యమని పొరబడకుండా దీన్ని మనం 'వృత్త బంధం' అనవచ్చు.

2. ధాతువు: ఈ శబ్దానికి రెండు అర్థాలు చెప్పుకోవాలి. 'వాఙ్మాతురుచ్యతే, గేయం ధాతురిత్యభిధీయతే' (సంగీ. రత్నా. అధ్యా.3-శ్లో.2) పాటలో అర్థవంతమైన మాటలు 'మాతువు'; దాని గేయాంశం 'ధాతువు'. ఈ ధాతువనేది సకల ప్రబంధానుగతమైన గేయధర్మం, అంటేపాటలోని సంగీతం. ధాతువుకు మరొక నిర్వచనం 'ప్రబంధావయవో ధాతుః, స చతుర్ధానిరూపితః' (సంగీ. రత్నా. అధ్యా. 4-శ్లో.7) ఇక్కడ ధాతువనేది ప్రబంధం కూర్పులోని ఒక అంగంగా చెప్పబడింది. ఉద్గ్రాహాదులు ఇలాంటి అంగాలు. అప్పుడే ధాతువు పాటలోనిగేయ ధర్మంలో ఒక భాగం మాత్రమే అవుతుంది.

వ॥ ఈ వృత్తంబులకు ధాతు సంజ్ఞలెట్లయ్యె నంటేని

॥ వాతముఁ బిత్తముం గఫము వర్ణిత సర్వశరీర ధారణా
హేతువులయ్యెఁ గావున మహింజెలువొందెను ధాతుసంజ్ఞ; నీ
రీతినె వృత్తముల్ పదశరీర సముద్భవ కారణంబులై
ధాతు సమాఖ్యలందె భరత ప్రముఖాఖిల మౌనిసమ్మతిన్. 26

తా॥ వృత్తాలకు ధాతు సంజ్ఞలు వచ్చిన విధం చెప్తాను. వాత, పిత్త, శ్లేష్మాలనేవి దేహధారణ హేతువులు కావడం వల్ల లోకంలో వాటిని ధాతువులంటున్నారు. ఈ రీతిగానే పద శరీరం పుట్టడానికి వృత్తాలు కారణం కావడం వల్ల భరతాది మౌని ప్రముఖుల ఆమోదంతో ఈ వృత్తాలూ ధాతువులనబడుతున్నాయి.

వ్యా॥ వాతం, పిత్తం, శ్లేష్మం అనేవి ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన అంశాలు. వీటిని ధాతువులని, రోగపరంగా దోషాలనికూడా అంటారు. ఆయుర్వేద వైద్యులు 'నాడి' పరీక్ష చేసేటప్పుడు ఈ వాత పిత్తశ్లేష్మ నాడుల్నే కనిపట్టి చూస్తారు. దేహం ఏర్పడ డానికి ఈ మూడు కారణమనేది ఆయుర్వేద సిద్ధాంతం. ఇలాగే పద శరీరం పుట్టడానికి కారణమౌతూ వృత్తాలూ ధాతువులు అనబడ్డాయి. ధాతువుల స్పష్టమైన ప్రస్తావన మరల 38 పద్యం వద్ద వస్తుంది.

ప్రముఖులైన భరతాది మునులు అనడంలో భరతునితోపాటు కోహల దత్తిలులను కూడాగ్రహించాలని కవి అభిప్రాయంగా కనబడుతుంది. కోహలుడు, దత్తిలుడు, తండు, తాండాయని, తాండ్యుడనే వారు భరతపుత్రులుగా పేర్కొనబడ్డారు. కోహలగ్రంథం లేదు కాని ఇతర నాట్య గ్రంథాంశాలు కొన్ని అభినవగుప్తుడు నాట్యశాస్త్రం మీది వ్యాఖ్యానంలో చిత్రాభినయం మీది 25 అధ్యాయం (బొంబాయి, బరోడ ముద్రణలు)లో చెప్పాడు. కోహల శార్దూల సంవాదంగా ఉన్న 'సంగీత మేరువు'లోని అంశాలు ఇతర సంగీత గ్రంథాల్లో కలిసిపో యినై అని పండితుల తలంపు. కల్లినాథుడు తన సంగీత రత్నాకర - వ్యాఖ్యలో (వర్తనలను వివరిస్తూ) 39కోహల కారికలనిచ్చివాడు. కాని తర్వాతివాడైన కీర్తిధరుని పేర్కొన్నందువల్ల ఈ భాగం ప్రక్షిప్తమన్న సందేహం లేకపోలేదు. కోహలుని రచన నేటి నాట్యశాస్త్రంలో కలిసిపోయిందని, కోహలుడే నాట్య శాస్త్రాన్ని సవరించిన వాడని పండితుల అభిప్రాయం. 'దత్తిలం' అనే సంగ్రహ గ్రంథాన్నిగూర్చి ఇంతవరకే చెప్పబడింది.

ఇంతకూ ఈ పద్యంలో చెప్పబడిన అభిప్రాయం సంగీతరత్నాకరంలోని శ్లోకానికి అను వాదం. ఆ శ్లోకమిది:

వాత పిత్తకఫా దేహధారణాద్ధాతవో యథా
ఏవమేవ ప్రబంధస్య ధాతవో దేహధారణాత్.

(సంగీ. రత్నా. 4అధ్యా- 10/11శ్లో.

సంగీత రత్నాకరంలో ధాతు భేదాల్ని చెప్పే సందర్భంలో ఉద్గ్రాహం, ధ్రువ, ఆభోగం అనే ముఖ్య ధాతువుల్నీ మేలాపకం; అంతరం అనే అముఖ్యధాతువుల్నీ చెప్పిన తర్వాత పై శ్లోకం చెప్పబడింది. అక్కడ ఉద్గ్రాహం, ధ్రువ, ఆభోగం అనే మూడు ముఖ్య ధాతువులు ప్రబంధ శరీరానికివాత పిత్త శ్లేష్మ ధాతువుల్లాంటివని అభిప్రాయం. ఇక్కడ చిన తిరుమలాచార్యుడు వృత్తాలకు ధాతుసంజ్ఞలు చెప్తూ వాతపిత్తాది ప్రశంస చేశాడు. ఇక్కడ వృత్తాలు అంటే అక్షరగణచ్ఛందస్సుల్తో కూడిన పద్యాలని గ్రహించకూడదు. ఆ అక్షర గణాలతో కూడిన వృత్త చ్ఛందస్సుల్లో వర్తించే సూక్ష్మలక్షణాలని గ్రహించాలి. వేదాల్లోని గాయత్ర్యాది ఛందాల్లో వర్తించేది వృత్తం (గాయత్ర్యాదౌ ఛందసి వర్తతే ఇతి వృత్తమ్) అని వెనుక చెప్పిన వ్యుత్పత్తిని గ్రహించాలి. 38 పద్యం వద్ద ఉద్గ్రాహాది స్పష్ట ధాతువులు నిబద్ధపదానికి అవయవాలైన అవాంతర పదాలకు అనుకూలమైన పల్లవిగా నిరూపింపబడ్డాయి.

వ॥ ఇందులకు భాషానియమం బెట్టిదనిన

ఆ॥వె॥ పదము సంస్కృతమునఁ బ్రాకృతమున దేశ
భాషనైన వలదొసఁగఁ బలుక వలయుఁ
బ్రాసములును యతులుఁ బద్యభంగినె చెల్లు
ననిరి భరత దత్తిలాది మునులు 27

తా॥ పద రచనకు భాషా సంబంధమైన నియమం చెప్తాను. పదాన్ని సంస్కృతంలో కాని ప్రాకృతంలో కాని దేశ భాషలో కాని కూర్చవచ్చునని యతులు ప్రాసలు పద్యానికి చెల్లినట్లే ఇక్కడ కూడా చెల్లాలి- అని భరతుడు దత్తిలుడు మొదలైన మునులు చెప్పారు.

వ్యా॥ భరతుడు వాచికాభినయ సందర్భంగా సంస్కృత ప్రాకృత పాఠ్యాలను గూర్చి చెప్పాడు. సంస్కృత పాఠ్యానికిసంబంధించి నాట్యశాస్త్రం 14 అధ్యాయం (బొంబాయి, బరోడా ముద్రణలు)లో వ్యాకరణం ఛందస్సుల్నీ, 15 అధ్యాయంలో వృత్తాల్నీ, 16 అధ్యాయంలో లక్షణాలంకార గుణ దోషాల్నీ చెప్పి 17 అధ్యాయంలో ప్రాకృత పాఠ్యం, భాషా, సంబుద్ధి, నామ,కాకుస్వర విధానాలు విపులంగా చెప్పాడు. ఈ అధ్యాయం కాశీ ముద్రణంలో 'భాషా విధానం' అనే పేరుతో 18 అధ్యాయంగా ఉంది. సంస్కృతానికి అపభ్రంశరూపాలై ఆయా ప్రాంతాల్లో మాటాడబడే మాగధి, అవంతి, ప్రాచ్య, శౌరసేని, 'అర్ధమాగధి, బాహ్లిక, దాక్షిణాత్య అనే ఏడున్ను భాషలనీ శాకారి, ఆభీరి, చాండాలి, శాబరి, ద్రామిడి, ఆంధ్రి, వనౌకసి మొదలైనవి విభాషలని అక్కడ చెప్పబడింది. భాషలనబడిన ప్రాకృతాల్లో తత్సమ, తద్భవ, దేశ్యపదాలు మూడురకాలూ ఉంటాయి. విభాషల్లో తద్భవ దేశ్యాలు మాత్రమే ఉంటాయి. ఇది నాట్యశాస్త్రం నాటి మాట. అనంతర కాలంలో సంగీత రత్నాకరం నాట్యశాస్త్రాన్ని అనుసరించే ప్రబంధాధ్యాయంలో గురులఘు విధానం, మాత్రాగణాలకోసం రెండక్షరాల అత్యుక్తాచ్ఛందంలో వచ్చే 4రతిగణాలు, మూడక్షరాల మధ్యాచ్ఛందస్సులో వచ్చే 8 కామగణాలు, నాల్గక్షరాల ప్రతిష్ఠాచ్ఛందస్సులో వచ్చే 16 బాణగణాలువివరించింది. ఏలా ప్రబంధ భేదాల్లో గద్యైల, మాత్రైల, వర్ణైల అనే వాటిని చెప్పి కర్ణాట, లాట, గౌడ, ఆంధ్ర, ద్రావిడ భాషల్లో దేశైలను వివరించింది. చినతిరుమలాచార్యులు ఈ పద్యంలో సంస్కృత ప్రాకృత భాషలతోపాటు దేశభాషలైన కర్ణాట, ద్రావిడాంధ్ర భాషలు పదరచనకు తగినవే అంటున్నాడు. ఈ పద్యంలో కవి చెప్పిన యతి ప్రాసలు మాత్రం ఆయా భాషల సంప్రదాయాన్ని అనుసరించి అన్వయించుకోవాలి. సంస్కృతంలో పద విచ్ఛేదరూపమైన విశ్రాంతి యతి. ఇది పాదాంతంలో కూడా ఉండి తీరాలి. పాదాది ద్వితీయ వర్ణ రూపమైన ప్రాసము సంస్కృతంలో లేదు. అనుప్రాసం మాత్రం ఉంది. కన్నడంలో యతి సంస్కృతంలో వలె పదవిచ్ఛేద రూపమైన విశ్రాంతి; ప్రాసం మాత్రం తెనుగులోలాగ ద్వితీయాక్షర ప్రాసం ఉంటుంది. తమిళంలో 'మోనై' అనే పేరుతో యతి తెలుగులో లాగ పాదాద్యక్షర సాజాత్యరూపంగా ఉంటుంది, 'యదుగై' అనే పేరుతో ప్రాసం పాదద్వితీయాక్షర రూపంగానే ఉంటుంది. యతిలో అజ్ఝల్లులకు రెంటికీ మైత్రి కూర్చాలి, ప్రాసలో హల్మాత్రము ఆవృత్తి అయితే చాలు. తెనుగులో యతి తమిళంలో లాగే పాదాద్యక్షరమైత్రి. ప్రాస ద్వితీయాక్షరం. పద్యం 4

పాదాల్లోను పాదాదిద్వితీయాక్షర హల్లు అదే రావాలి. అనుప్రాస అన్ని భాషల్లోను ఒకే విధమే. ఇది సాధారణంగా శబ్దాలంకారంగా ఐచ్ఛికంగా ఉంటుంది.

కాని ఈ చోట యతి ప్రాసల్ని పద్యపరంగానే కాకుండ పదపరంగా కూడా గ్రహించాలి. పదాల్లో అక్షర సాజాత్యరూపమైన యతులతోపాటు విరామ రూపయతులుకూడా ఉంటాయి; అంటేపాడటంలోవిరామం వస్తుందన్నమాట. ఉదాహరణకు దేశైలకు సంబంధించిన వస్త్రైలలో పాదపాదానికి నాల్గేసి యతులుండాలని నియమం. అలాగే వాద్య సంగీతంలోను లయ ప్రవృత్తి నియమం యతి అనబడుతున్నది. సమయతి, గోపుచ్ఛయతి, స్రోతోవహాయతి అనే ఈ మూడు యతులు సంగీత విద్యార్థులకు పరిచితాలే. వాద్య ప్రబంధాల్లోను 'యతి' అనేది ఉంది. అలాగే ప్రాస అన్నపుడు పద్యంలో పాదద్వితీయాక్షరం ఒకటే కావాలి అనే నియమంతోపాటు అనుప్రాసను కూడా గుర్తుంచుకోవాలి. పదరచనలో అనుప్రాసకు ప్రాధాన్యం ఉంది. ఏలా పద రచనలో పాదాది తొలిపదం అనుప్రాసతో కూడిన ఖండద్వయంగా ఉండాలని సంగీత రత్నాకర లక్షణం. 'అంఘ్రౌ ఖండద్వయం సానుప్రాస మేకేన ధాతునా' (సంగీ. రత్నా. 4 అధ్యా- 33శ్లో.)

1. పద్యంలో కాకపోయినా వ్యాఖ్యానంలో స్పృశింపబడిన సంగీతశాస్త్ర మాత్రాగణాలు వివరింపబడుతున్నై.

(a) రెండక్షరాలుండే అత్యుక్తా ఛందస్సు. తెలుగులో ఇవి ఉపగణాలు. కన్నడంలో వీటినే 'బ్రహ్మ'గణాలంటారు. తమిళంలో వీటిని, 'ఈరశై' అంటారు.

లఘువునకు గుర్తు : I గురువుకు గుర్తు : U

U U = గల

I U = లగ (వ)

U I = గగ

I I = లల

ప్రస్తారంలో తొలిరెండువరసల్ని విడిచిపెట్టడం, మిగిలిన వాటిలో లఘువు మొదట ఉన్న గణాలకు మరొక లఘువు ముందుంచడం తెనుగులో సంప్రదాయం. కన్నడంలో తొలిరెండు వరసలు విడిచేపద్ధతి లేదు. లఘ్వాదికి ముందు మరొక లఘువు చేర్చుట ఉన్నది. తమిళంలో 'నిరై'కి 2 హ్రస్వాలుగాని, హ్రస్వదీర్ఘాలుగాని రావచ్చుగనుక మూడంశలు వచ్చినా 'ఈరశై' అవుతుంది.

సంగీత శాస్త్రంలో UU - IU - UI - II అనే ఈ నాల్గుగణాలను రతిగణాలంటారు. లఘ్వాది గణాలకు ముందు మరొకలఘువుంచటం సంగీత శాస్త్రంలోను చెప్పబడింది. 'కింతు తత్ర లపూర్వాద్యే తేష్వాదా వధికోలఘుః' (సంగీ. రత్నా 4-64) 'తత్రాపి లఘుపూర్వేష్వాదా వధికోలఘుః కర్తవ్య ఇత్యర్థః' అని కల్లినాథ వ్యాఖ్య.

(b) మూడక్షరాల 'మధ్యా' ఛందస్సు.

U U U = మ
I U U = య
U I U = ర
I I U = స
U U I = త
I U I = జ
U I I = భ
I I I = న

ఈ 8 మూడక్షరాల గణాలు. సంగీత శాస్త్రంలో వీటిని కామగణాలని వ్యవహరిస్తారు. తొలిరెండువరుసలు విడిచి లఘ్వాది గణాలకు ముందు మరొక లఘువు చేర్చితే తెలుగులో ఇంద్రగణాలనబడే గణాలు ఏర్పడతాయి. (ర-నగ-త-సల-భ-నల). కన్నడంలో తొలిరెండు వరుసలు వదలకుండ లఘ్వాదులకు లఘువు ముందు చేర్చితే వచ్చే మ-నగ-ర-నగ-త-సల-భ-నల గణాలను విష్ణుగణాలంటారు. తమిళంలో ఇవి 'మూారశై' క్రిందవస్తాయి.

(c) నాల్గక్షరాల ప్రతిష్ఠా ఛందస్సు

U U U U
I U U U
U I U U
I I U U
U U I U
I U I U
U I I U
I I I U
U U U I
I U U I
U I U I
I I U I
U U I I
I U I I
U I I I
I I I I

ఈ 16 నాల్గక్షరాల గణాలు. వీటిని సంగీతశాస్త్రంలో బాణగణాలంటారు. లఘ్వాది గణాలకు ముందు లఘువు చేర్చటం ఇక్కడకూడా అన్వయిస్తుంది. తెలుగులో తొలి రెండువరసల్ని విడిచి లఘ్వాదులకు ముందు లఘువుంచితే చంద్రగణాలు ఏర్పడతాయి. కన్నడంలో తొలిరెండువరసలు కలుపుకొని లఘ్వాదులకు ముందు లఘువుంచితే ఈ ఏర్పడే గణాలను రుద్రగణాలంటారు. తమిళంలో ఇవి 'నాలశై' క్రిందకు వస్తాయి.

ఇట్లే మూడు ఛృందాల్లోను ఏర్పడే మాత్రాగణాల్లో సంగీతంలో

6 మాత్రల గణానికి 'ఛ' గణమని సంకేతం

5 మాత్రల గణానికి 'ప' గణమని పేరు.

4 మాత్రల గణానికి 'చ' గణమని పేరు.

3 మాత్రల గణానికి 'త' గణమని పేరు.

2 మాత్రల గణానికి 'ద' గణమని పేరు.

పంచ, చతుర్, త్రి, ద్వి - అనేవాని ఆది హల్లులతో ఈ పేర్లు పెట్టబడినై.

శా॥ కర్ణాట ద్రవిళాంధ్ర లాటవిలసద్గౌడాది భాషాస్థితిం
గర్ణాపూర్ణ సుధా సమాన రుచులంగల్గించు దేశైళ దా
స్వర్ణం బాభరణత్వ మొందు కరణిన్ సంగీత శాస్త్రంబులన్
వర్ణింపం దగు నామజాతి యుతమై వర్తించు(ప్రత్యేకమై 28

తా॥ (భాషా నియమాన్నిబట్టి సంస్కృతంలోనో ప్రాకృతంలోనో కాకుండా) కర్ణాట, ద్రావిడ, ఆంధ్ర, లాట, గౌడాది దేశాల్లో మాటాడబడే దేశ భాషల్లో కూర్చిన 'దేశైల' అనే పదం బంగారం వేర్వేరు పేర్లతో నగలై ఆహ్లాదం కల్గించినట్లుగా కన్నడం, తమిళం, తెనుగు, లాటదేశభాష, గౌడ దేశభాషల్లో వేర్వేరు పేర్లతో సంగీత శాస్త్ర గ్రంథాలకెక్కినదై వినేవారి చెవులకు ఆహ్లాదం గొల్పుతుంది.

వ్యా॥ గ్రంథకర్త ఈ పద్యంలో 'దేశైల' అనేది కన్నడం, తమిళం, తెనుగు, లాట దేశభాష, గౌడ దేశభాష మొదలైన దేశ భాషల్లో ఉంటూ సంగీత శాస్త్రానికెక్కిందంటున్నాడు. పద్యంలో కవివాడిన ఆది శబ్దాన్నిబట్టి ఈ ఐదే కాక మరికొన్ని దేశభాషలు కూడా ఉద్దేశింపబడినట్లు అనుకోవాలి. ఈ విషయంలోకొంత అవ్యవస్థ ఉన్నట్లు కనబడుతుంది. సంగీత రత్నాకరం దేశైలనుగూర్చి చెప్తూ దాన్ని పై 5 భాషలకు మాత్రమే పరిమితం చేసి ఇలా చెప్పింది.

'కర్ణాట లాట గౌడాంధ్ర ద్రావిడానాంతు భాషయా
దేశాఖ్యైలా బుధైః పం: ప్రోక్తామంరాది తాలతః'

-(4 అధ్యా- 144 శ్లో)

మన గ్రంథకర్త ఈ శ్లోకాభిప్రాయాన్నే చెప్పినా ఆది శబ్దం ఒకటి చేర్చాడు. ఇతనికి తర్వాత కాలపు పొత్తపి వెంకటరమణకవి (క్రీ.శ. 1700 ప్రా. ) దాదాపు ఇదే శ్లోకం వ్రాసి 'ఏలాస్సప్త విధాజ్ఞేయా' అన్నాడు. నాట్య శాస్త్రంలో భాషలనబడ్డ ప్రాకృతాలు 7 చెప్పబడినై. వాటిలో 'దాక్షిణాత్య' ఒకటి ఉన్నా తమిళాంధ్రాలు అక్కడ విభాషల్లోనే చెప్పబడినై. పదకవులు, లాక్షణికులు ఈ పద్యంలోని ఐదింటికంటే ఎక్కువ దేశభాషల్నే గుర్తిస్తూ వచ్చారని చెప్పాలి. సంగీత రత్నాకరం నాటికంటె అనంతర కాలంలో వచ్చిన మార్పిది.

ముద్ద బంగారం ఇంట్లో ఎంత ఉన్నా ప్రయోజనం లేదు. నగలుగా చేయించి పెట్టుకొంటేనే ఆహ్లాదం. ఈ భావం క్రొత్తదేమీ కాదు. ఈ గ్రంథకర్తకు పూర్వుడైన విన్నకోట పెద్దన (క్రీ.శ. 1402-1407) తన కావ్యాలంకార చూడామణి 9ఉల్లాసంలో వ్యాకరణాన్ని చెప్పబోతూ 'తొడవుగాక పసిడిఁ దొడిగిన నొప్పునే, కనకమింటనెంత కలిగెనేని' (7 పద్యం) అన్నాడు. ఈ కవి కూడా 'స్వర్ణంబా.భరణత్వమొందు కరణిన్' అనడంలో అలాంటి భావమే ఉంది. దేశభాషను బంగారంలాంటి విలువైన వస్తువుగాను, ఆ భాషలోని రచనలనుపదాలను బంగారపు నగలవంటివిగాను భావించడం అనేది ఇక్కడ గమనించదగిన పరమార్థం.

ఈ గ్రంథం 'సంకీర్తన లక్షణ'మే కాని ప్రబంధలక్షణమో పదలక్షణమో కాదు. భగవత్సంకీర్తనకు అంగంగా మాత్రమే పద రచన స్పృశింపబడుతున్నది. అందుచేత సంగీత శాస్త్రపరమైన కొదవలు తప్పవు. ఏలాప్రబంధం లేదా ఏలాపదంఅనే సంగీత రచన పురాతనమైంది. జగదేకమల్లుని సంగీత చూడామణి (క్రీ.శ. 1134-43)లో ఏలాప్రబంధాన్నిగూర్చి శతాధిక శ్లోకాలు, కర్ణాటైలను గురించి మాత్రం దాదాపు 100 శ్లోకాలు ఉన్నట్లు తెలుస్తుంది. హరిపాల మహీపాలుని (క్రీ. 1175) సంగీత సుధాకరంలో సంగ్రహంగాను, పార్శ్వదేవుని 'సంగీత సమయసారం'లో సంగ్రహంగాను ఏలా ప్రబంధం చెప్పబడింది. శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరం (క్రీ. శ. 1230)లో 356 ఏలా ప్రబంధ భేదాలుచెప్పబడినై. మన గ్రంథకర్త ఏలా సామాన్యాన్ని గురించిచెప్పకుండానే తనకు ప్రసక్తమైనంత వరకు దేశైలను గురించి పలుకుతున్నాడు. 'దేశైల' అనేది ఏలా విశేషం గనుక ఏలా సామాన్య స్వరూపం స్థూలంగానైనా తెలియాలి. అందుచేత ఇక్కడ కొంత, గ్రంథకర్త నిబంధనామ పదాన్ని గురించిపలికిన 34 పద్యం దగ్గర కొంత, వివరింపబడుతుంది.

గానం ధాతువులతోటి ప్రబంధాంగాలతోటి నిబద్ధమైతే నిబద్ధగానం అనిపించుకుంటుంది. ప్రబంధాంగాల సంఖ్యనుబట్టి జాతి నిర్ణయం. ఛందస్సు, తాలం, అంగములు, ధాతువులు, రాగము, రసము, భాష మొదలైన వాటి నియమం వల్ల ప్రబంధాలు నిర్యుక్తాలని అనిర్యుక్తాలని రెండు రకాలు. నియమాలున్నవి నిర్యుక్తాలు. లేనివి అనిర్యుక్తాలు. ఉదాహరణానికి రాగాలాపనకు ఈ నియమాలు ఏవీ ఉండవు కాబట్టి అది అనిర్యుక్తం. ప్రబంధాలు మళ్ళా (1)సూడ ప్రబంధాలు (2) ఆలి ప్రబంధాలు (3) విప్రకీర్ణ ప్రబంధాలు అని మూడు విధాలు. సూడ ప్రబంధాలు గీత విశేషాలు. వెనుక చెప్పిన సూళాది సప్త తాలాల్లో ఒక దానితో పాడేవి. ఇవి మార్గసూడలు. వీనిని సూడస్థాలు అని కూడా అంటారు. ఏలాది సూడప్రబంధాల నడుమ ఏర్పడే వానికే ఆలిప్రబంధాలని పేరు. ఈ రెండు రకాలకు భిన్నమైనవి విప్రకీర్ణాలు. సంగీత రత్నాకరంలో సూడ ప్రబంధాలు 8+ ఆలి ప్రబంధాలు 24+విప్రకీర్ణ ప్రబంధాలు 36- మొత్తం 68 చెప్పబడినై. ఇవికాక సాలగసూడ ప్రబంధాలు 7, రూపక ప్రబంధ భేదాలు ఉన్నవి.


ఏలా పదంలో వస్తువు ఉదాత్తం. త్యాగం, లోకానురాగమనే సౌభాగ్యం, శౌర్యం, ధైర్యం, ధార్మికత్వం మొదలైన గుణాలు ఇందులో వర్ణింపబడతాయి. సంగీత రత్నాకరాన్ని అనుసరించి ఏలకు పద సంఖ్యా నియమం, ప్రతిపదానికి పేరు, అధిదేవత, ప్రాణం అనేవి ఉన్నాయి. అలాగే గానక్రమం ఉంది. ఏలకు తొలి రెండు పాదాల్లో ఐదేసి పదాలు, మూడోపాదంలో రెండు పదాలు, నాల్గోపాదంలో మూడు, ఐదోపాదంలో ఒకటి మొత్తం 16పదాలు. మొదటి 3పాదాల్లోని తొలి పదాలు అనుప్రాసతో కూడిన ఖండద్వయంగా ఉండాలి. ఆ వెంటనే గనుక ప్రయోగం చేయాలి. తొలి రెండు పాదాల్లోని చివరి మూడు పదాలు పల్లవం. నాల్గో పాదంలో పదం వర్ణ్యనామాంకితంగా ఉండాలి. ఐదోపాదంలోని

పదం వాగ్గేయకారుని ముద్రతో ఉండాలి. ఏలను మంఠ, ద్వితీయ, కంకాల, ప్రతితాల మనే వాటిలో ఏదో ఒక తాళంతో పాడాలని నియమం. సమగ్రహం కాక అతీత అనాగత గ్రహాల్లో ఒకటి పాటించాలి. ఈ 16పదాలను రెండోసారి కూడా పాడి ధ్రువం అన బడే 4 పాదంలోని తొలిపదం వద్ద (13వ పదం) ముగించవలసిందని కల్లినాథుని బోధ. అభోగ మనబడే ధాతువుతో ఐదోపాదం పాడిన పిమ్మట ధ్రువమనే నాల్గోపాదం పాడి ముగించమని సింగభూపాలుని బోధ. పదాల్ని పెట్టెలుగా, పెట్టెల్లో పదాలపేర్లు, క్రింద ప్రాణం, పైన అధిదేవత, ఎడమప్రక్కన ధాతువు, కుడి ప్రక్కన మిగిలిన వివరాలతో ఏల ప్రాణాన్ని ఈ విధంగా చూపవచ్చు పటం చూడండి

వెనుక చూపినట్లుగా అయితే ఏలా ప్రబంధం 1) ఉద్గ్రాహం 2) ధ్రువం 3) ఆభోగం అనే మూడు ధాతువులతో త్రిధాతుకం ఔతుంది. దీనిని చతుర్ధాతుకంగా చూచే సోమే శ్వరాదులు 11పదాల వరకు ఉద్గ్రాహంతో పాడాలని 12వ పదం 'మేలాపకం' అనే వేరే ధాతువని అన్నారు. పెట్టెల క్రింద చూపబడిన దశ ప్రాణాలకూ లక్షణాలు చెప్పబ డినై. గాన క్రమంలో వీటిని పాటించాలి. తొలి రెండు చరణాల్లో పల్లవమనే చివరి పదత్రయంలో తొలి రెండింటిని విలంబితమానంలోను మూడోదాన్ని ద్రుతమానంలోను పాడాలి. అలాగే నాల్గోపాదంలోని మూడుపదాల్లో తొలి రెండింటిని మధ్యమానంలోను మూడోదాన్ని విలంబిత మానంలోను పాడాలి. ఇది ఏలా సామాన్యలక్షణం. ఈ ఏలాపదం గణైల, మాత్రైల, వర్ణైల, దేశైల అని నాల్గు రకాలు. అందులో గణైల మనకు పరిచి తంగా ఉండే మూడక్షరాలు గణాలతో ఏర్పడేదే. 5 భగణాలమీద ఒక నగణంతో కూర్చేది నాదావతి. 5 రగణాల మీద ఒక సగణంతో కూర్చేది హంసావతి. 5తగణాల మీద ఒక జగణంతో కూర్చేది నందావతి. 5మగణాల మీద ఒక యగణంతో కూర్చేది భద్రావతి. వీటి భగణ రగణాదులను వికృతులుగా చేయటం వల్ల 93 భేదాలు, ప్రకారాంతరవికృతులు 15, మొత్తం ఇది 112 విధాలు ఔతుంది.

మాత్రైల అనేది వెనుక చెప్పిన రతి, కామ, బాణ, మిశ్రగణాలతో క్రమంగా 4రకాలు. రతిగణాలతో 11-11-10 లఘువులుండేది రతి లేఖ, కామగణాలతో 22-22-20 లఘు వులుండేది కామలేఖ. బాణగణాలతో 33-33-30 లఘువులుండేది బాణలేఖ. మిశ్ర గణాలతో 44-44-40 లఘువులుండేది చంద్రలేఖ. (లఘు సంఖ్యలు ఒక్కొక్క పాదానికి చెప్పబడినై. మూడు సంఖ్యలు వరుసగా మూడు పాదాలకు అని గ్రహించాలి.) నందిమ తాన్ననుసరించి 5ఛగణాలు+1 తగణంతో ఇందుమతి; 5 పగణాలు+1చగణం జ్యోతిష్మతి; 1ఛగణం+3చగణాలు +1పగణం +1ఛగణం-నభస్వతి; 1దగణ+1పగణ+4చగణాలు+ 3పగ ణాలు+1ఛగణం+1తగణం-వసుమతి- ఇట్లివి 4రకాలు. అర్జునమతాన్ననుసరించి వెనుక చెప్పిన నాదావత్యాదులే స్వగణ భంగములచేత మాత్రైల లై 4రకాలౌతాయి. ధనంజయ మతాన్ననుసరించి పైరతి లేఖాదుల గణనియమం విడిచి మాత్రా సంఖ్య పాటిస్తే అది 4రకాలౌతుంది. వీటిలో విశేషాలు మరో 4రకాలు. ఇట్లిది మొత్తం 20రకాలు.

# ఏలా ప్రబంధం


విషమగ్రహం :
పద్మాలయ
1. కా మ
దీప్త
గమక
2 మన్మథ
పత్రిణి
సమాన
పల్లవం
రంజని
విలంబిత
సుముఖి
3. కాంత
మధుర
4
5. మత్త
కాంత
(ద్రుతమానం)
వరేణ్య
6 వి కారి
దీప్త
వాయువేగ
7
9
10
కాంత
గౌరి
11. గీ తక
దీప్త
గమక
12
(మధ్యమానం)
మాతంగి
13. విచిత్ర
అగ్రామ్య
చండిక
14 వాసవ
సుకుమార
15
ఉద్గ్రాహం(1)
ధ్రువం(2)
16

గణాల నియమంకాని మాత్రల నియమంకాని కాకుండ వర్ణ సంఖ్యా నియమం మాత్రం ఉండేది వర్ణైల. ఇందులో అంఘ్రిఖండద్వయం 6,7,8 అక్షరాలతో కూడి ఉంటుంది. (6+6, 7+7, 8+8), 29 అక్షరాల వరకు పోవచ్చును. కాగా ఇది 24 రకాలౌతుంది. ఇంక దేశైల. ఏ దేశభాషలో కూర్చబడుతుందో ఆ భాష పేరును బట్టి ఇది (1) కర్ణాటైల (2) లాటైల (3) గౌడైల (4) ఆంధ్రైల (5) ద్రావిడైల అని 5రకాలు.

కర్ణాటైల : దేశైలల్లో ముఖ్యమైంది. సంగీత రత్నాకరం దీన్ని ఒక్కదాన్నే 12 శ్లోకాల్లో చెప్పి మిగిలిన నాల్గింటిని 4 శ్లోకాల్లో చెప్పింది. కర్ణాటైలలో ప్రతిపాదంలోను ఆది మధ్యాంతాల్లో అనుప్రాస ఉంటుంది. మంఠ, ద్వితీయ, కంకాల, ప్రతితాలాల్లో ఏదో ఒక తాళంలో ఉండటం దేశైలకు సామాన్య నియమం. ఇక్కడా అంతే. కర్ణాటైల ఆరు విధాలు. ఇందులో కామగణాల ఉపయోగం ఎక్కువ. కామగణాలనేవి మనకు పరిచితమైన త్ర్యక్షరగణాలే. గణైల దగ్గర చెప్పిన నాదవత్యాదులు త్ర్యక్షరగణాలతో ఏర్పడివే. ఇవీ ఒక రకమైన కర్ణాటైల అనబడినై. ఈ నాదవత్యాదులకు గణాదినియమం అంఘ్రిఖండద్వయమాత్ర పరిమితం. తర్వాత స్వేచ్ఛగా కూర్చవచ్చు. వాని రాగతాళాలు నియతాలు.

(a) 1. నాదావతి: 5భగణాలు+1నగణం. టక్కరాగం. మంఠతాళం.
2. హంసావతి: 5రగణాలు+1నగణం. హిందోలరాగం. ద్వితీయతాళం
3. నందావతి: 5తగణాలు+1జగణం. మాలవకైశికరాగం. ప్రతితాళం
4. భద్రావతి: 5మగణాలు+1యగణం. కకుభరాగం. కంకాల తాళం.
(మాత్రల లెక్కగా చూస్తే ఇవి క్రమంగా పాదానికి 23, 29, 29, 35 వచ్చే రచనలు- అర్జునమతానుసారంగా ఇవే సరిగా మాత్రైలలు ఔతాయి)

(b) సులేఖ: తొలి రెండుపాదాలకు 2 కామగణాలు+1 రతిగణం; పాదాద్యనుప్రాసం. మూడో పాదానికి 4కామగణాలు+1రతి గణం; అది మధ్యానుప్రాసం (ఇదే రతి లేఖ కూడా) మిగిలినది నాదావళికి వలె నియమం ( రాగతాళములు వగైరా).

(c) కామలేఖ: తొలి రెండు పాదాలకు 4 కామగణాల చొప్పున ఉంటాయి. ఆది మధ్యానుప్రాసం. మూడోపాదానికి 8 కామగణాలు. ఆదిమధ్యాంతానుప్రాసం. వెనుకటి హంసావళికి చెప్పిన రాగతాళాలు.

(d) స్వరలేఖ: ప్రతి పాదానికి 4 కామగణాల చొప్పున మూడు పాదాలకు నియమం. ఆది మధ్యల్లో అనుప్రాసం. నందావళికి వలె రాగతాళాలు.

(e) భద్రలేఖ: తొలి రెండు పాదాలకు 6కామగణాలు+1 బాణగణం చొప్పున. మూడో పాదంలో 8 కామగణాలు. మూడు పాదాల్లోను ఆది మధ్యాంతాల్లో అనుప్రాస. రాగతాళాలు భద్రావళికి వలె.

(f) ఛందస్వతి: మూడుపాదాల్లోను పాదానికి 5 కామగణాలు+ 1రతిగణం+1 కామగణం ఉండాలి. అప్పుడు సులేఖాది భేదాలే ఛందస్వంతము అనబడతాయి (ఒక కామగణం ఎక్కువ చెయ్యాలి). రెండు పాదాల చివరనో మూడు పాదాల చివరనో మూడో పాదం పరిమాణంగల పదం కూర్చితే అది 'శిఖాపదం' అనిపించుకుంటుది. (ఈ ప్రసక్తి మరల 40, 41 పద్యాల వద్ద వస్తుంది).

<u>లాటగౌడాంధ్ర ద్రావిడైలలు:</u> లాటైలలో పాదాంతానుప్రాసం ఉంటుంది. రసము లనేకాలు. గౌడైలలో గమకానుప్రాసలుండవు; ఒక్కటే రసం ఉంటుంది. ఆంధ్రైలలో పలు విధాలైన గమక విశేషాలు, రాగాంశాలు, రసాలు, భావాలు ఉంటాయి. ద్రావిడైలలో అనుప్రాస ఉండదు కాని రసాలు భావాలు బహుళాలు. ఈ చెప్పిన ఏలలకు మిగిలిన లక్షణాలు కర్ణాటైలతో సమానమే కాని ఛందస్వంతాల్లో మాత్రం నాల్గో పాదం ఒకటి ఎక్కువగా కూర్చబడుతుంది.

రెండు పాదాల్లో అనుప్రాస లేకుండా మూడో పాదంలో అనుప్రాస ఉండి, ధ్రువాభోగాలు అనుప్రాసలో కూడి, పాద పాదానికి ప్రత్యేకంగా పదచ్ఛేద రూపమైన నాల్గేసి యతులుండి వర్ణైలలో లాగ రాగ-రస-రీతి-వృత్తి దేవతాది నియమం ఉండక తక్కిన విషయాల్లో ఆ లక్షణం ఉండేది 'వస్త్వైల' అవుతుంది.

ఏలా ప్రబంధాలు బహు విధాలుగా ఉంటూ వచ్చినై. సంగీత రత్నాకరం నాటికి వీటిలో ముఖ్యమైన వాటిని సంగ్రహించడం ఏలా సామాన్య లక్షణం ఏర్పరచడం జరిగిందని తలప వచ్చు. సంగీత రత్నాకరానికి పూర్వపుదైన 'సంగీత సుధాకరం'లో ఏల బహువిధమంటూ గద్యైల అయిన నాదావళి మాత్రమే చెప్పబడింది. దీనికి తర్వాతది అనదగిన 'సంగీత సమయసారం'లో నాదావళి అన్న పేరును కూడా చెప్పకుండా గద్యైల చెప్పబడింది. ఈ రెండింటిని అనుసరించి ఏలలో పాదానికి ఆరు గణాలచొప్పన ఉంటాయి. ప్రాస సమన్వితమైన పాదత్రయం ఉద్గ్రాహధాతువు. ప్రతి పాదాంతంలో గమక ప్రయోగం. అటుపై పల్లవి. పల్లవికి గణమాత్రల నియమం లేదు. నాల్గోపాదంతో మేలాపక ధాతువు రావాలి. అటుపై నేతృ నామాంకితమై అనుప్రాసతో కూడిన ధ్రువ ఉంటుంది. అటుపై వాగ్గేయకార ముద్రతో కూడిన చరణం అభోగధాతువుగా ఉంటుంది. అభోగాన్ని పాడిన పిమ్మట ధ్రువను పాడి న్యాసం చెయ్యాలి అనేది గానక్రమం- (సంగీత సుధాకరం గీత ప్రకరణం, సంగీత సమయసారం 4అధి- 130, 131,132, 133, 134 శ్లో). ఈ గ్రంథాలు ఏలను (1) చతుర్ధాతుకంగా దర్శించడం (2) పాదాంతంలో గమక ప్రయోగం చెప్పడం (3) పల్లవానికి గణ, వర్ణనియమంలేదనటం గమనింపదగిన అంశాలు. సంగీత రత్నాకరం నాటికి ఏలా ప్రబంధం త్రిధాతుకమనే భావం బలకొని వెనుకటి ఆరేసి గణాల రెండు పాదాలే (12 గణాలు) ఖండత్రయంలోని 5+5+2 పదాలుగా వ్యవస్థీకరించడం జరిగింది. ఈపద్ధతిని అనుసరించే కాబోలు అరుణ గిరినాథుడు తన తమిళ 'తిరుప్పుగళ్' కావ్యంలో 12గణాల (సీర్ కళ్) తర్వాత 'తొంగల్' **(pendent)** అనబడే తూగు పదమొకటి కల 'విరుత్తాలు' వ్రాశాడు. ఇతర 'విరుత్తాల'లోనూ ఇలాంటి తూగుపదాల్ని కూర్చాడు. బహుశః ఇదే శిఖాపదం అనబడి ఉండొచ్చు. ఇప్పటికి ఈ పరిచయం చాలు.

వ.॥ అట్టి పదం బెన్ని విధంబులం జెలువొందు ననిన

కం.॥ బంధుర వృత్త పదంబు, ని
బంధ పదము, చూర్ణపదము భరతాగమసం
బంధంబునఁ బద విజ్ఞా
నాంధులకును దాళ్లపాక యన్నయ దెలిపెన్॥ 29

తా॥సంగీత శాస్త్ర గ్రంథాల్లో 'దేశైల' అనబడ్డ పదమనేది ఎన్ని విధాలుగా ఉంటుందంటే వృత్తపదం, నిబంధపదం, చూర్ణపదం అనే పేర్లతో నాట్యశాస్త్రాన్ననుసరించి ముప్పేధంగా ఉంటుందని పద విజ్ఞానం ఏమీ తెలియనివాళ్లకోసం తాళ్లపాక అన్నయ చెప్పారు.

వ్యా॥ వెనుక 24పద్యం వద్ద సుబంతం, తిజంతం పదమని చెప్పబడ్డది. అంటే నామ విభక్తి కాని క్రియావిభక్తికాని ఏదైనాసరే విభక్తి అయితే చాలు, అదిచివర ఉండేది 'పదం.' విభక్తిచేరనిది 'శబ్దం,' ఉదారహణకు 'రామ' అనే ప్రాతిపదికకు సంస్కృత నామవిభక్తి చేరనప్పుడు 'రామశబ్దం' అంటారు. నామవిభక్తిచేరాక 'రామః' అని ఉన్నప్పుడు అది పదమన్పించుకుంటుంది. విభక్త్యంతం పదమని అభిప్రాయం.

ఈ పదాలు రెండు రకాలు. నిబద్ధం. చూర్ణం. నిబద్ధమంటే ఛందోబద్ధం. చూర్ణమ నేది గురు లఘు నివేశ నియమం కాని, అక్షరసంఖ్యానియమం కాని లేకుండా వృత్తబద్ధం కాకుండా రసాభివ్యక్తి కోసమైన అక్షరాల కూర్పు ఉండేది.

ఛందోబద్ధమైన అక్షరాల కూర్పు, యతి, అక్షర సంఖ్యా నియమం ఉండేది 'నిబద్ధ పదం'. అనేకార్థాలను స్ఫురింపచేసే అక్షరాల కూర్పుతో అలంకరింపబడ్డ నాల్గు పాదాలతో కూడిన ఛందస్సు 'వృత్తం' అనిపించుకుంటుంది. ఈ ఛందస్సనేది అక్షరసంఖ్యాభేదం చేత 26 విధాలుగా ఛందశ్శాస్త్రంలో చెప్పబడింది. 26 అక్షరాలకు మించి ఉంటే అలాంటి కూర్పులను 'మాలావృత్తాలు' అంటారు. దండక వృత్తం సంస్కృతంలో రెండు నగణాల మీద రగణాలో, యగణాలో, తగణాలో కూర్చుతూ పాదానికి 27 అక్షరాలు మొదలు 999 అక్షరాలు దాకా ఉండేటట్లు కూర్చదగింది.

1. 'బంధుర వృత్త పదంబు' అనేచోట 'బంధురవృత్త'మని భ్రాంతిపడరాదు. (సంస్కృత ఛందంలోను దాన్ని అనుసరించే తెనుగుకన్నడాల్లోను 'బంధురమనే పేరుతో ఒక వృత్తం ఉంది. ఇది 25 ఛందానికి చెందింది. అంటే పాదానికి 25అక్షరాలు ఉంటాయన్నమాట. వరుసగా నాలుగు నగణాలమీద ఒకసగణం ఆపైని మూడు భగ ణాలు అటుపిమ్మట ఒక్కగురువు ఉంటాయి. (4న+1స+3భ+ 1గ)'; 16 అక్షరం మీద యతి ఉంటుంది) దట్టంగా నాల్గు పాదాల్తో వృత్తంగా కూర్చబడిన పదం అని మాత్రమే అర్థం చేసుకోవాలి.
2. పద రచనలో నిబద్ధం అన్నపుడు అక్షర సంఖ్యా నియమం, ఛందస్సు, యతి అనేవాటి తోపాటు తాలం, పాత అనేవి కూడా ఉంటాయి. తాళం వేస్తూ చప్పడయ్యేటట్లుగా ఒక చేత్తో మరో చేతి మీదకాని రెండు చేతుల్తో సమానంగా కాని దెబ్బ కొట్టడం లేదా చిటిక వేయటం 'పాత'. 'పాత' అంటే దెబ్బ పడటం. ఇది సశబ్దక్రియ. నియతాక్షర సంఖ్య లేక, పాదనియమం లేక, యతి నియమం లేక కూర్చబడింది అనిబద్ధం. ఇది తాలనియమం లేకుండా వాద్యాల్లో ప్రయోగింపబడుతుంది!

వ.॥ అందు వృత్తపదం బెట్టిదనిన

కం.॥ అందములై షడ్వింశ
చ్ఛందోగణయుక్త వృత్తజాతుల పదముల్
కుందనమునకుం బరిమళ
మందిన క్రియ వృత్తపదములలరుచు నుండున్ 30

తా॥ వృత్తపదం, నిబంధ పదం, చూర్ణపదం అనే మూడింటిలో వృత్తపదమనేది ఎలాంటిదో చెప్తాను. వృత్తపదాలనేవి ఇరవై యారుఛందాల్లోను అక్షర గణాలతో ఏర్పడే వృత్త పదాలుగాను మాత్రా గణాలతో ఏర్పడే జాతులుగాను బంగారానికితావి అబ్బినట్లుగా అందంగా వికాసం కలిగి ఉంటాయి. (పద్యాలైనవి పాటలు కావటం బంగారానికి తావి అబ్బటం లాంటిది).

వ్యా॥ పాటకు, పద్యానికి ఉండే లక్షణమే ఛందస్సు. 'చది ఆహ్లాదే' అనే ధాత్వర్థాన్ననుసరించి ఆహ్లాద పరిచేది ఛందస్సు అని వ్యుత్పత్తి చెప్పడం ఒక పద్ధతి. 'ఛదిసంవరణే' అనే ధాత్వర్థాన్ననుసరించి చెప్పదల్చుకొన్న విషయాన్ని (అక్షర సంఖ్యా నియమం ఉండే) పద్యపాదాలతో కప్పి ముస్తాబు చేసి నివేదించడం ఛందస్సు అని వ్యుత్పత్తి చెప్పడం రెండో పద్ధతి. ఎలా చెప్పినా ఆహ్లాదమే పరమార్థం. సంగీతపరమైన ఈ గ్రంథంలో కవి 'అందములై' 'అలరుచునుండన్' అనే పదాలతో సౌందర్యాన్ని పుష్ప వికాస సంతోషాలనూ స్మరింపజేస్తూ ఆహ్లాదాన్నే వ్యంజిస్తున్నారు.

సంస్కృతంలో ఋగ్వేద మంత్రాలు వృత్త బద్ధాలు, యజుర్వేదం గద్యాత్మకం. చాలా వరకు ఋగ్వేదమంత్రాలే గాన ప్రధానాలై సామవేదం అయింది. వేదపురుషునికి ఛందస్సుపాదాలని (ఛందః పాదేతు వేదస్య) చెప్పబడింది. అందుచేత ఛందస్సు వేదాంగాల్లో ఒకటి అయింది. సంస్కృతంలో వైదికచ్ఛందస్సు వేరుగా లౌకికచ్ఛందస్సు వేరుగా ఉంది. లౌకికచ్ఛందస్సులో పింగళాచార్యుని ఛందోగ్రంథం ప్రాచీనతమం. బాగా ప్రచారానికి వచ్చిన తర్వాతి గ్రంథం కేదారభట్టు వృత్తరత్నాకరం. తెలుగు కన్నడ భాషలు ఛందో విషయంలో ఈ గ్రంథాన్నే ఎక్కువగా అనుసరించాయని చెప్పవచ్చు.

తెలుగు ఛందస్సులో యతి ప్రాసలు విశేషమైన అంశం. తమిళంలో 'మోనై' 'యదుగై' అనే పేర్లతో క్రమంగా 'యతి' 'ప్రాస' ఉన్నాయి. యతి అక్షర సాజాత్య రూపం. ప్రాసము హల్ మాత్రావృత్తి. తమిళం నుండే వీటిని తెలుగు గ్రహించి ఉండాలి. కన్నడంలో అక్షర సాజాత్య రూపమైన యతి లేదు. సంస్కృతంలోలాగ పదవిచ్ఛేద రూపమైన యతి మాత్రమే ఉంది. హలావృత్తిగల ప్రాస ఉంది.

సంస్కృతచ్ఛందస్సులోను దాన్ని అనుసరించే తెనుగు కన్నడాది భాషల్లోను గురు లఘు స్వరూపం మొదటి అంశం. హ్రస్వాక్షరాలు లఘువులు. దీర్ఘాక్షరాలు, సంయుక్తా క్షరాలకు, బిందువునకు, విసర్గకు ముందున్న అక్షరాలు, పొల్లులతో కూడిన అక్షరాలు గురువులు. ఱెప్పపాటు కాలానికి మాత్ర అని సంజ్ఞ. (నిమేషోన్మేషాభ్యా మన్యతరేణ తులితః కాలః మాత్రా). ఒక మాత్ర కాలంలో ఉచ్చరింపబడే అక్షరం లఘువు. అంతకంటె ఎక్కువకాలంలో ఉచ్చరింపబడేది గురువు. గురువును రెండు మాత్రలకాలమని సామాన్యంగా చెప్పినా హ్రస్వము పొల్లుతో కూడినపుడు (వనితన్)ఒకటిన్నర మాత్రలు; దీర్ఘాక్షరమైనప్పుడు రెండు మాత్రలు, ప్లుతోచ్చారణంలో మూడు మాత్రలు అవుతుంది. తమిళంలో పద్ధతి వేరు. అక్కడ అంశం 'అశై', గణం 'శీర్' అనబడుతాయి. నేరశై,ని రైయశై అనే పేర్లతో అక్కడ 'శీర్ల' కూర్పు. ఒక హ్రస్వం కాని దీర్ఘం కాని తానుగాని ఒక వ్యంజనం (పొల్లు అక్షరం)తో చేరిగాని 'నేరశై' అవుతుంది. ఒక్క హ్రస్వం గణంలో అద్యంశంగా మాత్రం రాదు. 'నిరైయశై' అనేది రెండు హ్రస్వాలు కాని, లేదా ఒక హ్రస్వం ఒక దీర్ఘం కాని, తామొగాని పొల్లుతో కూడిగాని వస్తుంది. ఈ నేర్, నిరైలు రెండు మూడు నాలుగు అవుతూ 'శీర్లన బడే గణాలవుతాయి.

సంస్కృతంలో లాగే తెనుగు కన్నడాల్లోనూ గురు లఘువులతో కూడి త్రికాలనబడే మూడక్షరాల అక్షరగణాలు, మాత్రల లెక్కతో ఏర్పడే మాత్రాగణాలు ఉన్నాయి. అక్షర గణాలతో ఏర్పడే నాల్గు పాదాల ఛందస్సు కలవానికి 'వృత్తాలు' అని పేరు. మాత్రాగ ణాలతో ఏర్పడే వానికి 'జాతులు 'అని పేరు. (సంస్కృత ఛందస్సులోనూ, వర్ణచ్ఛందం, మాత్రాచ్ఛందం ఉన్నాయి. 'మాత్రావర్ణ విభేదేన ఛందస్తదిహ కథ్యతే' అని వృత్తరత్నా కరం) సంస్కృతంలో మాత్రా ఛ్ఛందస్సుతో ఏర్పడే ఆర్యాభేదాలు, గీతి భేదాలు 'జాతులు' అనబడుతాయి.

మూడు అక్షరాల చేరిన దాన్ని త్రికమంటారు. ఇలాంటి త్రికగణాలు మూడో ఛందాన్ని ప్రస్తరించటం వల్ల ఏర్పడతాయి. ప్రస్తారం చెయ్యటానికి తొలుత అన్నీ గురువులువ్రాసి, తరువాతి వరుసల్లో తొలి గురువు క్రింద లఘువు వ్రాసి, పూర్వస్థానాన గురువుంచి మిగత భాగాన్ని అలాగే ఉంచుతూ పోవాలి. అన్నీ లఘువులు వచ్చే వరకు ఇలాగే వ్రాయాలి. మూడక్షరాల 'మధ్య'మనే ఛందస్సుకు ప్రస్తారం, గణాలు చూపబడుతున్నాయి.

| | |
|---|---|
| U U U= మగణం | U U I = తగణం |
| I U U = యగణం | I U I = జగణం |
| U I U= రగణం | U I I = భగణం |
| I I U= సగణం | I I I = నగణం |

వీటికే అక్షరగణాలని, విసర్గగణాలని పేరు.

ఇక ప్రథమచ్ఛందస్సులో పాదానికి ఒక అక్షరం. ఆ అక్షరం లఘువు కావచ్చు, గురువు కావచ్చు. కనుక 'ఉక్తము' అనబడే ప్రథమచ్ఛందంలో వృత్త సంఖ్య 2. 'అత్యుక్త'మనబడే రెండక్షరాల ద్వితీయచ్ఛందంలో గురుగురు, లఘుగురు, గురులఘు లఘు లఘు- అనే ప్రస్తార క్రమంతో నాల్గు వృత్తాలేర్పడతాయి. మూడక్షరాల 'మధ్యమ' ఛందంలో పైని 8భేదాలు వచ్చినవి కనుక వృత్త సంఖ్య ఎన్మిది. ఇలాగి క్రమంగా ఆయా ఛందాల్లో వృత్త సంఖ్య రెట్టింపుగా పెరుగుతూ పోతుంది. ఇరవై ఆరు ఛందాల్లో ఏర్పడే వృత్తాల మొత్తం సంఖ్య 13, 42, 17, 726.

ఇన్ని వృత్తాలు ఉన్నా ఛందః కర్తలు చెప్పినవి 500మించవు. వీనిలో గ్రంథాల్లో వాడబడేవి సుమారు 30. సంస్కృతచ్ఛందాల పేర్లివి:

1. ఉక్తము, 2. అత్యుక్తము 3. మధ్యము 4. ప్రతిష్ఠ 5. సుప్రతిష్ఠ 6. గాయత్రి 7. ఉష్ణిక్కు 8. అనుష్టుప్, 9. బృహతి 10. పంక్తి 11. త్రిష్టుప్ 12. జగతి 13. అతిజగతి 14. శక్వరి 15. అతిశక్వరి 16. అష్టి 17. అత్యష్టి 18. ధృతి 19. అతిధృతి 20. కృతి 21. ప్రకృతి 22. ఆకృతి 23. వికృతి 24. సంకృతి 25. అభికృతి 26. ఉత్కృతి.

నాట్య శ స్త్రంలోని వృత్తాధ్యాయం (15 అధ్యా.)లో 53 వృత్తాలు చూపబడినవి.

సంస్కృతంలో మాత్రాగణబద్ధాలైన కూర్పులు జాతులు. ఇవి కూడా పద్యాలే. నాల్గు పాదాలుంటాయి. సంస్కృతంలో ఆర్యాభేదాలు, గీతిభేదాలు ఈ కోవకు వస్తాయి. ఆర్య 4 మాత్రల గణాలతో కూర్పబడేది. భ-జ-స-నల-గగ అనే గణాలు నాల్గేసి మాత్రలు గలవి. తొలి సగంలో ఏడుగణాల మీద ఒక్క గురువుంటుంది. బేసి స్థానంలో జగణం ఉండరాదు. ఆఖోగణం జగణమో నలమో ఉండాలి: ఇక్కడ తొలి లఘువు తర్వాత యతి. ఉత్తరార్థంలో ఆఖోగణం ఒక్క లఘువు మాత్రం ఉంటుంది. మిగిలిన లక్షణం పూర్వార్థంలాగే. ఈ లక్షణం కలది 'పథ్యార్య'. పథ్యార్యలోని ఒకటవపాదం రెండో పాదంలోకి, మూడో పాదం నాల్గోపాదంలోకి చొచ్చినట్లయితే అప్పడది 'విపులార్య' అవుతుంది. పథ్యార్యలో 2, 4 పాదాల తొలిగణం జగణమైతే అప్పడది 'చపలార్య' అనిపించుకుంటుంది. తొలి సగంలో 'చపలార్యా'లక్షణం, మలి సగంలో 'పథ్యార్యా' లక్షణం ఉంటే 'ముఖచపలార్య' అవుతుంది. తొలి సగంలో 'పథ్యార్యా' లక్షణం మలి సగంలో 'చపలార్యా'లక్షణం ఉంటే 'జఘన చపలార్య' అవుతుంది. ఇట్లు ఆర్య 5 రకాలు. ఆర్యలోని మాత్రా సంఖ్యను ఇలా చూపవచ్చు.

4+4+4
4+4+1 - 3+4+2
4+4+4
4+4+1 - +4+2

అడ్డగీత ఉన్నచోట పదచ్ఛేద రూపమైన యతి ఉండాలి.

| తెనుగు పేరు | కన్నడం పేరు | గణాలు | గణ సంఖ్య | తెనుగులో యతిస్థానం |
|---|---|---|---|---|
| 1. మహాక్కర | పిరియక్కరె | 1సూ+5ఇం.+1చం. | 7 | 4గణాలమీద |
| 2. మధ్యాక్కర | దొరయక్కరె | 2ఇం+1సూ+2ఇం.+1సూ. | 6 | 3గణాల మీద |
| 3. మధురాక్కర | నడువణక్కరె | 1సూ+3ఇం.+1చం. | 5 | 3గణాలమీద |
| 4. అంతరాక్కర | ఎడెయక్కరె | 1సూ+2ఇం.+1చం. | 4 | 3గణంచివరివర్ణం |
| 5. అల్పాక్కర | కిరియక్కరె | 2ఇం+1చం | 3 | 2గణాలమీద |

కన్నడంలో యతి ఉండదు. ప్రాసమాత్రం ఉంటుంది.

<u>ఉత్సాహం:</u> ప్రతిపాదంలోను సూర్యగణాలనబడే హగణ (UI) నగణం (III)లు ఏడింటి మీద 1గురువుండును. ఐదోగణం మొదటి అక్షరం యతి స్థానం. పాదపాదంలోను హగ ణనగణాల మిశ్రమం మాత్రం ఉండాలి. వీనికి క్రమ నియమం మాత్రం లేదు. (నాల్గు పాదాలు హగణంతో కూర్చితే సుగంధి వృత్తం ఔతుంది; అన్నీ నగణాలైతే విచికిలిత (తరళం) ఔతుంది.)

<u>ద్విపద:</u> మూడింద్రగణాల మీద ఒక్క సూర్యగణంతో తృతీయ గణాద్యక్షరం యతిగా రెండు పాదాలు ప్రాసనియమంతో కూర్చితే ద్విపద అవుతుంది. ద్విపద పాదాలు- ఒకదానిలోనికొకటి ప్రాకరాదు. విడిగా ఉండాలి. ప్రాసయతి-అనగా పాదద్వితీయాక్షరం గురుపూర్వమో లఘు పూర్వమో మరల అట్లే యతిస్థానం ప్రక్కన వచ్చుట- కూడదు. ఈ లక్షణానికికట్టుబడనివాడు పాల్కురికి సోమనాథుడు. తెనుగులో ద్విపదకు ప్రాచుర్యం ఎక్కువే. ద్విపదలో ప్రాస లేకుంటే మంజరీ ద్విపద ఔతుంది. దీనికి కొందరు ప్రాస యతిని అంగీకరిస్తారు.

<u>త్రిపద:</u> దీనికి తెనుగులో వాడుక లేదు. కన్నడభాషలో ప్రాచుర్యమెక్కువ.

<u>చతుష్పద:</u> దీనికే చౌపద, చౌపది అని కూడా పేరు. నాల్గు పాదాలుంటాయి. నాల్గు మాత్రల భ-స-నల-గగ అనే గణాలతో 16 మాత్రలతో కూర్చాలని భీమన అనే ఛందఃకర్త, మూడు చతుర్మాత్రాక గణాల మీద ఒక సూర్యగణమని అనంతుడు, చిత్రకవి పెద్దన అనే ఛందఃకర్తలు చెప్పారు. దీనికి అంతానుప్రాస ఉండాలి. 8మాత్రల మీద యతి. 2సూర్యగణాల మీద 9మాత్రలు కూర్చి (6+9=15) 8 మాత్రల మీద యతి వేస్తే విలాళ చతుష్పద అని అప్పకవి. 2 సూర్యగణాల మీద 4మాత్రల గణాలు రెండు ఆ మీద 1లఘువు కూర్చితే విలాళ చతుష్పద అని అనంతుడు, చిత్రకవి పెద్దన. ఇట్లైనా పాదానికి 15 మాత్రలే. అప్పకవి మతం గుర్వంతం; అనంతుడు చిత్ర కవి పెద్దన లఘ్వంత మతం కలవారు. వీరు అంతానుప్రాస పాటించారు. అప్పకవి పాటించలేదు.

పాదానికి 5మాత్రల గణాలు మూడింటి మీద ఒక్క సూర్యగణం కూర్చి (5+5+5+3= 18) 8 మాత్రలమీద యతి, ఆద్యంత ప్రాసలు కూర్చితే 'కర్ణాట చతుష్పద' అవుతుంది. తెనుగులో నగ- సల-త-ర అనేవి 5 మాత్రల గణాలు. మూడింద్రగణాలమీద 1 సూర్యగణం వస్తే అది ద్విపద అని వెనుక చెప్పబడింది. అప్పుడిది ద్విపద అవుతుంది కాని, యతిస్థానంలో మాత్రం కొంచెం మార్పు వస్తుంది. వెల్లటూరి లింగన మంత్రి తన 'సరసాంధ్రవృత్తరత్నాకరం (అముద్రితం)లో దీన్నే న్మర లఘువులు 5 ఉండే మూడు గణాల మీద ఒక సూర్యగణం (5x3 =15+3=18) అంటూ పదలక్షణంగా చెప్పాడు. మూడోగణం తొలి అక్షరం యతి, ఆద్యంత ప్రాసలుండాలి.

<u>షట్పది:</u> తెనుగులో దీనికి ప్రాచుర్యం లేదు. కన్నడంలో ప్రాచుర్యమెక్కువ.

<u>తరువోజ:</u> దీనికి నాల్గు పాదాలుంటాయి. ద్విపదచ్ఛందమైన 3ఇం+1సూ. అనేదాన్ని రెండుసార్లు కూర్చితే తరువోజ ఒక పాదం ఔతుంది. 3-5-7 గణాల తొలి అక్షరంతో మూడు చోట్ల యతి ఉండాలి. ప్రాస ఉండాలి.

<u>గీతులు:</u> తెనుగు ఉపజాతుల్లో ఆటవెలది తేటగీతులున్నవి. గీతమనేది వీనికి సామాన్యమైన పేరు. దేశిగీతాల్లో ఈ రెండూ సమగీతులు. వీటికి నాలుగు పాదాలుంటాయి. ప్రాసలేదు. ప్రాసయతి చెల్లుతుంది. ప్రతిపాదంలోను 1సూ +2 ఇం+2సూ ఉండి నాల్గో గణం ఆద్యక్షరం యతి కూర్చితే అది తేటగీతి అవుతుంది. బేసిపాదాల్లో 3 సూ + 2ఇం ప్రకారమున్ను, సరిపాదాల్లో 5సూ. గణాలున్ను ఉంటూ నాల్గోగణం ఆద్యక్షరంలో యతికూర్చితే అది ఆటవెలది అనిపించుకుంటుంది. సీసపద్యం వ్రాస్తే ఈ రెండింటిలో ఒకదాన్ని చేర్చి చెప్పాలి; అప్పుడీ గీతి సీసభాగంగానే పరిగణింపబడుతుంది. ఆటవెలది తేటగీతుల్ని విడిగా స్వతంత్రంగా వ్రాయవచ్చుననేది తెలిసిన సంగతే.

ఎత్తుగీతి, మేలనగీతి(కమలనగీతి), పవడగీతి అనేవి విషమగీతులు. ప్రతిపాదానికి 1ఇం+ 2సూ. గణాలు ఉంటూ, మూడోగణం ఆద్యక్షరం యతిస్థానంగా ఉంటూ, నాల్గుపాదాలుండేది ఎత్తుగీతి. ప్రతిపాదంలోను ఏడూ సూర్యగణాలుంటూ ఐదోగణం మొదటి అక్షరం యతిస్థానంగా ఉంటూ నాల్గుపాదాలు నడిచేది మేలనగీతి. దీనిని అప్పకవి కమలనగీతి అని వ్యవహరించాడు. ఆటవెలదియే నాల్గుపాదాల్లోప్రాసతో పవడగీతి అనిపించుకుంటుంది.

౨౹॥వె॥ వృత్తజాతి యెల్ల విషమంబు సమమును
నర్ధసమమునాఁగనతిశయిల్లు
నందులోన విషమ మనునది నాలుగు
పాదములును వేఱె భంగిఁజెల్లు 31

కం॥ నాలుగు పాదంబులు నొక
చాలున వర్తించునదియు సమవృత్తం బా
లీలన్ సమపదమును దా
ళాలంకృత సామ్యపాదమై చెన్నొందున్ 32

తే॥గీ॥ విషమ పాదంబులొక రీతి వెలయుచుండ
సమ చరణములు వేఱొక్క చందమైన
నర్ధసమ వృత్తమనఁజెల్లు; నట్టి పదము
అర్ధసమపద మని యన్నయార్యుఁడనియె. 33

తా॥ వృత్తజాతి అంతాకూడా (1) సమవృత్తాలు (2) విషమవృత్తాలు (3) అర్ధ సమ వృత్తాలు అని మూడు తెగలుగా ఉంటాయి. అందులో విషమ వృత్తం అనేది నాలుగు పాదాల్లో ఒక్కొక్క పాదమూ ఒక్కొక్క విధంగా ఉంటుంది. (31)

నాలుగు పాదాలూ ఒకే విధంగా నడిచేది సమవృత్తం. సమపదమనేది కూడా తాళంతో కూడి నాల్గుపాదాలూ ఒకే విధంగా నడుస్తుంది. (32)

బేసి సంఖ్యతో చెప్పదగిన ఒకటోపాదం మూడోపాదం అనేవి ఒక విధంగా ఉంటుండగా సరిసంఖ్యతో చెప్పదగిన రెండోపాదం నాల్గో పాదం అనేవి వేఱొక విధంగా ఉన్నట్లైతే అప్పడది అర్ధసమవృత్తమనిపించుకుంటుంది. అలాగ ఉన్నపదం కూడా అర్ధసమపదమని అన్నయార్యుడు చెప్పాడు. (33)

వ్యా॥ పద్యం పదం కావటమనేది బంగారానికి తావి అబ్బినట్లుగా ఉంటుందని వెనుకటి పద్యంలో చెప్పిన గ్రంథకర్త ఈ మూడు పద్యాల్లో పద్యాల స్వరూప భేదాన్నాశ్రయించిన తెగలను, చెప్పి ఆ లక్షణాలనే పదాలకూ అన్వయించి చెప్తున్నాడు.

సమానంగా ఉండేది సమం, సమంకానిది విషమం (వి+సమ - విషమ) అర్ధం, అంటే సగపాలు, సమానంగా ఉంటేది అర్ధసమం.

నాల్గుపాదాల కూర్పు ఉండటమే వృత్తానికి ముఖ్యలక్షణం. కనుక ఈ సమత్వం, విషమత్వం, అర్ధసమత్వం అనేవి నాల్గుపాదాల పరంగా అన్వయించుకోవాలి. అందుచేతనే నాలుగు పాదాలూ నాలుగు రకాలుగా (ఒక్కో పాదం ఒక్కో రకంగా) ఉండటం విషమ వృత్తలక్షణంగా చెప్పబడింది.

ఇక్కడ వృత్తాలకు చెప్పిన ఈ మాటలు నాలుగు పాదాలుగా కూర్చబడే జాతులకూ ఉపజాతులకు కూడా అనువర్తిస్తాయి. 'వృత్త జాతియొల్ల' అనే పదబంధం ఏక వచనాంతమై వృత్తసమూహాన్ని మాత్రమే చెప్తున్నా అందులో ఉన్న 'జాతి' పదం పద్యాల్లోని జాతులకూ ఉపజాతులకు జ్ఞాపకంగా వాడబడింది.

నాల్గు పాదాలూ సమంగా లేని వృత్తాలకు 'గౌణ వృత్తా' లనిపేరు. అప్పుడు అర్ధసమవృత్తాలు, విషమవృత్తాలూ గౌణ వృత్తాల కోవకే వస్తాయి. ఛందస్సంఖ్య పాదంలో ఉండే అక్షరాల సంఖ్యకు గుర్తు. ఇరవైయో ఛందం అన్నప్పుడు పాదానికి ఇరవై చొప్పున అక్షరాలుంటాయని అర్థం. అక్షరాలైతే ఇరవై ఉండవచ్చునుగాని గురులఘువుల క్రమం, గణాలు ఒక్కోపాదంలో మారవచ్చు. అలాగు గనుక తొలిపాదంలో ఉండే అక్షర సంఖ్యకు కట్టుబడి ఉంటూ మిగత పాదాల్లో గురులఘు క్రమమో గణాలో మారితే అప్పుడా విషమత్వం తొలిపాదానికి చెందిన ఛందఃస్థానానికే సంబంధించి ఉంటుంది. అప్పుడది 'స్వస్థాన విషమ వృత్తం' అనిపించుకుంటుంది. గురులఘువుల లేదా గణాల క్రమంతో పాటు అక్షరసంఖ్యకూడా మారితే 'పరస్థాన విషమ వృత్తం' అనిపించుకుంటుంది. నాల్గుపాదాల్లోను అక్షర సంఖ్య, గురులఘు క్రమం లేదా గణక్రమం ఏపాదానికాపాదంలో మారిపోతే అప్పుడది 'సర్వపరస్థాన విషమవృత్తం'. ఇదేవిధంగా అక్షర సంఖ్యమారకుండా ఒకసగం - అంటే రెండు పాదాల్లో ఉండే గురులఘుక్రమంగాని గణక్రమం గాని రెండోసగంలో మారితే అప్పుడది 'స్వస్థాన అర్ధ సమవృత్తం'. ఒకసగానికీ రెండోసగానికి అక్షర సంఖ్య కూడా మారితే అప్పుడది 'పరస్థాన అర్ధసమ వృత్తం' అనిపించుకుంటుంది.

ఉదాహరణకు 11వ ఛందానికి చెందిన (1) ఇంద్రవజ్ర (2) ఉపేంద్రవజ్ర (3) కాంతి (4) వాతోర్మి అనే నాల్గు భిన్న వృత్తపాదాలతో 'వారాంగి' అనే స్వస్థాన విషమ వృత్తం ఏర్పడుతున్నది : దాని వివరాలివి.

<u>వారాంగి :-</u>

1 పాదం : ఇంద్ర వజ్ర - త-త-జ-గా గణాలు : 11 అక్షరాలు

2 పాదం : ఉపేంద్ర వజ్ర - జ-త-జ-గా గణాలు : 11 అక్షరాలు

3 పాదం : కాంతి - త-జ-జ-గా గణాలు : 11 అక్షరాలు

4 పాదం : వాతోర్మి - మ-భ-త-వ గణాలు : 11 అక్షరాలు

ఇలాగే 'అరిగ జాత్రం', 'నదీప్రఘోషం' అనేవి స్వస్థాన విషమవృత్తాలు.

10వ ఛందములోని భ-మ-స-గ (10 అక్షరాలు) అనే రుగ్మవతి తొలిపాదంగాను 11వ ఛందంలోని భ-భ-భ-గ-గ (11 అక్షరాలు) అనే దోధక పాదాలు 2,3,4 పాదాలు గాను చేరి 'శ్రీ రమణము' అనే పరస్థాన విషమవృత్తం ఏర్పడుతుంది.

వీణారచనము, ఉద్ధత, మధుర, మణిదీపిక అనేవి సర్వపరస్థాన విషమ వృత్తాలుగా తెనుగులో చెప్పబడినవి.

ఇంక ఒక్క ఛందంలో పుట్టిన ఒక్కవృత్తమే సమమైన గురులఘుక్రమ విన్యాసంతో నాల్గుపాదాల్లోను సమానంగా ఉండేది సమవృత్తం. దీనికి ఉదాహరణలు అనవసరం. మనం చదివే వృత్తాలు తరచుగా సమవృత్తాలే. గ్రంథకర్త ఈ సమవృత్త లక్షణాన్నే పదానికీ అన్వయించి 'సమపదం' అంటున్నాడు. అయితే ఇక్కడ గమనించవలసిన అంశాలు ఒకటిరెండు ఉన్నాయి. వృత్తం అన్నప్పుడు పద్యమోశ్లోకమో అనే భావం మరచిపోయి నాల్గుపాదాల కూర్పు అని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే పదాలు వృత్తబంధాలుగా ఉంటాయి, నాల్గుపాదాల కూర్పు ఉంటుంది. తర్వాతి అంశం ఈ పదాల పాదాలు తాళాలంకృతాలుగా ఉంటాయని గ్రంథకర్త చెప్తున్నాడు. తాళాన్ని గురించి కవి 36,37 పద్యాల వద్ద ప్రసంగించబోతున్నా ఇక్కడ గమనించవలసిన అంశాలు ఒకటి రెండు చెప్పాలి.

పదానికి లేదా పాటకు ఉండే రాగతాళాల్లో రాగం కంటే తాళం ముఖ్యమైంది. ఒకరాగానికి కూర్చిన పదాన్ని లేదా పాటను వేఱొక రాగంతో పాడటం సులభమే కాని ఒకతాళానికి కూర్చిన పాటను మరొకతాళానికి మార్చటం సులభమైన పనికాదు. తాళంకోసం అక్షరాల కూర్పు అమర్చబడి ఉంటుంది కనుక ఆకూర్పు మరొకతాళానికి ఒదిగిరాదు. సమపదం అన్నపుడు పదంలోని నాల్గుపాదాలూ సమంగా ఉండడమే కాదు తాళగతి కూడా సమంగానే అమరిరావాలి. అంటే లయసరిగాకుదరాలి. వేగంగా పాడితే ద్రుతమానం. మధ్యరకంగా పాడితే మధ్యమానం. నిదానంగా పాడితే విలంబిత మానం. విలంబితానికి రెట్టింపు వేగం మధ్యమానంలోను, దానికి రెట్టింపు వేగం ద్రుత మానంలోను ఉంటాయి. ఈగాన గమనకాల ప్రమాణం 'లయ'. ఈ లయప్రవర్తనను బట్టి 'యతి' అనేది ఏర్పడుతుంది. వాటిలో 'సమయతి' అనేది ఒకటి. తాళంలో సమమైన కాలప్రమాణంకల ఒకేరకపు అంగాలు ఉంటే అది 'సమయతి' ఔతుంది. మామూలుగా నాలుగు అక్షరాల కాలం ఒకలఘువు అంటారు. నాల్గేసి అక్షరాలకు తాళం పడుతూపోతే అది ఏకతాళం అవుతుంది. తాళాలకు అక్షరసంఖ్య ఉంటుంది కనుక రచనలో జాగ్రత్త అవసరం. సమానకాలాలు ఉండే స్వరసమూహావులయ 'సమయతి' అని తెలుసుకుంటేచాలు. సమపదాల కూర్పులో ఛందస్సుతో పాటు అలాంటి తాళలక్షణం ఉండాలంటున్నాడు గ్రంథకర్త.

ఇంక అర్ధసమవృత్తం. వృత్తం నాలుగు పాదాలకూర్పు అయినప్పుడు అర్ధసమవృత్తంలో రెండుపాదాలు ఒకవిధంగాను మిగిలిన రెండుపాదాలు మరొకరకంగాను ఉంటాయని స్ఫురిస్తుంది. అయితే ఏరెండు పాదాలు అన్నది కూడా ఇక్కడ ఒక అంశమే. తొలిరెండుపాదాలు (1,2) ఒకసగం. మలిరెండుపాదాలు (3,4) మరొక సగం. ఇది ఒకపద్ధతి. బేసిపాదాలు (1,3) ఒకసగం; సరిపాదాలు (2,4) మరొక సగం. ఇది మరొకపద్ధతి. ఈ రెండుపద్ధతులు గ్రహింపవచ్చు. వీటితోపాటు లాక్షణికులు ఒకపాదం ఒకరకంగాను మిగిలిన మూడుపాదాలు మరొకరకంగాను ఉన్నప్పుడుకూడ అర్ధసమమనే అన్నారు. వీటిలోను మరల స్వస్థాన అర్ధసమాలు, పరస్థాన అర్ధసమాలు అనే భేదం ఉంటుంది.

స్వస్థాన అర్ధసమాల్లో 11వ ఛందానికి చెందిన ఇంద్రవజ్ర, ఉపేంద్రవజ్ర అనేవాటి మిశ్రణం ఉండే 'ఉపజాతి' ఒక్కటే తెనుగు గ్రంథాల్లో కనబడుతుంది. ఇంద్రవజ్రకు త,త,జ,గగ - గణాలు (9+2= 11 అక్షరాలు) ఉపేంద్రవజ్రకు జ,త,జ,గగ - గణాలు (9+2= 11 అక్షరాలు) రెండింటికి 8యతిస్థానం. ఈరెండింటి మిశ్రణం చేత 14 రకాలు ఉపజాతి పద్యాలు ఏర్పడతాయి.

'ఏకత్రపాదే, చరణద్వయేవా, పాదత్రయే వాన్యతరస్థితశ్చేత్

తయోరిహాన్యత్ర తదోహసీయా చతుర్దశోక్తా ఉపజాతిభేదాః'

అనే లక్షణాన్ని అనుసరించి ఆభేదాలు క్రింద చూపబడుతున్నవి.

ఇ - ఇంద్రవజ్రపాదం, ఉ- ఉపేంద్ర వజ్రపాదం అని సంకేతం. నాలుగు అక్షరాలు వరుసగా 1-2-3-4 పాదాలకు గుర్తులు.

| | |
|---|---|
| 1. ఇ-ఉ-ఉ-ఉ | 8. ఇ-ఇ-ఇ-ఉ |
| 2. ఉ-ఇ-ఉ-ఉ | 9. ఇ-ఇ-ఉ-ఉ |
| 3. ఉ-ఉ-ఇ-ఉ | 10. ఇ-ఉ-ఇ-ఉ |
| 4. ఉ-ఉ-ఉ-ఇ | 11. ఉ-ఇ-ఇ-ఉ |
| 5. ఉ-ఇ-ఇ-ఇ | 12. ఉ-ఉ-ఇ-ఇ |
| 6. ఇ-ఉ-ఇ-ఇ | 13. ఉ-ఇ-ఉ-ఇ |
| 7. ఇ-ఇ-ఉ-ఇ | 14. ఇ-ఉ-ఉ-ఇ. |

మన గ్రంథకర్త బేసి (1,3) పాదాలు ఒకరకంగా సరి (2,4) పాదాలు ఒకరకంగా ఉండటం అర్ధసమలక్షణమని చెప్పటాన్ని ఉపలక్షణంగా మాత్రమే తీసుకోవాలి. 12వఛందానికి చెందిన 'ప్రమితాక్షరం' (స,జ,స,స) అనేది బేసిపాదాల్లోను, ప్రియంవద (న-భ-జ-ర) అనేది సరిపాదాల్లోను వస్తే 'అజిత ప్రతాపం' అనే అర్ధసమవృత్తం అవుతుంది.అలాగే 13వ ఛంధానికి చెందిన ప్రహర్షిణి (మ-న-జ-ర-గ) బేసి పాదాల్లోను రుచిర (జ-భ-స-జ-గ) అనేది సరిపాదాల్లోను వస్తే 'రతిప్రియ' మనే అర్ధసమవృత్తం అవుతుంది. ఇవి స్వస్థానార్ధసమాలు.

10వ ఛందానికి చెందిన సుముఖి (స-స-జ-గ) బేసి పాదాల్లోను 11వ ఛందానికి చెందిన వనమాల(స-భ-ర-ల-గ) సరిపాదాల్లోను వస్తే 'వియోగిని' అనే పరస్థాన అర్ధసమవృత్తం అవుతుంది. అట్లే 11వ ఛందానికి చెందిన కలితాంతము (త-జ-జ-వ) బేసి పాదాల్లోను 12వ ఛందానికి చెందిన తోటకము (స-స-స-స) సరిపాదాల్లోను వస్తే 'మనోహరం' అనే పరస్థాన అర్ధసమవృత్తం అవుతుంది. ఇలాంటివి ఇంకా ఉన్నాయి. మనకివి చాలు.

ఇలాంటి అర్ధసమలక్షణంతో కూడిన పదాలు అర్ధసమపదాలు అనిపించుకుంటాయని అన్నమాచార్యులు చెప్పినట్లుగా చినతిరుమలాచార్యులు లక్షణనిర్దేశం చేస్తున్నారు.

సమపదాలకు చెప్పినట్లుగా విషమపదాలకు అర్ధసమపదాలకు తాళసంబంధమైన నిర్దేశం ఏదీలేకపోవడం గమనించాలి.

ఉండే అవకాశాలను అన్నింటిని అవలోడిస్తుంది శాస్త్రం. అంతమాత్రంచేత అన్నింటికీ లక్ష్యాలు ఉన్నాయనికాని అన్నింటిని అనుసరించాలనికాని అభిప్రాయంకాదు. పథ్యమూ ఆహ్లాదకరమూ అయిన దాన్నేగ్రహించాలి.

1. 32 పద్యంలోకవి సమపదం 'తాళాలంకృత సామ్యపాదం' అన్నాడు. ఇక్కడ తాళముచేత అలంకరింబడిన సామ్యపాదం అని అర్థం. నాల్గుపాదాలు తాళానికి చక్కగా ఒదిగిరావాలి అని అభిప్రాయం. అంతేకాని తాళాలంకారం ఉండాలి అని భ్రాంతిపడకూడదు. దేశితాళాలనబడే 35 తాళాలకు పురందరదాసు స్వరాలతోకూర్చిన తాళాలంకారాలు ఉన్నమాటనిజమే అయినా ఆయన అన్నమయ్యకంటే చాల చిన్నవాడైన సమకాలీనుడు. పురందరదాసు తిరుపతికి వచ్చినప్పుడు అన్నమయ్యను దర్శించినట్లు అన్నమాచార్య చరిత్ర చెప్తున్నది. కాబట్టి పురందరదాసు స్వరసంచారంతో కూర్చిన తాళాలంకారాలు అన్నమయ్య చెప్పిన లక్షణంలోకిగాని దాన్ని అనుసరించే ఈ తెనుగు లక్షణంలోకికాని ప్రవేశించడం సంభావ్యంగా ఉండదు.

వ॥ మఱి నిబంధనామపదం బెట్టిదనిన

మ॥ యతులుం బ్రాసములుం బదంబులును మాత్రానీకముల్ తాళసం
గతులుం గల్గి నిబంధనామపద మాఖ్యాతార్థ సంయుక్త స
త్కృతియై తాళులపాక యన్నయగురూక్తిన్ లోకవిఖ్యాతమై
జితమాధ్వీక సితాసుధారస రుచిస్ఫీతంబునై చెన్నగున్ 34.

తా॥ ఇంక నిబంధపదం అనేది ఎలాంటిదో చెప్తాను. దీనికి యతులు, ప్రాసలు, మాత్రాగణాలననుసరించే పదాలు, తాళాల సంగతి ఉంటాయి. పదంలో చెప్పదలచిన అర్థం ఏదైనా ఉంటుంది. నేర్పైన కూర్పుగాను ఉంటుంది. ద్రాక్షపండ్లకల్లును, నిర్మలమైన అమృతాన్ని కూడా గెల్చిన రుచితో అందంగా ఉంటుంది. తాళ్ళపాక అన్నయగురుడు చెప్పడం చేత ఇదిలోకంలో ప్రసిద్ధికెక్కింది.

వ్యా॥ పదరచనకు తాళ్లపాక అన్నమాచార్యులు గురుడని ప్రస్తుతింపబడుతున్నాడు. 'పద నిర్యుక్త' మనే పేరుతో భరతుడు నామమాత్రంగా చెప్పిన దేవస్తుత్యాత్మకమైన పదానికి మొదటిసారిగా సంస్కృతంలో లక్షణం ప్రతిపాదించిన వాడు అన్నమయ్య. ఆయన రచించినన్ని పదాలు తెనుగులోనే కాదు మరే భారతీయ భాషలోను ఎవరూ రచించలేదు. రచనలో పద్యకవులెవరూ ఆయన చాయలకైన రాలేరు. భాష ఆయన చేతిలో మైనపు ముద్ద. భావన మధురాతి మధురం. ఇన్నికారణాలచేత పదరచనాగురుత్వం ఆయనకు తగి ఉంది.

నిబంధ, నిబద్ధ శబ్దాలు సమానార్థకాలే. ఉద్గ్రాహాది ధాతువులచేత ప్రబంధాంగాలైన స్వర,బిరుధ, పద, తేనక,పాట, తాలాలనే వాటిచేత దేశిరాగాల్లో వాగ్గేయకారుడు జనరంజకంగా కూర్చిన గానం నిబద్ధం. అదే నిబంధపద మనబడుతున్నది.

28 పద్యం క్రింద వ్యాఖ్యలో ప్రాచీనులు చెప్పిన ఏలా పదలక్షణం అందలి భేదాలు విపులంగా ఉల్లేఖింబడినై. ఇక్కడ తెనుగులాక్షణికులు చెప్పిన పదలక్షణాలు ఒకటిరెండు స్పృశింపబడుతున్నాయి.

వెల్లటూరి లింగన మంత్రి తన 'సరసాంధ్ర వృత్త రత్నాకరం' (1550-1600 A. D) (దీనికే మాల్యాద్రి నృసింహచ్ఛందమని కూడ పేరు) లో పదలక్షణాన్ని ఇలా చెప్పాడు.

'స్వర లఘువులైదుగల త్రిగణ రవిగణము
సరస గణ యుగముపై జత యతిక్రమము
వర పదాంతము నందు వలెఁ బ్రాస సమము
వరఁగ నరసింహ నాపదము గైకొనుము'

ఈ గ్రంథకర్త మన గ్రంథకర్తకు కొంచెం తర్వాతివాడు. వెనుకచెప్పిన కామగణాలే స్మరగణాలు. మూడో ఛందంలో పుట్టిన గణాలే ఇవి. కాగా త్ర్యక్షర గణాలే కామగణాలు ఔతాయి. వాటిలో లఘ్వాదిగణాలకు ముందు మరొక లఘువు ఉంచితే కామగణా లన్నీ ఏర్పడతాయి. ఐదుమాత్రలకు ఐదులఘువులుండే గణాలు మూడుకూర్చి మరొక్క సూర్యగణాన్నికలపాలి. సూర్యగణానికి నగణమైనా (III) హగణ (UI) మైనా మూడు మాత్రలు. మొత్తం పాదానికి 5 X 3 = 15 + 3 = 18మాత్రలు. రెండుగణాల పైనయతి చెల్లాలి. ద్వితీయాక్షరప్రాసతోపాటు పాదాంతంలోను ప్రాస ఉండాలి. ఈలక్షణపద్యం దీనికి లక్ష్యం ఔతుంది. ఇక్కడ విశేషమేమంటే ఇది సరిగా కర్ణాటచౌపద లక్షణం. కన్నడంలో నాగవర్మ ఛందోంబుధిలో ఇదే లక్షణం 8 మాత్రల మీద యతితో రఘటా లక్షణం క్రింద చెప్పబడింది. ఇది తెనుగులోని 'ద్విపద' కూడ అవుతుంది.

పై లక్షణకర్తకు తరువాతి వాడైన వార్తాకవి రఘునాథయ్య (1660-1680 A.D.) తన 'లక్షణ దీపిక'లో పదలక్షణాన్ని ఇలా చెప్పాడు.

కం॥ 'పాదము ప్రాసము వడియును
శోధించి పదాఖు కళల సూత్రం బరయన్
నాదాంగ రాగలీలలఁ
బాదంబాలించి చెప్పఁ బదమై యొప్పన్.

గీ॥ ధన్యతకుఁ బల్లవికి విరోధంబు లేక
క్రియ ఫలింపఁగ నియమంబు గీలుకొలిపి
ప్రాస యతులును సమయతుల్ భాసురముగ
తాళ పద్ధతి రచియింపఁదగుఁ బదంబు

ఇందుకు తాత్పర్యము. కళలనంగా లఘువులకు సంజ్ఞ. చరణం 1కి 16 లఘువులు నియమం. ధన్యత అనగా నుపపల్లవికి పేరుగనుక పల్లవికి యుపపల్లవికి క్రియచేర్పుగా చెప్ప వలెను. లయప్రధానంగా రాగవరుస ప్రాసవడి వర్గవళ్లను చెప్పవలెను.' (707,708,709)

ఇతని లక్షణంలో పాదానికి 16 మాత్రలే చెప్పబడినై. ఉపపల్లవి క్రొత్తగా వినబడు తున్నది. రాగతాళాలు చెప్పబడినై.

ఇంక 18 శతాబ్దినాటి పొత్తపి వెంకటరమణకవి తన 'లక్షణ శిరోమణి' వృత్తాధికా రంలో 'అర్జున భరతాన్ని' 'సంగీత రత్నాకరాన్ని' స్మరించి పదాన్నిగుర్చి ఇలా చెప్పాడు.

'కావున నీదేశ భాషల పదములు చెప్పవచ్చుననిన్ని, ఏళలనగా పదములనిన్ని మూడు చరణములకు ఖండికాత్రయము అని పేరుగలదనిన్ని, పల్లవము ఉపపల్లవము అనిన్ని యివి మాత్రానమక నిబద్ధములైన పగణాదులతోఁగూర్చవలెననిన్ని సూళాదుల (క)ను గు(ణ) ముగా నుండవలెననిన్ని' సంగీత రత్నాకరము మొదలైన గ్రంథము(లు) అర్జునభరతాది ఏళా ప్రకారంబున పగణాదుల రాగతాళమ్ముల సంగీత రీతిని తేటపడి యుండుగాన నీసాహిత్య మార్గంబున లక్షణంబున కొరవవి యట్లుండె.' (3-427)

దీనిలో పాదానికిన్ని మాత్రలని నిర్దేశం లేదు. పంచమాత్రాకాలైన గణాలు ఉండాలని మాత్రమే చెప్పబడింది. మూడు చరణాలనటంలో త్రిధాతుకత్వం సూచింపబడింది. పల్లవి అనుపల్లవి చెప్పబడ్డవి. ఈ ఏలాపదం సూళాదులకనుగుణంగా ఉండాలని రాగ తాళాలుంటాయని చెప్పబడింది. ఇతనికాలానికి పదరచన కేవలం సంగీత సంబంధిగాతోచి సాహిత్యాన్నుండి వేఱుపడ్డది. పాదానికి ఆఱని, ఐదని ప్రాచీనులు చెప్పిన పదనియమం పోయి గణసంఖ్యా నియమం రావటం అదికూడ పోయి పాదానికి 16 మాత్రలనడం. చివరకు మాత్రాసమకాలైన పగణాలతో కూర్చాలనటం - క్రమంగా వచ్చిన మార్పు. తాళ్లపాక వారి సంకీర్తనల్లో పల్లవితో పాటు మూడేసి చరణాలు ఉండటం మామూలు. ప్రతి చరణం నాల్గుపాదాల వృత్తబంధంగా ఉంటుంది. చరణాలసంఖ్యకు అపవాదాలు లేక పోలేదు.

పదరచనలో పాదానికి ఇన్ని అనే గణసంఖ్యా నియమంకాని మాత్రా సంఖ్యనియమం కాని లేదని నాలుగు, ఐదు, ఆఱు మాత్రల గణాలు వాడుకోవచ్చునని రాగతాళాలకు అనుగుణంగా వీటిని నియమించుకోవచ్చునని యతులు, ప్రాసలు ఉంటాయని పల్లవి చరణ త్రయం ముఖ్యమని సారాంశం.

ఈ సందర్భంలో నాట్యశాస్త్రం చెప్పిన సలహోగమనింపవచ్చు. ఆర్యావృత్తాల్లో నాల్గేసి మాత్రాలకే గణాలు చూచుకోవాలని, గీతకాల్లో ఐదేసి మాత్రల గణాలు చూచుకోవాలని, తాళప్రధానాలు కనుక వైతాళీయాల్లో (రగడలు వగైరా) ఆఱేసి మాత్రల గణాలు చూడాలని 14 అధ్యాయం (బరోడా ప్రతి)లో చెప్పబడింది.

1 'నిబద్ధ మనిబద్ధం తద్ ద్వేధా నిగదితం బుధైః॥
బద్ధం ధాతుభిరంగైశ్చ నిబద్ధమభిధీయతే
ఆలప్తిర్బంధ హీనత్వాదనిబద్ధ మితీరితా॥

(సంగీ. రత్నా. 4-4/5)

రాగాలాపన అనిబద్ధం.

2. 'మాత్రానీకముల్' అనేది పదాలు, తాళసంగతులు అనేవాని నడుమ వేయబడింది. మాత్రలసమూహాలు అనే ఆ అభిప్రాయం ఇటు పదాలపరంగా మాత్రాగణాలుగా నోమాత్రల సంఖ్యగానో అన్వయానికి వస్తుంది, అటు తాళపరంగా కూడా అన్వయానికి వస్తుంది. 36 పద్య వివరణం చూడండి.

3. అఖ్యాతం అంటే చెప్పబడింది అని శబ్దార్థం. భాషాపరంగా ఆఖ్యాతం అనేది క్రియాశబ్దం. ధాతువుకు భూతభవిష్యద్వర్తమానాది కాలసూచకాలైన తిఙ్లు చేరింది ఆఖ్యాతం; దీనికి కర్తృపదమైన నామశబ్దానికి ఉండే వచనపురుషలు ఉంటాయి. వ్యక్తం చేయబడిన ఏదైనా ఒక అర్థంతో కూడింది అని గ్రహిస్తేచాలు.

వ॥ అట్టి నిబంధనామ పదంబునకు దదంగంబులైన యతిప్రాసాదులవిధం బెట్టిదనిన

క॥ పాదముల నాలుగింటికి
నాదుల నడుముల సవర్ణమగునవి యతు లా
పాద ద్వితీయ వర్ణము
పాదుగ నొక్కటియ చెల్లఁ బ్రాసం బనఁగన్ 35

తా॥ నిబంధపదమనే దానికి అంగాలైన యతి, ప్రాస మొదలైనవి చెప్పబడుతున్నై. నాలుగు పాదాల మొదళ్లలోను మధ్యభాగాల్లోను సజాతీయవర్ణం ఉండటం యతులు అనిపించుకుంటాయి. నాల్గు పాదాల్లోను పాదద్వితీయాక్షరం ఒకటిగానే రావటం ప్రాస అనిపించుకుంటుంది.

వ్యా. అంగాలంటే అవయవాలు. నిబంధపదం సావయవం. పదం శరీరంలాంటిదైతే యతులు, ప్రాసలు, మొదలైనవి సౌష్ఠవం (symmetry) తోకూడిన కాళ్లు చేతుల్లాంటి అవయవాలు.

ఈనిబంధపదం వృత్తబంధంగా ఉంటుంది. అంటే నాలుగు పాదాలుగా ఉంటుంది. ఈనాలుగు పాదాల్లోను పాదాదిలో ఉండే అక్షరంతో సజాతీయమైన అక్షరం పాదమధ్యంలో రావటం యతి. నాలుగు పాదాల్లోను నాలుగు యతులు ఉంటాయి. ఏపాదం యతి ఆపాదానిదే. కాని సజాతీయాక్షరం వచ్చే యతిస్థానం మాత్రం నాల్గు పాదాల్లోను ఒకేచోట వస్తుంది. పాదమధ్యంలో రావటంఅనేది సామాన్యసూత్రం. ఒకపాదానికి 16 మాత్రలుంటే సగానికి 8 మాత్రలు ఔతాయి. అప్పుడు పాదంతొలి అక్షరం 9 వమాత్ర ఉండే అక్షరము సజాతీయంగా ఉండాలి. గణాలసంఖ్యనుబట్టికూడా ఇట్లే చూచుకోవాలి. కొన్నిచోట్ల పాదమధ్యాన్నిదాటి యతి ఉండటం, ఒకటికంటె ఎక్కువ యతిస్థానాలు ఉండటం కూడా ఉండవచ్చు.

యతి అనేది చదివేవాని నాల్కకు విశ్రాంతి స్థానం. సంస్కృతభాషలోను కన్నడంలోను యతి విచ్ఛేదరూపం. యతిస్థానంలో పదమధ్యం రాకూడదు. సంస్కృతంలో పాదం చివరకూడ పదం ముగిసిపోవాలి. దీన్ని పాదాంతయతి అంటారు. 'యతిః సర్వత్ర పాదాంతే, శ్లోకార్ధేతు విశేషతః' అని పింగళచ్ఛందము.

తెనుగులో యతిస్వరూపంవేఱు. యతిస్థానంలో పదచ్ఛేదం ఉన్నా లేకపోయినా పాదం తొలి అక్షరంతో మైత్రిగల అక్షరం ఆచోట వచ్చితీరాలి. ఉదాహరణకు శార్దూలవృత్తానికి 12 యతి స్థానం. అనగా 12 అక్షరం ఉన్నచోట పదచ్ఛేదం జరగాలి. తెలుగులో 12 అక్షరం దగ్గర పదచ్ఛేదం జరిగినా జరుగకపోయినా 1 వ అక్షరంతో మైత్రిగల అక్షరం 13 వ అక్షరంగా వస్తుంది. ఇలాగ నాల్గు పాదాల్లోను యతి ఉండాలి. పదరచనలోను ఇట్లే పాదమధ్యంలో ఒకచోటగాని, ఒకటికంటె ఎక్కువచోట్లగాని యతిని నిర్వహింపవచ్చు. యతి అక్షరమైత్రిచేత శ్రావ్యతకు దోహదం చేస్తుంది.

పాదం రెండో అక్షరం ప్రాస. ఇదికూడ నాల్గుపాదాల్లో ఉంటుంది. 'ప్రకృష్టో వర్ణవిన్యాసః ప్రాసః' అని వ్యుత్పత్తి. ఇది రసస్ఫోరకమని సౌందర్యహేతువని చెప్తారు. తొలిపాదంలో రెండోఅక్షరంగా వచ్చిన అక్షరమే రెండవమూడవ నాల్గవ పాదాల్లోని రెండో అక్షరంగా రావాలి. కాబట్టి ప్రాస నాల్గుపాదాలకూ ఒక్కటిగానే ఉంటుంది. సంస్కృతంలో ఇలాంటి ఆవృత్తి శబ్దాలంకారం క్రిందికి వస్తుంది. అనుప్రాస అంటారు. కన్నడంలోను తెనుగులోను ప్రాస ఒకేవిధంగా ద్వితీయాక్షరావృత్తిగా ఉంటుంది.

యతికి ప్రాసకు ఒక్కభేదం ఉంది. యతిలో అక్షరమైత్రి అజ్ఝల్లులకు రెండింటికి ఉండాలి. ప్రాసలో వ్యంజనం ప్రధానం. అనగా, హల్లు మాత్రం వస్తేచాలు; వేర్వేరు అచ్చులతోకూడి ఉండవచ్చు. ఉదాహరణానికి ర-రి-రు-రె లు ప్రాసాక్షరాలుగా రావచ్చు. యతి ర-రా-రై-రౌ లకు, రి-రీ-ఋ-రె-రే లకు, రు-రూ-రొ-రో లకు మాత్రమే చెల్లుతుంది.

పదరచనలో పాదాంత ప్రాసకూడ ఉంటుంది. ప్రతిరెండు పాదాలకు చివర అనుప్రాస నిర్వహించటం ఒకపద్ధతి. నాల్గుపాదాలకూ నిర్వహించవచ్చు.

1. అజాది పదాలు వాడేటప్పుడు ఈక్రింది అచ్చులకు పరస్పరం యతిమైత్రి ఉంటుంది.

(a) అ-ఆ-ఐ-ఔ (b) ఇ-ఈ-ఋ-ౠ-ఎ-ఏ (c) ఉ-ఊ-ఒ-ఓ (d) అచ్చులలోని అకారానికి హల్లుల్లోని య-హ లతో యతిమైత్రి, ఋకారానికి రి తో యతిమైత్రి. (e) హల్లులలో పరస్పరం యతి మైత్రి ఈక్రింది విధంగా ఉంటుంది.

క-ఖ-గ-ఘ-క్ష

చ-ఛ-జ-ఝ-శ-ష-స-క్ష

ట-ఠ-డ-ఢ  ఇవి వాడుకగా ఉండేవి. విశేషాలు చాలా ఉన్నై.

త-థ-ద-ధ

ప-ఫ-బ-భ-వ

ంప-ంఫ-ంబ-ంభ-మ

పు-ఫు-బు-భు-ము

య-హ

ర-ఱ

ల-ళ

న-ణ

జ్ఞ-న

2. ప్రాసలో హల్లు ఆవృత్తి అయితే చాలునని చెప్పబడినా కొన్ని విశేషాలున్నై.

(a) వట్రువసుడి ఉన్నహల్లుకు వట్రువసుడిలేని హల్లుతో ప్రాసచెల్లుతుంది. సుకృత-సకియ

(b) క్రావడి ఉన్నహల్లుకు క్రావడిలేని హల్లుకు ప్రాసచెల్లుతుంది.

(c) న-ష, స-శ, న-ణ, ద-ధ, థ-ధ, ఋ-ర, ల-ళ-డ లకు పరస్పరం ప్రాసచెల్లుతుంది.

ఇక్కడకూడా విశేషాలు చాలాఉన్నై. పరిచయమాత్రంగా ఇక్కడ చూపబడినై.

క॥ మాత్రయొకటి లఘువనఁదగు
మాత్రా ద్వయమైన గురునమాహ్వయమయ్యెన్
మాత్రా త్రయము ప్లుతంబగు
మాత్రార్ధము ద్రుతము భరత మతమునఁ జెలఁగున్ 36

తే॥గీ॥ పూని తాళక్రియాలసన్మాన మునకుఁ
దాళశబ్దంబు వర్తించు ధరణినదియు
దేశి యును మార్గమును నాఁగఁ దేజరిల్లు
ధన్య భరతాది బహుసంప్రదాయ లీల. 37

తా॥ ఒక్కమాత్రకు లఘువని పేరు. రెండు మాత్రలు గురువు. మూడు మాత్రలు ప్లుతం. అర్ధమాత్ర ద్రుతం. భరతమతంలో ఇలాగచెల్లుతుంది. (36)

పనిబడి తాళక్రియతో కొలవటానికే తాళం అని పేరు. లోకంలో ఆతాళం భరతాదుల సంప్రదాయాలను అనుసరిస్తూ 'మార్గ' అని 'దేశి' అని రెండు రకాలుగా ప్రకాశిస్తున్నది. (37).

వ్యా॥ ఈ రెండు పద్యాలు తాళాన్ని గురించి పలుకుతున్నాయి. 34 పద్యంలో మాత్రా నీకాలు చెప్పి తాళసంగతులు చెప్పబడినై. ఇక్కడ మరలా మాత్రలను గూర్చి తాళాన్ని గూర్చి ప్రసంగింపబడుతున్నది.

మాత్రలను గురులఘువులను గూర్చి చెప్పే పద్యం ఛందస్సుకు సంబంధించిందని ఎందుకనుకోరాదు? ఛందస్సులో గురులఘువులతోడి గణాలుండవచ్చు, మాత్రాగణాలుండ వచ్చు. కాని ద్రుత ప్లుతాలకు అందులో తావులేదు. కనుక రెండు పద్యాలు తాళపరాలే అనిగ్రహించాలి.

'తల ప్రతిష్ఠాయాం' అనే ధాతువు వలన 'తాల' శబ్దం వచ్చింది. గీత నృత్తవాద్యాలు దీనిలో ప్రతిపాదింపబడుతాయి కనుక 'తాల' మని పేరు. లఘ్వాదులచేత సశబ్దనిశ్శబ్ద క్రియలచేత గీత వాద్యనృత్తాదుల కాలం కొలువబడుతుంది. కనుక 'తాల' మనేది ప్రధా నంగా కాలసంబంధమైంది. తాలానికి (1) కాలం (2) మార్గం (3) క్రియ (4) అంగం (5) గ్రహం (6) జాతి (7) కల (8) లయ (9) యతి (10) ప్రస్తారం అని పది ప్రాణతుల్యమైన అంశాలు చెప్పబడినై. వీటిలో మొదటి 5 ముఖ్యప్రాణాలు రెండో 5 అముఖ్యప్రాణాలు. ఇక్కడ తొలిపద్యం కాలానికి సంబంధించింది.

సంగీతంలో కొలతకు వచ్చేకాలానికి లోకంలో మనం చెప్పకొనేకాలానికి వ్యత్యాసం ఉంది. సంగీతంలో (1) సూక్ష్మకాలం (2) స్థూలకాలం అని కాలం రెండురకాలు. నూఱు తామరరేకులను ఒకదానిమీద ఒకటి పేర్చి సూదితో గ్రుచ్చితే ఒకరేకు తెగటానికి పట్టేకాలం క్షణం. అలాంటి క్షణాలతో ఈక్రింది సూక్ష్మకాలాలు ఏర్పడుతున్నై.

| | | | |
|---|---|---|---|
| 8 | క్షణాలు | = 1 | లవం |
| 8 | లవాలు | = 1 | కాష్ఠ |
| 8 | కాష్ఠలు | = 1 | నిమిషం |
| 8 | నిమిషాలు | = 1 | కళ |
| 2 | కళలు | = 1 | చతుర్భాగం |
| 2 | చతుర్భాగాలు | = 1 | అనుద్రుతం |

ఇటుమీద చెప్పేవి స్థూలకాలాలు:

| | | | |
|---|---|---|---|
| 2 | అనుద్రుతాలు | = 1 | ద్రుతం |
| 2 | ద్రుతాలు | = 1 | లఘువు |
| 2 | లఘువులు | = 1 | గురువు |
| 3 | లఘువులు | = 1 | ప్లుతం |
| 4 | లఘువులు | = 1 | కాకపాదం |

పద్యంలో ద్రుతం అనేది అర్ధమాత్ర అనిచెప్పబడింది కనుక రెండు ద్రుతాలు 1 మాత్ర అవుతుంది. అదే లఘువని చెప్పబడింది. అలాగే 2 లఘువులు, మాత్రాద్వయం, గురువనబడింది. మూడులఘువులు ప్లుతమనబడింది. పైవాటిలో (1) అనుద్రుతం (2) ద్రుతం (3) లఘువు (4) గురువు (5) ప్లుతం (6) కాకపాదం అనే ఆఱున్నూ తాళానికి నాలుగో ప్రాణమైన షడంగాలు. ఈనాడు గురు, ప్లుత, కాకపాదాలు వచ్చే తాళాలు ఏవీ వాడుకలోలేవు. ఇప్పుడు వాడుకలో ఉండే తాళాల్లో అనుద్రుతం, ద్రుతం, లఘువు అనే మూడు అంగాలు మాత్రమే వస్తాయి. వీటికి హ్రస్వాక్షరాలకాలం, గుర్తులు ఇలా ఉంటాయి.

| <u>అంగం</u> | <u>హ్రస్వాక్షరసంఖ్య</u> | <u>గుర్తు</u> |
|---|---|---|
| అనుద్రుతం | 1 | U |
| ద్రుతం | 2 | O |
| లఘువు | 4 | I |

అనుద్రుతం నుండి కాకపాదం దాక ప్రస్తారం చేస్తే 16 అంగాలు వస్తాయి. వాటిలో మూడు మాత్రమేపైన చూపబడినై. ·ద్రుతవిరామమనే అంగానికి 3 హ్రస్వాక్షరాలు. గుర్తు UO. తాళంలో వచ్చే లఘువు సాధారణంగా నాల్గు హ్రస్వాక్షరాలను ఉచ్చరించడానికి పట్టేకాలం (ఛందస్సులో లాగ 1 హ్రస్వాక్షరోచ్చారణ కాలం కాదు).

తాళమనేది గీత వాద్యనృత్తాల్లో కాలాన్ని కొలచటం అని చెప్పబడింది. ఈకొలిచే పద్ధతికే 'క్రియ' అనిపేరు. ఇది తాళదశప్రాణాల్లో మూడోదిగా చెప్పబడింది. 37 వ పద్యంలో తాళక్రియతో కాలాన్ని కొలచటానికే 'తాళ' శబ్దం వర్తిస్తుందని చెప్పబడింది. ఈ 'క్రియ' (కొలవడం) అనేది సశబ్దక్రియని నిశ్శబ్దక్రియఅని రెండు రకాలు. చేతిమీద చేతితో చప్పుడయ్యేటట్లుగా దెబ్బవెయ్యటం సశబ్దక్రియ. దీన్నే 'ఘాత' అంటారు. వ్రేళ్లతో చిటిక వెయ్యటం కూడా సశబ్దక్రియే. దీన్ని 'ధ్రువం' అంటారు. చేయి విసరటం లాంటిది నిశ్శబ్దక్రియ.

ఈతాళాలు మార్గతాళాలనీ దేశ్యతాళాలని రెండురకాలు. నాట్యశాస్త్రంలో (1) చచ్చత్పుట (2) చాచపుట (3) షట్పితాపుత్రక (4) సంపద్వేష్టాక (5) ఉద్ఘట్టక - అనే 5 తాళాలు చెప్పబడినై. నారదుని 'సంగీత మకరందం' లోను పార్శ్వదేవుని 'సంగీతసమయసారం' లోను 101 తాళాలు చెప్పబడినై. సంగీతరత్నాకరంలో 120 దేశ్యతాళాలు చెప్పబడినై. వీటిలో రత్నాకరకర్త శార్ఙ్గదేవుడు చెప్పినవి రెండు చేరినై. ఈతాళాలకు గురులఘువులతోడి గణాలతో లేదా సంకేతాక్షరాలతో అంగాలు చెప్పబడినై. తెనుగు సాహిత్యంలో పాలకురికి సోమనాథుడు తన కాలంలో ఉండిన 108 తాళాల పేర్లు చెప్పినాడు. ప్రాచీనులు చెప్పిన పేర్లకు ఇతడిచ్చిన పేర్లకు కొన్ని తేడాలు కనిపిస్తున్నై. సోమనాథుడు చెప్పిన తాళాల పేర్లివి : (1) చంచుపుట (2) జాచపుట (3) షడ్గీత (4) ఉత్పుట (5) మోచిత (6) సమతాళ (7) సత్రచ్ఛేద (8) ఎగ (9) బొంబడ (10) ఎడ (11) హడ (12) గారు (13) హడక (14) బంధకరణ (15) బాడకరణ (16) క్రౌంచపద (17) సరకరణ (18) ఆస్థానమండప (19) ఫల (20) చక్రవాక (21) కలహంస (22) ఆర్య (23) లలిత (24) సరళ (25) విరళ (26) ఉమామందిర (27) మత్తమాతంగ (28) రథ్య (29) మర్థి (30) ముదవ (31) బంధమర్థి (32) రూపక (33) ఏక (34) మడ (35) ఖండితతర (36) అఖండ (37) కంకాళ (38) ఖండిత చండకి (39) ఖండవర్ణ (40) అవిఘూర్ణిత (41) కుటిలఘూర్ణిత (42) గోష్ఠి (43) అర్ణ (44) కచ్చన (45) అణ (46) ఆదిమాతృక (47) తరక్షణవుత్రి (48) ఉద్వీక్షణ (49) ఉచ్చవటి యుక్షోళిక (50) చటిక (51) యష్టిక (52) పూర్వకంకాళ (53) మణిమిశ్ర కంకాళ (54) ఖండ కంకాళ(55) కావ్యకంకాళ (56) పంచాళి (57) భిన్నక (58) కోకిల ప్రియ (59) నిరవద్య (60) రన్న (61) కుంజర (62) ఫణి రాజ (63) చతురశ్రధార (64) కృత్యచ్ఛ (65) విద్యాధర (66) రక్తధార (67) ఉత్తమమేరు (68) తాంబూలియాణ (69) మలపు (70) ఉత్పల్లిక (71) మాతంగ (72) అర్ధకళిక (73) సరస్వతి (74) కంఠాభరణ (75) మిశ్ర (76) సమ్మిశ్రవాద (77) సింహవిక్రీడిత (78) సింహనాద (79) సింహనంద (80) లక్ష్మీస్తన (81) ముక్త (82) పంచబ్రహ్మ (83) దశరుద్ధ (84) పంచ (85) చాయణ (86) పరి

(87) ప్రసక్త (88) ఖుర (89) పెసరఖుర (90) ఉత్తర (91) పంచబాణ (92) హరిణ (93) మాయాఖణ (94) ఆదికంకాణ (95) ఖంజర (96) చతురశ్ర ఖంజర (97) కృష్ణఖంజర (98) అసమాన ఖంజర (99) లక్ష్మవతి (100) ధ్రువ (101) లయ (102) తనుభద్ర (103) లక్ష్మణయాణ (104) విలంబిత (105) ఆదిమర్థి (106) వళి (107) ధ్రువమర్థి (108) జంపెమర్థి (పండితారాధ్య చరిత్ర - పర్వత ప్రకరణం)

పేర్లు తెలిసినా ఈ తాళాల స్వరూపం తెలియరాదు. ప్రాచీనులు చెప్పిన తాళాలతో సంపదించే వాటి అంగాలు తెలుసుకోవచ్చు.

దక్షిణ భారతీయ గానంలో నేడు ప్రచారంలో ఉన్న తాళాలు ఏడు. వాటి పేర్లు, అంగాలు క్రింద చూపబడుతున్నై.

| తాళం పేరు | అంగాలు |
|---|---|
| (1) ధ్రువతాళం | I0II |
| (2) మఠ్య | I0I |
| (3) రూపక | 0I |
| (4) జంపె | IU0 |
| (5) త్రిపుట | I00 |
| (6) అట | II00 |
| (7) ఏక | I |

తాళాలు త్ర్యశ్ర, చతురశ్ర భేదంతో రెండు రకాలు. ఈ రెండూకలపితే మిశ్రమనే భేదం వస్తుంది. మిశ్ర త్ర్యశ్రలను కలిపి రెండుగా ఖండిస్తే ఖండజాతి వస్తుంది. ఖండ చతురశ్రాలను కలిపితే సంకీర్ణ జాతి వస్తుంది. లఘువుకు ఈవిధంగా విలువను మార్చటంతో అది 5 రకాలైనై 7 తాళాలు 7 X 5 = 35 రకాలు అయినై. పంచలఘువుల వివరాలివి.

| లఘువు పేరు | విలువ | మాత్రలు | గుర్తు | గణనం |
|---|---|---|---|---|
| త్ర్యశ్ర లఘువు | 3 అక్షరాలు | 3/4 | $1^3$ | ఘాతవేసి 2వ్రేళ్లు ఎంచాలి |
| చతురశ్ర లఘువు | 4 అక్షరాలు | 1 | $1^4$ | ఘాతవేసి 3వ్రేళ్లు ఎంచాలి |
| మిశ్ర లఘువు | (3+4) = 7 అక్షరాలు | 1 3/4 | $1^7$ | ఘాతవేసి 6వ్రేళ్లు ఎంచాలి |
| ఖండ లఘువు | $\frac{7+3}{2}$ = 5 అక్షరాలు | 1 1/4 | $1^5$ | ఘాతవేసి 4వ్రేళ్లు ఎంచాలి |
| సంకీర్ణ లఘువు | (5+4) = 9 అక్షరాలు | 2 1/4 | $1^9$ | ఘాతవేసి 8వ్రేళ్లు ఎంచాలి |

తాళం వెయ్యటంలో వచ్చే సశబ్ద నిశ్శబ్ద క్రియలు కూడా మార్గదేశి భేదంతో రెండు రకాలు. దేశ్యక్రియలు మాత్రం ఇక్కడ చెప్పబడుతున్నై.

<u>సశబ్దక్రియ:</u> ధ్రువకం. చప్పుడయ్యేటట్లుగా కుడిచేత్తో దెబ్బవెయ్యటం లేదా వ్రేళ్లతో చిటిక వెయ్యటం.

<u>నిశబ్దక్రియలు:</u>

(1) సర్పిణి : చేతిని ఎడమవైపునకు విసరటం

(2) కృష్య : ఎడమకు ఉన్న చేతిని కుడివైపునకు విసరటం

(3) పద్మిని : అరచేయి క్రిందకు మళ్లించి చేయిచాచుట

(4) విసర్జితం : అధోముఖ హస్తాన్ని వెలుపలికి విసరటం

(5) విక్షిప్తం : అలా విసరినచేతి వ్రేళ్లను ముడుచుట

(6) పతాక : చేతిని పైకి విసరుట

(7) పతిత : పైకి విసరిన చేతిని క్రిందికి తెచ్చుట

అనుద్రుతానికి ధ్రువకమనే సశబ్దక్రియ వాడాలి. ద్రుతానికి ధ్రువకమనే సశబ్దక్రియ, విసర్జిత అనే నిశ్శబ్దక్రియ వాడాలి. అంటే ఘాతవేసి పిమ్మట చేతిని వెనక్కి విసరాలి. ఇది రెండక్షరాల కాలం అవుతుంది. ఇంక లఘువుకు ధ్రువకమనే సశబ్దక్రియ, విక్షిప్త అనే నిశ్శబ్దక్రియ వాడాలి. ముందు ఘాతవేసి ఆపిమ్మట చిటికెన వ్రేలు మొదలుగా ఆ లఘుజాతికి తగినట్లు వ్రేళ్ళు లెక్కించాలి.

పురందరదాసు ఈ దేశ్యతాళాలు 35కి స్వరసంచారంతో అలంకారాలు కూర్చినాడు. వీటిసాధన వల్ల స్వరజ్ఞానం తాళజ్ఞానం కలుగుతాయి. ఉదాహరణకు ధ్రువతాళానికి 1011 (లఘువు, ద్రుతము లఘువు లఘువు) అంగాలు. దీంట్లోని లఘువు చతురశ్రజాతి లఘువు అనుకొంటే అప్పుడు దానికి 10 ఆవర్తాలతో

సరిగమ / గరి / సరిగరి / సరిగమ.

(లఘువు) (ద్రుతం) (లఘువు) (లఘువు)

అనే స్వరసంచారంతో ప్రారంభం ఉంటుంది. తొలిఖండంలో 5 ఆవర్తాలు మలిఖండంలో 5 ఆవర్తాలు ఉంటాయి. తొలిఖండంలో మధ్యస్థాయి షడ్జస్వరంతో ప్రారంభం. మలిఖండంలో తారస్థాయి షడ్జస్వరం. తొలిఖండం చివరి ఆవర్తంలో చివర తార షడ్జం ఉంటుంది. మలిఖండం చివరి ఆవర్తం చివర మధ్యషడ్జం ఉంటుంది. తొలిఖండపు స్వరప్రస్తారాలు ఆరోహణ క్రమంలోను మలిఖండపు స్వరప్రస్తారాలు అవరోహణ క్రమంలోను ఉంటాయి. ఒక్కొక్క తాళాక్షరానికి ఒక్కొక్క స్వరం చొప్పున ఉంటుంది.

1. తెనుగులో పాలూరి గోవిందకవి ఈక్రింది గ్రంథాలు రచించాడు.

(a) తాళదశ ప్రాణప్రదీపిక - తంజావూర్ సరస్వతీమహల్ లైబ్రరీవారి ప్రచురణ (13)(1950)

(b) రాగాతాళచింతామణి - గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ, మద్రాసు సీరీస్ L xxxx1 - (1952)

2. అనుద్రుతానికే విరామం, వ్యంజనం, అవ్యక్తం, అనునాసికం అనే పేర్లుకాడా ఉన్నె. ద్రుతానికి వలయం, బిందుకం, వ్యోమం, అర్ధమాత్ర అనిపేర్లు. లఘువుకు కళ, హ్రస్వం, మాత్ర అని పేర్లు.

3. లఘువు జాతి (త్ర్యశ్ర, చతురశ్రాది) ననుసరించి తాళం భేదిస్తుంది. పద్యాల త్ర్యశ్ర, చతురశ్రాది గతులననుసరించి కొన్ని వృత్తాలు ఆయాగతులకు బాగుంటాయని తలచటం సహజమే. ఏగతిలో ఏయే వృత్తాలు నడుస్తాయో కొన్ని ఉదాహరణలు సూచింపబడుతున్నవి.

(1) త్ర్యశ్ర గతి (3 మాత్రల గణాలు) - సుగంధి, విచికిలిత, పంచచామరం వగైరా.

(2) చతురశ్ర గతి (4 మాత్రల గణాలు) - తోదకం, తోటకం, ప్రహరణ కలిత, మణిగణనికరం, విద్యున్మాల, మానిని, సరసిజం, క్రౌంచపదం, కవిరాజవిరాజితం వగైరా.

(3) ఖండగతి (5 మాత్రల గణాలు) - స్రగ్విణి, త్వరితగతి, వనమయూరం, భుజంగ ప్రయాతం, పద్మనాభం, లయగ్రాహి, లయవిభాతి, లయహారి, మంగళమహాశ్రీ, దండకం వగైరాలు

(4) మిశ్రగతి (7 మాత్రల గణాలు) తరల, మత్తకోకిల వగైరా

రగడ భేదాలు యక్షగానాల్లో వాడబడుతాయి. ఆభేదాలు వాటికి సంబంధించిన తాళాలు 50 పద్యం క్రింద ఇయ్యబడును.

వ॥ ముందు జెప్పిన నిబంధనామ పదంబునకు నవయవంబులైన యవాంతరపదంబులకు నామంబు లెయ్యవి యనిన

క॥ మొదలుద్గ్రాహము, రెండవ
యది మేళాపము, తృతీయమగు ధ్రువ, మటపై
గదిసిన యది యంతర, మా
తుది నాభోగంబు ముద్రతోఁ జెలువొందున్ 38

తా॥ ముందు చెప్పిన నిబంధ పదమనే దానికి అవయవాలైన విడిపదాలకు పేర్లువివంటే పదం ఎత్తుకోగానే వచ్చేది ఉద్గ్రాహం, రెండోదశలో వచ్చేది మేళాపం, మూడోది ధ్రువం, అమీదట వచ్చేది అంతరం, అటుపై చివరగా వచ్చేది ముద్రతోకూడి ఆభోగం అనేపేరుతో అందంగా ఉంటుంది.

వ్యా॥ నిబద్ధపదానికి అంగాలైన యతిప్రాసలను తాళాన్ని గూర్చిపలికి పదానికి అవయవాలైన భాగాలకు పొసగే పేర్లను గూర్చి ఇక్కడ చెప్తున్నాడు. 26 పద్యంలో కూర్చినపదాన్ని శరీరంగా దర్శించి ఆకూర్పునకు ఆధారంగా నిల్చిన వృత్తబంధాల్ని (ఛందస్సుల్ని) ధాతువులుగా చెప్పాడు. అక్కడ పాట రూపంగా ఉండే శరీరానికి ధాతువులను చెప్తే ఇక్కడ ఆపాటలోని భాగాలకు పేర్లను చెప్తున్నాడు.

ఇక్కడ ఒక అంశం గమనించాలి. పదశరీరానికి వృత్తబంధం అనేది (ఛందస్సు) ఒక్కటేకదా అందుచేత ధాతువుకూడా ఒక్కటే అనుకోరాదు. శరీరానికి కారణాలైన వాతపిత్త శ్లేష్మాలనే మూడు ధాతువులు చెప్పబడినై. అవివేర్వేరైనా ధాతుత్వం అనే లక్షణం వాటిలో సామాన్యం. అలాగే వృత్తబంధం అనబడిన ఛందస్సు అక్కడ సామాన్యం అని అదేఛందస్సులో పదశరీరమై భిన్నధాతుకాలైన మూడు చరణాలైనా ఉంటాయని గ్రహించాలి. శరీరం త్రిధాతుకమైనట్లుగానే పదము త్రిధాతుకమనేభావం దీనికాధారం.

సంగీతశాస్త్ర గ్రంథాల్లో ధాతువులని చెప్పబడ్డ ఉద్గ్రాహాదుల్నే మనగ్రంథకర్త ఇక్కడ చెప్తున్నాడు.

గ్రంథకర్త పదంలోని అవాంతరపదాలకు (విడిభాగాలకు) చెప్పినవి. (1) ఉద్గ్రాహం (2) మేళాపం ( 3) ధ్రువం (4) అంతర (5) ఆభోగం. సంగీత రత్నాకరం వీటిని ధాతువులుగా చెప్పి వివరించిన శ్లోకాలివి:

"ప్రబంధావయవో ధాతుః స చతుర్ధానిరూపితః
ఉద్గ్రాహః ప్రథమ స్తత్ర తతో మేలాపక ధ్రువౌ ॥
ఆభోగశ్చేతి తేషాంచ క్రమాల్లక్ష్మాభిదధ్మహే
ఉద్గ్రాహః ప్రథమో భాగ స్తతో మేలాపకః స్మృతః ॥
ధ్రువత్వాచ్చ ధ్రువః పశ్చాదాభోగస్త్వన్తిమో మతః
ధ్రువాభోగాంతరే జాతో ధాతురన్యో న్తరాభిధః ॥
సతు సాలగసూడస్థ రూపకేష్వేవ దృశ్యతే
వాతపిత్తకఫా దేహ ధారణా ద్ధాతవోయథా ॥
ఏవమేతే ప్రబంధస్య ధాతవోదేహధారణాత్
తత్ర మేలాపకా భోగా నభవేతాం క్వచిత్ క్వచిత్"॥

(సంగీ. రత్నా. 4-7/11)

సంగీతరత్నాకరాన్ననుసరించి కూడ ఉద్గ్రాహం మొదటిది, తర్వాతివి మేలాపక ధ్రువలు; ఆభోగం చివరిది. ధ్రువాభోగాల మధ్యనిర్మింపబడేది అంతర. వీటిలో ఉద్గ్రాహం అనేది అన్వర్థసంజ్ఞ. పదాన్ని 'ఎత్తుకోవడం' అనేది ఉంటుంది. కనుకనే దీన్ని 'ఉద్గ్రాహం' అన్నారు. నేడుమనం దీన్ని 'ఎత్తుగడ' గా పలుకవచ్చు. ఉద్గ్రాహ ధ్రువలను మేలనం (కలపడం) చేస్తుంది గనుక రెండోది మేలాపకం అయింది. ధ్రువత్వం - అనగా నిలకడ వలన ధ్రువ. 'ఆభోగః పరిపూర్ణతా' అనే అభిధానంవలన పదానికి నిండుదనం (పూర్తి కావడం) దీంతో వస్తుంది గనుక ఇది ఆభోగం. ముగింపు అని అభిప్రాయం. వీటిలో అంతర, మేలాపకాలు అప్రధానాలనే చెప్పాలి. 'అంతర' అనేది సాలగసూడ ప్రబంధాలని చెప్పబడే ధ్రువ, మంఠ, ప్రతిమంఠ, నిస్సారుక, అంకతాల, రాసక, ఏకతాలీ ప్రబంధాలకే పరిమితంగాను, 'దృశ్యతే' అని దృశగ్రహణం చేయటంచేత ధ్రువాది ప్రబంధాల్లోకూడ ప్రాచీనులు ఎక్కడ 'అంతర' ను నిర్మించారో అక్కడ మాత్రమే నిర్మించవచ్చునని, దీన్నిబట్టి మంఠాదుల్లో అంతర కనబడుతోందిగనుక మంఠాదుల్లో చేయవచ్చునని, ధ్రువాప్రబంధంలో కనబడటంలేదు గనుక అక్కడ చేయరాదని తెలుసుకోవాలంటూ కల్లినాథుని వ్యాఖ్య.

సంగీతశాస్త్ర గ్రంథాల్లో 'పల్లవము' అనబడ్డదే ఈగ్రంథంలో 'పల్లవి' అనబడింది. నేడుమనంకూడ 'పల్లవి' అనే అంటున్నాము. అయితే శాస్త్రగ్రంథాల్లో ప్రాక్ప్రసిద్ధ దేశీ రాగాల్లోను విభాషారాగంగాను చెప్పబడిన 'పల్లవీ' అనే రాగంకూడా ఒకటిఉంది. దానికీ దీనికీ సంబంధంలేదు.

పదం లేదా పాటలోని విడివిడి భాగాలకు చెప్పిన ఈధాతువులు అనేవి ప్రధానంగా స్వరసంబంధులు. వీలాది గీత ప్రబంధాలకు చెప్పబడినట్లే తంత్రీవాద్యమైన వీణకు దీన్ని ననుసరించి సుషిరవాద్యమైన వంశవాద్యానికి (పిల్లనగ్రోవి), అట్లే వాద్యప్రబంధాలకు ధాతు విచారం ఉంది. ఇవి వరుసగా సమానాలు కావుకాని ఆపారిభాషిక పదాలు ఇలా ఉంటాయి.

| <u>గీత ప్రబంధాలు</u> | <u>వీణ-వేణువు</u> | <u>వాద్యప్రబంధం</u> |
|---|---|---|
| 1. ఉద్గ్రాహం | 1. విస్తారజ (14) | 1. లహరి |
| 2. మేళాపకం | 2. కరణ (5) | 2. యెదుపు |
| 3. ధ్రువ | 3. ఆవిద్ధ (5) | 3. అంతర |
| 4. అంతర | 4. వ్యంజన (10) | 4. ఉపాంతర |
| 5. ఆభోగం | | 5. ముక్తాయి |

(మధ్యవరుసలో కుండలీకరించిన అంకెలు ఆయావాని అంతర భాగాలను సూచిస్తాయి.)

గీతప్రబంధంలో ధాతువులు గేయాంశానికి చెందిన సరిగమలనబడే స్వరాలు. వీణవంటి తంత్రీవాద్యల్లో ఇవి ఘాత (ప్రహారం) వల్ల పుట్టేస్వరాలు. వీణలో లాగే వేణువాద్యం లోను ధాతువులను కల్పించాలని శాస్త్రంచెప్తున్నది. ఈనాడు ఈధాతువులను గూర్చిన ప్రసంగం సాధారణంగా వినబడదు. పాటను సరిగమలలో స్వరపరచడమే ధాతుకల్పనం అని చెప్పవచ్చు. ఇది పాడగలవారందరు చేయగలపనికాదు. శాస్త్రం చక్కగా తెలిసి అను భవరసికులైన ఏకొందరికో సాధ్యంగా ఉండేపని. ఉదాహరణకు తాళ్లపాకవారి సంకీర్తనలు రాగరేకులమీద లభ్యమౌతున్నా 'మాతు' దొరికినట్లేకాని 'ధాతువు' దొరికినట్లుకాదు. ఆపా టలకు రాగనిర్దేశం మాత్రమే ఉంది; ఒక్కటిరెండుచోట్ల తప్ప తాళనిర్దేశంకూడా లేదు. రాగాలపేర్లు తెలిసినా ఆయారాగాలను అనాడు ఎలా పాడేవారో స్పష్టంగా తెలియదు. కనుక వాటిని ఒకతాళానికి యోజించి స్వరం వెయ్యటం సులభంకాదు. అందుచేతనే తిరుమల తిరుపతి దేవస్థానము వారు సంగీతసాహిత్యాల్లో ఆరితేరిన వారిచేత ఏకొన్నిం టికో ఆపని నిర్వహింపచేశారు. వాగ్గేయకారునికి ధాతు మాతువులు రెండుకూర్చడంలో నేర్పుఉండాలి. వాక్కైన 'మాతు', గేయమైన 'ధాతువు' రెండూ కూర్చగలవాడైనందుచే తనే అతడు 'ఉభయకార' శబ్దంతో చెప్పబడ్డాడు. అపదబంధమే 'బయకార'గా మారింది. 'రాయబయకార' అనేది కొందరకు రాజాస్థానంలో వాగ్గేయకారులుగా ఉండిన కారణాన బిరుదం కూడ అయింది.

సాహిత్య రచనలాగే సంగీత రచనకూడ గొప్పశిల్పం. సాహిత్యంలోలాగే ఇక్కడా జ్ఞాతశిల్పులు కొందరు; యదృచ్ఛాశిల్పులు కొందరు. పదరచనలో చివర వాగ్గేయకారుని

ముద్ర ఉండాలనేది నియమం. త్యాగరాజకృతుల్లో 'త్యాగరాజనుత' అనేది చివర వినబడటం మనమెరిగిందే. కాని దీనికి అపవాదాలు లేకపోలేదు. తాళ్లపాక వారి సంకీర్తనలలో ముద్రలేదు. ముద్ర ఉండేవాట్లో అది ఇష్టదేవతాముద్ర, ఆచార్యముద్ర, క్షేత్రముద్ర, ప్రభుముద్ర వగైరాల్లో ఏదైనా ఒకటి ఉంటుంది. అలాగే పదంలో రాగతాళాలు రెండు చెప్తే రాగతాళముద్ర, రాగం మాత్రం చెప్తే రాగముద్ర. దీనివల్ల ప్రయోజనమేమంటే ఆరాగతాళాలు ప్రసిద్ధంగా వాడుకలో ఉండేవైతే వాటి స్వరూపం సులభంగా తెలుస్తుంది.

కర్ణాటక సంగీతంలో త్రిమూర్తులనిపించుకున్నవారిలో ముత్తుస్వామి దీక్షితర్ సంగీత రచనాశిల్పంలో జ్ఞాతశిల్పులు; ఆయన రచనల్లో రాగముద్రలేనివి అరుదు. శ్యామశాస్త్రి, త్యాగరాజు యదృచ్ఛాశిల్పులు. దీక్షితర్ హంసధ్వని రాగం, ఆదితాళంలో కూర్చిన 'వాతాపిగణపతింభజే . . .' అనే ప్రసిద్ధకృతిలో చివర 'హంసధ్వనిభూషిత హేరంబం' అనిరాగముద్ర ఉంది. శ్యామశాస్త్రి కల్యాణిరాగం రూపకతాళంలోకూర్చిన 'హిమాద్రిసుతే పాహిమాం వరదేవతే' అనేకృతిలో చివరిచరణంలో 'కరిముఖ కుమారజనని కాత్యాయని కల్యాణి' అనిరాగముద్ర. త్యాగయ్యవారి 'మోహనరామ' అనేకృతి మోహనరాగంలోనే ఉంది. హరికథారచయితలు కొందరు తాళముద్ర, రాగతాళముద్రలు రెండుకూడ కూర్చిన వారున్నారు. ఈపద్ధతి రాగతాళాల పేర్లు చెప్పటంవరకే పరిమితం. వివరాలు తెచ్చుకోవాలి. ఇలాకాకుండా పదం కూర్చడంలోనే స్వరాక్షరాలైన సరిగమలను కూర్చేపద్ధతి కూడా ఒకటి ఉంది.

పదాలు, కృతులు, కీర్తనలు, సంకీర్తనలు ధాతుమాతు సమాహారాలు. మాతువు మాటలకూర్పు. ధాతువు స్వరాల కూర్పు. అంటే స-రి-గ-మ-ప-ధ-ని అనే సప్తస్వరాలకే పరిమితంగా ఉంటుంది. ధాతుమాతువులకు అభేదంగా స్వరాక్షరాలు వచ్చేటట్లు కూర్చితే దాన్ని 'స్వరాక్షరం' అంటారు. ఇలాగ ధాతుమాతువులకు అభేదంగా కూర్చిన సంగీతరచనను 'స్వరార్థ' ప్రబంధమని 'స్వరాక్షర ప్రబంధ'మని శాస్త్రకారులు అంటారు. సంగీతరత్నాకరంలో దీని లక్షణం ఇలా చెప్పబడింది.

'యత్రస్వరాక్షరై రేవ వాంఛితోऽర్థోऽభిధీయతే

సస్వరార్థో ద్విధా శుద్ధో మిశ్ర స్తైః శుద్ధమిశ్రితైః'

(సంగీ. రత్నా. 4-222)

సాహిత్యంలో ఇలాంటి రచనకు 'సరిగమ పధనులు' అనిపేరు. తెనుగులో విన్నకోట పెద్దన (క్రీ.శ. 1402-1407) రచించిన 'కావ్యాలంకార చూడామణిలో' 'సరిగమపధనులు' అనేశీర్షికతో ఈక్రింది పద్యముంది.

కం॥ సీసరిపని సీసరి ధని
సీసరి మాధారి గరిమ సీసరిగారీ
సీసరిగా నిగమాగమ
గోసారులునుం బలుక్యకుల విశ్వేశా॥

దీంట్లో తొలిమూడుపాదాలు స్వరాక్షరాలు. అయినా ఆమాటలకు అర్థం ఉంది.

ఇలాంటి స్వరాక్షరసంపుటి పాటల్లో పదాల్లో శుద్ధరూపంగాను సూచితరూపంగాను ఉండవచ్చు. 'సరిగమపధని' అనే అక్షరాలే, పై పద్యం మూడుపాదాల్లోలాగ - వస్తే అది శుద్ధ స్వరాక్షరసంపుటి అవుతుంది. స్థూలంగా హల్మాత్రసామ్యం ఉంటే సూచిత స్వరాక్షర రచన అవుతుంది. స్వరాక్షరాలకు సూచకాక్షరాలు ఇలాఉంటాయి. సూచకాలు ఏ అచ్చుతోకూడినా, ద్విరుక్తమైనా ఇబ్బందిలేదు.

స - చ,ఛ,జ,ఝ,శ,ష,స

రి - ర,ఱ

గ - క,ఖ,గ,ఘ

మ - మ

ప - ప,ఫ,బ,భ

ధ - త,థ,ద,ధ

ని - న,ణ

స్వాతితిరుణాళ్, రామస్వామిశివన్, సుబ్బరామదీక్షితుల తండ్రి అయిన రామస్వామి దీక్షితులు, స్వరాక్షర సంపుటికి ప్రసిద్ధులు. ఆధునికుల్లో బాలమురళీకృష్ణగారి 'సీగరిమగని' అన్న స్వరాక్షరసంపుటి చెప్పదగింది. త్యాగరాజు, శ్యామశాస్త్రుల రచనల్లో స్వరాక్షరరచన సూచిత పద్ధతిగానే ఉన్నట్లు చెప్పవచ్చు. త్యాగయ్య అమృతవాహిని రాగం - ఆదితాళంలో కూర్చిన 'శ్రీరామపాదమా నిక్రుప చాలునే' అనేకీర్తనలో

ప దనీ ద మ పా, ద మా గా రి స రీ మ పా

శ్రీ రా మ పా ద మా నీ కృ ప చా లు నే

'పాదమా' అనేది స్వరసాహిత్యాలు రెండింటిలోను కనబడుతుంది. అయినా ధన్యాసిరాగం - ఆదితాళంలో కూర్చిన 'సంగీతజ్ఞానము భక్తివినా' అనేకృతిలో

సా సా మా(గ)రీ

భృంగినటే శ స మీ ర జ అనే సూచిత శుద్ధస్వరాక్షరాలు రెండు కనబడతాయి. శ్యామశాస్త్రి రచనల్లో ఎక్కడైనా ఒకచోట స్వరాక్షర సంపుటి కన్పిస్తుంది. తోడిరాగం - ఆదితాళంలో కూర్చిన 'రావే హిమగిరి కుమారి' (స్వరజతి) లో

గా మ పా మదనీ

కా మ పా . లి నీ

మ ద నీ ద ని స దా ద ని ద గ రి

మ ది లో ని ను స దా త ల చు కొ ని

వంటి స్వరాక్షరకల్పన ఉంది. దీక్షితర్ రచనల్లో ఈశిల్పం ఎక్కువ. ధాతుమాతువులకు ఏకరూపంగా ఉండే స్వరాక్షరాల కూర్పే క్రమంగా 'స్వరార్థప్రబంధ' రచనగా పరిణమించిందనేది `స్పష్టమే.

ఈచెప్పిందంతా గీతప్రబంధాలకు సంబంధించిన విషయం. వాద్యప్రబంధాల్లో ఉద్గ్రాహాది ధాతుకల్పనకు విస్తరమైన శాస్త్రపద్ధతి ఉంది. ధాతుస్వరూపాన్ని గూర్చి ఒక అభిప్రాయం కలగటానికి ఇంతదూరం చెప్పడం జరిగింది.

వ॥తా॥ యవయవ పదంబులకు ననుకూలంబైన పల్లవియెట్టిదనిన

కం॥ పదముల యర్థము బల్లవి
వదలక యన్నిఁటికి నేక వాక్యతఁ జేయున్
గుదిగ్రుచ్చినట్లు తగులై
పదము తుదిన్ మఱియు మఱియుఁ బల్లవియలరున్ 39.

తా॥ పదానికి అవయవాలైన చరణాలకు పొసగింపుగా ఉండే పల్లవి వివరింపబడుతున్నది. పదంలోని చరణాల అర్థానికి దూరం కాకుండా, వాటన్నింటికీ తగులుకొని ఉంటూ అభిప్రాయాన్ని ఒక కొలికికితెస్తూ మాటిమాటికి ఆవర్తింపబడుతూ పదం చివర ఉండేది పల్లవి.

వ్యా॥ 24వ పద్యంలో పదం అవయవమనీ, అవయవి అనీకూడా చెప్పబడింది. అవయవం అంటే కాలు చెయ్యిలాంటి శరీరభాగం. అవయవపదం అన్నప్పుడు చరణమని గ్రహించాలి. అవయవాలు కలది అవయవి. అవయవి పదం అంటే చరణాలన్నీ చేరిన మొత్తం పదం అని గ్రహించాలి. వెనుకటి పద్యంలో నిబద్ధపదానికి అవయవాలైన అవాంతరపదాలకు అనుకూలమైన పల్లవి చెప్పాడు. అదిస్వరసంబంధి. అక్కడకూడా చరణాన్ని అవాంతర పదంగా గ్రహిస్తే ఉద్గ్రాహఖండం, ధ్రువఖండం, ఆభోగఖండం ఇత్యాదిగా ఏర్పడతాయి. కాని అక్కడ మాటల అర్థాల ప్రమేయం ఏమి ఉండదని గ్రహించాలి. ఇక్కడ అర్థం ప్రమేయాంశంగా గ్రహింబడుతోంది. ఇది మొత్తం పదానికంతటికీ సంబంధించిన అర్థము కావచ్చు; ఒక చరణంలో ఉంటూ ఆచరణం చివరన ఒకకొలిక్కి వచ్చే అర్థమూకావచ్చు. పాటఅంతా మహావాక్యం లాంటిదైతే చరణం అవాంతరవాక్యం లాంటిదన్నమాట. ఈపద్యంలో అవయవపదం అన్నప్పుడు నాలుగుపాదాలుగా వృత్తబంధంలో కూర్చిన 'చరణం' అని ఒకసారి, మొత్తం పదం ఒకసారి గ్రహించాలి. సార్థకమైన మాటలతో కూర్చిన పాట గేయానికి అవయవమని భావిస్తే అప్పుడే మొత్తం పదం అవయవపదం అవుతుంది. పల్లవి అనేది ప్రతిచరణంలోని మాటల అర్థాలకు చరణాంతంలో ఏకవాక్యత కూరుస్తుంది. అలాగే పదంలోని అన్నిచరణాల అర్థాలకు కూడ ఏకవాక్యత కూరుస్తుంది. అందువల్లనే ప్రతి చరణాంతంలోను, పదాంతంలోను పల్లవి పాడబడుతుంది.

ఉదాహరణానికి అన్నమయ్యగారి ఈసరళమైన పదం చూడండి.

కాంభోజరాగం - త్ర్యశ్రత్రిపుటతాళం

ఏల రాఁడమ్మా - ఇంతిరో వాఁ
డేల రాఁడమ్మా న - న్నేలిన వాఁడు ॥పల్లవి॥
పచ్చని పులుగుల - బండిమీఁదనుండు
పచ్చవింటి పిన్న - బాలుని తండ్రి
పచ్చనిచాయలఁ- బాయని బంగారు
పచ్చడము గట్టిన - బాగైన వాఁడు॥ఏల॥ 1.

తెల్లని పులుగుపై - తిరుగమరిగినట్టి
తెల్లనిసతి పాలి - దేవరతండ్రి
తెల్లని పఱపుపై - తేలి పొరలువెట్టు
తెల్లని కన్నులఁ దెలివైన వాఁడు ॥ ఏల॥ 2.

కొండవింటి వాని - గుత్త గొనిన యట్టి
కొండుక ప్రాయపుఁ- గూతురు తండ్రి
కొండలరాయఁడు - కోనేటి తిమ్మయ్య
కొండతలనెత్తి - గుఱుతైనవాఁడు ॥ఏల॥ 3.

ఈపదంలో తొలిరెండు పాదాలు పల్లవి. ఆతర్వాత మూడు చరణాలపాట ఉంది. భక్తుడు నాయిక. భగవంతుడు నాయకుడు. ఇది మధురభక్తి. నాయిక ఉత్కంఠతో నాయకునికై ప్రతీక్షిస్తూ తహతహగా చెలితో పలుకటం సందర్భం. నాయిక తహతహ ప్రధా నాంశం. తొలిచరణంలో రాచిల్కల తేరెక్కి పచ్చని చెరకు వింటితో తిరిగే మన్మధుని తండ్రి బంగారపు రంగు వలువగట్టిన సుందరాంగుడు - నన్ను ప్రియంగా చేపట్టిన నాథుడు ఏలరాడని పల్లవి అన్వయానికి తెస్తుంది. రెండో చరణంలో హంసవాహన అయిన సర స్వతిని పాలించే బ్రహ్మకు తండ్రి, శేషశయనంమీద తేలి జ్ఞానస్వరూపుడై పొరలే వాడనే భావంతో అన్వయం. మూడో చరణంలో ఈశ్వరుణ్ణి స్వాధీనపరచుకొన్న గంగకు తండ్రి, గోవర్ధన గిరినెత్తిన యశస్వి, స్వామిపుష్కరిణి ప్రక్కన వెలసిన వేంకటేశ్వరుడనే భావంతో అన్వయం. భగవంతుని ఐశ్వర్య వీర్య యశస్సులు శ్రీ జ్ఞానవైరాగ్యాలు అనే షాడ్గుణ్యంతో ఇక్కడ నాయకుని సర్వాతిశాయిత్వం చెప్పబడింది. పల్లవికి విడిచరణాలతోను మొత్తం పదం తోను పొసగింపు ఉంది. ఇష్టమైతే ప్రతిచరణంలోని రెండేసి పాదాలకు కూడా పల్లవి పొసగివస్తుందని ఇక్కడ గమనించవచ్చు.

ఈపల్లవి పుట్టు పూర్వోత్తరాలు సంగీతవిద్వాంసులకే తీరని సమస్యగా ఉన్నాయంటారు. తాళ్లపాక అన్నమయ్యగారి సంకీర్తనల్లో పల్లవి ఉంది. కొన్నింటిలో 'అనుపల్లవి' కూడా ఉంది. రామక్రియ రాగం (రూపకతాళం) లో కూర్చిన 'భక్తికొలది వాఁడే పరమాత్ముడు' అనే సంకీర్తనలో ఈమాటలే పల్లవి. భుక్తి ముక్తి తానెయిచ్చు - భువిపరమాత్ముడు' అనేది 'అనుపల్లవి'. అంటే అన్నమయ్య నాటికి పల్లవి పాదుకొన్నది, 'అనుపల్లవి' పాదుకొంటున్నదని ఊహించవచ్చు. నారాయణతీర్థుల కృష్ణలీలా తరంగిణిలో పల్లవి, అనుపల్లవి రెండూ ఉన్నవి. (త్యాగయ్యకు నూరేండ్లైనా ముందు).

అలోచిస్తే ఈ 'పల్లవి'కి ఆధారభూతమైన ఆవృత్తి అనేది మొదట లఘుగురువుల పాదాంతా వృత్తిగాను అటుపై పదాల ఆవృత్తిగాను నడిచినట్లు గ్రహించవచ్చు. వైదిక ఛందస్సుల్లో ప్రసిద్ధమైన నాల్గుఛందస్సుల్ని చూద్దాం: గాయత్రి, అనుష్టుభ్, త్రిష్టుభ్, జగతి.

(క) గాయత్రిలో పాదానికి 8 అక్షరాల చొప్పున మూడు పాదాలు ఉంటాయి. ప్రతిపాదంలోని 8 అక్షరాలను నాల్గేసి అక్షరాల రెండుగణాలుగా ఛేదించవచ్చు.

U I U U I U I U

అ గ్ని మీ ళే | పు రో హి తం

U U I U I U I U

య జ్ఞ స్య దే | వ మృ త్వి జం

U U U U I U I U

హో తా రం ర | త్న ధా త మ మ్॥

మూడు పాదాల్లోను లఘుగురువుల ఆవృత్తి పాదద్వితీయార్ధంలో ఒకేవిధంగా ఉండటం గమనించవచ్చు.

(b) అనుష్టుప్ఛందంలో 8 అక్షరాల పాదాలు నాలుగు ఉంటాయి. వైదికమైన ఈఛందం లౌకిక సాహిత్యంలో అనుష్టుప్ శ్లోకం అయింది.

I U I U

(1) హిరణ్మయేన/ న పాత్రేణ/ సత్యస్యాపి/ హి తం ము ఖం

I U I U

తత్త్వం పూషన్/ న్నపావృణు/ సత్యధర్మా/ య దృ ష్ట యే

I U I U

(2) సత్యం మాతా/ పితా జ్ఞానం/ ధర్మోభ్రాతా/ ద యా స ఖా

I U I U

శాంతిః పత్నీ/ క్షమా పుత్రః/ షడే తేమ/ మ బాం ధ వాః

వీటిలో మొదటిది వైదికం. రెండోది లౌకికమైన శ్లోకం. వీటిలోను రెండవ, నాల్గవ పాదాల చివర లఘుగురువుల ఆవృత్తి ఒకేవిధంగా ఉండటం గమనించవచ్చు.

(c) ఇంక త్రిష్టుప్ఛందంలో పాదానికి 11 అక్షరాలుండే 4 పాదాలుంటాయి. పాదానికి మూడేసి గణాలు. చివరిగణం IUU ఈక్రింది ఉపనిషన్మంత్రం చూడండి..

I U U

నా య మా త్మా / ప్రవచనే / న ల భ్యో

I U U

న మే ధ యా / న బ హు నా / శ్రు తే న

I U U

య మే వై ష / వృ ణు తే తే / న ల భ్యో

I U U

త స్యై ష ఆ / త్మా వృ ణు తే / త నూం స్వా మ్

(సంస్కృతంలో పాదాంత లఘువు గురువుగా మారవచ్చు)

(ఛ) జగతీ ఛందస్సులో పాదానికి 12 అక్షరాల చొప్పున 4 పాదాలుంటాయి. పాదానికి మూడేసి గణాలు.

I U I U

తు వ మ గ్నే / ప్ర థ మో అం / గి రా ఋ షిః

I U I U

దే వో దే వా / నా మ భ వః / శి వః స ఖా

I U I U

త వ ప్ర తే / క వ యో వి / ద్మ నా వ సో

I U I U

అ జా యం త / మ రు తో భ్రా / జ ద్రు ష్ట యః

గాయత్రి అనుష్టుభ్‌లలో లాగే ఇక్కడ కూడా పాదాంతంలో లఘుగురులఘుగురు ఆవృత్తి చూడవచ్చు. ఇది గణావృత్తి అనుకొందాము.

(జ) ఎనిమిదక్షరాల పాదాలు, 12 అక్షరాల పాదాలు కలిపి, నాల్గుపాదాల్ని ఏడు పాదాలుగా పెంచి కూర్చిన 'ప్రగాథ' లో గణావృత్తితోపాటు పదావృత్తి తొంగిచూస్తుంది.

I U I U

యు వాం స్తో మే / భిర్ దేవ యం / త అ శ్వి నా

I U I U

ఆ శ్రా వ యం / త ఇ వ శ్లో / క మా య వః

I U I U

యు వాం హ వ్యా / భి అ యు వః

I U I U

యు వో ర్ వి శ్వా / అ ధి శ్రి యః

I U I U

వృ క్ష శ్చ వి / శ్వ వే ద సా

I U I U

ప్రు షా యం తే / వాం వ వ యో / హి ర ణ్య యే

I U I U

ర థే ద ప్రా / హి ర ణ్య యే

ఇక్కడ 'హిరణ్యయే' పల్లవ పదాలుగా ఆవృత్తి చూడవచ్చు.

సంగీత రత్నాకరం ఎలా చెప్పినా చాళుక్య జగదేకమల్లుని (క్రీ.శ. 1134-43) సంగీత చూడామణిలోని శ్లోకాలే ఈసందర్భంలో పార్శ్వదేవుని సంగీత సమయసారం (క్రీ.శ. 1300 ప్రాం.) లో కనబడటాన్నిచూస్తే ఏలాప్రబంధవిషయంలో రెండు ప్రస్థానాలున్నట్లు గ్రహించవచ్చు. మైసూరు వరలక్ష్మి సంగీత అకాడమీవారి దగ్గరుండే 'సంగీత చూడామణి' ప్రతి ఆకు నెం.46 A. ఏలా ప్రబంధం పాదానికి ఆరుగణాలని చెప్పి అటుతర్వాత ఇలా అంటున్నది.

"పాదస్యాంతే ప్రయోగస్యాత్పల్ల వాస్యం చదం తతః

పల్లవాక్యే పదేనాపి నియమో గణ వర్ణయోః

అనేనైన ప్రకారేణ ద్వితీయాంఘ్రిః ప్రకల్పనా

గీత్వా తతస్తుతి యాంఘ్రి గీత్వామేలాపకోభవేత్"

తప్పుల తడకగా ఉన్న ఈశ్లోకాలే పార్శ్వదేవుని సంగీత సమయసారంలో ఇలా ఉద్ధరింపబడి ఉన్నవి.

"ఉద్గ్రాహేంఘ్రి ద్వయం ప్రాసైః ప్రతి పాదం గణాశ్చ షట్॥

పాదస్యాంతే ప్రయోగః స్యాత్ పల్లవాఖ్యం పదం తతః

పల్లవాఖే పదే నాస్తి నియమో గణ వర్ణయోః॥

అనేనైః. ప్రకారేణ ద్వితీయాంఘ్రేః ప్రకల్పనా

గీత్వాతతస్తృతీయాంఘ్రి గేయే మేలాపకో భవేత్॥

(తథా) పాదత్రయే గీత మేక మేవ విధీయతే

న ప్రాసోऽథ ధ్రువో గేయో వర్ణ్యనామ్నా సమన్వితః॥

ఆభోగశ్చ తతో గేయో గాతు ర్నామ్నా విరాజితః

ధ్రువం గీత్వాతతో న్యాసః సర్వైలాసు ప్రశస్యతే॥

(4 అధికరణం శ్లో. 130-134)

హరిపాలుని సంగీత సుధాకర (క్రీ.శ. 1175) మతంకూడా ఇదే. ఇక్కడ గమ నింపదగిన ముఖ్యాంశాలు ఏలాప్రబంధంలో పాదానికి ఆరేసి గణాలుండే రెండు పాదాలు మాత్రమే ఉద్గ్రాహ ఖండం అనీ, పాదాంతంలో గమక ప్రయోగించేసి పల్లవం పాడాలనీ, ఈపల్లవానికి గణవర్ణ నియమంలేదని, తొలిపాదంలాగే మలిపాదమూ అనడంతో పల్లవం అనేది ఆరుగణాల పాదాలు ముగిసిన తర్వాత వస్తుందనీ స్పష్టం. ఈ రెండుపాదాల 12 గణాలే సంగీత రత్నాకరంలోని ఏలా ప్రబంధలక్షణంలో 5+5+2 గాసర్దుబాటు చేయ బడినవని తొలిరెండుపాదాల్లో వచ్చే ఐదేసి పదాల్లోను చివరి మూడేసిపదాలు పల్లవ పదాలనబడినవని స్పష్టంగా తెలుస్తుంది. సంగీత రత్నాకరం చెప్పిన ఏలాపద ప్రథమ ద్వితీయ పాదాంత పదత్రయం 'పల్లవి' గా మారిందని నమ్మజాలని వారు సంగీత చూడామణి, సంగీత సమయసారాలు ఏల ప్రథమ ద్వితీయ పాదాల గణషట్కం తర్వాత చెప్పిన పల్లవాఖ్య పదాలే నేడు మనకు తెలిసిన 'పల్లవి' గా మారినవని గ్రహించడంలో శ్రమ ఉండదు. మనకు తెలిసిన పల్లవి వృత్తబంధంగా నాల్గుపాదాల్లో ఉండే చరణానికి బాహ్యమైన కూర్పు. సంగీత చూడామణి సంగీత సమయసారాల ప్రస్థానం పల్లవిగా పరిణమించిందని, సంగీతరత్నాకర ప్రస్థానం లోపించి పోయిందని చెప్పవచ్చు.

ఏలా ప్రబంధ విషయంలో రెండుప్రస్థానాలుండిన వనటానికి ఆధారమేమి? శాస్త్ర గ్రంథాలైన సంగీత చూడామణి, సంగీతసమయసారాలు ఏలా పాదానికి ఆఱుగణాలని చెప్తుండగా సంగీత రత్నాకరం ఐదుపదాలని చెప్పడం, ఆగ్రంథాలు పాదానికి వెలుపల పల్లవి గణవర్ణనియమం లేకుండా చెప్తుండగా సంగీత రత్నాకరం గణవర్ణనియమాలతో కూడిన పాదంలోని చివరి మూడు పదాలనే పల్లవపదాలుగా చెప్పడం, స్పష్టంగా కనబడే విష యాలు. ఈభిన్నదృష్టులకు కారణం ఏలా ప్రబంధాన్ని త్రిధాతుకంగా సంగీత రత్నాకరం దర్శిస్తే సోమేశ్వర, జగదేకమల్ల, పార్శ్వదేవాదులు చతుర్ధాతుకంగా దర్శించటం. ఈప్ర స్థాన భేదాన్ని సంగీత రత్నాకరానికి కల్లినాథుడు వ్రాసిన వ్యాఖ్య చెప్తున్నది. ఏలా ప్రబంధానికి త్రిధాతుకత్వాన్ని కోరేవారు ఉద్గ్రాహానికి 12 పదాలనూ చెప్తారనీ, చతు ర్ధాతుకత్వాన్ని కోరే సోమేశ్వరాదులు 11 పదాలకు మాత్రమే ఉద్గ్రాహం చెప్పి 12 వ పదం మేలాపకం అంటారంటూ ఇలా వ్రాశాడు.

"ఏలా ప్రబంధస్యత్రిధాతుకత్వ మభ్యుపగచ్ఛతా మేతాని ద్వాదశ

పదాన్యు ద్గ్రాహో భవంతీతి మతమ్. చతుర్ధాతుకత్వ మభ్యుపగచ్ఛంతః

సోమేశ్వరాదయస్త్వేకాదశానా మేవోద్గ్రాహత్వముక్త్వా ద్వాదశపదం మేలాపక మాహు రిత్యాహ"

మూడోపాదంలో రెండుపదాలే ఉంటాయని అక్కడ పల్లవపదం ఉండదని రెండవ పదం దగ్గర గమక ప్రయోగమని అది మేలాపకమని సోమేశ్వరాదులు అంటారని రత్నాకరకర్త వ్రాసిన శ్లోకానికి (4-3) వ్రాసిన వ్యాఖ్యలో ఈ అంశం ఉంది.

పాదాంతప్రయోగానికి - పిమ్మట నియమరహితంగా చెప్పబడిన పల్లవి క్రమంగా నియమంతో నేడు మనకు తెలిసిన పల్లవిగా స్థిరపడిందనటం సారాంశం.